# మన తెలంగాణ

"సుధామ'యోక్తి' కాలమ్

(కాలిక వార్తాంశ కథనాలు)



సుధామ

# మన తెలంగాణ
## ‘సుధామ’ యోక్తి

(‘మన తెలంగాణ’ దినపత్రిక 2015-16 ఎడిట్‌పేజి మిడిల్‌కాలమ్ వ్యాసాలు)

సుధామ

స్నేహితస్రవంతి
జి-12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్-500 036

# MANA TELANGANA : ''SUDHAMA' YOKTI'

[Edit Page Middle Column of Mana Telangana Telugu Daily (2015-2016)]

***By***
SUDHAMA

© Author
Cell : 9849297958

***First Edition***
2.7.2018

***Copies :*** 500

***Cover Design :*** Sudhama

***DTP :*** Manu Graphics
1-8-430/3/A, Chikkadpally
Hyderabad - 500 020
Ph : 93 93 83 40 50

***Printed at*** : Venu Graphics
21-1-392, Nallakunta, Hyderabad-44
Ph : 92473 03783

***For copies*** : A.Usha Rani
G-12, Sadath Towers
Padmavathi Apartments
Saleemnagar Colony
Malakpet
Hyderabad - 500 036
Ph : 98482 76929
040-24545780
98492 97958

&

Navodaya Book House, Opp. Aryasamaj Mandir
Kachiguda X Roads, Hyderabad-500 027.

***Price :*** Rs.150/-

క్రమక్రమాగత
చైతన్య ధనుష్పాణులయిన
ప్రజ కు-

# నా 'నుడి'

శిరీషకుసుమపేశల సుధామయోక్తుల శ్రీ అల్లంరాజు వెంకట్రావు మంచి మిత్రుడు, యువభారతీయుడు.

గత పాతికేళ్ళుగా సుధామను గమనిస్తూంటే వ్యాసమైనా, ఉపన్యాసమైనా, ప్రజల్లోకి చొచ్చుకుపోయేలాగా తనదైన శైలిని సృష్టించుకున్నాడని అనిపిస్తోంది నాకు. ఆకాశవాణిలో పనిచేస్తున్నా, నిగర్విగా-నిరాడంబరంగా తనదైన పనిని సాఫీగా, సజావుగా కొనసాగిస్తూ పదిమంది మంచి కోసం కృషిచేసే మిత్రుడాయన. బాగా రాయగలడు కానీ ఎక్కువగా రాయలేదు. బాగా మాట్లాడగలడు కానీ మాట్లాడకుండా ఉండడాన్నే తన తీరుగా మలచుకున్నాడు. వాగ్మిలాగా ఉంటాడు, మౌనిలాగా అన్పిస్తాడు. వాగ్మి, మౌనిగా రెండు తత్వాలను తనలోనే ఇముద్చుకోవడం కొద్దిమందికే సాధ్యం. సునిశిత పరిశీలకుడు. మిత్రులను, తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి, అవసరం మేరకు సమాజాన్ని సంస్కరించే ప్రయత్నం చేస్తూంటాడు. వివాదాల జోలికి పోడు. కానీ వివాదాలు పరిష్కరించాల్సివచ్చినప్పుడు మాత్రం తన మాటైనా, చేతైనా, కలమైనా, గళమైనా బలంగా వాడగలిగిన సారస్వతమూర్తి. సుధామ మంచి చిత్రకారుడు, కార్టూనిస్టు కూడా... ఆయన చేతివ్రాతలో అక్షరాలు కాగితంమీద అందంగా మలుచుకుంటాయి. కాబట్టే వారి చేతివ్రాతలోనే ఎందరో రచయితలు, రచయిత్రులు పుస్తకాలు అచ్చు వేయించుకోవాలనుకుని ఉవ్విళ్ళూరేవాళ్ళు నాకు తెలుసు. ఇన్ని లక్షణాలున్న సుధామ మీడియాలో క్రియాశీలకంగా ఉంటాడు. సమాజ స్థితిగతులను గమనిస్తూ తన పంచాంగాన్ని విప్పి సమాజం యొక్క మంచి-చెడులను నిర్దేశించడానికి ప్రయత్నం చేస్తాడు... అది అతనిలో నాకు బాగా నచ్చిన అంశం...

'సుధామ' సమాజశ్రేయస్సు దృష్ట్యా; తన రచనల ద్వారా సమాజంపై మనకు ఉండాల్సిన గౌరవాన్ని, సమాజంపట్ల పౌరుడిగా చూపాల్సిన బాధ్యతని, సామాజిక దురన్యాయాన్ని, సుతిమెత్తని ఎత్తిపొడుపులు, సున్నితమైన మందలింపులతో వ్యక్తపర్చడం అతని రచనా చణతకు నిదర్శనం. అతని రచనా వ్యాసంగమంతా నిజాయితీతోను, నిబద్ధతతోను సాగిపోతుంది. సుధామలోని సారళ్యం, సౌమనస్యం, మిత్రుత్వం, చిత్తశుద్ధి, సాంద్ర బాధాపరితప్త హృదయం, సముదాత్తత వంటి ఎన్నో మృదువైన అంశాలు అతని సాహిత్యాభివ్యక్తిలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంటాయి. భాష మీద మంచి పట్టు, భావగాంభీర్యం, తీసుకున్న అంశం ఏదైనా పాఠకుడిని పరవశింపచేయు అక్షరరమ్యత 'సుధామ' సొంతం.

'మన తెలంగాణ' దినపత్రికలో ఫిబ్రవరి 2015 నుండి ఏప్రిల్ 2016 మధ్యకాలంలో ప్రచురింపబడిన 'మిడిల్‌కాలమ్' వ్యాసాలను పుస్తకరూపంలో తీసుకురావడం సుధామ మిత్రులందరికీ ఆనందదాయకమైన విషయం. ఈ పుస్తకంలో 59 వ్యాసాలుంటే ఏ వ్యాసానికావ్యాసం హారంలోని మణిపూసలాంటిదే...

"ఈ రోజుల్లో సహజంగా జరగాల్సినవన్నీ ఆర్భాటాలుగా, ఉద్ధరింపులుగా మారిపోతున్నాయి. తెలంగాణాతల్లి జనజీవనకల్పవల్లిగా వెల్లివిరియాలంటే జనంకోసం సంధించిన చాపంగా, సాహిత్యలక్ష్యంగా, మసిబారిన బతుకుల్లో వెలుగివ్వడానికి కసిగా కదిలేవాళ్ళతో కలిసివెళ్దాం రండి" అంటూ సుధామ ఒక వ్యాసంలో పల్కిన పల్కులు స్ఫూర్తిప్రదంగా ఉన్నాయి.

భారతదేశాన్ని అత్యున్నత స్నేహదేశంగా గుర్తించింది కనుకనే అమెరికా మాజీ భారత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం మృతిపట్ల మునుపెన్నడూ జరగని విధంగా తమ వైట్‌హౌస్ మీద పతాకాన్ని గౌరవ సూచకంగా అవనతం చేసిందని తెలపడం; ఒబామా-కలామ్ పట్ల తన మైత్రీ భావాన్ని అలా నిరూపించుకున్నాడని రాయడం 'అఖండ స్నేహదీపాని'కి హైలైట్‌గా ఉంది.

రామేశ్వరంలో జన్మించిన అబ్దుల్‌కలాం మసీదు వీధిలో నివసిస్తున్నా, ప్రతి సాయంకాలం శివాలయం వీధిలో సంచరించడం మతసామరస్యానికి ఎత్తిన వైజయంతి అది... నుదుట నామాలతో జందెంతో రామనాథశాస్త్రి; ముస్లిం టోపీతో కలాం బడిలో ప్రక్కప్రక్కనే అంత స్నేహంగా కూర్చోవడం ఆనాటి టీచరుకి నచ్చని విషయం. 'ఆలయ ప్రధానార్చకుని ప్రక్కన కూర్చుంటావా? లేచి చివర బెంచిలో కూర్చోమంటూ' ఐదవ తరగతిలో పాఠం చెప్పడానికి వచ్చిన టీచరు కలాంను లేవగొడితే కళ్ళవెంట నీరు తిరుగుతూ చివర బెంచిలో కలాం; మొదటి బెంచిలో రామనాథశాస్త్రి-మిత్రులిద్దరూ మౌనంగా రోదించారు. ఆలయ ప్రధానార్చకుడు- రామనాథశాస్త్రి తండ్రి- మర్నాడు ఉదయం కలాంను ఇంటికి పిలిపించుకుని క్లాసుకు కొత్తగా వచ్చిన టీచరు సమక్షంలో పిల్లవాడైన కలాంకు క్షమాపణ చెప్పించడం, వ్యాసముఖానికి తిలకంగా నిలిచింది. "భారతదేశపు ఒక గొప్ప ముస్లిం హిందువుల పర్వదినమైన తొలిఏకాదశినాడు ఒక క్రిస్టియన్ హాస్పిటల్‌లో కన్నుమూయడం కాకతాళీయమే అయినా మృత్యువులో కూడా 'సెక్యులరిజం' ద్యోతకం అయ్యేట్లుగా నిలిచిన మానవీయ మహనీయమూర్తి కలాం... దేశాల మధ్య కూడా పటిష్టతకు కావాల్సిన స్నేహానికి కలాం ఒక ఆరనిదీపం" అని వ్యాసానికి అందించిన ముగింపు ఒక గొప్ప అందగింపు...

"టాక్సులు ఎగ్గొట్టేది, నల్లధనం పోగేసేది వ్యాపారులు, ఈ పాలకులే గానీ-ఈ దేశంలోని పేదవాళ్ళు, మధ్యతరగతి ప్రాణులూ కాదు. పాలకులకు 'జడ్‌ప్లస్' భద్రతలుంటాయి. పౌరుల రక్షణకు పూచీయే లేదు".

"మున్సిపల్ కర్మచారి జీతాలు పెంచమంటే-అందుకు సమ్మె చేస్తే అది అరాచకంగా కన్పిస్తుంది. పార్లమెంట్ సభ్యుల వేతనాలు పెంచడం అంటే మాత్రం-ఎలాటి ప్రతిఘటన లేకుండా సజావుగా జరిగిపోయింది. సామాన్యులు హోటల్‌లో తినాలంటే వందలు ఖర్చుపెట్టాలి. పార్లమెంట్ క్యాంటిన్‌లో రేట్లు మాత్రం బహు చౌకగానే ఉంటాయి! ఒక ఎం.ఎల్.సి. గానీ, ఎం.ఎల్ఎ.గానీ, మంత్రిగానీ, ఎం.పి. గానీ, తమకు ప్రభుత్వం నుండి లభించే సౌకర్యాలు ఒక్కటీ వదులుకోరు. సామాన్య పౌరులు మాత్రం ప్రభుత్వం అరకొరగా ఇచ్చే సబ్సిడీలయినా స్వచ్ఛందంగా వదులుకోవాలిట! సెలబ్రిటీల స్థానంలో ఉన్నారుగా! సలహాలు, సందేశాలకేం కొరత!' అంటారు 'వదులుకుంటారా! రా?!' వ్యాసంలో.!! **గొప్ప సెటైర్!!**

'సంపన్నత, సౌశీల్యత సమవుజ్జీలుగా సాగాల్సిన అవసరం ఉంది. ఫుట్‌పాత్‌ల దురాక్రమణను అరికట్టాలి. రోడ్లమధ్యనే గుడులూ-మసీదులు అంటూ నెలకొల్పుకుని మతం పిచ్చి పెంచుకొని-రహదారులను, రహదారి ప్రయాణాలను సంక్లిష్టం చేసుకుంటున్న స్వయంకృతాపరాధాలు మనవే!" అని 'సంపన్నత' అనే వ్యాసంలో ఆర్థికపుష్టి ఒక్కటే సంపన్నంకాదని జీవన విధానాలు, వ్యక్తిగత సంస్కారాలూ కూడా సంపన్నతలో భాగమని తెల్పడం ఈనాటి సమాజ పోకడలకు దర్పణంపడ్తుంది...

"ట్రాఫిక్ పోలీసులు రాజకీయనాయకుల వాహనాలు అయితే నిరాటంకంగా సాగిపోవడానికి తగిన హంగామా రోడ్లపై సృష్టిస్తున్నారు కానీ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని తీసుకెడుతున్న అంబులెన్స్‌కు ట్రాఫిక్ పోలీసు దగ్గరుండి దారి ఇప్పించిన దాఖలాలు కన్పడవు. నిజానికి విధిగా జరగాల్సిన ఆ నిత్యవ్యవహారాలకు నూటికో కోటికో ఒక పోలీసు ఆ పనిచేస్తే, అది గొప్ప వార్తగా చెప్పుకు ఆనందించే దౌర్భాగ్యపు స్థితిలో ఉంటున్నాం మనం! నిజానికి ట్రాఫిక్ భద్రత అనేది ప్రతి ఒక్కరి కర్తవ్యం. స్వేచ్ఛగాను, సురక్షితంగాను ప్రయాణాలు సాగాలి. అలాగే పాదచారులకు కూడా నియమాలు, సూత్రాలు ఉన్నాయి. ఒకప్పుడు సైకిల్‌కు కూడా లైసెన్స్ ఉండేది. హెల్మెట్ నిబంధన కొత్తదేమీ కాదు. కానీ ఇంకా దానిమీద అనేక తర్జనభర్జనలు కొనసాగుతూనే ఉన్నాయి" అంటూ నేటి దుస్థితికి వాపోతారు 'ప్రాణహిత చర్యలు' అనే వ్యాసంలో....

"నేత కూడా ఒక ఉపాధ్యాయుడిలా ప్రజలకు కనబడాలి. విద్యా, వినయ, వివేక సంపన్నుడిగా పరిపాలకుడు కనబడాలి గానీ రౌడీగానో, గూండాగానో కాదు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం బడిలో తనకు పాఠాలు నేర్పిన గురువు డా॥తిరుమల శ్రీనివాసాచార్యగారికి మొట్టమొదటి తెలంగాణ ప్రభుత్వం ఏర్పరచిన 'దాశరథి' పురస్కారాన్ని అందజేస్తూ ఆ సభలో ప్రసంగించిన తీరు, తన గురువుకు మనస్ఫూర్తిగా పాదాభివందనం చేసిన తీరు

చూసినపుడు ఆ సంస్కారానికి, ఆయన సహృదయచర్యకు సభాసదులే కాదు, మరునాడు వార్తల్లో విన్న, చూసిన అందరూ కూడా ఆశ్చర్యానందాలు పొందారు. ఒక ముఖ్యమంత్రి బడిలో చిన్నప్పుడు పాఠాలు చెప్పిన ఆ ఉపాధ్యాయుని పట్ల ప్రదర్శించిన ఆ మాట, చేత, శిష్యుల ఉన్నతికే కాదు, గురుశిష్య సంబంధానికే ప్రశంసార్హదృశ్యం". అని 'సారొస్తొరొస్తారు' అనే వ్యాసంలో అగ్గలంగా ఉటంకించడం యువతరానికో ప్రబోధగీతంగా భాసిల్లింది.

"గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో సబ్సిడీ ఉల్లి అమ్మకాల ప్రారంభోత్సవం రైతుబజార్లలో మంత్రుల హడావిడిల మధ్య అట్టహాసంగా జరిగింది. బంగారు నగలషాపుల ప్రారంభోత్సవాన్ని మించి–ఉల్లిమార్కెట్ విక్రయాల ఉద్ఘాటనం జరగడం వింతే మరి! అయిదు రైతుబజార్లలో అయిదుగురు మంత్రులు సబ్సిడీ ఉల్లిగడ్డల విక్రయ కేంద్రాలను ప్రారంభించడం బంగారు తెలంగాణకు గొప్ప వార్త అయింది!" ఉల్లిగడ్డ కోస్తే కాదు, కొంటే కంట్లో నీళ్ళొస్తున్నాయి అనుకునే పరిస్థితి దాపురించినపుడు జరిగిన సన్నివేశాన్ని 'ఉల్లితల్లిమేలు' అనే వ్యాసంలో సామాన్యుల కడగండ్లను కళ్లకు కట్టినట్లుగా వివరించిన వైనం సుధామలోని సామాజిక స్పృహను పట్టిచూపుతుంది.

ఇలా ఒక్కొక్క వ్యాసం గురించి చెబుతూపోతే పేజీలకు పేజీలు చెప్పాల్సి ఉంటుంది.. కానీ ప్రతి వ్యాసం నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలకు నిలువుటద్దం పడ్తుందన్న విషయం మాత్రం స్పష్టం. మనం అనుభవిస్తున్న దాన్ని, అనుభూతి చెందుతున్నదాన్ని, అక్షరమయం చేస్తున్నాడు కాబట్టే 'సుధామ' తెలిపినవన్నీ 'సుధామయోక్తులు'. వారి కలం, వారి గళం రెండూ ఇంకా విస్తృతంగా, ప్రయోగాత్మకంగా, స్ఫూర్తిమంతంగా, సమాజహితంగా ప్రకాశించాలని–వర్తమానతరానికీ, భావితరాలకీ చదువుకున్నప్పుడల్లా వారి 'సుధామయోక్తులు' వారి అంతరాత్మకు అద్దంపట్టాలని ఆశిస్తూ...

సాహితీ 'సుధామ'ను మనసారా అభినందిస్తూ...

'వాచవి'గా సాగిన ఈ నా 'నుడి' దాటి ఇక ముందుకు సాగిపోండి...

శుభాకాంక్షలతో

డా॥ కె.వి.రమణాచారి

ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్)

(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు)

18.05.2018

హైదరాబాద్

# సమకాల జ్ఞానసుధ

వేర్వేరు భాషల్లో ఒక పదం, శబ్దం ఒకటిగా వున్నా, అర్థాల అన్వయం కుదరని సందర్భాలు అత్యధికంగా వుంటాయి. తెలుగు ఇంగ్లీషు భాషల్లో ఒకేలా ధ్వనిస్తూ హాస్యమో లేక వ్యతిరేకార్థాలో ఇచ్చే పదాలను ఎగతాళి కోసం వాడుతుండేవారు విశ్వనాథ సత్యనారాయణ. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువులో ఈ తరహా తమాషాలు చాలా చేశారు. వేర్వేరు భాషల్లో సాంకేతికంగా అర్థం వేరయినా అన్వయం కుదిరే పదం 'కాలమ్'. తెలుగులో 'కాలమ్' అంటే చెప్పనవసరం లేదు. ఇంగ్లీషులో 'కాలమ్' అంటే నిర్ణీతంగా వుండే వరస, స్తంభం లేదా సైనిక కవాతులో వరస. పత్రికల్లో సమాచారాన్ని కూడా ఎనిమిది, ఆరు, ఇలా కాలమ్స్‌గానే ఇస్తుంటారు. తెలుగు గొప్పతనం మనం చాలా చెప్పుకుంటాం గాని, మాలాటి వాళ్ళమంతా ఈ 'కాలమ్' అనే పదానికి సరైన తెలుగు సృష్టించింది లేదు. 'డబుల్ కాలమ్' అని, 'ట్రిపుల్ కాలమ్' అని వాడేస్తుంటాం. అనుభవజ్ఞులు, రచయితలు వారం వారం లేదా మరేదైనా కాలవ్యవధితో రాసే వ్యాఖ్యాన వ్యాసాలు రాసినప్పుడు 'కాలమ్' అనే అర్థం వేరు. హెడ్డింగ్‌లను శీర్షిక అన్నట్టే 'కాలమ్'ను కూడా శీర్షిక అంటుంటారు గాని, వాస్తవంగా అర్థం పొసగదు. ఏది ఏమైనా శబ్దానికి అనుగుణంగా కాలవ్యవధితో రాసేది 'కాలమ్' అన్నమాట. 'కాలమ్' రాసే రచయితలు సమకాలీన అంశాలపై తమ భావాలను పంచుకోవచ్చు. అలాగే పేరున్నవారు రాయడానికి ఒప్పుకుంటే పత్రికలు సంతోషిస్తాయి. ఇలా ఇక్కడ ఒక పరస్పర సంబంధం చూస్తాం. మామూలు వార్తా కథనాల్లో దొరకని పలువిశేషాలు, విశ్లేషణలూ, నేపథ్యాలు, జ్ఞాపకాలు ఇందులో ఉంటాయి. అభిప్రాయ శిల్పులు అంటే నాయకులూ, లేఖకులూ అందుకే వీటిని ప్రత్యేకంగా చదువుతుంటారు.

కాలమ్స్ గురించిన చర్చ నుంచి నేరుగా సుధామ దగ్గరకొస్తే – దశాబ్దాల పాటు ఆకాశవాణిలో అదృశ్యంగా అతి సుతారంగా వినిపించిన సుధామ అక్షరరూపిగా ప్రత్యక్ష పరిచితుడు. కవి, వ్యాసకర్త, సమీక్షకుడూ, వ్యాఖ్యాత, ఫీచర్ రచయిత. ఉపన్యాసకుడూ. చెప్పాలంటే ఇంకా చాలా రకాలైన శక్తియుక్తులు వున్నవారు. వాటిని

యుక్తాయుక్తంగా వినియోగించగలవారు కూడా. భాగవతంలో సుదాముడు స్నేహాన్ని గుర్తుచేస్తాడు. దానికి వత్తు చేర్చి మరీ – సుధామ కలం పేరు పెట్టుకున్న అల్లంరాజు వెంకటరావుగారిలో ఆ స్నేహగుణం కూడా ఒక పిసరు ఎక్కువే. మాకైతే రెండు మూడు దశాబ్దాల స్నేహం. తొలిరోజుల్లో రేడియోలో నాకు ప్రసంగ కార్యక్రమాలు ఇచ్చి, ఆయన రికార్డు చేసి ప్రసారం చేస్తే, మలి దశలో మా సాహిత్య సభల కోసం ఆయనను వివిధ చోట్లకు విహరింపజేసిన పాత్ర నాది. ఇన్ని విధుల మధ్యనా ఆంధ్రభూమిలో ఏకంగా పదిహేనేళ్ళపాటు, ఆంధ్రప్రభలో మరో మూడేళ్ళపాటు 'కాలమ్స్' రాసిన అరుదైన ప్రత్యేకత ఆయన స్వంతం. వివిధ పత్రికల్లో పజిల్స్ ద్వారా భాషకూ, భావాలకూ కూడా పదును పెట్టే సుధామ – రాతల్లోనూ, ప్రసంగాల్లోనూ మాత్రమే గాక, సాధారణ సంభాషణంలో కూడా చమత్కారాలు కురిపించే వ్యంగ్యహాస్య ప్రియుడు. అనేక రంగాలలో చేయి తిరిగిన ఈ రచయిత 'మన తెలంగాణ' దినపత్రికలో 2015లో 'సుధామ 'యోక్తి'' పేరిట వారం వారం రాసిన 'కాలమ్' ఇది. అలాటివారు 'కాలమ్స్' రాస్తే విషయానికి న్యాయం జరగడమే గాక, ప్రాస్తావికంగా బోలెడు వైనాలు మనకందుతాయి. పదబంధాలు పట్టుపడతాయి. ఇక్కడ పేర్కొన్న విశేషణాలు లేని వ్యాసం అంటూ ఇందులో మనం చూడం. శీర్షికలోనే ఆ విరుపుంది. ఆయన రాసిన వ్యాసాలలో మెరుపులు కూడా చాలా చూస్తారు.

మొదటే చెప్పుకున్నట్టు 'కాలమ్' నిర్వహణ కాలంతో ముడిపడి ఉంటుంది గనుక 2015లో రాయడం అంటే కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ తొలి అడుగుల సందర్శనం. ప్రథమ ప్రభుత్వ తీరుతెన్నులను అవలోకించే అవకాశం. కొత్త రాష్ట్రం, కొత్త పాలకులు కావడం వల్ల కొన్ని వెసులుబాట్లు, కొన్ని ఆటుపోట్లు కూడా వుంటాయి. ఆదిలోనే హంసపాదులా అన్నిటిపైనా కాలమిస్టు ధ్వజమెత్తే అవకాశముండదు. అయితే తొలి అడుగులో నెరవేర్చాల్సిన కనీస కర్తవ్యాలను విస్మరించడమూ వాస్తవికత కాదు. ఈ సమతుల్యత పాటిస్తూ సాగిన సమకాలీన వ్యాఖ్యాన సంహిత ఈ 'మన తెలంగాణ' అనేక ఆశల మధ్య ఆకాంక్షలతో ఏర్పడిన నూతన రాష్ట్రంలో మాటలకూ చేతలకూ మధ్యన, అలాగే వాగ్దానాలకు, వాస్తవాలకు మధ్యన, ప్రశంసలూ విమర్శలను పరిగణనలోకి తీసుకుంటూ, అవసరమైన చోట సూటిగా, మరికొన్నిచోట్ల అన్యాపదేశంగా చెప్పాల్సింది చెబుతూ, వేయాల్సిన చురకలువేస్తూ, సుధామయం చేశారు రచయిత. మీడియాలో నిరంతరం రచనలు, వ్యాఖ్యానాలు చేయడంతో

పాటు ఒకటిన్నర దశాబ్దంగా కాలమ్ రాస్తున్న నాకు ఇందులోని సాధకబాధకాలు బాగా తెలుసు. దీన్ని 'మిడిల్ కాలమ్' అన్నారు గనుక అందుకు తగ్గట్టే మధ్యేవాద మార్గంలో మంచి మాటలు చెప్పే ప్రయత్నంలో కృతకృత్యులయ్యారు.

ఈ పుస్తకంలో తొలి వ్యాసమే 'ఏడవకండేడవకండి'. అసమానతల నుంచి ఉత్పన్నమైన అసూయలకు ఆలవాలమైన మన సమాజంలో అనుమానాలు, అపోహలకు లోటులేదు. మనను చూసి ఇతరులు ఈర్షపడుతున్నారని, దాని వల్ల చెడు జరుగుతుందని దిష్టి తీస్తుంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్-పిఆర్‌సి పెంచినపుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెంచకపోగా. ముందు పనితీరు బాగుచేసుకొమ్మని ఉద్బోధించడం వల్ల కలిగిన స్పందన ఇది. విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య పరిస్థితులను, రాజధాని రహితమైన ఎ.పి పరిమితులను చెబుతూ, ఒకరిని చూసి ఒకరు బాధపడేకంటే సుహృద్భావంతో ముందుకు సాగాలనే సూచన చేశారు రచయిత. అప్పుడే అనేక భవనాలు కూల్చి కొత్తవి కట్టాలనుకుంటున్న కెసిఆర్ ఆలోచలను ప్రస్తావించి, ఆయన కూడా విమర్శకు అతీతుడనని అనుకోవడం లేదనీ, స్వయం చోదిత నియంత్రణ అవసరమనీ చెప్పేశారు. స్వచ్ఛభారత్ హడావుడిలో ఢిల్లీలో గెలిచిన 'ఆప్' ఎన్నికల గుర్తు ఆధారం చేసుకుని రాసిన కాలమ్ 'చీ పురోగమనం'. శీర్షికలోనే సుధామ తరహా విరుపు చూస్తాం. ముచ్చటగా మూడో వ్యాసం అమ్మభాష తెలుగు ఔన్నత్యాన్ని చెప్పడంతో పాటు, తెలంగాణలో భాషా స్థిరీకరణ బోధనలకు సంబంధించి, స్పష్టత అవసరాన్ని నొక్కి చెప్పారు. తదుపరి రెండు వ్యాసాల్లోనూ – యాదగిరిని అభివృద్ధి పరచడాన్ని హర్షిస్తూనే, యాదాద్రి అని సంస్కృతీకరించడం అవసరమా అని విచికిత్స చేయడానికి వెనుకాడలేదు. 'ఏ తీరుగ మము దయచూచెదవో' అంటూ భద్రాచలం బదలాయింపుపై రాస్తారు. 'ఆర్థికంలో కొత్త 'దేవుడు'' అంటూ మరో వ్యాసంలో హైదరాబాద్ ప్రాధాన్యతనూ, ఉమ్మడి రాజధానిగా తీసుకోవలసిన జాగ్రత్తలను చెప్పారు. 'శాంతి గు'లాబీ'' కూడా ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్‌ను ప్రస్తావించి, ప్రశాంత తెలంగాణ కోసం ప్రజాస్వామికంగా వ్యవహరించాలని చెప్పే రచన. 'కొత్త(గా)ఏడు'కూడా చమత్కార శీర్షికతో ఆ యేడు మార్చి 21న ఉగాది రావడంపై విసుర్లతో విశ్లేషణ చేస్తారు. తెలుగులోనే గాక ఇంగ్లీషు విరుపుల్లోనూ దిట్ట గనుక– 'ఇంటర్ 'నెట్టు'కు రాలేమా?, గ్రేటర్ ఓటర్ మేటర్, 'గ్యాస్'కబుర్లు ఇలా అర్థవంతమైన

హాస్య స్ఫోరకమైన శీర్షికలతో సమస్యల సాధకబాధకాలను, సానుకూల ప్రతికూలాంశాలను కళ్ళకు కట్టారు. ఇదో సామాన్యుని సంవేదన అనిపించారు. మౌలికంగా సాహిత్య కారుడు, భాషాభిమాని గనక ఈ సంబంధమైన అంశాలు అనేక వ్యాసాలలో రసవత్తరంగానూ, సమగ్రంగానూ విశ్లేషించారు.

సుధామ నిరంతరం చలనంలో వుంటూ తనను తాను తాజాపర్చుకోవడం చూస్తూనే వున్నాను. ఉపాధ్యాయుల నియామకాలపై 'సారొస్తారొస్తారు' అని రాసిన సుధామ– సినిమాల విషయంలోనూ ఎలా అప్‌డేట్‌గా వున్నారో తెలుస్తుంది. 'గవర్నర సింహన్'–ఆయన పేరునూ తీరునూ చర్చలను గమనంలో వుంచుకుని చేసిన రచన. రచయిత అవసరమైన చోట గట్టిగా అభిప్రాయాలు చెప్పడానికి వెనుకాడరు. ఆత్మహత్యలు ఎందుకైనా సరే మంచిది కాదని సోదాహరణంగా చెబుతూ, వాటికి రాజకీయాకర్షణ కల్పించవద్దని సూచిస్తారు. 'తిండిపోటుగాళ్ళు' శీర్షికలో ఆహార వ్యవహారాలపై అనుచిత ఆంక్షలు, ఆధిపత్యాలు తగవని ఆక్షేపిస్తారు. ఇలా చెబుతూ పోతే అన్నిటినీ ఉదహరించాలనీ, ఉటంకించాలని అనిపిస్తుందిగానీ, తినబోయే పాఠకులకు రుచులన్నీ చెప్పడం తప్పవుతుంది. కాబట్టి సంపూర్ణ సుధారసాస్వాదన మీకే వదిలేస్తూ, నా చిరకాల మిత్రుడు సుధామను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆయన అనుభవం, అధ్యయనం నుంచి మరిన్ని అమూల్య విషయాలు తెలుగువారికి అందించాలని కోరుతున్నాను.

**- తెలకపల్లి రవి**

(ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, సామాజిక రాజకీయ పరిణామాల మీడియా విశ్లేషకులు, 'సాహితీప్రస్థానం' సంపాదకులు)

10.5.2018
హైదరాబాద్

# ధన్యవాదాలు

పత్రికా రచయితగా, అందునా ఒక కాలమిస్టుగా సుమారు పదిహేను సంవత్సరాలు ఆంధ్రభూమి దినపత్రికలో–మధ్యలో కొంత విరామం తీసుకున్నా 'సం.సా.రా.లు' (సంస్కృతి–సాహిత్యం–రాజకీయాలు) కాలమ్ నిర్వహించడం, అది అత్యంత పాఠక సమాదరణ పాత్రం కావడం మరచిపోలేని అనుభవం. కాలమ్ ప్రారంభించిన కొద్దినాళ్ళకే ఓ యాభై వ్యాసాలతో 'సం.సా.రా.లు' పుస్తక రూపంలో 2001లో వెలువడటం, 2004లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం అందుకోవడం, ఓ కాలమ్ వ్యాసాలకు తొలిసారి ఆ గౌరవం దక్కడం విశేషమే మరి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 'విశాలాంధ్ర' దినపత్రిక ఇక్కడి రాష్ట్ర ప్రజలకై 'మన తెలంగాణ' దినపత్రికగా పరిణామం చెందింది. 'మన తెలంగాణ' దినపత్రికలో 'కాలమ్' నిర్వహించమని మిత్రుడు వేదాంతసూరి (ప్రముఖ బాలసాహితీవేత్త) అడగడం, అది 'సుధామ'యోక్తి కాలమ్‌గా రూపుదాల్చడం జరిగింది. ఇప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ అయిన ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ప్రోత్సాహం, సంపాదకుల సమాదరణతో, వారం వారం ఏడాదికి పైన రెండు నెలలు ఈ కాలమ్ 'మన తెలంగాణ' దినపత్రిక ఎడిట్‌పేజి మిడిల్‌కాలమ్‌గా ప్రచురితమైంది.

29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం జరిగాక 2016 వరకూ ఓ పధ్నాలుగు నెలల కాలంలో రాష్ట్రంలోని, దేశంలోని కొన్ని పరిణామాలకు ఒక రికార్డుగా వుంటుందని ఇప్పుడీ కాలమ్ వ్యాసాలను పుస్తక రూపంలో వెలువరించడం జరుగుతోంది. అప్పటి వార్తాంశ కథనాలివి. తదుపరి కాలంలో పరిణామాలకు అవి ఎలాంటి ప్రాతిపదికలయ్యాయో, నాటి ఈ వ్యాసాంశాలు వర్తమానరీతులకు ఎలా మూలకందంగా వున్నాయో పాఠకులే గ్రహించగలుగుతారు.

'అందరి బంధువయా' అని సాహితీ లోకంలో చిరయశస్విగా వెలుగొందుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారిగారు తమ అమూల్య అభినందనలను అందించి ఆదరాభిమానాలను, ఆత్మీయతను పంచినందుకు ధన్యవాదాలు.

ప్రముఖ సామాజిక, రాజకీయ పరిణామాల విశ్లేషకులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, ప్రముఖ సాహితీవేత్త శ్రీ తెలకపల్లి రవిగారు కోరినంతనే ఈ 'కాలమ్' వ్యాసాలకు అమూల్యమైన తమ 'మున్నుడి'ని అందించినందుకు ఎంతగానో కృతజ్ఞుడిని.

ఈ పుస్తకం ఇలా రూపొందించడానికి వెనుక నా శ్రీమతి అల్లంరాజు ఉషారాణి, కుమారుడు స్నేహిత్, కోడలు స్రవంతిల అండదండలకు వారికి నా ఆశీస్సులు. అందంగా, అర్థవంతంగా డి.టి.పి చేసిన శ్రీ కుదుపూడి భాస్కర్ రావు (మనుగ్రాఫిక్స్) గారికీ, అచ్చొత్తిన వేణుగ్రాఫిక్స్‌కూ, ముఖ్యంగా సతీష్ గారికీ నా కృతజ్ఞతలు.

-సుధామ

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఏడవకండేడవకండి | 17 |
| 2. | చీ‘పురో–గమనం’ | 20 |
| 3. | అమ్మబాష | 23 |
| 4. | మర్యాదగిరి | 25 |
| 5. | భాష ప(నిము)ట్టు | 28 |
| 6. | కొత్త(గా)ఏడు! | 31 |
| 7. | ఏ తీరుగ మము దయచూచెదవో....! | 33 |
| 8. | ఆర్థికంలో కొత్త ‘దేవుడు’ | 36 |
| 9. | శాంతి గు‘లాబీ’ | 38 |
| 10. | ‘తాళి’ంపు కాదా? | 41 |
| 11. | యువ(తోద్యోగ) తెలంగాణ | 44 |
| 12. | ‘ఒకటి’కి రెండుసార్లు!? | 47 |
| 13. | కె.జి. టు పి.జి – డ్రౌజీ టు రోజీ | 50 |
| 14. | ఎక్కువచోటు – ఎక్కువ చేటు | 53 |
| 15. | ఉద్యోగ కళాకారులు | 56 |
| 16. | వ్యాపార పారావారం | 59 |
| 17. | ‘అభివృద్ధి(కి) రేటు’ | 62 |
| 18. | ఏ నిముషానికి ఏమి జరుగునో...! | 65 |
| 19. | గవర్నర్ సింహన్.... | 68 |
| 20. | ‘మనవాళ్లు బ్రీఫ్‌డ్‌మీ’ | 70 |
| 21. | వదులుకుంటా!...రా?! | 73 |
| 22. | పుష్కరుడు – ముష్కరులు | 76 |
| 23. | మాటకు మాట | 78 |
| 24. | అఖండ స్నేహదీపం | 81 |
| 25. | ఉల్లితల్లిమేలు | 84 |
| 26. | ఆరనీకుమా ఈ దీపం..... | 87 |
| 27. | “కల్లు తెరవండోయ్!” | 90 |
| 28. | ‘గిల్లీదండా–గల్లీ దందా’ | 93 |

29. సారొస్తారొస్తారు....! 96
30. ఇదేనా సిలబస్! 99
31. తప్పుడు సంకేతాలు 102
32. అసలు చరిత్ర 105
33. తిండి–పోటుగాళ్ళు! 108
34. ని'రసన' పంథా 111
35. భద్ర భావన 114
36. రేపు తెలుస్తుంది 117
37. పిల్ల(ల) సినిమాలు 120
38. నిర్లక్ష్యపు నీడలొద్దు 123
39. పాక'కళాశాల'! 126
40. 'గ్యాస్' కబుర్లు 129
41. 'చలియోగం' లేదా? 132
42. 'సరి–బేసిల' దారి... 135
43. 'కొత్త' వెలుగు 138
44. గుండెబలంకావాలి! 141
45. ఇంట(ర్) 'నెట్టు'కు రాలేమా? 144
46. వ్యవస్థ పు(రోహిత్)లేనా? 147
47. గ్రేటర్ ఓటర్ మేటర్ 150
48. నవాభ్యుదయగళహారం–నగరం 153
49. వ్యవస్థీకృత వలపు 156
50. పాపం! దేశభక్తి 159
51. ఆరోగ్యమే మహాభాగ్యం 162
52. ప్రాణ'హిత' చర్యలు 165
53. మానవ సంబంధ విని'యోగం'! 168
54. దేశం 'అమ్మ'కాలే...! 171
55. విశ్వాసమార్గంలో... 174
56. అసంపూర్ణానికే స్వర్ణం భళీ! 176
57. దుర్ముఖి సన్ముఖంగా... 179
58. నీటిరాతలు! 182
59. (సు) సంపన్నత 185

# ఏడువకండేడువకండి

‘నన్ను చూసి ఏడ్వకురా!’ అని లారీల వెనకాలా, ఆటోలా వెనకాలా నినాదం ఒకటి – రోడ్ల మీద ప్రయాణిస్తున్నప్పుడు కనబడుతూ వుంటుంది. ముందుకుపోతున్న బండి వెనకాల ఆ మాట, వెనక వాహనాల వారికి ఎలా అనిపిస్తుందో చెప్పాలా? అలాంటి వాహనాన్ని ఓవర్‌టేక్ చేయాలని తాపత్రయపడే డ్రైవర్లూ తారసపడుతుంటారు. అతివేగం ప్రమాదకరం, అంతేకాదు అనర్థదాయకం కూడాను. అయితే మంచి కండిషన్‌లో వాహనం వుండి, జాతీయరహదారిమీద ప్రయాణిస్తున్నప్పుడు, కంట్రోల్‌లో వుంటూ వాహనాన్ని పరుగులు తీయించడం, అభివృద్ధి దాయకమే అవుతుంది. దానిని చూసి ఉడుక్కుని, చేతకాని వాడు వెనకనుంచి ఓవర్‌టేక్ చేయాలనుకుంటే వాళ్లకే ఇబ్బంది.

పిఆర్సీపై ముఖ్యమంత్రి కేసిఆర్ ధనాధన్ నిర్ణయం తీసుకుని, ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వస్తే ప్రకటించడం ఇబ్బంది అవుతుందని, ముందుగానే తెలంగాణా ఉద్యోగుల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం, ఉద్యోగవర్గాల్లో ఆనందాన్ని పెంచింది. 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారు. నవ తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిన జూన్ 2, 2014 నుంచి కొత్తవేతనాన్ని అమలు చేస్తూ, బకాయిలను మాత్రం పిఎఫ్‌లో కలుపుతూ, ఈ ఏడాది మార్చి నుంచి కొత్తవేతనాలు చెల్లిస్తామన్న కెసిఆర్ ప్రకటన మునుపెవ్వరూ తీసుకోని సాహసనిర్ణయంగా సంబరాన్ని కలిగించింది.

సున్న నుంచి బేరం మొదలెట్టిన సి.ఎంలను చూసిన కళ్ళతో ఏకంగా 43 శాతం ఫిట్‌మెంట్ అన్న కెసిఆర్ మాటలు హర్షణీయమైన సంగతి కదా! తెలంగాణ పునర్నిర్మాణంలో ఉద్యోగులు దీనితో పనిమంతులై భాగస్వామ్యం వహిస్తారన్న విశ్వాసం సామాన్యులకు కూడా కలుగుతోంది. వేతనంలో 2881 రూపాయిలు, 43 శాతం ఫిట్‌మెంట్ అమలుతో పెరగడం – భారీ మొత్తంగా సంతోషం కలిగించడంలో ఆశ్చర్యం ఏముంది. ఒక సీనియర్ అసిస్టెంట్‌కు కూడా ఒక్కసారిగా అయిదు వేల రూపాయలుదాకా పెరగడం సంబురమే కదా!

ఇది ఇలా ఉంటే తనను కలిసిన ఉద్యోగ నేతలకు ఆంధ్రప్రదేశ్ సి.ఎం చంద్రబాబు పిఆర్‌సి ఎంతిస్తామనే విషయం చెప్పలేననీ, రాష్ట్రం ఇబ్బందుల్లో వుందనీ., డబ్బులేదనీ అనడంతో ఊరుకోలేదు. "ముందు మీ పనితీరు మెరుగుపరుచుకోండి. మీ పనితీరు నా అంచనాలకు తగినట్లుగా లేదు, బాగా పనిచేసి రాష్ట్ర ఆదాయాన్ని పెంచండి. అప్పుడు మీ జీతాలు పెంచుతాం" అనడంతో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు సహజంగానే ఖిన్నులవుతున్నారు.

'అత్తగారు తిట్టినందుకుకాదు- తోడికోడలు నవ్వినందుకు' అన్నట్లుగా మొన్నటిదాకా ఒకటిగా వున్నచోట ఇవాళ తెలంగాణ ఉద్యోగుల జీతభత్యాల పురోగమనం-రహదారిపై ముందుకు పోతున్న వాహనం వెనుక 'నన్నుచూసి ఎడ్వకురా" అన్న వాక్యం చూసిన భావననే రేకెత్తిస్తుందవచ్చు. నిజానికి పోలికలు అనవసరం. ఎవరి అదృష్టం, ఎవరి పనితీరు వారిది అనే వారుంటారు. ఆ మాట కొస్తే కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణాకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అసంతృప్తి దాయకంగానే వుంది. కేంద్రం అంటున్న 'నీతి ఆయోగ్' వల్ల వెనుకబడిన ప్రాంతాలకి ప్యాకేజ్ వర్తిస్తుందంటే మన హైదరాబాద్, దాని చుట్టూ ఏర్పాటు చేసే పరిశ్రమల దృష్ట్యా ఆ కేంద్రప్యాకేజీ వర్తించదు. కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు ఇన్‌కంటాక్స్, సెంట్రల్ ఎక్సైజ్‌లను మినహాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది.

నూతన పారిశ్రామిక విధానం విధి-విధానాలను ప్రకటించి పారిశ్రామిక వేత్తలను కొత్త పరిశ్రమల స్థాపనకు ఆకట్టుకోవాలన్నప్పుడు కేంద్ర రాయితీలు నూతన రాష్ట్రానికి సంతృప్తిదాయకంగానూ, ప్రోత్సాహకరంగానూ వుండాలి కదా!

కేంద్ర ప్యాకేజీలు, రాయితీల విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే ముందువాహనం వెనుకరాత భావన-ఇక్కడా పొటమరించవచ్చు. అందువల్ల పోలికలు అనవసరం. ఎక్కడా వాపు కాదు కావాలసింది. బలం కావాలి. తెలుగువారి రెండు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలన్నదే ఆకాంక్ష. ఎక్కడ నివసించినా తెలుగువాడు వెలుగొందాలి. మునుపటి దోషాలను సరిదిద్దుకుని, పునర్నిర్మాణానికి అంకితభావంతో ముందడుగువేయాలి. కూలగొట్టడమే పునర్నిర్మాణమా అని కెసిఆర్ గురించి సన్నాయినొక్కులు నొక్కుతున్నవారూ వుంటారు. సచివాలయాన్ని, ఛాతీ ఆసుపత్రినీ

మార్చాలంటున్న కెసిఆర్ తాను విమర్శలకు అతీతుడనని ఏమీ అనుకోవడం లేదు. కానీ 'దూకుడులో కూడా ఒక స్వయం చోదిత నియంత్రణ' అభిలషణీయమవుతుంది.

స్టీరింగ్ చేతిలో వుందని వాహనాన్ని నడపడంలో డ్రైవర్ నిగ్రహాన్ని కోల్పోకూడదనీ, అతివేగం ప్రమాదకరం అనీ, ఓవర్‌టేక్‌లు ఏవయినా నియమబద్ధంగానూ, ఆవశ్యకంగానూ తోచాలనీ, ఏ ప్రయాణీకుడయినా అనుకుంటాడు. అందులో తప్పులేదు. సుఖవంతమైన ప్రయాణం కోసం, గమ్యం వీలయినంత త్వరగా క్షేమంగా చేరాలన్న అభిలాషతో వుంటూనే, నడిపేవాడిని విశ్వసిస్తారు.

నడిచేదారుల గమ్యమొక్కటే
నడిపేవాడికి అందరొక్కటే
అన్నపాటలోని మాట యథార్థం అనిపించక మానదు.

**(7.2.2015)**

# 'చీపురో-గమనం'

ఇవాళ ప్రేమికుల రోజు! అవును!

ప్రజాస్వామ్య ప్రేమికుల రోజు

ఢిల్లీ గద్దెమీద 'ఆమ్ ఆద్మీ' – అనగా సామాన్యుడు, పీఠం ఎక్కడానికి ప్రమాణస్వీకారం చేస్తున్నడు. సాంప్రదాయ పార్టీల ఊసులేకుండా, ఢిల్లీ ఎన్నికల్లో ఊడ్చి పారేసిన కేజ్రీవాల్ – మునుపు ఏ రాజకీయ రంగంలోనూ, సినిమా రంగంలోనూ వారసత్వపు 'క్రేజ్' వున్న 'సెలబ్రిటీ' ఏమీ కాదు. తానొక 'కామన్‌మేన్'. ప్రజాస్వామ్యంలో 'సామాన్యుడు' కూడా 'అసామాన్యుడు' కాగలడనడానికి తానొక నిదర్శనంగా నిలుస్తున్నాడు. నూటపాతిక సంవత్సరాల పై చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సామాన్యుడి పార్టీ ముందు మట్టికరిచి శూన్యమైంది. దేశమంతా 'మోడీ' హవా వీస్తోంది. ప్రధాని మోడీ వల్ల బిజెపి పార్టీ ప్రభంజనంగా చెలరేగుతోంది. ఢిల్లీలో కూడా బిజెపిదే హవా అనుకున్నవారి అంచనాలను తారుమారు చేస్తూ, 'ఆమ్‌ఆద్మీ' ఒక 'సునామీ'నే సృష్టించింది. ఈ గెలుపు మట్టికరిచిన కాంగ్రెస్‌కే కాదు, తానే గట్టిపట్టుగల పార్టీ ననుకుంటున్న బెజెపికి కూడా ఒక విద్యుద్ఘాతం లాంటిదే!

కేజ్రీవాల్‌ను – 'ఒకే ఒక్కడు' అనీ, 'అతడే ఒక సైన్యం' అనీ సినిమా టైటిల్స్‌తో కీర్తించటం సరైంది కాదు. తను ఒక్కడు కాదు, తనవెనుక సైన్యం ఉంది. వారంతా కలిసి చేసిన ఆలోచనల వెనుక, ప్రజాక్షేమానికి తలపోసిన ప్రణాళికల వెనుక, ఒక ఔచిత్యం ఉంది. ఎన్నికలప్పుడు చేసే వాగ్దానాలు – గెలిచిన తరువాత పేలపిండిలా కృష్ణార్పణం అనకుండా, ఆచరణే అసలు కార్యంగా అమలు చేయగలరన్న విశ్వాసం ఆమ్‌ఆద్మీపై ప్రజలకు కలిగింది. అందుకే దేశ రాజధాని ఢిల్లీ – ప్రజాస్వామ్య చరిత్రలో కొత్తపుటను తెరిచింది. "గెలిచామని గర్వపడకండి. గర్వంవద్దు. మనం మనంగా సామాన్యంగానే వుందాం. నేను మఫ్లరే చుట్టుకుంటాను. జెడ్ సెక్యూరిటీలు, ట్రాఫిక్‌లకు ఇబ్బంది కలిగించే కాన్వాయ్‌లు, వాస్తు బాగాలేదంటూ కొత్త కొత్త భవన నిర్మాణాలు వద్దు. నీరే ప్రాణాధారం అన్నారు. ఢిల్లీ వాసులకు ఆ నీరు... మంచినీరు–త్రాగడానికి ఉచితంగా అందేలా చూద్దాం. స్త్రీలకు భద్రత హామీ నిద్దాం.

అంటూ కేజ్రీవాల్ – అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తానని గాలిమేడలు కట్టడం కాకుండా, ఆచరణ సాధ్యమైన అతిమామూలు సగటు జీవికి కావలసిన అంశాలపట్లే పునరంకితమవుతున్నాడు. అదే ఆచరణలోకి అనువదిస్తానంటున్నాడు.

'ఆడలేక మద్దెల ఓడు' అన్నాడని సామెత! 'ఆమ్ ఆద్మీ' వల్ల పరాజయం పాలైన, పరాభవం పొందినట్లుగా విలవిలలాడుతున్న సాంప్రదాయ పార్టీలు తమ ఓటమిని జీర్ణించుకోలేక, రకరకాలుగా గొణుగుతున్నాయి. 'దేశఛత్రాధిపత్యం' అనుకున్న బెజెపి పార్టీకీ చెందిన ఓ ప్రముఖుడు – ఆమ్ ఆద్మీ పార్టీ తన ఎన్నికల గుర్తును మార్చుకునేలా చేయమని సుప్రీంకోర్టు నాశ్రయించాడట! ఆమ్ఆద్మీ పార్టీ చిహ్నమైన 'చీపురు' గుర్తు చూసి ఢిల్లీ వాసులు అది 'స్వచ్ఛభారత్' అంటున్న బిజెపి చిహ్నమే అనుకుని – బిజెపికి ఓటు వేస్తున్నామనుకునే ఆమ్ఆద్మీపార్టీకి వేసేసారనీ, అందువల్ల అది 'గుర్తు' చేసిన మోసమనీ, ఆయన గోల పెడుతున్నాడట! ఇంతకీ ఎవరు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయిందో వాడే 'ఆమ్ఆద్మీ'!

'చీపురు' అనగానే – 'స్వచ్ఛభారత్'యే గుర్తు కొచ్చేలా ప్రధాని మోడీ చేశారనీ, అందువల్ల ఢిల్లీవాసులు మోడీకే ఓటేస్తున్నామనుకునే మోసపోయారనీ అంటే – పాపం కాంగ్రెస్‌కు 'సున్న' వచ్చిన చోట, బిజెపికి మూడు స్థానాలు మాత్రం ఎలా వచ్చినట్టో తెలీడం లేదు కదా! ప్రతిపక్షంలో కూర్చోడానికి కావల్సినంత సంఖ్య కూడా స్థానాలుగా బిజెపికి దక్కలేదు. కానీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇవాళ ప్రమాణస్వీకారం చేస్తున్న ఆమ్ఆద్మీ అధినేత కేజ్రీవాల్ ఎంతో ఔదార్యంతో – మూడు స్థానాలున్న బిజెపికి ప్రతిపక్ష హోదా కల్పిస్తానని, ముందే ప్రకటించేశాడు. అదీ ఒక విశేషమేమరి.

చీపురు అంటే ఆమ్ఆద్మీ పార్టీ గుర్తే! ఒక ఏనుగునో, పెద్ద కమలం పువ్వునో పార్టీ గుర్తుగా వుంచుకునే సంపన్నత తమకు లేదనీ, ఏ సైకిల్‌నో ఎంచుకుందామనుకున్నా అది వేరెవరికో ముందే కేటాయింపు జరిగిందనీ, అందువల్ల సామాన్యులమైన తమ పార్టీకి చీపురే తగిన గుర్తుగా భావిస్తున్నామనీ, కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రముఖ నేత థరూర్ "మాది చెయ్యి గుర్తు. అందువల్ల ఆమ్ ఆద్మీ కావాలంటే ఏ కాలునో, గుండెనో, కిడ్నీనో గుర్తుగా పెట్టుకుంటే తమకు అభ్యంతరం లే"దని ఎకసెక్కం చేశారు.

చీపురే అయినా అందులోనూ నిజానికి రకాలున్నాయి. చెత్త వూడ్చే చీపురువేరు, మురికి నీళ్ళను చిమ్మేసే కొబ్బరిచీపురు వేరు. గదిగోడలపై బూజులను దులిపే బూజుకర్ర చీపుర్లు వేరు. ఇంట్లో వాడే చీపురుకూ, రోడ్లు ఊడ్చే చీపురుకు కూడా తేడా ఉంది. ఇంతకీ అసలు విషయం చీపురే అయినా దానిని వినియోగించేవారి ఒడుపు, శ్రద్ధ, పనితనం మీద చీపురు పనిచేసే తీరు ఆధారపడి వుంటుంది. స్వచ్ఛ భారత్ చీపురు–ఫోటోలు దిగడానికి పనికివచ్చినంతగా, చిత్తశుద్ధితో శుద్ధిచేసి పరిశుభ్రతను నెలకొల్పడంలో ఉపయుక్తం కాలేదని చాలామందికి తెలిసిపోయింది. సంపన్నుడు చీపురుపట్టుకుంటే అది ఒక నాటకం అనీ, ఏ ఫొటో కోసమో వేషం వేయడమేననీ అర్థమైపోయింది. పైగా ఆ మహనీయనేతలు ఊడ్చినట్లు ప్రచారం చేసుకోవడం కోసం – ఉన్న చోట చెత్త ఊడ్వడం కాక, శుభ్రంగా వున్న చోట చెత్త తెచ్చివేసి మరీ దృశ్యమాలికలు కూర్చి పరిశుభ్రభారత్ ప్రకటనలకు కోట్ల రూపాయలు వెచ్చించారని తేటతెల్లమైపోయింది.

అంచేత ఢిల్లీవాసులు నిజమైన ప్రేమికులై అదే.. అదే... ప్రజాస్వామ్య ప్రేమికులై, ఈ ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం నాడు ఒక ఆమ్‌ఆద్మీసామాన్యుడిని గద్దెనెక్కిస్తున్నారు, సంతోషం. ఎటొచ్చీ రోజులు గడిచాక ఈ చీపురు కూడా చీపురుతో ఊడ్చిపారేసేదిగా కాకుండా, ఈ ప్రజాస్వామ్య విజయపు గుర్తు సుపరిపాలనతో సామాన్యుల గుండె క్రింద చిరునామాగా నిలవాలని ఆకాంక్షిద్దాం.

**(14.2.2015)**

# అమ్మభాష

'ఈ క్రింది పదములను వాక్యములలో ప్రయోగించుము' అని మునుపు స్కూల్ పరీక్షల్లో అడిగేవారు. ఆ పదం అర్థం వీరికి తెలుసునా లేదా? దానిని ఆ సరియైన అర్థంలో వాడుతూ మాట్లాడగలరా లేదా? అని తెలుసుకోవడానికి విద్యార్థులకు అదొక పరీక్ష! మాతృభాష అయిన తెలుగు పరీక్షలోనూ తక్కువ మార్కులతో పాసయ్యేవారు వుండేవారు. ఇంట్లో మాట్లాడుకునేదేగా! తెలుగు మనకు తెలియకపోవడమేమిటి? అనుకుంటే పొరపాటని ఆ రోజుల్లోనే తెలుగు మాధ్యమంలో చదువుతూనే, తెలుగు పరీక్షల్లోనే తెల్లమొహం వేసే తెలుగు విద్యార్థులకు తెలియక పోలేదుమరి!

ఎందుకు చెప్పడం అంటే తెలుగువాళ్లమే అయినా మనకు తెలుగు అధ్యయనం చేయటం నిరంతరం వుంటూ ఉండేదే! వ్యవహారంలో తెలుగుకూ, రాసే తెలుగుకు ఒకప్పుడు తేడా వుండేది? ఇంట్లోనో, బంధువులతోనో మాట్లాడుకున్నట్లు, తెలుగును తెలుగుపరీక్షలో రాస్తే ఒప్పేవారు కాదు! అందుకే దానిని 'గ్రాంథికం' అని, గ్రంథస్థ భాష ఎలా వుండాలనేది నిర్దేశించారు. అరసున్నలు, బండి 'ఱ'లు సరిగ్గా వాడలేదని, విశ్వవిద్యాలయాల్లో పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు రాసిన వారిని, డాక్టరేట్‌కు అనర్హులని తేల్చేసిన సందర్భాలుండేవి ఆ రోజుల్లో!

ఎప్పుడైతే మాట్లాడినట్లే రాయాలనే వ్యవహారిక భాష విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా అంగీకరించబడిందో, దానివల్ల ప్రయోజనంతో బాటు కొత్త సమస్యలూ వచ్చినట్లయింది! వ్యవహారభాషనే అన్నిటికీ స్వీకరించడం మొదలయ్యాక ఎవరి ప్రాంత వ్యవహారం వారిది కాబట్టి, నిజానికి ఆయా ప్రాంతాల్లో వ్యవహరించే తీరునే, యాసపదాలనే, మాండలీకాలనే పరీక్షల్లో,పత్రికల్లో ఆయా విద్యార్థులు, రచయితలూ రాయాలి. కానీ అలా రాస్తే ఒక ప్రాంతపు తెలుగే మరో ప్రాంతానికి అర్థం కాని తీరు, తమ వ్యవహారమే 'అసలు తెలుగు' అని ఎవరికి వారు అనుకునే తీరు తయారైంది.

నిజానికి అన్ని ప్రాంతాల భాషాపదాలూ కలిస్తేనే అది 'సమగ్రమైన తెలుగు' అవుతుంది. రాతలో వ్యవహారికం అనేసరికి, అనివార్యంగా ప్రామాణికత అనేది ప్రశ్నార్థక మౌతోంది. అదే జరిగింది.

విద్యావిధానంలో తెలుగుకు 'ప్రామాణికత' లేకపోతే, మాతృభాష ఎలా వికాసవంతం కాగలుగుతుంది అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తెలుగు జాతి, ఇప్పుడు పాఠ్య గ్రంథాల పునర్వ్యవస్థీకరణను తలపెట్టింది. తమ ప్రాంతపు సాహితీ సంస్కృతులకు పెద్దపీట వేసుకోవలసిందే. అలాగే భాష కూడా తమ ప్రాంతాల మాండలికాల అన్నింటి సమాహారంగా వుండాలి. ఇప్పుడు కూడా తెలంగాణాలోనే అయినా, ఏదో ఒక వరంగల్, కరీంనగర్ ప్రాంత వ్యవహార భాషే పెత్తనం చేస్తోందని తెలంగాణలోని ఇతర జిల్లాల వారూ, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తమ వ్యవహార రచనలకు పాఠ్యప్రణాళికలో చోటు లేదని ఏ ఉత్తరాంధ్ర వారో అనుకోని విధంగా పాఠ్యప్రణాళికలు రూపొందగలుగుతాయా?

ఏ భాషలోనైనా, ఏ ప్రాంతంలోనయినా మాటతీరు జిల్లా జిల్లాకు తేడా వచ్చేస్తూనే వుంటుంది. పదాలు, అర్థాలు, యాస విభిన్నంగా ఉంటాయి. ఇంతకీ భాష అనేది భావవినిమయసాధనం. మనం అనుకున్నది అవతలవారికి అర్థం కావడం ముఖ్యం! నిఘంటువులోని అన్ని పదాలు ఇప్పుడు వ్యవహారంలో వుండకపోవచ్చు. కానీ భాషకు నిఘంటువుల అవసరం చాలా వుంది. ఇప్పుడు తెలంగాణా భాషా నిఘంటువు ఒకటి సమగ్రంగా తయారు కావాలి. అది రూపొందితే తప్ప తెలంగాణ భాష స్థిరం కా(లే)దు. తెలుగు మాట్లాడే దీపాలు తరతరాలు వెలుగుతూనే వుంటాయి.

**(21.2.2015)**

# మర్యాదగిరి

తెలుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీము లేక
డేంజరుగా మారుతోంది

అని అప్పుడెప్పుడో కీ॥శే॥ గజ్జల మల్లారెడ్డిగారు రాసినట్లు, భక్తి కూడా క్రమంగా ఫక్తు వ్యాపరంగా మారుతోందనిపిస్తున్న రోజులొచ్చేశాయి. టీవీ ఛానెల్స్‌లో రక్షరేకులు, యంత్రాలు, మహిమాన్విత ఉంగరాలు, హారాలు అంటూ ప్రాయోజిత కార్యక్రమాలు కూడా పెరిగిపోతున్నాయి. మీ కోసం ప్రత్యేక తగ్గింపుధరలకే ఈ ప్యాకేజీలు అంటూ, ప్రకటనల కార్యక్రమాలు ఊదరగొడుతున్నాయి. 'బిలీఫ్ ఈజ్ యువర్ గాడ్' అనగా విశ్వాసమే దేవుడు అన్నాడు టాల్‌స్టాయ్. అయితే హేతువుతోకాకుండా మూఢంగా ఏర్పడే విశ్వాసాలే భక్తివ్యాపారానికి పెట్టుబడులవుతున్నాయి. ప్రత్యేక హోమీలు, క్రతువులు అంటూ భక్తుల నుండి వేలు, లక్షలు రూపాయలు ఒడుపుకుంటున్న దొంగబాబాలు, అర్చకుల కథనాలు వార్తాంశాలుగా బయటికి వస్తున్నా, విశ్వసించి మోసపోతున్నవారు వుంటూనే వున్నారు.

నిత్యజీవన ఒత్తిడుల నుండి విముక్తి పొందే వాతావరణం కావాలని తపించడంలో దోషం లేదు. మానవీయతకు మకుటాయమానంగా నిలవడం అభ్యంతరకరం కాదు. మతమన్నది కంటి మసకగా, మనసుకు మచ్చగా మారకూడదు. నిజానికి ప్రతి పల్లెలో ఒకదేవాలయం పవిత్రతకు, పచ్చదనానికి సాక్షిగా వుండి మానసిక ప్రశాంతతకు ప్రోద్బలకమై దర్శనీయంగా వుండడం హర్షణీయమే. నిజానికి ఎన్నో జీర్ణదేవాలయాలు, శిథిలాలయాలు వున్నాయి. ఆలయాలమీదా, అర్చనల మీద ఆధారపడి జీవనం గడుపుతున్న అగ్రవర్ణ పేదలూ వున్నారు. ఆలయభూములు అన్యాక్రాంతం అయి, ఆదాయవనరులు లేక నిత్య ధూపదీపనైవేద్యాలకు నోచుకోని గుడులున్నాయి.

ఆలయ అర్చకుడు అంటే నలుగురి మంచినీ ఆశించి మంచిని ప్రబోధించేవాడుగా, భక్తుల గోత్రనామాలతో దేవుడికి అర్చనచేయడమేకాక శుభాశుభాలన్నింటా వారికి తోడై ఆసరాగా నిలిచే పూజనీయుడిగా వుండడం ఒకప్పటి మన గ్రామ వ్యవస్థలోని ప్రధానాంశమే. దేవుడువరమిచ్చినా పూజారివరమియ్యడు చందాన స్వార్థపరులైన వారు తయారై, గుడినీ, గుడిలో లింగాన్నీ మింగేవారికి భయభక్తులతో వారి కనుసన్నలలో మెలిగే భృత్యగణం స్థాయికి ఆ పెద్దలు చ్యుతమయ్యాక ఆధ్యాత్మికతకు, భక్తికి బీటలువారడం మొదలైంది.

ఆలయాలు పవిత్రతను కోల్పోయి, అక్కడా స్వార్థశక్తులు ప్రవేశించి, గుడులను, గుడిమాన్యాలను కైంకర్యం చేసే వారు బయలుదేరి భక్తులకు సౌకర్యాలు లభించడం కరువై, భగవద్దర్శనం కూడా డబ్బుతో ముడిపడిపోయి, వి.ఐ.పి.లకు పూర్ణకుంభాలతో స్వాగతం పలికి నేరుగా గర్భగుడిలోకి అనుమతించి, ఆపై వారిపేర ప్రత్యేక అర్చనలు, పూజాదికాలు ఎగబడిచేసి, శేషవస్త్రాలను, ప్రసాదాలను సమర్పించుకుని భగవదనుగ్రహం కన్న ఆ వి.ఐ.పి.ల అనుగ్రహమే ఎలాగో సంపాదించి, తమ వైయక్తిక కార్యాలను నిర్వర్తింపచేసుకోవాలనే యావ ఏర్పడ్డాక–ఇంక భక్తులకు ఆ క్షేత్రాలమీద భక్తిభావనలు, దర్శనాభిలాషలు ఎంతవున్నా, ఒక విధమైన ఏవగింపు, రోత కలగడంలో వింత ఏముంది. అందుకే ఆలయవ్యవస్థను కూడా శుద్ధి చేయాల్సిన సమయం, ప్రక్షాళించవలసిన స్థితి ఏర్పడ్డాయి. ఇన్నాళ్లు ఉమ్మడి రాష్ట్రంలో కొంత నిరాదరణకూ, ఆలక్ష్యానికి గురి అయ్యి అభివృద్ధికి నోచుకోని క్షేత్ర అభివృద్ధికి తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గారు సమకట్టడం ధర్మానికి గ్లాని ఏర్పడినప్పుడు రక్షణకు సమకట్టే సంకల్పంగా సంభావించడం సముచితమే. యాదగిరిగుట్టను సమగ్ర ఆధ్యాత్మిక ఆలయంగా తీర్చిదిద్దడమే కాదు, గుట్టపై భక్తులకు సకల సదుపాయాలూ సమకూడాలని, భక్తి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా వసతి గృహాలు, మంటపాలు, వంటశాలలు నిర్మించాలని, గుట్టకు చేరుకున్నది మొదలు, పైన ఆలయం చేరుకునేదాకా మార్గమంతా పర్యావరణ పరిశుభ్రతతో విరాజిల్లుతూ, గుట్టకు వెళ్లే నాలుగుదారుల్లోనూ దారి పొడవునా వేదమంత్రోచ్చారణలు వినబడుతుండాలనీ, ఎటుచూసినా భక్తిభావాన్ని పెంపొం దించేలా, నైతిక విలువలకు ఊతమిచ్చేలా, బోధనలు కనిపించాలనీ, సుగంధ పరీమళ వృక్షాలతో మార్గం క్షేత్ర సందర్శకులకు ఆధ్యాత్మిక భావనలు ఉప్పొంగచేస్తూ,

నిత్య జీవితంలోని ఒత్తిడులనుండి దూరంగా ప్రశాంతతను పాదుకొల్పుతూ ప్రకాశించాలనీ ముఖ్యమంత్రి అన్నారు. యాదగిరిగుట్టను ఉగాదికి మొదలుపెట్టి, నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిది దుష్ట శిక్షణకోసం ఎంతటి ఉగ్ర అవతారమో, శిష్టరక్షణ కోసం ప్రహ్లాదమయమైన అంతటి ప్రసన్న మూర్తిత్వం కూడాను. ధర్మసంస్థాపన కోసం ఉద్యమించినప్పుడు ఉగ్రత అనివార్యంగానీ, అనుకున్నది సాధించాక ఇక శాంతి ప్రతిష్ఠాపన జరగాలి. యాదగిరి మర్యాదగిరిగా, తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక కేంద్రంగా మహర్దశను అందుకోవడం అభిలషణీయ పరిణామం. వ్యాపార ఛాయలతో కాక భక్తరంజని క్షేత్రంగా, మానవాళి మానసిక ప్రశాంతతకు దోహదకారిగా యాదగిరి రూపొందాలని ఆకాంక్షిద్దాం.

**(28.2.2015)**

# భాష ప్రమాణాలు

"వినియోగించేది ఏదయినా వస్తువే అయినప్పుడు, 'భాష' కూడా వస్తువే!" అన్నాడు ఒకాయన. రేపు అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం. వస్తువును వినియోగించే వినియోగదారుడికి కొన్ని హక్కులున్నాయి. ఏ వస్తువైనా నాణ్యమైనదీ, మన్నికైనదీ కావాలి. మరి భాష కూడా భావవినిమయ సాధనం అయినప్పుడు, అది కూడా మన్నికైనదీ, బహుధా ఉపయుక్తమైనదీ కావద్దా? అని ఆయన వాదన.

"ఖరీదు పెట్టి కొనేది ఏదయినా వస్తువుగానీ – భాషని మనమేమీ కొనుక్కోవడం లేదు కదయ్యా!" అంటే ఆయనంటాడు కదా – "అదేమిటి! ఉచితంగా లభించే వస్తువులు మాత్రం నాణ్యమైనవి కానక్కర్లేదా! అదీకాక భాషను మనం ప్రతికలద్వారా, రేడియో ద్వారా, టీవీ ఛానెళ్ళ ద్వారా పొందుతున్నాం. పత్రికను డబ్బులు పెట్టే కొనుక్కుంటున్నాం , రేడియో, టీవీలు ఖరీదైనవి మరీ కొంటున్నాం. అలాంటప్పుడు వాటిద్వారా ప్రచార, ప్రసారాలుగా అందుతున్న భాష బాగుండక్కర్లేదా?" అని ఆయన డబాయించాడు.

ఒకే వస్తువును రకరకాల ఉత్పత్తి సంస్థలు అందిస్తున్నప్పుడు – వాటి మన్నికలో, ఎన్నికలో తేడా వుంటుంది. అలాగే పత్రికల భాష నేరు, రేడియోభాష వేరు, టీవీ భాషవేరు.

మౌలికంగా ఏదయినా తెలుగే కదా! అంటే కుదరదు. ప్రాంతాలనుబట్టి, వృత్తులను బట్టి కూడా భాష మారిపోతుంటుంది. అందుకని ఎవరికి ఏ వస్తువు కావాలో వారు ఎన్నుకున్నట్లు, ఎవరి భాషను వారు ఎన్నుకుంటారు. తమకు నచ్చినదాన్ని వినియోగించుకుంటారు. 'అందులో తప్పేమిటి?' అంటే ఏమీ లేకపోవచ్చు, కానీ వస్తు వినియోగం తమకోసం కాక, తాము వాడుతున్న వస్తువు ఇతరుల కోసం అయినప్పుడు – అది ఎదుటివారికి ఆకర్షణీయంగానూ, వారు నచ్చేదిగానూ, మెచ్చేదిగానూ వుండాలి. ఒక వస్తువు పదిమందికీ ఉపయుక్తం కావాలి అంటే సరియైన నాణ్యతాప్రమాణాలు వుండాలి. పైగా ఏ వస్తువుకయినా – దానిని ఉపయుక్తం చేసే సంవిధానం అంటూ ఒకటి ఉంటుంది. ఆ వస్తువు రూపొందే

మూలపదార్థాలు కొన్ని ఉంటాయి. మాట్లాడే భాషకయినా, రాసే భాష కయినా ఆ భాషలో ఉపయోగించే పదాలు, వాక్య నిర్మాణం, మాట్లాడేప్పుడు ఉచ్చారణ, రాసేటప్పుడు శైలి ప్రధానమౌతాయి.

కల్తీవస్తువులు చెలామణీలో ఉన్నట్లు – భాష కూడా కల్తీ అవుతుంటుందా? అంటే గమనిస్తే తెలుస్తుంది. తెలుగు మాట్లాడుతున్నాం అంటూ సగానికి సగం ఆంగ్లపదాలు ఉపయోగిస్తున్నప్పుడు, ప్రజల భాషలో మాట్లాడుతున్నాం అంటూ సంస్కృతమనే గీర్వాణాన్ని పట్టుకు వ్రేలాడుతున్నప్పుడు అది స్వచ్ఛమైనది. నాణ్యమైనది అయిన సరుకుగా ఎలా ఒప్పుతాం? నన్ను 'సరకు' చేయడం లేదంటే గుర్తించడం లేదని అర్థం!

రాష్ట్రం విడిపోవడానికి భాషతో ముడిపడ్డ అవమానమే ఓ కారణంగా చూపించి, ఇప్పుడు ఏడాదయినా తిరక్కముందే 'యాదగిరిగుట్టకు తెలంగాణ వరవడిలో వున్న పేరును మార్చి సంస్కృతాంధ్ర పేరైన 'యాదాద్రి' అన్ని పెట్టడమేమిటనీ, తెలంగాణ ప్రజలకు గుట్టలంటే ఏంటో కొండలంటే ఏంటో అర్థమవుతుంది గానీ, 'అద్రులు' అంటే ఏం అర్థమవుతుందనీ, అసలు అలాంటి పేర్లతో పిలిచే పెత్తనం ఏమిటని అంటూ, తెలంగాణలోని పోచమ్మ, కట్టమైసమ్మ, పోతరాజులు, సమ్మక్క–సారలక్కలు వంటి ఉత్పత్తి శక్తులు, వనరులతో సంబంధం ఉన్న వాటిని వదలి... పొయ్యి పొయ్యి తెలంగాణలో సింహ అవతారాన్నే ఆదర్శవంతమైన దేవుడుగా, స్వామి చినజియ్యర్‌ను తలకెత్తుకుని, హెలికాప్టర్ ఎక్కించుకుని, తెలంగాణను 'వైష్ణవాంధ్ర'గా ఓ కల్తీ వస్తువుగా మలుస్తున్నారన్నట్లు ఐలయ్యగారు ధ్వజమెత్తారు. 'ధ్వజం' అంటే కూడా మళ్లీ ఆ 'మూస'పదమే అయిపోయేట్లుంది!

సరే! అందరికీ అన్నీ నచ్చవు. ఏది చేసినా కొందరికి నచ్చదు. ప్రతిదాంట్లో వంకలు ఎన్నడమే కొందరి నైజం, ఏ వస్తువూ అది నూటికి నూరుశాతం నాణ్యమైనదని గ్యారంటీ ఎక్కడుంది? వస్తు వినియోగంలో కూడా 'అడ్జస్టికా' సిద్ధాంతమే ఎక్కువ రాజ్యమేలుతోంది. నిజమే! మార్కెట్ సంస్కృతి విస్తృతమైంది. ఒక 'హెరిటేజ్' ఒక రాష్ట్రంలోనే వుండదు. పక్కరాష్ట్రాలకూ విస్తరించాలని చూస్తుంది. వస్తు సంస్కృతిలో పోలికలు ఎక్కువ. అవతలివారి వస్తువు ఎక్కువ బాగున్నట్లుంటుంది. తన చీరకన్నా పక్కింటావిడ కట్టిన చీరే ఎక్కువ మోజు కలిగించినట్లు. స్త్రీలకు వస్తువ్యామోహం

అధికం అంటారుగానీ, పురుషుల వస్తువులు తక్కువేమీ కాదు!

ఇంతకీ ఇంట్లో వాడినట్లే కొన్ని వస్తువులు బయట వాడతామంటే కుదరదు. ఇంట్లో డ్రాయరూ, బనీనుతో తిరిగినా, పంచె ఎగేసుకుతిరిగినా చెల్లుతుందేమోగానీ, ఆఫీసులో ఉద్యోగిస్తున్నప్పుడు అవి చెల్లుబాటు కావు! అలాగే భాష కూడాను. 'నీయవ్వ'... అని శాసనసభలో అంటేనూ, 'నోర్ముస్కో' అని ప్రాంతపు దాదాగిరి వినియోగిస్తానంటేనూ, కుదరదు, క్షమాపణల పర్వం సాగవలసిందే!

ఏమైనా మౌలికంగా 'భాషా, సాంస్కృతిక విధానం' అంటూ ఒకటుండాలి. అభివృద్ధి ఉపకరణంగా, జీవన వికాసానికి పనిముట్లుగా – భాషా సాహిత్యాలు ఉపయుక్తం కావలసిన అగత్యం ఎంతనయినా వుంది.

ఒక వస్తువు పనికి రాకుండా పోయినట్లుగా, తెలుగుభాష అంతరించిపోకూడదన్న తపన... వస్తునాణ్యతను, మన్నికను ఎన్నికను పెంచేదిగా కావాలి! వినియోగదారులారా మేల్కోండి అన్న నినాదం మరి వస్తు, రూపాల 'భాష' విషయంలోనూ హెచ్చరికే కావాలి!

**(14.3.2015)**

# కొత్త(గా)ఏడు!

ఇవాళ మార్చి 21 శనివారం. ఇది తెలిస్తే చాలుగా! చైత్రశుద్ధ పాడ్యమి - ఉత్తరాభాద్ర నక్షత్రం. ఉదయం 9.02 - వర్జ్యం. రాత్రి 7.44 నుండి 9.10 వరకూ... ఇదంతా తెలియాల్సిన అవసరం ఏమిటి? అనే తరం వచ్చేసింది. ఇవాళ 'కొత్త సంవత్సరం' అంటే - "న్యూ ఇయర్ వచ్చి మూడు నెలల ఇరవై రోజులయింది. ఇవాళ కొత్త సంవత్సరం ఏమిటి? బార్బేరియస్!" అనుకునే వాళ్ళూ ఉన్నారు.

ఇవాళ తెలుగు సంవత్సరాది. మన్మథనామ సంవత్సర ప్రారంభం. ఇవాళ ఉగాది. అంటే - 'ఓహో! అలానా' అనో, 'సోవాట్!' అనో అనే వారూ మన తెలుగువాళ్ళే వున్నారు! న్యూ ఇయర్ అంటే ముందు రోజు రాత్రి - క్లబ్బుల్లోనో, పబ్బుల్లోనో ఆడి, పాడి, తాగి, గెంతులేయడం; పెద్దముల్లూ, చిన్నముల్లూ గడియారంలో వన్నెండుమీద నిలవగానే - షాంపైన్ బాటిల్స్ ఓపెన్ చేసి, నురగలు పొర్లగా, 'హ్యాపీ న్యూ ఇయర్!' అని అరచి సంతోషంతో గెంతులు వేయడమే తెలిసిన పిల్లలకు - "ఇవాళ కొత్త సంవత్సరమర్రా! పొద్దునే లేచి నువ్వులనూనెతో తలంటుస్నానం చేసి, కొత్తబట్టలు కట్టుకుని, దైవానికీ, తల్లిదండ్రులకీ నమస్కారం చేసి, దీవెనలు తీసుకుని, ఉగాది పచ్చడి పరగడుపునే తినండంటే కొందరికి స్టుపిడిటీ గానే అనిపిస్తోంది కాబోలు!

ప్రపంచవ్యాప్తంగా గ్రెగరియన్ - ఇంగ్లీష్ క్యాలెండర్ వ్యవహారంలో వుండగా, తెలుగు క్యాలెండరూ, తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలంటూ ఈ 'పంచాంగం' ఏమిటో? అసలు ఈ పంచాంగాలు చూడటం ఏమిటో చెప్పినా అర్థం కాదు సరికదా - శుద్ధవేస్టు కదా! అనుకుంటున్న వారుండవచ్చు. అన్ని రోజులూ, అన్ని వేళలూమంచివే! శుభఘడియలు, దుర్ముహూర్తాలూ, రాహూకాలాలూ, యమగండాలూ ఏమిటివన్నీను? సాటిమనుషులనూ, తమ శక్తి యుక్తులనూ కాక, గ్రహగతులను నమ్ముకోవడం ఏమిటి పిచ్చికాకపోతేనూ! అనే తర్కం ముందుకు తెచ్చేవారూ వున్నారు. "అంతకడివెడు పాలపై / ఒక్కింతమీగడ పేరినట్లుగ / మనకు మిగులును గతములోపలి మంచి/ అదియే సంప్రదాయము".

అని డాక్టర్ సి. నారాయణరెడ్డి గారన్నట్లుగా, తెలుగు జాతికి తమవైన సంస్కృతి, సంప్రదాయాలు వున్నాయి! మనకు మనదైన 'కాలగణన'మూ వుంది. 'కాలచక్రం' అనే మాటలో - ఒక పరిభ్రమణం వుంది. ఆంగ్ల సంవత్సరం - వట్టి అంకెలది!

2015 అనే ఈ అంకె వెళ్ళిపోతే మళ్ళీ తిరిగివచ్చే ప్రశ్నే లేదు. కానీ బ్రతుకులో కష్టసుఖాలు, వెలుగు చీకట్లు వస్తూ పోతూంటాయి. ఒకసారి సుఖం వచ్చిందని ఇక మళ్ళీ రాకపోవడమో, ఒకసారి దుఃఖం కలిగిందని మళ్ళీ దుఃఖం కలగకపోవడమో వుండదు. జననమరణాలు కూడా అంతే! చావుపుట్టుకలు నిరంతరాయంగా జరుగుతూనే వుంటాయి. ఈ మానవజీవన సారమనే భిత్తిక మీద ఏర్పడినదే మన కాలగమనం కూడాను. అరవై సంవత్సరాలు ప్రభవ, విభవ అంటూ మొదలై... అక్షయ తరువాత, మళ్ళీ ఆ వృత్తం ప్రభవించి తిరుగుతుంది. తాను పుట్టిన జన్మనామ సంవత్సరాన్ని జీవితంలో మళ్ళీ చూడగల్గడం అంటే 60 ఏండ్లు బ్రతకడం. అంటే షష్టిపూర్తి వేడుక. కాలచక్రభ్రమణంలో అదికూడా చూడనోచక దివంగతులయ్యే వారెందరో! రెండవసారి తను పుట్టిన నామసంవత్సరం చూడగల్గడం అంటే 120 ఏండ్ల సంపూర్ణ ఆయుర్దాయం అనుభవించడం! అరవై ఏళ్ళ జీవితమే హామీలేని కాలంలో, "ఎవరు బ్రతికారు అసలు రెండు యాభైలు?" అన్నది కూడా విశేషాశ్చర్యజనకమే అవుతోంది.

మీరు మరీ చెబుతారు, ఉగాది కొత్తసంవత్సరంగా చేసుకోకుండా ఎవరుంటున్నారండీ! అని అడిగే వారుండవచ్చు. కొత్తబట్టలు కట్టుకోవడం సరదాయేగా! తలంటు పోసుకోవడమా! ఓకే! హెడ్‌బాత్ కదా! బోలెడు షాంపూలు వస్తున్నాయి. గొప్పగొప్ప టాయిలెట్స్‌సోప్స్ వున్నాయి. సినీ తారల చర్మ రహస్యాల సౌందర్యపు సబ్బులున్నాయి. చేసేస్తే పోలా! కానీ ఈ నువ్వుల నూనె శరీరానికి రాసుకుని, నలుగుపిండితో రుద్దుకుని, కుంకుడుకాయల పులుసుతో తలంటుకోమంటేనే వస్తుంది ఇబ్బంది ఈ పిల్లకాయలకు. వాళ్ళు పెద్దల తలంటుతారు.

'పంచాంగ శ్రవణం'లో ఆదాయ–వ్యయాలు, రాజ పూజ్యాలు – అవమానాలు ఎంతెంతో చూసుకోవడం కంటే, ఫేస్‌బుక్‌లో లైకులెన్ని, కామెంట్లన్ని, షేర్‌లు ఎన్ని, టాగ్‌లు ఎన్ని చూసుకోవడమే బాగుంటుంది అనుకుంటున్నారంటే – కాలపరిణామం కాదనగలవారెవరు? కవిసమ్మేళనాల్లో 'రావయ్య మన్మథా రా!" అని ఒకరు ఆహ్వాన కవితరాస్తే, "రాకోయి మన్మథా రాబోకు! నిర్భయ బాణాలు సంధించి, ఉ(ట్టిఅడ్డ)గా (డి)దిలను రెచ్చగొడుతూ రాబోకు" అని ఇంకొకాయన నిరసన కవిత్వం నినదిస్తుంటే... రావాలో పోవాలో తెలీక 'కాలిబూడిదవడమే బెటర్' అని మన్మథ కాలపురుషుడనుకుంటే చేసేదేముంది? అదీ వ్యవహారసరళి!

'ఏడు మారినా ఈడుముదిరినా ఏమి మారినది ఈ లోకంలో' అన్న కాళోజీ నా గొడవకు నమస్కరిస్తూనే, ఏమైనా అందరికీ ఉగాది శుభాకాంక్షలు. **(21.3.2015)**

# ఏ తీరుగ నను దయచూచెదవో....!

“తక్కువేమి మనకూ రాముడొక్కడుండు వరకూ” అని రామదాసు గారన్నారు. తిరుపతి ఆంధ్ర రాష్ట్రానికి పోయినా, భద్రాద్రి మన తెలంగాణదే! రాబోయే గొప్ప ‘యాదాద్రి’ కన్నా, వున్న ‘భద్రాద్రి’ జీవనపథ నిర్దేశకం కాదా! ‘రామరాజ్యం’ అన్నమాటే–రాజకీయంగానూ గొప్ప ప్రాధాన్యం సంతరించుకుంది. ‘రాముడుండాడు.. రాజ్యముండాది’ అంటే చల్లని పాలన వున్నట్లు కదా! “ఉగ్ర నరసింహాలకన్నా మానవుడిగా బతుకమ్మా అని చూపించే దారిదీపం గొప్పది కదా!” అంటూ మొన్న ఓ పెద్దాయన ప్రవచనం పరిచాడు. “రాముడు ఆదర్శం అంటే అది బి.జె.పి. వ్యవహారం అయిపోతుందేమోనని భయపడుతున్నరు కదు సార్! అందుకే ‘భద్రాద్రి’ కన్నా ‘యాదాద్రి’ని అభివృద్ధి చేయాలన్నదే సంకల్పం అయినట్లుంది! హిరణ్యకశివుడి పెత్తనాన్ని భరించలేని ప్రహ్లాదుడు–తండ్రి పెట్టే బాధలు భరిస్తూనే, ఆ శ్రీహరిని నమ్ముకోగా, నరసింహావతారంగా హిరణ్యకశిపుడి పీచమడిచి, ప్రహ్లాదరాజ్యం స్థాపనం జరిగినట్లు కె.సి.ఆర్.గారు కూడా ప్రహ్లాద మార్గంలోనే ఆంధ్రపాలకుల కబంధహస్తాల నుండి తెలంగాణను విముక్తం చేశారంటే – నరసింహావతారం ఎత్తింది ఉద్యమ రూపంలో ఆయనా, లేకపోతే కాంగ్రెస్ సోనియమ్మనా? ఏమైనా కాళోజీ గారికి కూడా ప్రహ్లాదకథే ఇష్టం! తెలంగాణకు నరసింహుడే తగినవాడు కదు సార్! ‘రామాయణ కల్పవృక్ష’ం కన్నా ‘రామాయణ విషవృక్ష’మే ఆదర్శమేమో సార్ ఇక్కడ’ అని ఆ పెద్దాయనకు ఒక యూనివర్సిటీ కుర్రాడు క్లాసు తీసుకోబోయాడు.

తప్పు బిడ్డా! ‘తెలంగాణ’ అనే సీతమ్మ తల్లిని ఆంధ్ర రావణుడు విశాలాంధ్ర పేరుతో ఎత్తుకుపోయి చెరబడితే, కె.సి.ఆర్. రాముడై యుద్ధం చేసి విడిపించి, పట్టాభిషేకం చేసుకున్నాడు. రాముడు చేసిందీ, కె.సి.ఆర్. గారు చేసిందీ ధర్మ యుద్ధమే! సీతమ్మే మన ‘బతుకమ్మ’. ‘రామాయణం’ అంటే రాముడు నడిచిన దారి అని. ‘ఆయనము’ అంటే గమనము కదా!.. రాముడు నరరూపంలో ధర్మకోసం నిలిచి జీవనం గడిపినట్లు, అందుకోసమే అరణ్యవాసం చేసినట్లు, ఒకప్పుడు పెద్ద మనుషుల ఒప్పందానికి కట్టుబడి ఇన్నాళ్ళూ, అరణ్యవాసం జరిగింది. కైకమ్మలా

వ్యవహరించింది కేంద్ర ప్రభుత్వమే. రాముడు అడవిపాలవడం అంటే–ఉద్యమ బాటపట్టడమే ఇక్కడ, సీతాపహరణం ఆంధ్రావతరణం అయిందీనాడు! నేడు తెలంగాణ స్థాపనతో, రావణుని చెరనుంచి విడివడిన సీత రాముల వారి చెంత చేరడమన్నమాటే!" అన్నాడు మళ్లీ ఆ పెద్దాయన. "అట్లనుడు బాగున్నట్టు లేదు సార్! ఎందుకంటే సీతమ్మతో పట్టాభిషేకం చేసుకున్నాక గూడ మళ్ళీ రాముడు ఆమెను అడవిపాలు చేశాడు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కోటా ఎన్నికల డబ్బాల్లో కె.సి.ఆర్. రాముడి నిజాయితీని శంకించే–రేవుకబుర్లు రేగాయిట! టి.ఆర్.ఎస్. మీద – బంగారు తెలంగాణ విషయంలో అప్పుడే అనుమానాలు మొదలైనాయి అంటున్నారు. అసలు సీత బదులు, 'బంగారు సీత'ను పెట్టిరాముడు యాగం చేస్తే జనం మెచ్చుడు వుండదు కద్సార్! రాముడైనా సరే మళ్ళీ సీతమ్మను అడవుల పాలు చేస్తానంటే–రాముడు మాకు ఆదర్శం కాదు పొమ్మనమంటారేమో సార్ మనవాళ్ళు" అన్నాడు ఆ యువకుడు.

రామాయణం వర్సెస్ ప్రహ్లాదచరిత్ర–లేదు భద్రాద్రి వర్సెస్ యాదాద్రి... ఇదేదో ప్రపంచ కప్ పోరులెవల్లో ముందుకు రావడం ఏమిటా అని నివ్వెరపోవాల్సి వస్తోంది! క్రీడాస్ఫూర్తి వుండాలి నిజమే గాని, రాజకీయ స్ఫూర్తి కూడా వుండాలి కదా! అసలు మతానికీ, రాజకీయానికీ ముడిపెట్టడమే తప్పనీ, మతాతీత రాజకీయాలు వుండాలనీ అభిలషిస్తున్నప్పుడు సెక్యులర్ అన్నదానికి గౌరవం ఎక్కువ. కానయితే– సెక్యులర్ ముసుగులో ఛాందసాలు, మతమౌఢ్యాలు చెలామణి కావడం ప్రమాదకరం! సోనియా గాంధీ కారణంగా కాంగ్రెస్ పార్టీ క్రిస్టియానిటీకి మొగ్గిందనీ, హిందూత్వ పేరుతో బి.జె.పి. ముందునుంచీ అయోధ్యరాముడంటూనే చిందులేస్తోందనీ భావిస్తున్నవారున్నారు. నిజామ్‌ను మెచ్చుకున్నంత మాత్రాన ఇస్లాంను తలకెక్కించుకున్నట్లుగా కొందరు కొన్నివిషయాల్లో గింజుకుపోవడమూ కనబడుతోంది!

"నిధి చాలా సుఖమా! రాముని పెన్నిధి సుఖమా" అంటే – ఇప్పుడు కొత్తరాజధాని కోసమో, ఉన్న రాజధానిని ఉన్నతంగా చేసుకోవడం కోసమో 'నిధులే ముఖ్యం' అంటున్నట్లే వున్నారు ముఖ్యమంత్రులిద్దరూను. తెలంగాణను ఆంధ్రలో విలీనం చేస్తూ విశాలాంధ్ర ఏర్పడినప్పుడు నెహ్రూగారు – అమాయక భార్యకు తెలివైనమొగుడితో పడిన 'వివాహబంధంగా', "ఈబంధం ఎంతకాలం పటిష్టంగా వుంటుందో చెప్పలేం" అన్నారట! సీత అమాయక భార్య అనీ, రాముడు మొండి

మొగుడనీ అసలు సీతారాముల బంధమే ఆదర్శ బంధం కాదనీ, సీతకు రావణుడంటేనే ప్రీతి అనీ, కథనాలు కదంత్రొక్కడమూ చూశాం. రామాయణ విషవృక్షమే, కల్పవృక్షం కన్న సమాదరణీయం అనుకున్న తరాన్ని చూడడమూ జరుగుతూనే వుంది. రాముడు సంచరించిన దండకారణ్యంలో అధికప్రాంతాలు తెలంగాణలో వున్నాయిట! సీతారాములు అరణ్యవాసంలో వేసుకున్న పర్ణశాల భద్రాద్రికి 32 కిలోమీటర్ల దూరంలోనే వుందట. ఇంతకీ ఇప్పుడు సీతారాముల కల్యాణం ఆంధ్రరాష్ట్రంవారు ఒంటి మిట్టలోనూ, ఇక్కడ-భద్రాద్రిలోనూ ప్రభుత్వపరంగా జరుగుతున్నాయి. ఏది రామాయణపథమౌ? అసలు రామాయణం ఏమిటో...? మానవజీవన రాజకీయంలో... సంక్షుభితమై కల్లోల కడలికావడమే ఓ విషాదం! "ఈ సముద్రాన్నిదాటి, లంకను చేరి, రావణుడిని రాముడు సంహరించడం కన్నా, ఇవాళ సీతారాముల మధ్య సహృదయ సేతుబంధనం ఆవశ్యకం. సీతారామకళ్యాణం అంటే ఇవాళ తెలుగు వెలుగు మంగళ సూత్రం కావడం ముఖ్యం". అని ఆ పెద్దాయనకూ, ఆ యువకుడికీ కూడా తెలియాలి మరి? ఏమంటారు?

**(28.3.2015)**

# ఆర్థికంలో కొత్త 'దేవుడు'

హైదరాబాద్ అంటే - ఒకప్పుడు నిజాం సంస్థానం. హైదరాబాద్ తెలంగాణలో భాగమే అయినా, నిజాం పాలనలో హైదరాబాద్‌లో ఉర్దూ తప్ప తెలుగును అణచివేసే ప్రయత్నాలే జరిగాయి. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగానే – తెలంగాణ కవులు, రచయితలూ కూడా గళమెత్తారు. రజాకార్లు నిజాం సైనికులుగానే అరాచకాలు చేసారు. రజాకార్లకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటం సాగింది. కమ్యూనిస్టులు ప్రజాపక్షాన నిలబడి ఎదురొడ్డి పోరాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా – నిజాం తాను స్వతంత్రంగా వుండాలనే చూశాడు. తన రాజ్యమే నిలబెట్టుకోవాలనుకున్నాడు. అవసరమైతే దేశవిభజన తర్వాత పాక్ వైపే మొగ్గుచూపాడు. సైనికచర్య తరువాతే హైదరాబాద్ విమోచనం జరిగింది. నిజాం నిరంకుశపాలన అంతమొందింది.

ఇది హైదరాబాదు ఇది హైదరాబాదు
ఇది భిన్న సంస్కృతులు ఎదిగిపూచినపాదు

అని డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు అన్నట్లుగా, అంతవరకూ వున్న హైదరాబాద్‌కూ, భారతదేశంలో విలీనమై తెలుగువారి రాజధానిగా మారిన హైదరాబాద్‌కు తేడా వుంది. ఇప్పటికీ హైదరాబాదును ముస్లింలు దేశంలో తమ మూలాధారనాడి నగరంగా భావిస్తున్నారు అనడం అతిశయోక్తి కాదు. ఉగ్రవాద చర్యలు పాకిస్తాన్ భిత్తికపై ఏమి జరిగినా, వాటికి ఎక్కడోమూలాలు, 'ఇక్కడ' వుంటున్నాయన్న అనుమానాలు చెలరేగుతూనే వున్నాయి!

ఇప్పుడు తెలంగాణా రాష్ట్రానికి మౌలిక ఆదాయ కేంద్రం హైదరాబాదే. “హైదరాబాద్‌ను ఇంతలా అభివృద్ధి చేసింది నేనే” అని తెలుగుదేశం చంద్రబాబు నాయుడు గారు అప్పుడూ, ఇప్పుడూ అంటూనే వుంటాడు. హైదరాబాద్‌లో ఆంధ్రులు, తెలంగాణ వారేకాదు, అనేక భాషల వారు, రాష్ట్రాలవారు ఉన్నారు. ఇప్పుడు హైదరాబాద్ పూర్తి తెలంగాణసంస్కృతి ప్రాంతం కాదు. ఒక కాస్మోపాలిటన్ సిటీ. మరీ ముఖ్యంగా చెప్పాలంటే – పాశ్చాత్య సంస్కృతికీ, మరీ ముఖ్యంగా అమెరికా కల్చర్‌కూ కూడా ప్రతిబింబిత నగరంగానూ తయారైంది! పబ్‌లూ, క్లబ్బులూ, సంపన్న కాలనీలు, కార్పొరేట్ సంస్థలు, మెగా వ్యాపార కూడళ్ళు వీటన్నింటితో హైదరాబాద్ ఇవాళ భిన్నసంస్కృతుల సమ్మేళనంగానే వుంది. కేవలం తెలంగాణ భూభాగంలా లేదు.

అభివృద్ధిని అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం చేయడంవల్ల తెలుగురాష్ట్రాలు రెండింటికీ ఒక రకంగా విఘాతమే! నిజానికి తెలంగాణ కాకతీయ వైభవ ప్రాభవాల గడ్డగా విరాజిల్లింది. వరంగల్‌ను ఇప్పటికయినా తెలంగాణ రాజధాని అన్న స్థాయిలో అభివృద్ధి పరచవలసివుందనీ, హైదరాబాద్‌లో వున్నవి కూలగొట్టి కొత్త సచివాలయాలూ, అవీ నిర్మించే బదులు, విస్తరణను జిల్లాలకు చేసి ఆ ప్రాంతాలకు హైదరాబాద్‌వలెనే గొప్ప ఆర్థిక వనరులకు ఆస్కారమిచ్చే స్థాయికి పెంచాలన్న వాదనలు వినబడుతున్నాయి. తెలంగాణ అంటే ఒక్క హైదరాబాదే అన్నట్లుండకూడదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నక్సలైట్ ఉద్యమం ఊపందుకుంటుందని, అప్పట్లో భయపెట్టిన వారున్నారు. 'మావోయిస్టు పార్టీ అజెండాయే మా అజెండా' అన్నట్లు ఆ భయమేమీ అక్కర్లేదని అధికారంలోకి రాగానే కె.సి.ఆర్. అన్నారు గానీ, ఇప్పుడు కె.సి.ఆర్.ను 'నయా నిజాం'గా అభివర్ణిస్తూ సిపిఐ మావోయిస్టు పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. సమైక్యరాష్ట్రంలోకన్నా మూడురెట్లు రైతుఆత్మహత్యలు తెలంగాణలో జరుగుతున్నాయని, ఆదివాసీల బ్రతుకులు బుగ్గిపాలవుతున్నాయనీ, రియల్ ఎస్టేట్ లాభాల వ్యాపారిలా కెసిఆర్ భక్తి ముసుగులో యాదగిరిగుట్ట గురించీ, వాస్తుపేరుతో నూతన సచివాలయ భవన నిర్మాణాలంటూ– 'హైదరాబాద్ నిజాం'లా వ్యవహ రిస్తున్నారనీ మావోయిస్టుపార్టీ ఆగ్రహం వెల్లడిస్తోంది. కెసిఆర్ కొత్త 'దేవుడు' విమర్శనాపాత్రమౌతోంది!

తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ వాహనాలకు ఈ నెల ఒకటోతేదీ నుండి పన్ను విధించడం విమర్శనీయమవుతోంది! ప్రస్తుతానికి కోర్టు నిలుపుదల చేసినా ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ వుండేంతవరకూ ఈ చర్య అసమంజసం అనీ, రెండుగావిడిపోయినా తెలుగుల మధ్య, సమైక్య ఆత్మీయభావనలకు గొడ్డలిపెట్టు చర్యలు చేపట్టడం అంటే నిజాం నిరంకుశ పాలన వైఖరేననీ, అప్పుడే లుకలుకలు మొదలయ్యాయి. టీ సర్కార్‌పై తెలంగాణ ఉపాధ్యాయులూ అప్పుడే అల్టిమేటం పేర నిరసనలు మొదలెట్టారు. పే రివిజన్ పట్ల తెలంగాణ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆగ్రహానికి కారణమవుతోంది. మార్చి నెలలో కొత్త వేతనాలు ఆశించి వారు భంగపడ్డారు. నూతన ఆర్థిక సంవత్సరం హార్దిక సంవత్సరంగాను రూపు కట్టాల్సిన తక్షణ కర్తవ్యం ఉంది.

**(4.4.2015)**

# శాంతి 'గులాబీ'

ప్రాణం ఎవరిదయినా విలువైనదే. ఎవరికయినా ఎవరి ప్రాణమైనా తీయడం, హక్కు ఎందుకవుతుంది? మరణాలు సహజాతాలు కావడానికీ, మరొకరి చేతిలో హతమవడానికీ చాలా వ్యత్యాసం వుంది. అసలు ప్రాణం తీయడం వీరోచిత కార్యం ఎందుకవుతోంది? ఉగ్రవాదిని పోలీసులు చంపడం పోలీసుల వీరోచితకార్యంగా కీర్తింపబడితే, పోలీసులను చంపడమూ – ఆ ఉగ్రవాదుల దృష్టిలో వీరోచితంగానే భావింపబడుతుంది. శత్రువును చంపడం వీరోచితమన్న భావనకన్నా, శత్రుత్వాన్ని చంపడం వీరోచితమన్న స్పృహ పెరగాల్సివుంది!

అసలు 'శత్రుత్వం' అనేది వ్యక్తిగతమా? వ్యవస్థాగతమా? శత్రునిర్మూలనం అనేది అంగీకారయోగ్యమే అయితే, అది శాంతి భద్రతల సమస్యగా ఎందుకు ముడిపడుతోంది? అన్నది ఆలోచించాలి మరి! రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇటీవల జరిగిన ఘటనలు, ఆ సంఘటనా నేపథ్యాలను, ఫలితాలను సమీక్షించుకోవలసిన అగత్యాన్ని ముందుకు తెస్తున్నాయి. ఉగ్రవాదులను వేటాడటం, సిద్ధయ్యవంటి యువ పోలీసాధికారి మరణం, వికారుద్దీన్ ముఠా హతం కావడం తెలంగాణా కొత్త రాష్ట్రం ఏర్పడి ఏడాది కాకుండానే, 'బంగారు తెలంగాణ' కోసం కలలు కంటున్న వేళ, మరి కంగారునూ, ఉలికిపాటునూ కలిగిస్తున్నమాట నిజం! కలవర పెడుతున్న మాట నిజం! ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొంగలుగా ముందు భావించబడినవారు – ఆ తరువాత 'సిమి' కార్యకర్తలని వెల్లడి అయ్యింది. కేంద్రం కొద్దిరోజులకు ముందే – మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా కారాగారంనుంచి అయిదుగురు 'సిమి ఉగ్రవాదులు' తప్పించుకున్నారన్న విషయాన్ని హెచ్చరిక చేసింది! పోలీసులమీద దాడిచేసిన వారి మూలాల గురించి – ఒక వంక పోలీసులు చెప్పినదానికీ, మరోవంక ప్రభుత్వం చెప్పినదానికీ పొంతన కుదరకపోవడం కూడా ప్రజలను నివ్వెరపరిచే విషయమే!

ఉగ్రవాదులను కఠినంగా అణచివేయడంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని నిరూపించుకోవడానికే – ఆలేరు ఎన్‌కౌంటర్ ఘటన తటస్థించిందని మానవహక్కుల

సంఘాలు అంటున్నాయి అంటే, శాంతిభద్రతలు కాపాడవలసిన యంత్రాంగమే, స్వయంగా చట్టోల్లంఘనం చేసినట్లనిపించడం కాదనలేని సత్యమే అవుతుంది!

ఇక 'వికారుద్దీన్ ముఠా' అంతం కావడం హైదరాబాద్‌లో ముస్లిం సంస్థలకు ఎలాంటి సంకేతాలుఇచ్చినట్లో చెప్పలేం! పాతబస్తీలో ఉద్రిక్తత, ఉగ్రవాదుల దేహాలతో ప్రదర్శనలు – ఒక రకంగా నగరాన్ని 'అప్రకటిత హై అలర్ట్‌లోకి నెట్టాయి. సిమి ప్రతీకార దాడులపై అప్రమత్తం అవుతోంది పోలీసు యంత్రాంగం. హైదరాబాద్ శాంతిభద్రతలకు గవర్నర్ బాధ్యుడని ప్రభుత్వం అనలేదు. లష్కరే తాయిబా, ఇండియన్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలతో వికారుద్దీన్‌కు సత్సంబంధాలు వున్నాయనీ, తనలానే ఓ రెండువందల మందిని అతను తయారుచేశాడనీ, వికారుద్దీన్ ఎన్‌కౌంటర్‌తో తెలంగాణలో ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం వుందనీ – ఇంటలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయిట!! హైదరాబాద్‌లో పాతిక వరకూ స్లీపర్‌సెల్స్ వున్నారని– వికారుద్దీన్ స్వయంగా గతంలో పోలీసులకు చిక్కినప్పుడు వెల్లడించాడు కూడాను. వారెవరో ఇంతవరకూ గుర్తించనేలేదు. హైదరాబాద్ శివారు ప్రాంతాలు ముఖ్యంగా – అబ్దుల్లాపూర్‌మెట్, పహాడ్‌షరీఫ్, అనంతగిరి, మేడ్చెల్‌వంటి ప్రాంతాలపై ఇప్పుడు నిఘా ఎక్కువ అవసరమవుతోంది. గతంలో దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లకు హేతువైన ఉగ్రవాదులూ, అలాగే ఇతర రాష్ట్రాల దోపిడీ గ్యాంగ్‌లు కూడా – నగర శివార్లనే తమ స్థావరాలుగా చేసుకుంటున్నారన్నది వెల్లడవుతూ వచ్చిన సంగతే!

వాతావరణం ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో కాక – 'ప్రశాంతత ఏర్పడుతోంది' అనుకుంటున్న తరుణంలో రెచ్చిపోవడం, అలాంటప్పుడు తమ ప్రతీకార వ్యూహాలు నెగ్గేలా చూసుకోవడం ఉగ్రవాదుల నైజం! అందువల్ల ఏ క్షణమూ ఏమరుపాటు తగదు. ఉగ్రవాదం కూడా మతంతో ముడిపడిందే తెలంగాణలో ఎక్కువ విస్ఫోటించే అవకాశాలున్నాయన్న భయాలువున్నాయి. కానీ సి.ఎం. కె.సి.ఆర్. నిజామునూ, హైదరాబాద్ ముస్లింలను గౌరవాదరాలతోనే చూస్తున్నారు. మత కల్లోలాలకు నగరం కేంద్రకం కాకూడదన్నది ఆయన పట్టుదల.

..మతమన్నది మా కంటికి మసకయితే
మతమన్నది మా మనసుకు మబ్బైతే
మతం వద్దు గితం వద్దు
మారణహోమం వద్దు..
నారాయణ నారాయణ అల్లా అల్లా..."

అని కృష్ణశాస్త్రిగారు రాసినట్లుగా – మత మౌఢ్యాలకు మంగళంపాడి, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులూ తలెత్తకుండా, విభజన సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధికి బాటలు విస్తరించుకోవాల్సిన తరుణం ఇది! పధ్నాలుగేళ్లు తెలంగాణ ఉద్యమాన్నీ, తెలంగాణ రాష్ట్ర సమితినీ నడిపించిన కె.సి.ఆర్. – ఈనెల 24న ప్లీనరీ వేదికపైనే మరోసారి పార్టీ అధ్యక్షులై 'బంగారు తెలంగాణ' సాకారానికై నేతృత్వం వహించబోతున్నారు. శాంతియుత పద్ధతిలో అలుపెరగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రమనే అరవైఏళ్ల కలను సాకారం చేసిన కె.సి.ఆర్. శత్రుత్వ భావనలేని బంగారు తెలంగాణ తేవాలని కాంక్షిద్దాం!

**(12.4.2015)**

# 'తాళి'ంపు కాదా?

పెళ్ళి అనేది కూరో, చారో అవుతే తాళి దానికి 'తాలింపే' గానీ, అదే పెళ్లికాదు. 'తాళి' కొందరికి 'ఇంపు'గాకపోతే, మునిగిపోయేదేమీ లేదు! వివాహ వ్యవస్థమీద నమ్మకం వుందా లేదా అన్నది ప్రధానం గానీ, 'వైవాహిక తంతు' కాదు.

'ద్రావిడ కళగం' పార్టీ తమిళనాట ఇటీవల పనిగట్టుకుని ఇరవై ఒక్క జంటలు – మగడు పట్టుకోగా భార్య తాళి తెంచే కార్యక్రమం పెట్టుకుందిట! తాళి త్రెంచుకున్నారు గానీ వివాహబంధం కాదు కదా! ఇంతకీ తాళి కట్టించుకున్న స్త్రీలే, భర్త అనుమతితోనే దాన్ని తీసిపారేశారు. అంతేకదా! నిజానికి చూస్తే అందులో గగ్గోలు పెట్టాల్సిందేమీ లేదు.

'తాళి' అనేది వివాహిత స్త్రీకి ఒక గుర్తుగా మనం పెట్టుకున్నదే. మెడలో తాళి లేకుండా ఇవాళ వివాహిత స్త్రీలు ఇంట్లోనూ, ఆఫీసుల్లోనూ పనిచేసుకుంటూనే ఉన్నారు. మెడలో 'పుస్తెలతాడు' వున్న స్త్రీ వైపు పరాయిపురుషుడు కన్నెత్తి చూడడు అనుకునే కాలంలో ఏమీలేము కదా! మృగమహారాజులకు, జరుగుతున్న ఆత్యాచారాలకూ అదేమీ రక్షణ కవచంగా లేదు కదా!

'తాళి' గురించి తెగ సెంటిమెంట్ గుప్పించి, ఆడవాళ్ళను కట్టిపడేయచూచింది ముఖ్యంగా మన సినిమాలే! తాళిబొట్టుకు ఎక్కడలేని ప్రాధాన్యత తెచ్చిపెట్టి, విలన్ మంగళసూత్రం పట్టుకుని హీరోయిన్ మెడలో కట్టేయడానికి పరుగులు పెట్టినట్లూ, మెడలో అది కట్టబడకుండా ఆవిడ గింజుకొంటున్నట్లుగా కథలల్లి, మంగళసూత్రం అనేదానికి చట్టబద్ధమైన వైవాహిక లైసెన్స్ అన్న బిల్డప్ ఇచ్చింది సినిమాలే!... అదో ఫార్స్ నిజానికి.

నిజంగా తాళిబొట్టుకు అంత ప్రాధాన్యమే వున్నట్లయితే, ఎన్ని సినిమాల్లో ఎందరు హీరోలు, ఎందరు హీరోయిన్లకు పెళ్లిసీన్లలో మూడుముళ్లూ వేసేయలేదు. మరి వారు భార్యభర్తలు అయిపోయారా? తాళి కట్టడం కూడా ఒక తంతు, ఒక వేడుక కనుకనే మంగళసూత్రధారణ – సినిమాల్లో 'మహానటన'గా చెలామణీ అయింది! ఇది గ్రహించక 'తాళిబొట్టు' అంటే అదేదో స్త్రీని కట్టిపడేయగల సూత్రం అని ఎవరనుకున్నా అది పొరపాటే!

పురాణాల కాలం నుంచీ జరిగిన ఎన్నో పెళ్ళిళ్ళలో అన్నిటా తాళియే వుందనుకోకండి. అనేకరకాల వివాహాలున్నాయి; 'గాంధర్వం' నుండి 'రాక్షసం' వరకూను. దుష్యంతుడు శకుంతల మెడలో తాళి కట్టలేదు. అక్కడ వివాహంలో అంగుళీయకం అనగా 'ఉంగరం' కథ నడిపించింది. 'తాళికట్టు శుభవేళ మెడలో కల్యాణమాల' అంటున్నారంటే, దండలు మార్చుకోవడం ఆవేళ ప్రధానాంశంగా గుర్తించినట్లే కదా! సింపుల్‌గా దండల పెళ్ళిళ్ళు ఎన్నో జరిగాయి. గుడిలో కావచ్చు, అభ్యుదయ వివాహ మంటపంపై కావచ్చు. అభ్యుదయ భావనతో కమ్యూనిస్టు వివాహాలు ఎన్నో అలా జరిగినవే. మంత్రతంత్రాలు ఏమీ లేక, కేవలం విశ్వాస ప్రమాణాలు చేసుకుని ఒక్కటైన జంటలున్నాయి. రిజిస్టర్‌మ్యారేజ్‌లున్నాయి. ఎలా చేసుకున్నా 'తాళి' ధరించారంటే అది ఒక చిహ్నంగా మాత్రమే! అదో విశ్వాసం అంతే! హిందూ వివాహ పద్ధతే అయినా, శుభలేఖలో ముద్రించిన ముహూర్తానికి వధూవరులు పరస్పరం తలపై 'జీలకర్రా బెల్లం పెట్టుకోవడం' అసలు ముహూర్తం గానీ, మాంగల్యధారణ- అనంతరం జరిగేదే! మూడుముళ్ళు పడడం, ఏడడుగులు నడవడం భార్యాభర్తల మధ్య బంధానికి ప్రతీకలు. అసలు ముడి పడవలసింది వారి మనసులు, పరస్పరం కలసి నడవాల్సింది వారి సమష్టి జీవితం. వివాహం వ్యక్తిని శక్తిగా మార్చే సమష్టి వ్యవస్థ. ధర్మబద్ధకామానికి, గృహస్థాశ్రమానికి శ్రీకారం.

మంగళసూత్రం బంగారంతో తయారయ్యేది కనుక దానికి 'విలువ' హెచ్చింది! 'మా ఆయన బంగారం' అనుకునే స్త్రీ మంగళసూత్రాలు కళ్ళకద్దు కోకపోయినా, ఆ విశ్వాసంతో ఉండగలిగితే చాలు. ఆ విశ్వాసాన్ని ఆ మొగుడు నిలుపుకోగలిగితే చాలు! పేకాటకో, తాగుడుకో ఆమె మెడలోని పుస్తెలు తెంపుకుపోయిన దౌర్భాగ్యుల కథలు తెలిసి కూడా – ఆ వస్తువే కలిపివుంచే రక్షక వ్యవస్థ అనుకోవడమంత హాస్యాస్పదం మరొకటి లేదు! ఆ మాటకొస్తే 'రసపట్టు'లో అడ్డం వస్తుందని శృంగారకేళిలో దానిని తీసేయడం తెలియనిదా! తాళిబొట్టే అయినా మెడలో చికాగ్గా వుంటే – తలగడక్రిందో, వేసవికాలం దానిని ఏ చిలకకొయ్యకో తగిలించే స్త్రీలు లేరా? అంతెందుకు? ఇవాళ వాటిని బీరువా లోనో, బ్యాంక్‌లాకర్ లోనో భద్రపరస్తున్న వారున్నారు. పుస్తెలు, మట్టెలు వివాహిత స్త్రీకి గుర్తులయితే, మరి పురుషుడికీ అలాంటివేవో వుండాలనడం సమంజసమే అనాలనిపించదా?

తాళి త్రెంచి పారేయడం వివాహ బంధాన్ని తెంపేసుకోవడంగా రూపు కట్టించింది పురుషాధిక్య సమాజమే! ద్రావిడ కళిగం వారు తాళిని ఎగతాళి చేశారని ఘోషిస్తున్నవారు ఆ మంగళ సూత్రం స్త్రీపురుషుల మధ్య పటిష్ఠ వివాహ బాంధవ్య రక్షణ సూత్రంగా నిరూపించ గలరా? తాళికట్టి పెళ్లాడీ, విడిచిపెట్టి పోయిన వారూ, తాళి కట్టిన భార్య వుండగానే మరి వివాహేతర సంబంధాలు పెట్టుకున్న వారు కళ్ళ ముందే సమాజంలో కనబడుతుండగా, ఒక్క 'తాళి' మాత్రమే వివాహ పటిష్ఠతా సర్వస్వంగా తలపోయడం ఎందుకు? అలాగని మంగళ సూత్రాలు విలువలేనివనికాదు.

బంగారంగా విలువైనవే. పసుపు కొమ్ము మాత్రమే మెడలో కట్టుకుని వివాహబంధం విశ్వసించి కాపురాలు చేసుకుంటున్న పేదస్త్రీలు బోలెడుమందున్నారు. 'తాళి' ఇంపు కాదా అంటే ఇష్టమైతే ఇంపే, కష్టమైతే కట్టించుకోవడం ముఖ్యంకాదు. పసుపు తాడయినా పలుపుతాడు కాకూడదు. విలువ ఇవ్వాల్సింది వస్తువులకు కాదు, జీవితాలకు. వస్తుసంస్కృతి పెచ్చరిల్లుతున్నప్పుడు అసలు స్త్రీయే ఒక భోగవస్తువుగా ఇంకా చెలామణీ అవుతున్నప్పుడు తాళిపేర జరిగేవి ఎగతాళి కార్యక్రమాలే? వాటికి తలలు బాదుకోవడం తగని పని.

**(8.4.2015)**

# యువ(తోద్యోగ) తెలంగాణ

టి. ఆర్.ఎస్ ప్లీనరీ తీర్మానాల్లోని అంశాలలో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడం గురించి ఎవరికీ ఆక్షేపణ వుండనవసరం లేదు. పదేళ్లపాటు ఉమ్మడి రాజధాని అన్నమాట వున్నంత మాత్రాన – ఆంధ్రప్రదేశ్ సర్కార్ హైదరాబాద్‌ను తనదిగా భావించగల ప్రశ్నే లేదు. ఎంత తొందరగా ఆ భావన వదిలించుకుంటే అంతగా అమరావతి గురించి ఆలోచించుకోవచ్చు! – కానీ తెలంగాణకు హైదరాబాద్ ఎప్పటికీ గుండెకాయే! గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైతే ఆరోగ్యంకోసం అనివార్యంగా చేయవలసిందే! మొత్తం శరీరానికి రక్తప్రసరణ కేంద్రం గుండె అయినట్లే, బంగారు తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్‌ను 'విశ్వనగరంగా మలుచుకోవడం' ఆహ్వానించదగిన అనివార్య స్థితే!

నిజంగా కొత్తతరం ఊహలకు అనుగుణంగా నగరం పరిణామశీలమవుతోంది. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలలో ఇప్పటికే 'ఉచిత వైఫై' వచ్చింది. త్వరలో నగరమంతటా ఆ సౌకర్యం విస్తరించడానికి ప్రభుత్వం సంకల్పించింది. భిన్న సంస్కృతుల కూడలి అయినా కూడా – 'తెలంగాణా సంస్కృతీపతాక ఎత్తుగా రెపరెపలాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది! తమదైన ముద్రకోసం ఎలాంటి మార్పులకయినా సంసిద్ధమవుతోంది! సచివాలయ నూతన నిర్మాణం, అలాగే తెలంగాణ కళాభారతి నిర్మాణం – నగర వైభవోజ్జ్వల దీప్తికోసం ఉద్దేశించినవే. తమనగరమే అయినా, తమ విశ్వవిద్యాలయం అయినా, తమ ఆసుపత్రులే అయినా – తెలంగాణ బిడ్డలు వివక్షను ఎదుర్కొన్న ఒకప్పటి రాజధాని నగరంగా కాక, నేడు తెలంగాణ రాష్ట్ర రాజధానిగా హైదరాబాద్ ఎదగవలసి ఉంది. భోజనహోటళ్ళు, కోచింగ్ సెంటర్లు కూడా తమతనంతో వెల్లివిరియాలని తెలంగాణ పౌరులు అభిలషించడంలో తప్పేమీ లేదు. నిజానికి శ్రీ చుక్కా రామయ్య వంటి విద్యావేత్త పెట్టిన భిక్షతోనే ఎదిగిన యువతరం నేడు విదేశాలలో కూడా వివిధ ఉద్యోగాలలో రాణిస్తూ వుంది. తెలంగాణ నడిబొడ్డు హైదరాబాద్‌లో చదువుకోవడంతో విజయ సోపానాలు అధిరోహించిన విషయాన్ని గుండెమీద చెయ్యివేసుకుని వారు చెప్పుకోగలరు.

అయితే హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాల మాట వచ్చేసరికి – సీమాంధ్ర ప్రభుత్వాల హయాంలో దగాపడ్డ తెలంగాణబిడ్డలకు ఇకపై పూర్తి న్యాయం కలిగించాలని ముఖ్యమంత్రి కె.సి.ఆర్. సమకట్టడం బంగారు తెలంగాణకు మూలాధారనాడి. హైదరాబాద్‌లోనేకాదు, తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేవారికి అన్నిరకాల వసతులూ కల్పిస్తామనీ, అందుకు ప్రతిగా ఆయా యూనిట్లలో తమ బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ ఆయన పారిశ్రామికవేత్తలను కోరడం – సబబుగానూ, హర్షణీయంగానూ వుంది. కేంద్ర ప్రభుత్వం 'మేకిన్ ఇండియా' అంటూంటే, ఇప్పుడు తాము 'మేకిన్ తెలంగాణ' అనిపారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని అనడం ఔచితీమంతంగా ఉంది.

తెలంగాణలో కొత్తపరిశ్రమల స్థాపనకు అనుమతులు అతిత్వరితంగా లభించేలా 'ఎర్ర తివాచీ' పరచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలోని మధ్యవర్తుల ప్రోత్సాహ ప్రమేయాలను కూడా త్రోసిరాజని, నేరుగా పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం సంపర్కం పెట్టుకునేందుకు సిద్ధమౌతోంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచస్థాయిలో పేరుపొందిన సంస్థలు ఇటీవల ముందుకు రావడం చూస్తుంటే – బంగారు తెలంగాణ పట్ల, తెలంగాణ యువత ఉపాధి అవకాశాలపట్ల, ఆశావహరేఖలు పొడచూపుతూ వున్నాయన్న మాట నిర్వివాదాంశం.

ప్రపంచస్థాయి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ 'శామ్‌సంగ్' హైదరాబాద్‌లో – నూరు మిలియన్ల అమెరికన్ డాలర్లతో యూనిట్ నెలకొల్పడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. అలాగే మెదక్‌జిల్లా సదాశివపేటలో ఎం.ఆర్.ఎఫ్. పరిశ్రమ ప్రతినిధులు ఈ మధ్యే ముఖ్యమంత్రిని కలిసి 980 కోట్ల రూపాయలతో పరిశ్రమను విస్తరించి, వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మెదక్‌జిల్లా జహీరాబాద్‌లో రెండు రోజుల క్రితమే మహీంద్రా అండ్ మహీంద్రా నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో మేటివ్ ప్లాంట్ – రెండు వందల యాభై కోట్లతో రూపొందింది. తెలంగాణ అభివృద్ధిని గతప్రభుత్వాల వలె పునాదిరాళ్లకు పరిమితం చేయక, కేవలం కాగితాలమీద దృశ్యీకరించక, వాస్తవంగా సాకారం చేయడానికి టిఆర్ఎస్ ప్రభుత్వం పునరంకితం కావడం జనానందకారకమే!

ప్రపంచవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం చేసే సంస్థలు స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ పెంచడంలో మరింత చొరవ చేయాలని – హైదరాబాద్‌లో నాలుగైదు

శాఖలతో పాటు, రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా శాఖలు ఏర్పాటు చేయడానికి, సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తనను కలిసిన వాల్‌మార్ట్ సంస్థ సిఈవో ప్రభృతులతో కె.సి.ఆర్. విస్పష్టంగా చెప్పడం కూడా గుర్తించదగిన అంశం! ఆదివారాలు దుకాణాలు తెరిస్తే ఇరవైశాతం అధికంగా ఉద్యోగావకాశాలు కలుగుతాయనే మాట వాస్తవం అయినా, తెలంగాణలో అన్ని షాపులు, మాల్స్‌లో పనిచేసే ఉద్యోగులకు వారానికి, ఒకరోజు కచ్చితంగా సెలవు ఇవ్వాలనే నిబంధన విధిస్తున్నట్లు కె.సి.ఆర్. స్పష్టపరిచారు. ఇది ఉద్యోగ సంక్షేమ భావనయే!

పారిశ్రామిక వేత్తలకు వసతులు కల్పించినప్పుడు – ప్రతిగా స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని వారితో ఆ మేరకు హామీ తీసుకోవడం – విజ్ఞతతో కూడిన వ్యవహారమే! మౌలిక వసతులకల్పన. సాగునీటి వ్యవస్థ, పారిశ్రామిక రంగం, వ్యవసాయరంగం, సాగునీటి పారుదల వ్యవస్థ. మిషన్‌కాకతీయ గురించిన ప్లీనరీ తీర్మానాంశాలన్నీ – కర్షక, కార్మిక సౌభాగ్యానికి నిర్దేశించినవి! రష్యాలో మహిళా ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 55, పురుషులది 60. దానిని పెంచడానికి రష్యా ప్రభుత్వమే సుముఖంగా లేదట! తెలంగాణలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే సత్సంకల్పంతోనే తెలంగాణ ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 గానే కె.సి.ఆర్ నిర్ధారించడం కూడా అందుకే అభినందనీయమనవచ్చు.

**(25.4.2015)**

# ‘ఒకటి’కి రెండుసార్లు!?

‘ఆలోచనవస్తే... మరుగుదొడ్డి వచ్చినట్లే’ అని టీవీ ఛానెల్స్‌లో స్వచ్ఛభారత్ ప్రకటన వస్తూంటుంది. గ్రామాలలో ఆరుబయళ్లకు బదులు, ఇంటింటా మరుగుదొడ్లు శుభ్రతకూ, స్వచ్ఛతకూ తార్కాణాలు, ఆవశ్యకాలు అనుకోవడం బాగానే వుందిగాని, పెద్దపెద్ద నగరాల మాటేమిటి? నగరవాసుల ఇళ్లలో మరుగుదొడ్లు వుంటే సరిపోతుందా? హైదరాబాద్‌లాంటి పెద్దపెద్ద నగరాల్లో – నిత్యం జనసంచారం ఎక్కువ. ‘ఫ్లోటింగ్ పాపులేషన్ అంటామే!... అలాంటి రద్దీజనం ఎక్కువ. మరి వారి దైనందిన అవసరాలు తీరేదెలా? హోటళ్లలో, సినిమాహాళ్లలో ‘శౌచాలయాలు’ ఉంటే సరిపోదు. నగరంలో అనేకప్రాంతాలలో జనం తక్షణ అవసరాలు తీర్చేందుకు, మలమూత్ర విసర్జనకు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా! ఈ విషయం ఒకటికి రెండుసార్లు గట్టిగా ఆలోచించి ఆచరణలో పెట్టాలి.

నిజమే! సులభ్ కాంప్లెక్స్‌లు అంటూ కొన్ని పనిచేస్తున్న మాట వాస్తవమే! కానీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ‘డబ్బు ఖర్చు చేయాల్సిన ఆగత్యం’ తెచ్చిపెట్టారు. అందువల్లే నగరంలో సందుల్లో, విశాల భవంతుల ప్రహరీ గోడల ముందూ, చెత్తకుండీల తావుల్లో ఇలా ఎక్కడ పడితే అక్కడ – పౌరుల విసర్జనా కార్యక్రమాలు జరిగి పోతూనే ఉంటాయి. ‘ఇచ్చట మూత్రము పోయరాదు’ అని పెద్దపెద్ద అక్షరాల్లో రాసినా, “ఇక్కడ మూత్రం పోసిన చెప్పుదెబ్బలు తప్పవు” అనో, “అయిదువందలు జరిమానా” అనో, హెచ్చరిక రాతలు రాసినా, ఆ ప్రాంతంలో కంచెలా వేసి – వాటికి చెప్పులు స్వయంగా వ్రేలాడదీసినా, ఇంకొంచెం ముందు జాగ్రత్త తెలివి తీరున – అలా అవకాశం వున్న గోడలపై దేవుళ్ళ బొమ్మలో, ఓం వంటి రాతలో రాసినా, ఎన్ని రకాల నిఘాలు వేసినా, ఏ రాత్రో, పాదచారులెవరో అక్కడ తమ అవసరం తీర్చేసుకోక తప్పని స్థితులే కానవస్తూవుంటాయి.

నగరంలో అసలు కొన్ని వీధుల్లో, సందుల్లో నడవాలన్నా భయమే! అక్కడ ఒకటే కంపు. ఇక స్త్రీల బాధలు చెప్పనే అక్కరలేదు. నగర వీధుల వెంట వెడుతున్నప్పుడు

– ఏ పౌరుడికి ఎప్పుడు ఆ ఆగత్యం ఏర్పడుతుందో, ఎవరు చెప్పగలరు? నిజానికి ప్రభుత్వం ఈ విషయం గట్టిగా ఆలోచన చేయాల్సి వుంది.

ఆలోచన వస్తే చాలదు ఆచరణారావాలి. హైదరాబాద్ నగరాన్ని డల్లాసో, సింగపూరో, బీజింగో చేయాలనీ, పెద్దపెద్ద కాంప్లెక్స్‌లు, ఎత్తయిన భవనాలు నిర్మించాలనీ అనుకోవడం కన్నా ముందు – సామాన్యుల 'ఈతిబాధలు' తీరే ప్రణాళికలు పట్టించుకోవడం ముఖ్యం! హైదరాబాద్ పాతనగరం చూడండి! ఇప్పటికీ ఇంకా రోడ్లమీద రక్తపు మరకలుగా కంగారుపడే, జర్దాకిళ్లీల ఉమ్ములు తగ్గనే లేదు. హైదరాబాద్ సంస్కృతిలో అది ఒక భాగం అయిపోతే – స్వచ్ఛ శుభ్రతల గురించి ఎంత ఘోషించి ఏం లాభం? కార్లలోంచి, బస్సుల్లోంచి రోడ్లమీదకు విసిరివేసే చెత్తను నియంత్రించే ఆలోచనలు చేయవద్దా?

'నగరాన్ని పరిశుభ్రంగా వుంచండి' అని వేల కరపత్రాలు పంచితే – వాటిని జనం రోడ్లమీదా, పార్కుల్లో పారేసిపోతే, ఊడ్చుకోలేక మున్సిపాలిటీ ఉద్యోగిని నానా తంటాలు పడిందని ఓ జోకు. అది జోక్ కాదు... నిజంగా అలాగే వుంటోంది! రాజకీయపార్టీలు బహిరంగ సభలు చేస్తూ, నగర మంతటా కట్టే జండాలు, అంటించే పోస్టర్లూ, వెదజల్లే కరపత్రాలూ నిజంగా ఏ ప్రయోజనం కోసం? కోరి చెత్తను పెంచడం గానే అన్పిస్తుంది కొన్నిసార్లు.

వెయ్యికోట్లతో స్వచ్ఛనగరి వెలయిస్తామని ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు ప్రకటించారు. భేష్! కిలోమీటరున్నర వ్యాసార్థంలో మొత్తం నాలుగు వందల భాగాల్లో ఆరువేల మంది బాధ్యతలు తీసుకుంటారని చెప్పారు. ప్రభుత్వం ఏం చేయాలి? ప్రజల బాధ్యత ఏమిటి అన్న విస్పష్ట నిర్ణయాలు అవసరం. ప్రజల్లో పరిశుభ్రతపై స్ఫూర్తి, చైతన్యం నింపాలి. భయమో, భక్తో వుండడం కూడా అవసరమే! స్వచ్ఛ హైదరాబాద్‌పై హోర్డింగ్స్, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు అంటించి మరింత చెత్త పోగయ్యే చందంగా కాకుండా, నిజంగా నిఘావేసి పౌరులు స్వచ్ఛ, శుభ్రతలు పాటించేలా చూడడం అవసరం. అందుకోసం ముందుగా తగు సదుపాయాలు ఏర్పరచాలి.

నిజంగా కిలోమీటరు వ్యాసార్థంలో 'డస్ట్‌బిన్లు' ఏర్పాటు చేసి, పనికిరాని కాగితం ముక్క, తాగిపారేసే నీటిప్లాస్టిక్ సీసాయో ఆ డస్ట్‌బిన్‌లోనే పౌరులు పడేసేలా చూడాలి. అంతే కాదు! నిండి పోయిన డస్ట్‌బిన్లను ఎప్పటి కప్పుడు ఖాళీచేసేలా – జి.హెచ్.ఎం.సి. వ్యాన్‌లు గంటకోసారి ప్రాంతాల్లో సంచరిస్తూ వెళ్లాలి! అలాగే

పరిశుభ్రమైన 'శౌచాలయాలు' కనీసం నాలుగువందల భాగాల్లోనయినా – పౌరుల అవసరాలు తీరేలా, ఉచితంగా ఉపయోగించుకునేలా ఏర్పాటు చేయగలగాలి. అప్పుడు గోడలపై 'ఇచట మూత్రము చేయరాదు' అని రాయాల్సిన అగత్యాలు దాపురించవు. 250 పబ్లిక్ టాయ్‌లెట్లు నిర్మిస్తామన్న ఒక్క మాట బావుంది! అయితే వాటిని స్వచ్ఛ శుభ్రంగా నిర్వహించడం, ఉచిత వినియోగంలోకి తేవడం జరిగితే అంతకన్నా ఇంకేమి కావాలె? ఇటుక ముక్కలు పోగు పడకుండా చూడాలి! ఏమయినా స్వచ్ఛనగరి కోసం ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తన బాధ్యతలు నిర్వర్తించేలా చేయడం విధాయకం.

**(2.5.2015)**

# కె.జి. టు పి.జి - క్రేజీ టు రోజీ

'కె. జి.టు పి.జి.' ఉచిత విద్య – అనేది వినడానికి 'రోజీ'గానూ, క్రేజీగాను వున్నా, అమలులో అంత 'ఈజీ' కాదన్నది కూడా కటిక వాస్తవం! వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ నిర్బంధ ఉచిత విద్య అమలులోకి వస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఈ 'స్కీము' గురించి 'ఐస్క్రీమ్'లా బాగా ఊరిస్తోంది కానీ, అసలు 'ప్రభుత్వ పాఠశాల' అనే మాటకే టికాణా లేకుండా పోతున్నప్పుడు, వేల రూపాయల ఫీజులు కట్టి ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికయినా తల్లిదండ్రులు తయారై పోతున్నారు గానీ, ప్రభుత్వ పాఠశాల అంటే – దానికి సరిఅయిన భవనం లేకా, భవనం వున్నా ఇతర సదుపాయాలు విద్యార్థులకు లభించేలా లేకా, ఆ సదుపాయాలున్నా సరియైన టీచర్లు లేకా, ఉన్నా అరకొర బోధన, బోధనేతర సిబ్బంది, పాఠశాల గురించీ, విద్య గురించీ కాక ఇతరేతర పనులమీద శ్రద్ధపెట్టి, విద్యార్థులను పట్టించుకోకా, ఇప్పటికే 'ప్రభుత్వ పాఠశాల' అంటే – పనికిమాలిన, ప్రమాణ రహిత, ప్రమాద సహిత విద్యాకేంద్రంగా పొడగడుతున్నప్పుడు, అందులో పిల్లల్ని చేర్పించేందుకు సాహసించేదెవరు?' – బాగా సోచాయించాలె! వీధికో కాన్వెంట్ స్కూల్, ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు తామరతంపరగా పుట్టుకొస్తూ – 'విద్య' అనేది ఎప్పుడో ప్రైవేటుపరం అయిపోయిందనిపిస్తుండగా, ఇప్పుడు 'ఉచితం' పేరుతో, ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ 'అసలు ఉచితమేనా' అని ప్రశ్నించే వారు ఉన్నారు. ఏ ప్రజా ప్రతినిధీ, ప్రభుత్వోద్యోగీ తమ పిల్లలనో, మనవలనో, – గవర్నమెంట్ స్కూలుకు పంపి చదివించడం – 'నామోషీ'గా భావించే పరిస్థితి తెచ్చి పెట్టిందెవరు? ప్రభుత్వం కాదా! 'కె.జి.టు పి.జి.–ఉచిత నిర్బంధ విద్యాపథకం' కళ్ళ ముందు సాక్షాత్కరింపచేస్తున్న దృశ్యాలు మాత్రం అమోఘంగా వున్నాయి. ప్రతి నియోజక వర్గానికీ ఒక పాఠశాల! పదిహేను ఎకరాల్లోపు, హాస్టల్ సదుపాయంతోపాటు ఉంటుందట! యాభై నాలుగు నుంచి యాభైఆరుకోట్ల రూపాయలతో సకల సదుపాయాలు, సరంజామా వుంటాయి. అయిదో తరగతి వరకు తెలుగులోనూ, ఆ తరువాత ఇంగ్లీషులోనూ, బోధనా మాధ్యమం వుంటుంది.

తమ తెలంగాణ పిల్లలు ఇంగ్లీషులో ఏ మాత్రం వెనకబడ కూడదని సిఎం గారి సంకల్పం. అందుకే ఇంగ్లీష్ నేర్పించగల టీచర్లకోసం 'వలేమిటి, గాలమే' వేసి పట్టుకోడానికీ సిద్ధంగా ఉన్నారు. ఒకటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది తరగతులను వచ్చే ఏటినుంచి అడ్మిషన్లతో ప్రారంభించి, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఆ తరగతుల పునఃప్రారంభం చేయనున్నారట. 2017 తరువాత కేవలం ఒకటో తరగతికే అడ్మిషన్లుట! ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి రెండుసెక్షన్లు, మాధ్యమిక పాఠశాలకు ప్రతి తరగతికి మూడు సెక్షన్లూ ఉంటాయనీ, సెక్షన్‌కు కేవలం 40 మంది విద్యార్థులే వుంటారనీ, కో ఎడ్యుకేషనేగానీ – హాస్టల్ సదుపాయాలు మాత్రం బాలబాలికలకు వేరువేరుగా కల్పించబడతాయనీ వెల్లడిస్తున్నారు. ఇక అడ్మిషన్లు విషయంలో చదువు మధ్యలో విరమించిన 'డ్రాప్‌ఔట్స్' పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు. తరువాతనే వేరే పిల్లలను చేర్చుకోవడం అనేదిట!

కావలసిన ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామనీ, నిపుణతగల టీచర్లకు శిక్షణ ఇస్తామనీ చెబుతున్నారు. ఈ పాఠశాలలన్నింటినీ – సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఉత్కృష్ఠతా కేంద్రాలుగా గుర్తిస్తారట! ఔనూ! అలా గుర్తించాల్సింది ప్రభుత్వమా? విద్యార్థులూ, తల్లిదండ్రులా? "ఈ పాఠశాలలో చదువు కోవడం ఓ గొప్ప అదృష్టం, ఎంతో సామర్థ్యం, ప్రతిభ అలవరుచుకునే వీలుంటుంది" అని విశ్వసించవలసిందీ, అందుకు సన్నద్ధం కావలసిందీ – తల్లిదండ్రులు, పిల్లలు. తమ పిల్లల్ని ఈ స్కూల్స్‌కే పంపాలి అని వారు తీర్మానించుకుని, ఆచరించేలా ప్రభుత్వం ఏం చేయగలదన్నది అసలుకి ప్రధానం! పాఠశాలలో పౌష్టికాహారం పెడతామనీ, గురుకుల, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పనిచేసిన అనుభవం గలవారికే ఈ వంటావార్పు సహాయక పనులన్నీ 'ఔట్ సోర్సింగ్'గా అప్పగిస్తామనీ అనడం, అలాగే ప్రతి పాఠశాలకూ మొత్తం 34 మంది స్టాఫ్ (ప్రాథమిక స్థాయికి 12 మంది) చొప్పున బోధనా సిబ్బందిని ఏర్పరుస్తామనీ చెప్పడం బాగానేవుంది కానీ, ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గకుండా ఈ ఉచిత విద్యకై అసలు తెలంగాణపౌరులు ఆరాట పడాలి కదా! పడతారామరి!

2016–17లో పదవతరగతి పాసయినవారు ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్‌కు కొనసాగుతారనీ, అలా కే.జి.టు పి.జి. అనేది తప్పక, విద్యపట్ల క్రేజ్ పెంచుతుందని భావిస్తున్నారు. మంచిదే! అలాగే జరిగితే అంతకన్నా కావలసిందేముంది? ప్రైవేటు పాఠశాలల 'మోజు' వదిలించుకుని, 'కె.జి.టు.పి.జి.

ఉచిత విద్యను ఇవ్వనున్న ఈ పథకం నిజంగా తల్లిదండ్రులకూ, విద్యార్థులకూ అందుకోదగిన గొప్ప అవకాశంగా అందిపుచ్చుకోగలిగితే – నిజంగానే ఎంత బాగుంటుంది! చాకిరీలలో పడి కొట్టుకుపోకుండా, డ్రాప్‌ఔట్స్ అయిన పిల్లలు కూడా సంతోషంతో పాఠశాలలకు 'ఎగిరిపోతే ఎంత బాగుంటుంది'!

ప్రైవేటు పాఠశాలలవారు దీనిని పడనిస్తారా? ప్రజా ప్రతినిధులు, నేతలు, ప్రభుత్వాధికారులు తమ సంతానాన్ని ఈ చదువులకు తరలిస్తారా? విద్యా విధానంలో ఇదొక జనాకర్షక పథకంగా కాక, ఆచరణాత్మకమైన పరమ ప్రయోజనదాయకంగా అంతా భావించగలుగుతారా? అదే జరిగితే – బంగారు తెలంగాణ ధగధగ మెరిసితీరుతుంది.

**(16.5.2015)**

# ఎక్కువచోటు - ఎక్కువ చేటు

అంటే అన్నానంటారు గానీ – అయినదానికీ కానిదానికీ, ప్రతిదానికీ, పాలకపక్షాన్ని విమర్శించడమే – 'ప్రతిపక్షం' అంటే–అనుకునే వారున్నారు. 'బంగారు తెలంగాణ' సాకార పథంలో – అభివృద్ధికర అంశాలకు కూడా అడ్డుపడడం జరిగితే, అది 'సగుణాత్మక ప్రతిపక్షం కాజాలదు. పేదలకు నివాసయోగ్యమైన ఇండ్లు కట్టించడానికి ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు 'చోటు' చూసుకోవడం కూడా, కొందరికి అభ్యంతరమైపోతోంది.

ఆయన అన్నదేమిటి? – 'యూనివర్సిటీలకంటూ నిజంగా అంతంత భూములు అవసరమా' అనే కదా! 'కంటోన్మెంట్' ఏరియాలు కేంద్ర ఆజమాయిషీలో వున్నాయిగానీ, మన కంట్రోల్‌లో లేవాయె! రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని భూములనే చూసి, వాటి నివాసయోగ్యతనూ గమనించి, అక్కడ పేదలకు ఇండ్లు కట్టించాలనుకోవడం తప్పుకాదు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఖాళీ జాగాల్లో–నగరం నడిబొడ్డున, నిరుపేదల గృహనిర్మాణానికి తలపెట్టడాన్ని, విద్యావినయశీలత గలవారెవరైనా అడ్డుకోవలసిన ఆగత్యం లేదు. ఎందుకంటే – ఉస్మానియా యూనివర్సిటీలోని కోర్సులకూ, వాటి బోధనా, బోధనేతర అవసరాలకూ తగిన భవనాలు ఈసరికే వున్నాయి! నిజానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంతపు ఖాళీజాగాలు విద్యా విధ్వంసకశక్తులకు, అరాచక వ్యవహారాలకు 'అడ్డాలు'గా మారుతున్నాయని భయాందోళనలూ వ్యక్తమయిన సందర్భాలున్నాయి.

'ఎక్కువ ఎక్కువ జాగాలు వుండడం తప్పా?' అంటే–ఇవాళ 'అపార్ట్‌మెంట్ కల్చర్' విస్తరించాక, ఇండిపెండెంట్ ఇళ్ళ ప్రాధాన్యం కూడా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి జీవులు, ఉద్యోగవర్గాల జీవులు, 'వైయక్తిక' గృహవాసాలను వదిలి 'అపార్ట్‌మెంట్స్'లో నివసించడానికే మొగ్గు చూపుతున్నారు. 'ప్రైవసీ'కి భంగం లేకుండానే 'ఫ్లాట్స్'లో కాపురాలు చేసుకోవడం కుదురుతున్నప్పుడు, పైగా 'మెయిన్‌టెనెన్స్' బాధ్యత తగ్గుతున్నప్పుడు, ఒక విధంగా 'ఇంటిచాకిరీ' తగ్గుతున్న భావన సంతృప్తికరంగా లభిస్తున్నప్పుడు అపార్ట్‌మెంట్ ఆవాసాలే సుఖమనుకుంటున్నారు. అందులోనూ వాస్తవం

లేకపోలేదు! నీళ్ళగురించీ, కరెంటు గురించీ, ఇంటి చిన్న చిన్న రిపేర్ల గురించీ – ఇండిపెండెంట్ ఇళ్లవారు అన్ని పనులూ, సాధకబాధకాలూ తామే చూసుకోవాలి. పెరడు ఊడ్చుకోవడాలూ, శుభ్రం చేసుకోవడాలూ, ఇంటిముందు ముగ్గు వేసుకోవడాలూ ఏమైనా 'జాగా' ఎక్కువైన కొద్దీ, 'బాగా' పనిచేసుకోవడం 'శ్రమతో కూడినపనే'. అదే ఫ్లాట్స్ అయితే – ఓనర్లంతా కలిసి కష్టాలను షేర్ చేసుకుని, సుఖాన్ని 'ఓన్' చేసుకోవచ్చు, 'చోటు ఎక్కువైనకొద్దీ – చేటు ఎక్కువ' అన్నది వర్తమానం లాజిక్కు.

వ్యాపారస్తులు, సంపన్నులు ఖరీదైన భవంతుల్లో నివసిస్తారు. 'పీతకష్టాలు పీతవి' అన్నట్లు – వారి కష్టాలు వారివే లేండి! వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు, పనిమనుషులు, తోటమాలీలు లేకపోతే గడవని ఇళ్లు వారివి – అది మరిచిపోకూడదు. పనిమనిషి రాకపోతే – అంత పెద్ద భవంతినీ ఊడ్చుకోలేక 'చచ్చేచావే' అనుకుంటారు వాళ్ళు! సరే! యూనివర్సిటీ జాగాల గురించి కదా మాట్లాడుకుంటున్నది! అన్నేసి ఎకరాలు నిజంగా వాటికన్నింటికీ అవసరమా? అన్నది ప్రశ్నించదగిందే! ఒక వ్యవసాయ విశ్వవిద్యాలయమో, ఉద్యానవన విశ్వవిద్యాలయమో – వాటికి అనుబంధంగా వ్యవసాయభూములూ, తోట భూములూ కలిగివుండాలంటే – అది ఔచిత్యం! విద్యార్థుల ప్రత్యక్ష బోధనకు ఆ అనుబంధభూముల అగత్యం వుంది. అలాగే తెలుగు విశ్వవిద్యాలయం గురించి ఆనాడు సంకల్పించినప్పుడు – సకల కళల సమాహార 'మ్యూజియం' నెలకొల్పాలన్న భావనతోనే – పబ్లిక్‌గార్డెన్స్ స్థలాలను ప్రభుత్వం గ్రహించింది. 'తెలంగాణ కళాభారతి'గా దానిని మార్చేసుకుంటే అభ్యంతరం ఉండదు గాని, అందుకోసం క్రీడా మైదానాలు ఆక్రమించడం సరికాదు అన్న ఆందోళన అర్థం చేసుకోవచ్చు గానీ, నిరుపయోగంగా దశాబ్దాలుగా వున్న, ఉస్మానియా యూనివర్సిటీ జాగాల్లో – పేదల గృహనిర్మాణానికి, అవరోధాలు కల్పించడం – కె.సి.ఆర్. గారు చేపట్టే ప్రతి నిర్మాణాన్నీ వ్యతిరేకించడమే ధ్యేయంగా పెట్టుకోవడం వల్ల తప్పించి, నిజానికి కాదనవలసిన సహేతుకకారణం ఏముంది? అని ఆలోచించాల్సిందే! హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్న భిన్న ప్రాంతాలవారెందరో వున్నారు. తెలంగాణ రాజధానియైన హైదరాబాద్‌లో – తెలంగాణ పేదకుటుంబాలకు నివాసయోగ్యమైన 'డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు' కట్టిస్తానంటున్న కెసిఆర్ గారి సత్సంకల్పాన్ని అభినందించడానికి అభిజాత్యం అడ్డొస్తున్నవారినేమనాలి?

'దీని నెవదు అడ్డుకుంటాడో చూస్తా నీ యబ్బ'! అన్నంత కోపం సిఎంగారికి కలిగించిందంటే – ఇంక అంతే సంగతులు. మొన్నటికి మొన్న రాహుల్ గాంధీగారు హైదరాబాద్‌లో కూడా వాలకుండా నేరుగా తెలంగాణలో రైతు ఆత్మహత్య కుటుంబాల పరామర్శ అంటూ దిగబడి, మోడీగారి పాలనకూ పదవ తరగతి పరీక్షా ఫలితాలన్నట్లు పదికి సున్న మార్కులు అంటూ వేసి, కెసిఆర్‌గారు కూడా మోడీలానే నియంతలా వ్యవహరిస్తున్నారని వాక్రుచ్చారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెసేనన్నది కరెక్టే కావచ్చుగానీ, అదేదో దానంగా ఇచ్చింది కాదుగా! టిఆర్ఎస్ సాధించి తెచ్చుకున్నది అని జనం నమ్మబట్టే, అధికార పీఠాన్ని కెసిఆర్‌కు కట్టబెట్టారు. బిజెపి కూడా తెలంగాణకు బాహాటంగా సమర్థింపునిచ్చింది. "సోనియా పెద్దమ్మనేకాదు చిన్నమ్మను నన్ను, గుర్తుపెట్టుకోండి" అని సుష్మాస్వరాజ్ అన్నారుగా! కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోయినా, వచ్చిన 'బిజెపి' ప్రభుత్వంలో చేరడానికి, ఆహ్వానం వస్తే అభ్యంతరం లేదని – కవితమ్మ అనడం కూడా కొందరికి నచ్చడం లేదు. పనులు సానుకూలం కావాలంటే – సానుకూల వ్యక్తులతో, వ్యవహారాలతో, సాహచర్యం పెట్టుకోవాలనుకోవడం వివేకలక్షణమే మరి! కాదంటారా?

అక్కరలేని జాగాలను భేషజంకోసం అట్టే పెట్టుకోవడం కన్నా, పదుగురికీ పనికివచ్చే సామ్యవాద పథంలో ఉపయుక్తం చేయడం బాగుంటుంది! లేదంటే ప్రజాస్వామ్యంలో కూడా దొరల మోతుబరి భూస్వామ్య లక్షణాలే కొనసాగుతాయి. అతి సర్వత్రవర్జయేత్ అన్నది, ఎకరాల ఎకరాల భూములున్న వారికెవరికయినా వర్తిస్తుంది. చివరాఖరుకు అరడుగుల నేల చాలిన మనిషికి–ఎక్కువ చోటు – ఎప్పటికీ చేటు.

**(23.5.2015)**

# ఉద్యోగ కళాకారులు

ఇప్పుడుందో లేదో తెలీదుగాని, మునుపు కేంద్ర ప్రభుత్వంలో 'సాంగ్స్ అండ్ డ్రామా డివిజన్' అని వుండేది. 'క్షేత్ర ప్రచారకశాఖ'గా ఊరూరా, కేంద్ర ప్రభుత్వ పథకాలనూ, అభివృద్ధి కార్యక్రమాలనూ ప్రచారం చేయడమే దానిపని! అందుకోసం వివిధ కళారూపాలద్వారా జరిగే ప్రదర్శనలకు కళాకారులను ఎంపికచేసి, వారికి ఉపాధి కల్పించడం కూడా జరిగేది.

నిజానికి సమాజంలో కళాకారుల ప్రాధాన్యం గొప్పది. 'తెలంగాణ సెంటిమెంట్'ను పండించి, ప్రత్యేక రాష్ట్రసాధనలో ఉద్యమస్ఫూర్తిని ఎగదోసిన కవులూ, రచయితలూ, కళాకారులదే ప్రధాన పాత్ర అనేది నిస్సందేహం! ఎంత రాజకీయం నడిచినా, జనంలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ బలీయంగా వుంది అని ధూంధాం చేసి చూపింది కళాకారులే! 1969లో తెలంగాణ ఉద్యమం జరిగినప్పటికీ, కెసిఆర్ ఆధ్వర్యంలో జరిగినప్పటికీ – బోలెడు తేడా వుంది. 1969 నాటికి సమైక్య వాదం వినిపించిన కవులూ, కళాకారులూ – మీడియా బలోపేతమైన ఈ కాలంనాటికి తమ ప్రత్యేక ఆస్తిత్వాలూ, నేతృత్వ లక్షణాలూ చాటిచూపుకునే అవకాశాలూ అందివచ్చి, సెంటిమెంట్‌ను బలంగా పండించగలిగారు. రాజకీయంలో కన్నా ముందే సాహిత్యంలో తెలంగాణ ఉద్యమం తీవ్ర కంపనలు సృష్టించగలిగింది. 'జనఘోష'గా రాజకీయం దానిని అందిపుచ్చుకోగలిగింది. స్వయంగా సాహిత్య, కళాభిలాషి అయిన కెసిఆర్ – అందుకే ఉద్యమసారథిగా, తెరాస నేతగా మరింత బలీయమైన శక్తి కాగలిగారు. అంతటా తనదైన 'ముద్ర' వేయగలిగారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి జూన్ 2కు ఏడాదికావస్తోంది. ఆవిర్భావ ఉత్సవాలకు రంగమూ సిద్ధమవుతోంది. అయితే – రాష్ట్రం సాకారమైనా, తమ కలలు సాకారం కాగలవన్న 'విశ్వాసం' రైతులకు, నిరుద్యోగులకు, కళాకారులకూ, సామాన్య పేదలకు కలుగుతోందా? అన్నది నేటి ప్రశ్న.

రాష్ట్ర సాధన సమయంలో ఉద్యమస్ఫూర్తితో ప్రధానంగా పొడగట్టిన – విద్యార్థులు, కళాకారులు ఇప్పుడు సిఎంగారికి ఆనట్లేదనే అభిప్రాయాలు

తొంగిచూస్తున్నాయి. ఉద్యమ కార్యక్షేత్రంగా విద్యార్థులకు భూమిక అయిన ఉస్మానియా యూనివర్సిటీ భూములపై కెసిఆర్‌కు – పేదలకు అవి ఆవాస యోగ్యస్థలాలు కావాలన్న భావన కలగడం, కళాకారులెవరయితే తెలంగాణ ఉద్యమంలో పనిచేసారో వారికి ఉద్యోగాలు కల్పిస్తానన్న కేసిఆర్ గారి హామీ, రసమయి బాలకిషన్ పెత్తనంతో తూట్లుపడి, అన్యాక్రాంతమవుతోందన్న ఆందోళన చెలరేగడం చూస్తుంటే – ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రయోజనాలపై నీరుచల్లినట్లవుతోందని, బాహాటంగా అంటున్నవారే ఉన్నారు.

'కళాకారులకు ఉద్యోగాలు' అన్నది – ఏదో 'క్షేత్ర ప్రచారశాఖ' బాపతు తరహా తీరా, లేక బ్యాంకుల్లో వాటిల్లో 'స్పోర్ట్స్ కోటా తరహా ఉద్యోగాలా' అన్నది తేటతెల్లం కాలేదుట! తెలంగాణ రాష్ట్రసాధనకోసం గజ్జెకట్టి పాడిన కళాకారులను పక్కనబెట్టి, ఉద్యమంతో ఏ మాత్రం సంబంధంలేనివారికి ఉద్యోగాలు ఇచ్చారంటూ – ఆగ్రహించిన కళాకారులు అందరితో – 'నిరసన ధూంధాం' నిర్వహించిన దరువు అంజన్నను, కెసిఆర్ అండచూసుకుని 'బాలకిషన్' అంతు చూస్తానని బెదిరించాడనీ, అంజన్న అందువల్ల ప్రాణభీతితో అదృశ్యమయ్యాడనీ వార్తలు వచ్చాయి. బుధవారం సాయంత్రం తిరిగి వచ్చాడని కుటుంబసభ్యులు చెబుతున్నా, తనకు ప్రాణహాని వుందన్న భీతిని ఆయన వ్యక్తీకరిస్తున్నాడట! కళాకారులకు ఉద్యోగాలు అంటే ఎలాంటివి? ఎక్కడెక్కడ? అనేది స్పష్టం కావాలి. 'స్పోర్ట్స్ కోటా మీద బ్యాంకు ఉద్యోగం పొందిన ఓ క్రికెటర్ వల్ల – ఆయన సంవత్సరంలో సగం రోజులు క్రీడామైదానాల్లోనే వుంటూ వుంటే, కలిగే లాభం ఏమిటంటే చెప్పలేం! ఆ గొప్ప ఆటగాడు మా బ్యాంకు ఉద్యోగి అని చెప్పడానికేనా? మరెందుకేనా ఊపయోగమా? క్యాష్ కౌంటర్ దగ్గర కూచోబెడితే – బ్యాంకుకు 'ఫిక్స్‌డ్ డిపాజిట్లు' వస్తాయి అనుకుంటే, కస్టమర్లు ఆయన చేతులమీదుగా డబ్బులు తీసుకోవచ్చని క్యాష్ విత్‌డ్రాలే ఎక్కువ చేసారని, ఓ మేనేజర్ తలపట్టుకున్నాట్ట! అలాకాక – నిజంగా వారి సేవలు ఉపయుక్తం అయ్యే సంవిధానంలో కళాకారులకు ఉద్యోగాలు కల్పించడం సబబు! గవర్నమెంట్ ఆఫీసుల్లో క్లర్కులుగానో, బడుల్లో టీచర్లుగానో కళాకారులను నియమించేస్తే ఓ పని అయిపోతుందనుకుంటే కూడా సరికాదు.

'కళాకారులు' హృదయ పరివర్తనంతేగల సమర్థులు, వారు మానసిక సంస్కర్తలవంటివారు. అందువల్ల బంగారు తెలంగాణ స్థాపనకు వారి సేవలను –

ప్రభుత్వ పథకాలు, మంచి పనుల ప్రచారానికి తగినవిధంగా వినియోగించడం అవసరం, వారికి అందుకోసమే జీతభత్యాలు చెల్లించడం ఔచిత్యం! బాధ్యతాయుతమైన వేరే పోస్టులో పెట్టి, వారిలోని కళను చంపేయడమూ సరికాదు. ఆయనకు పాడడం తప్ప పనిచేయడం చేతకాదు - అనుకునేలా నియమించడమూ సరికాదు. "పనిపాటలన్న నాకు అయిష్టము - పాటలు రాయడం నా పని" అని పఠాభి 'పన్' చాంగమ్‌లో చమత్కరించినట్లు, వృత్తికీ, ప్రవృత్తికీ లంకెకుదరని ఉద్యోగాలలో కళాకారులను నియమించి అవమానించకపోవడమే మంచిది.

సాంస్కృతికశాఖ, తెలుగుయూనివర్సిటీ, తెలంగాణ కళాభారతి, తెలుగు అకాడమి వంటి సంస్థల ద్వారా తెలంగాణ రచయితలకూ, కవులకూ ప్రోత్సాహం ఇస్తూ, ముఖ్యంగా యువకళాకారులను తగిన ఖాళీలలో భర్తీచేస్తూ, కేంద్ర ప్రభుత్వంలో ఉండిన 'సాంగ్స్ అండ్ డ్రామా డివిజన్' వంటి క్షేత్ర ప్రచారశాఖను తెలంగాణ ప్రభుత్వం కూడా ఏర్పరచి, అన్ని జిల్లాల్లోనూ కళాకారులను బంగారు తెలంగాణకు భాగస్వాములను చేస్తూ, వారికి గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను కల్పించడం అవసరం. అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు అలుముకునే పరిస్థితులను అదుపులో పెట్టటం అనేది మరీ ముఖ్య కర్తవ్యం! అయితే పొట్టకూటికోసం తమ కళలను అమ్ముకునే స్థితిలో కళాకారులంతా వుంటారా అనేది ముందుకొచ్చే మిలియన్‌డాలర్ల ప్రశ్న!

**(30.5.2015)**

# వ్యాపార పారావారం

'అమ్మకాలు–కొనుగోళ్ళు' అనేవి వస్తువులకు, పదార్థాలకు మాత్రమే అనుకునేవాళ్ళం ఒకప్పుడు! మొదట్లో వాటికి కూడా వుండేవి కావు. ఒకరిదగ్గర పప్పు–ఉప్పు వుంటే, మరొకరి దగ్గర బెల్లం– చింతపండు వుండేవి. వాళ్ళిద్దరూ పరస్పరం వాటిని 'ఉచితంగా' ఇచ్చిపుచ్చుకునేవారు. ఎప్పుడైతే అవతలి వారి అవసరాన్ని తమ స్వార్థానికి, అవతలివారి అసహాయతను తమ అభివృద్ధికి – వినియోగించుకోవాలనే కాంక్ష ప్రబలిందో, అప్పుడు తమ దగ్గరున్నదానికి 'గిరాకీ' పెంచుకోవడం అనే 'ఎత్తులు' మొదలయ్యాయి.

'ఎత్తుకి పై ఎత్తు'లు మొదలయ్యాయి. వెరసి ఎవరికి వారు తమకుతాము కేంద్రస్థానమై, ఇంకొకరికి ఉపయోగపడాలంటే – ఖరీదుకట్టే వైఖరి వచ్చి పడింది! అది ఇవాళ ఇబ్బడికి ముబ్బడై – మనుషులు కూడా 'అమ్మకాలు – కొనుగోళ్ళు'గా – మార్కెట్ సరుకుగా మారిపోయారు.

అందరూ మార్కెట్ సరుకు అంటే కుదరదు! అందులోమళ్ళీ బోలెడు తారతమ్యాలు ఉన్నాయి. సామాన్యుడికి విలువ ఎక్కడుంది! 'పౌరుడు' అంటే 'ఓటు' వేసేవాడు. అంచేత ఎన్నికలవేళనే వాడి గిరాకీ! అది కూడా ఎంతలెండి? ఓ పచ్చనోటు, ఓ మద్యం సీసా, ఓ బిర్యానీపొట్లంకు – కొనేసుకోవచ్చనే ధీమా పదవులకు పోటీచేసే అభ్యర్థులది. 'ఓటుకి నోటు' అనేది అప్పటి వ్యాపారలావాదేవీ! అందులో నష్టపోయేది ఓటరేకానీ, అభ్యర్థి ఎంతమాత్రం కాదు! మళ్ళీ – అభ్యర్థిత్వాలకు నిలుచునేవారి మధ్య లావాదేవీలు ఉండవనుకోకండి. 'నాకు మద్దతుగా నువ్వు ఉపసంహరించుకుంటే ఇంత' అని ఆ లెక్క మొదలవుతుంది. అది మాత్రం వేలూ, లక్షల్లోనే సుమండీ! గెలవాలంటే ఖర్చుపెట్టాలి కనుక, గెలిచాక – ఎలాగైనా సొమ్ము జమచేసుకోవాలి అనే ఆత్రం! పదవి ఏదయినా, దాన్ని అడ్డంపెట్టుకుని వ్యాపారం చేసుకోవడం, లబ్ధిపొందడం, మనదేశంలో సాధ్యమైనట్లుగా – మరెక్కడా సాధ్యం కావుట! అందులో పారదర్శకతకు లోటేముంది!

రాజకీయాలు – అంచేత పెద్దటోకు వ్యాపారాలు అయిపోయాయి. చిల్లర వర్తకులు టోకు వర్తకులై పోవడం పార్టీల్లోనే సాధ్యం! వ్యాపారం అంటేనే లాభనష్టాల వ్యవహారమాయే! నష్టపోవడానికి ఎవరు సిద్ధంగా ఉంటారు? తాము లాభపడాలంటే ఎదుటివారిని నష్టాల్లో పడవేయాలనే 'కుట్ర' సూత్రం కూడా ఇక్కడిదే! తమాషా ఏమిటంటే – తాను మిస్టర్ క్లీన్ అని ఎవరికి వారు చాటింపు వేసుకుంటూ, అవతలి వారిదే మోసపూరిత వ్యవహారం అని నిరూపించడానికి, అవకాశాలకోసం తహతహలాడి పోతూండడం.

మరోపార్టీని వీడి తమ పార్టీలోకి ఒకరు వచ్చారంటే – తమ పార్టీ ఆశయాలు, లక్ష్యాలు నచ్చి, తమ నాయకత్వం మీద విశ్వాసం ప్రబలి, అభివృద్ధి తమవల్లే సాధ్యం కనుకనే, తమతో చేతులు కలిపారనీ, అందుకే మనస్ఫూర్తిగా సహృదయంతో వారిని ఆహ్వానించామనే పైకి చెప్పేమాట! కానీ లోపాయికారిగా తమ ఆకర్షకశక్తి – ఎన్ని లక్షల కోట్ల రూపాయలతో లంకె పడిందో ఎవరూ చెప్పరు. అదే తమ పార్టీ నుంచి ఒకరు మరోపార్టీలోకి పోతుంటే – అవతలిపార్టీవారు తమ మనిషిని డబ్బుతో కొనేస్తున్నారనీ, ఎరవేసి లాక్కుపోతున్నారనీ గగ్గోలు మామూలే!

ఇంతకీ న్యాయం ఎవరి కయినా ఒకటే కావాలి కదా అంటే – అలావుండదు. డబ్బు ఎరచూపి ఏపార్టీ వారూ, మరో పార్టీ అభ్యర్థిని కొనుగోలు చేయరాదని ఒక చట్టబద్ధమైన సూత్రం చేసి, రాజ్యాంగబద్ధత కల్పిస్తారా? ఉహూ! ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవ్వరూ చస్తే ఆ పని మాత్రం చేయరు! తమకో న్యాయం, ఎదుటివారికో న్యాయం, తాము చేస్తే ఒప్పు, అవతలివారు చేస్తే తప్పు, అవతలివారు చేస్తే నేరం, ఘోరం అనేది, తాము చేస్తే ఉపకారం, జనసంక్షేమానికి సాకారం! ఇదీ తంతు.

నిజమే! అంచేతే 'దొరికితే దొంగలు' లేకుంటే దొరలు. దొరికాక ఎంత గింజుకున్నా లాభం వుండదు. అప్పుడు తీగలాగి డొంకంతా కదిలించాలనే ముమ్మరయత్నాలూ సాగుతాయి. "పలికెడిది భాగవతమట – పలికించెడివాడు రామభద్రుండట' అన్న పోతన చందాన – జరిగే భాగవతానికి, 'రామరామ' అని చేర్చుకునే చంద్రులు వేరు! ఈ చంద్రులది – కళాకళా! వేళా వేళా! ఎప్పుడు 'శుక్లపక్షమో', ఎప్పుడు 'కృష్ణపక్షమో' తెలీచుగానీ – 'ప్రజలపక్షం' కాదని మాత్రం అర్థమవుతూనే వుంటుంది! పునర్నిర్మాణాలపేరుతో వారు కూడా గొప్ప రాజకీయ వ్యాపారవేత్తలై పోతున్నారని సామాన్యుడు సణుగుకుంటున్నా, వారికి వినబడుతుందన్న నమ్మకం

లేదు. ప్రజల్దేముంది? పేదలకు సంక్షేమపథకాలు ప్రకటిస్తేచాలు! అవి అందుతున్నా, అందకపోయినా – చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడానికి, డబ్బులిస్తే మొదటి పేజీలోనే వ్యాపారం ప్రకటన వేసుకోవడానికి పత్రికల్లో సౌలభ్యం ఎలాగూ వుండనేవుంది కదా!

కాగితాలమీద అభివృద్ధి కనబడితే, అదే అక్షరాలా ఋజువు కదా! ఇంతకీ – ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు గొప్ప అమ్మకం సరుకుకాగలరు కానీ, సామాన్యపౌరుడు ఎప్పటికీ, ఆ రేటుకు చేరుకోలేడు. 'దారిద్ర్యరేఖ' ఎప్పుడూ వీడికి ఎగువనే వుంటుంది. 'వ్యాపారం' అంటే ఎన్నిక, మన్నిక, నాణ్యత, విలువలు నిజానికి. శుభ్రమైన సరుకయితే – ఎలాంటి ప్రచారార్భాటాలు లేకపోయినా, ప్రజలు అందిపుచ్చుకుంటారు.

ఇంతకీ రాజకీయమూ, ప్రభుత్వ పాలన–ఏదయినా వినిమయ ప్రపంచంలో ఎలా రాణిస్తున్నాయన్నది ముఖ్యం! మనిషే మార్కెట్ సరుకుగా మారిపోతున్నా – ఉన్న సరుకు నాణ్యమైనది, మన్నికయినదీ కావాలని కోరుకోవడం, విలువల కోసం ఆరాటపడటం, కనీసం తననుతాను నిజాయితీగా నిలబెట్టుకోవడం...అదీ కావాల్సింది!

**(6.6.2015)**

# 'అభివృద్ధి(కి) రేటు'

తమ 'అభివృద్ధికి' ఎదుటివారు అవరోధం అనుకోవడం కూడా, 'అభివృద్ధి' సాధించే క్రమంలో అలసత్వానికి ఒక 'మిష!'ఎదుటివాడిని ఎదగనీయకుండా అడ్డుపడే నైజంలో – తెలుగు వాడికి ఎప్పటినుంచో మంచిపేరుంది! రెండు పెద్ద జాడీ సీసాలలో ఒకసారి విదేశానికి 'పీతలు' ఎగుమతి చేస్తున్నారట! విమానాశ్రయంలో – ఆ సీసాలకు మూతలు లేకపోవడం గమనించిన అధికారి ఒకరు – 'ఇలాగైతే పీతల ఎగుమతి కష్టం' అనీ, 'అడ్డు, అవరోధం లేకపోతే పీతలన్నీ నేల పాలవుతా'యనీ అన్నాడట! 'అబ్బే! ఆ ప్రమాదం ఏం లేదు లెండి! అవి 'తెలుగు పీతలు'. ఒకటిపైకి ఎగబ్రాకి వెళ్లాలనుకుంటే, రెండోది దాని కాళ్ళు పట్టుకుని కిందకు లాగేస్తుంది. ఏ పీతనూ మరోపీత పైకి ఎగబ్రాకనీయదు. అంచేత పీతలతో సీసాలు భద్రమే!' అని సమాధానం వచ్చిందట! కరెక్టే మరి!

ఇది 'పరిహాసం' అనుకోవచ్చుగానీ, ప్రస్తుతం రెండుగా అయిన తెలుగు రాష్ట్రాల స్థితి ఇలానే ఉంది! ఏదీ పైకి ఎగబ్రాకక, రెండోదాన్ని క్రిందకు లాగేయాలని చూస్తున్నట్లుంది. తనది 'రెండు కళ్ళ సిద్ధాంతం' అంటూ – బాబుగారు, 2019 నాటికి తెలంగాణలో తమదే అధికారం కావాలని తపిస్తున్నట్లుందిగానీ, తాను ముఖ్యమంత్రి అయిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపట్ల ప్రాధాన్యతా దృష్టి సారిస్తున్నట్లు లేదు. సర్వేల్లో 'పర్లేదు' అన్న శాతమే కానీ, విశ్వాస ప్రకటనం 'ద్విగుణీకృతం'గా లేదుగాక లేదు!

ఎలాగూ ఆంధ్రప్రదేశ్‌లో 'తె.రా.స.' ఖాతా తెరిచే అవకాశాలు లేవని తెలుసుకనుక, కె.సి.ఆర్. గారు 'తెలంగాణ'ను 'బంగారు జింక' పరుగులు పెట్టించాలని చూస్తున్నట్లు, 'ఆంధ్ర' మీద పోరుతో, తన అభివృద్ధి 'హోరు' ఎత్తించాలని యత్నిస్తున్నట్లు, కనబడుతోందంటున్నవారున్నారు.

"దొరికితే దొంగలు–లేకుంటే దొరలు" అంటూ – "పిట్టపోరూ పిట్టపోరూ మధ్య పిల్లి" లాగా – కాంగ్రెస్‌పార్టీ 'దొందూదొందే' నినాదంతో, పడిలేచిన స్థితినుండి ఎలాగైనా నిలబడాలని ఆత్రపడుతోంది! కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొన్న మొన్న ఇద్దరు

సి.ఎం.ల దిష్టిబొమ్మలూ వారు దగ్ధం చేశారు. తమ రాజకీయ స్వార్థంకోసం – ఇద్దరు ముఖ్యమంత్రులూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇద్దరూ తోడుదొంగలేననీ, రాజకీయాలను కలుషితం చేసేవిధంగా ఓటుకునోటు ముడుపుల వ్యవహారాన్ని సాగించారనీ, తమ రాజకీయ ప్రయోజనాలకోసం అనైతిక చర్యలకు పాల్పడుతున్నారనీ గొంతెత్తారు.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు దొరికిపోయారంటున్నారు సరే! కానీ దాదాపు ఇరవై అయిదు మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది ప్రజాప్రతినిధులు, తమతమ పార్టీలు మారి – టిఆర్ఎస్‌లో చేరేవిధంగా, ఆకర్షక్‌తో –రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహించింది తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. అనీ, ప్రస్తుతానికి చట్టానికి దొరక్కపోయినా, ఆయనా నేరస్తుడేననీ, కాంగ్రెస్ నాయకులు లొల్లిచేశారు. 'వైకాపా, కాంగ్రెస్ పార్టీల నుండి అనేకమందిని తెలుగుదేశంపార్టీలో చేర్చుకోవడాన్ని కెసిఆర్ తప్పుపడితే, తమ వారిని గులాబీయింగ్‌తో, పార్టీలో చేర్చుకుని, మంత్రిత్వం కూడా కట్టబెట్టింది కె.సి.ఆర్.కాదా? అని చంద్రబాబునాయుడు గారు ఘీంకరిస్తున్నారు.

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్ళ కాలం అన్నది – వారు రాజధాని ఏర్పరచుకునేంత వరకూ తాను కల్పించిన సానుకూలత మాత్రమేననీ, ఈ కాలంలోనూ వారికేమీ హక్కుభుక్తాలు లేవనీ కె.సి.ఆర్. తెగేసి చెప్పారు. "జుట్టుపట్టుకుని పైకి ఈడ్చినా – చూరుపట్టుకుని వ్రేలాడీ, దూషణ భూషణ తిరస్కారాలు ఆశీస్సులుగా తలచినా.... హైదరాబాద్‌లో బాబుగారికి 'భలే ఛాన్సులేవి' దక్కవన్నదీ, ఇదేమీ ఆయన 'ఇల్లరికం' కాదన్నదీ, కె.సి.ఆర్. నిశ్చితాభిప్రాయం. అందుకే బాబుని "అడ్డంగా దొరికిపోయావు. నటనలు చాలించరా" అని హెచ్చరిస్తూవున్నారు!

పిల్లలిద్దరూ దెబ్బలాడుకుని, ఒకరిపై ఒకరు కేంద్రస్థానపు 'తల్లిదండ్రులకు' ఫిర్యాదులు చేసుకున్నట్లు, ఢిల్లీలో తెలుగుముఖ్యమంత్రులిద్దరూ – అక్కడి పెద్దలను కలిసి, ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారుట. మధ్యలో 'గవర్నరు' గారు నలిగే పరిస్థితీ వచ్చింది. ఇద్దరినీ సముదాయించాల్సిన పెద్దమనిషి – ఆయనా కేంద్రంలో ఫిర్యాదుల పెట్టె తెరిచినట్లు కనబడుతోంది! 'రెండుపడవల సవారీ–గవర్నర్‌గిరీ' ఆయనకూ ఇబ్బందే. 'తెలంగాణ రాష్ట్ర గవర్నరు' అని, ఆయన తమవైపే వున్నట్లు, 'కె.సి.ఆర్.' ప్రభుత్వ ప్రకటనల్లోనూ ఆయన్ను మచ్చిక చేసుకుంటున్నారనీ,

ఈ 'గవర్నర్' ఆంధ్రకు 'సవతితల్లి ప్రేమ' చూపుతున్నారనీ చంద్రబాబు ఘోష! 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్లుందిది అంటున్నారు కొందరు.

ఇంతకీ అభివృద్ధికి అవరోధం మటుకు అవరోధం లేకుండా సాగుతున్నట్లుంది. అందులో ఎవరికివారు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు తమాషా ఏమిటంటే – అభివృద్ధి హేతువనుకునేవే – అవరోధాల రూపెత్తడం.

విద్యకు–పాఠశాలలే అవరోధం!

ఆరోగ్యానికి – ఆసుపత్రులే అవరోధం!!

రైతుకు–పంటపొలాలే అవరోధం!!!!

సరియైన సమాచారం విస్తృతికి – ఛానెళ్ల ప్రసారాలే అవరోధం. రెండు రాష్ట్రాల అభివృద్ధికి – వాటి ముఖ్యమంత్రులమధ్య ఘర్షణే అవరోధం.

ఇంత చేసీ ఇప్పుడు–

"మృత్యువుకు" కూడా బ్రతుకే అవరోధం! సామాన్యుల జీవనానికి అభివృద్ధిరేటు సంగతేమో గానీ, అభివృద్ధికి మాత్రం 'రేటు'తప్పడం లేదని పరిస్థితులు నిరూపిస్తున్నాయి.

**(14.6.2015)**

# ఏ నిముషానికి ఏమి జరుగునో...!

"తమలపాకుతో నువ్వొకటంటే తలుపుచెక్కతో నే రెండంటా"

బాపతుగా, ఎదుటివాడిని ఎత్తుకు పైఎత్తులతో ఇరుకునపడేసి, వారి తాలూకుదారిలోనే వీలయినంత 'బద్నామ్' చేసి, తన ఆధిక్యాన్ని ప్రదర్శించు కోవాలనే ధోరణి కనబడుతోందంటే, 'రాబోతున్న రోజులేమిటా?' అన్న సందేహం పెరిగిపోతోంది.

ఎన్నికలు రావడానికి ఇంకా నాలుగేళ్లు వుంది. తాము ఏలుతున్న రాష్ట్రంలో, తమ ఆధిక్యానికి ఇప్పుడు లోటేమీలేదు! కానీ తామన్న పునర్నిర్మాణ కార్యక్రమాలు అనుకున్నంత వేగవంతంగా జరిగే వీలు ఎలాగూ లేదనేమో, ప్రస్తుతం తాము అధికారంలోకి రావడానికి పనికివచ్చిన జనం 'సెంటిమెంట్', 'సెంట్'లా తాత్కాలిక పరిమళంతో ఆవిరై పోకుండా, ఆ ఆవేశాన్ని నివురుగప్పిన నిప్పును ఊదినట్లు వినియోగించాలనే 'యావ' కనబడుతోంది.

విభజన భౌగోళికమూ, రాజకీయమూ మాత్రమే అనుకున్నాంగానీ, ప్రపంచం మొత్తాన ఇంతలా పరువు పోయే నిస్సిగ్గు వ్యవహారం తెలుగు వారికి తమ ముఖ్యమంత్రులద్వారానే సంప్రాప్తిస్తుందని అనుకోలేదు. "నవ్వుతున్నారు నాన్నా! బయటికి పోతే" అన్న బొమ్మరిల్లు డైలాగ్‌లా, పరువులు బజార్న పడేసుకున్న పరమ తలవంపుల స్థితిగానే తోస్తోంది! నువ్వానేనా అన్నట్లు–తెలుగు సర్కార్ల ఈ 'జుట్టూ జుట్టూ పట్టుకునే పరిస్థితి' తెలుగుతనాన్నే అభాసుపాలు చేసేలా విషాదం ముసురుకుంటోంది. "రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగువారంతా ఒక్కటే! తెలుగు నిత్యం వెలుగుతూనే వుంటుంది. తెలుగువారి వైభవానికి ఎదురేలేదు. తెలుగు సాహిత్యం, సంస్కృతి మరింతగా పునర్వికాసం చెందుతుంది" అని కబుర్లు చెప్పి– విభజనను జీర్ణించుకుందామనుకున్న జనానికి, తెరపైకి మరిన్ని విభజన సమస్యలు తలెత్తుతూ, గవర్నర్ పట్లకూడా పక్షపాతపు అనుమానాలు పెరుగుతూ, తెలుగు వైభవ ప్రాభవాలకు ఎనలేని 'డాగు' పడుతోందంటే, కడుపులోంచి దుఃఖం తన్నుకువస్తోందిలా కొందరికి.

'సహితస్య భావం సాహిత్యం'–సాహిత్యం అందరి హితాన్ని కోరుతుంది. మనుషులను సంస్కారవంతులుగా, మానవీయ విలువలతో తీర్చి దిద్దుతుంది అనుకుంటే – సాహిత్యానికీ, సంస్కృతికీ కూడా 'రాజకీయం' బురద బానే అంటుకుంటోంది. ఎవరి దుకాణాలు వారు తెరుచుకుని, తమదే లాభసాటి వ్యాపారం కావాలని చూసుకోవడం కనబడుతోంది! నిజంగా తెలంగాణలో మునుపెన్నడూ లేని విధంగా జిల్లాల వారీగా దాదాపు అయిదువేల మంది కవులూ, కళాకారులను ఇంత వరకూ సత్కరించుకోవడం జరిగింది. అయినా ఇంకా అసంతృప్తులు కాన వస్తూనే వున్నాయి. అమరుల కుటుంబాలకు ఆశించినంత అండదండలివ్వలేదనే మాటలూ వినబడుతున్నాయి మరోవంక.

చిత్రంగా – ఇంతవరకూ కవులూ, రచయితలూ ఎవరూ ఓటుకు నోటు వివాదం గురించి గానీ, ఫోన్ ట్యాపింగ్ గురించి గానీ కలం సారించిన దాఖలాలు కనబడలేదు. తెలుగు న్యూస్‌ఛానెళ్ళు మాత్రం గంటగంటకూ వేడి పెంచి, 'రేటింగు'ల 'హంటింగ్'లో, తల మున్కలుగా వున్నాయి. ఓటుకు నోటు – ట్యాపింగ్ మలుపుతో – సెక్షన్ 8 సెంటర్ పాయింట్‌లోకి చొచ్చుకువచ్చి, కథ గవర్నర్‌పై 'గుస్సా' దాకా వచ్చి ఆగింది. "ఏ నిముషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ" అన్నట్లే వుంది. బంగాళాఖాతంలో 'అల్పపీడనమే' గానీ – తెలుగు రాష్ట్రాలకు అధిక 'పీడ'లానే కనిపిస్తోంది. వర్షం ఎంత శాతం కురుస్తుందో తెలీదుగానీ 'ఆశనిపాతం' మాత్రం గోచరమయ్యేలానే వుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను జనంలో పరిరక్షించడానికి తన ప్రసంగాలతో కె.సి.ఆర్. కృషి చేస్తుంటే, పదేళ్ల ఉమ్మడి రాజధాని నగరంలో – ఆంధ్రులకు భద్రత లేకుండా పోతోందని, తమ పోలీస్‌స్టేషన్లు తాము పెట్టుకోకతప్పేలా లేదనీ, తెలంగాణలో 'తెలుగుదేశం పార్టీ' బలపడుతందేమోననే భయంతోనే కె.సి.ఆర్. భయపెట్టో, ప్రలోభపెట్టో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను టిఆర్ఎస్ గూటిలోకి బలవంతంగా లాక్కుంటున్నాడనీ, తమ ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నాడనీ చంద్రబాబు గారు ఆంధ్రులకు ఆవేశం కలిగించాలని ఆరాట పడుతున్నారు. జనానికి ఏమీ పట్టడం లేదా అంటే 'పట్టడం' మాటేమోగానీ, అసహ్యం, జుగుప్స 'పుట్టడం' మాత్రం ఖాయంగా జరుగుతోంది! నాయకులకు తమ సంక్షేమం ఏమీ 'పట్టడం' లేదని క్షుణ్ణంగా అర్థమైపోతోంది. ఇటు బంగారు తెలంగాణ రావాలన్నా, అటు అమరావతి నిర్మితం కావాలన్నా, ముఖ్యమంత్రుల ఈ 'ప్రస్తుత వైఖరులు' ఎటూ తోడ్పడవు

సరికదా అవే పెద్ద అవరోధాలై పోతాయనీ, వారికి అర్థమైపోతోంది. ఇల్లు కాలి ఒకడేడుస్తుంటే చుట్టకు నిప్పు దొరికిందని మరొకడు సంబర పడినట్లు, తెలుగురాష్ట్రాల మధ్య ఇప్పటి 'చిచ్చు' తమకు ఎలా లాభిస్తుందా అని జాతీయ కాంగ్రెస్ తలపోస్తోందిట! కానీ సోనియా గానీ, రాహుల్ గానీ ఈ విషయం మీద నోరుకదిపిన పాపాన పోలేదు సుమండీ! 'ఇంకా తెలవారదేమీ ఈ చీకటి విడిపోదేమీ' అనే పాటే తరంగితమవుతోంది.

**(20.6.2015)**

# గవర్నర్ సింహన్....

తెలంగాణను దోచుకున్నారన్నప్పటికీ హైదరాబాద్ అభివృద్ధిలో ఆంధ్రుల పాత్ర లేకుండా పోదు. విశాలాంధ్ర ఏర్పడ్డాక కర్నూలుకాక ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని హైదరాబాద్ కావడంవల్లనే ఇన్నేండ్లుగా ప్రధానంగా నగరంతోనూ, ఇతరత్రా వరంగల్, కరీంనగర్ వంటి తెలంగాణ జిల్లాలతోనూ ఆంధ్రులకు హృదయబంధం ఏర్పడింది. అదీకాక ఆంధ్రులు, తెలంగాణులు అనే వివక్ష లేక పరస్పరం వివాహ సంబంధ బాంధవ్యాలు అనేకం ఏర్పడడంతో, అలాగే హైదరాబాద్‌లో విద్యా ఉద్యోగాలు సాగడంతో అనేకులకు ఈ ప్రాంతంతో విడదీయలేని పోనీ! విడదీసుకోజాలనంత అనుబంధం ఉంది. ఎందరో ఆంధ్ర ఉపాధ్యాయులు తెలంగాణలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. విశ్వనాథ సత్యనారాయణ వంటి కవిసమ్రాట్టు కరీంనగర్ కళాశాలలో  పనిచేశాడు.

ప్రతిభకు ప్రాంతీయత కొలమానం కావడం సరికాదు. తెలుగుసాహిత్యంలో కవులూ, రచయితలూ, కళాకారులు ఎందరో ఇరు ప్రాంతాల నుండీ ప్రసిద్ధులువున్నారు. ప్రభుత్వాలు గుర్తించడంలో, సన్మాన సత్కారాలు చేయడంలో వివక్షత వుందిగానీ, నిజానికి ఒక కవి ప్రతిభను మరోకవి అణగద్రొక్కు తాడనుకోవడం సరికాదు. 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు' అన్నట్లుగానూ, 'గుప్పెడు గడ్డిపోచలతో హిమాలయాన్ని కప్పిపెట్టలేం' అన్నట్లుగానూ ప్రతిభగల కవులూ, రచయితలూ పాఠకలోకంలో రాణించకుండా వుండరు. తెలుగు రాష్ట్రాలు రెండయినా తెలుగు భాషా సాహిత్యాలు వేరుపడినట్లుగానూ, అ ఆ లు వైరుధ్యంతో విడిపోయినట్లుగానూ భావించడం సరికాదు. కానీ అనివార్య రాజకీయ ఆధిక్యం, వైమనస్యం సాహితీ ప్రపంచాన్ని, జర్నలిజాన్ని కూడా లోగొనడం ఒకరకంగా విషాదమే!

సెక్షన్ 8 అనే ప్రసక్తి వచ్చినప్పుడు నిజానికి హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రుల కుటుంబాల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఏమీ లేవన్నది స్పష్టమే! ఒకేచోట నివసిస్తూ, మానసికంగా దూరంగా వుంటున్న భావన కూడా ప్రబలకూడదన్నది అభిలషణీయమైన వ్యవహారం, నిజానికి సాహిత్యం అలా కలిపి కుట్టేది, నిలబెట్టేది. రాజకీయం వేరుచేయచూసినా, సాహిత్యం సామరస్యంగా ప్రజలను

మానసికంగా దరిచేర్చగలగాలి. కానీ ఇప్పుడు సాహిత్య రాజకీయాలూ ప్రబలుతూ వుండడం విషాదం!

సమకాలిక కవులకు, రచయితలకు ప్రాంతీయత వర్తింపచేసినా, అది వారి ఉనికికే గానీ ప్రతిభకు కారాదు. అద్భుత సాహిత్య సృష్టిచేసి ప్రజలకందించి అస్తమించిన కవులూ, రచయితలకు ఇప్పుడు ప్రాంతీయత అంటగట్టి ఏ ప్రాంతంవారిని వారే గౌరవించుకుని, స్మరించుకోవాలనే వైఖరి పొడచూపుతూండడం జాతి అభ్యున్నతికి ఆరోగ్యదాయకం కాజాలదు. తాము నివసిస్తూ, పన్నుకడుతున్న నగరంలో తమకు సౌకర్యాలు లభించాలని పౌరులు ఆశించడం దోషం కాదు. శాంతిభద్రతలకు సమస్య ఏర్పడకూడదని అభిలషించడం తప్పుకాదు, కానీ పొగరాకుండానే నిప్పు ఉందని అనుమానించడం నిప్పులాంటి మనుషులు చేసే పనికాదు. కుట్రలు, కుయుక్తులతో నిండిన మనసులే ఎదుటివారికి హానీ తలపెట్టడానికి, ఎదుటివారివల్ల తమకు హాని వుందని గోలపెట్టడానికీ ఉద్యుక్తమవుతాయి.

'ఆడలేకమద్దెల ఓడు' అన్నట్లు తమ రాజకీయ పబ్బాన్ని గడుపుకోడానికి విడిపోయినా కలిసి వుండవలసిన జనం మధ్య, కలవకుండా విడగొట్టే రెచ్చగొట్టుడు తనాలను మానుకోకపోతే తెలుగుజాతి నష్టపోతుంది. తాము భౌగోళికంగా మాత్రమే వేరుపడ్డామనీ, పాలనాసౌలభ్యంకోసమే, ప్రజాసంక్షేమాల సౌకర్యంకోసమే రెండు రాష్ట్రాలుగానీ, 'మనతెలంగాణ' అని ఆంధ్రులూ, 'అమరావతి' తమకేమీ వైరిజాతి కాదని తెలంగాణులు భావనా సమైక్యతలోకి ఎదగగలగాలి. ఒకరి అభివృద్ధికి మరొకరు సహకరించుకోవాలి. ఉమ్మడిగా వున్నప్పుడు వివక్షకు గురి అయినామన్న భావన ఇక ఏ కోశానా విడిరాష్ట్రాలలో ఎవరి పాలనలో వారుండగా ఏర్పడకుండా– ప్రజాసంక్షేమం పరివ్యాప్తం కావాలి.

గవర్నర్ నరసింహన్ తెలుగువారు కాదు. కానీ ఉమ్మడి నుండి నేటి వేర్పాటుదాకా తెలుగురాష్ట్రాల ప్రథమ పౌరునిగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయనను ఇద్దరు ముఖ్యమంత్రులూ సమాదరించకతప్పదు. పదవీకాలంలో ఆయన ఇరువురినీ సంతృప్తి పరచక తప్పదు. ఎవరిపట్లా ఆయన సవతి తల్లి ప్రేమ చూపుతారని అనుకోలేము. నిజానికి ఇప్పుడు సంకటస్థితిలో వున్నది గవర్నర్‌గారు. ఓటుకునోటు, ఫోన్‌ట్యాపింగ్‌ల నడుమ పుడుతున్న రాపిడి వేడిలో గవర్నర్ పరిస్థితులను ఎలా చక్కబరుస్తారన్నది ప్రజలకే కాదు, ఆయనకూ ముఖ్యమే! **(27.5.2015)**

# 'మనవాళ్లు బ్రీఫ్‌డ్‌మి'

అందరికీ అన్ని తెలియవు. తెలిసి వుండాలన్న రూలేమీలేదు. కానీ ఒక బాధ్యతాయుతమైన పదవీలోనో, అధికారంలోనో వున్నవారికి – తను నేతృత్వం వహిస్తున్న రంగాల గురించీ, ఆయా రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించీ, అవకతవకల గురించీ, వాటి పరిణామాలగురించీ, అవగాహన ఉండాలి. లేకపోతే కలిగించుకోవాలి! అందుకోసం ఆయారంగాలు, శాఖలకు చెందినవారి నుండి, విషయసేకరణ చేసుకోవడంలో, వారి నుండి 'విని' గ్రహించడంలో తప్పులేదు.

వినదగునెవ్వరు చెప్పిన<br>
వినినంతనె వేగపడక వివరింపదగున్<br>
గని కల్ల నిజము తెలిసిన<br>
మనుజుడె పో నీతి పరుడు మహిలో సుమతీ! అన్నారు.

అంచేత – ఎవరు చెప్పినా 'వినడం' తప్పుకాదు. తాను అడిగి చెప్పించుకోవడమూ తప్పుకాదు. కాని చెప్పినవారి మాటలు సత్యానికీ, యథార్థానికీ ఒప్పినవా, లేక చెప్పుడు మాటలేనా? అన్న వివేకం వుండాలి. 'మనవాళ్లు బ్రీఫ్‌డ్‌మి' అంటున్న చంద్రబాబుగారు – 'ఓటుకు నోటు' వ్యవహారంలో రేవంత్‌కు బెయిల్ లభించటంతో, 'రిలీఫ్'గా ఫీలవుతున్నారేమో గానీ, లభించింది బెయిలే! కేసు ఏమీ ఎత్తివేయబడలేదు. అదీగాక – అసలు 'ఓటుకు నోటు' లావాదేవీలో ఫోన్‌లో గొంతెవరిది అన్నదీ, సదరు తంతు నిర్వహించడానికీ రేవంత్‌కయినా చేయాల్సిందేమిటో బ్రీఫ్ చేసిందెవరో మొదలంటా తేలాలి! బాబుగారి 'బ్రీఫ్‌డ్' వల్లనే బ్రీఫ్‌కేసులు కోట్లతో అందించడం జరిగిందన్న అభియోగం వుండనే ఉంది!

'ఫోన్ ట్యాపింగ్ జరిగిందా' అని కూపీ లాగండి. వద్దన్నదెవరు? కానీ సదరు సంభాషణలు సత్యమవునా కాదా? ఆ గళనిగళాలు విచ్చింది తమరా కాదా? అన్న వాస్తవాలు బయట పడతాయన్న భయాలెందుకు? అసలు 'మా ఫోన్ ట్యాపింగ్ జరిగింది' అని ఆరోపించడంలోనే – తాము ఫోనుల్లో మాట్లాడింది బహిరంగమై బయటకు పొక్కేసిందనే – 'అపరాధ భావన' వుండనే వున్నది కదా! మాటల్లోని

మర్మాలు విశ్లేషిస్తే, మదిలో భావాలు ఏ 'లై డిటెక్టర్' అక్కర లేకుండానే అవగాహనలోకి వస్తాయి.

'ముప్పై రోజులు జైల్లోపెడితే లొంగిపోతాననుకుంటే అది కేసిఆర్ భ్రమే ముప్పై ఏళ్లు పోరాటానికైనా సిద్ధం" అని రేవంత్ మీసం మెలేస్తున్నాడుగానీ, ఆ మాటల్లో కెసిఆర్‌కు ముప్పై ఏళ్ళదాకా ఢోకాలేదన్న భావన అంతర్గతంగా దాగివున్నట్లే కదా! ఇంతకూ అసలు గొడవ అంతా ఎక్కడవచ్చిందంటే – ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ తిరుగులేని పార్టీగా వుంది. కానీ తెలంగాణలో – కెసిఆర్ గారి టిఆర్ఎస్ మాత్రమేగాక, టిడిపి, కాంగ్రెస్, బిజెపి అంత గొప్పగా కాకున్నా, బ్రతికిబట్టకట్టిన ఉనికిలో ఉన్నాయి! ఆంధ్రలో టిడిపి లాగా తెలంగాణలో టిఆర్ఎస్‌ను తిరుగులేని, ఎదురులేని పార్టీగా చేసుకోవాలని ఆ పార్టీ అధినేత కెసిఆర్ అనుకోవడంలో, తన పార్టీని రాజకీయంగా తను బలోపేతం చేసుకోవాలను కోవడంలో దోషం ఏం లేదు. కానయితే – ఉధృతంగా టిఆర్ఎస్ ఆకర్ష్ వ్యవహారాలేం చేస్తోందన్నది జనం గమనికలోకి రాకుండా పోదు. తెలంగాణలోఉన్న కాంగ్రెస్ సీనియర్ నేతలు డిఎస్ వంటి వారే టిఆర్ఎస్ ఆకర్ష్‌లో పడుతున్నారంటే–టిడిపికి మరీ కంటగింపుగానే వుంటుంది. తెలంగాణలో పలు పార్టీల ఉనికితో ప్రజా స్వామ్యబద్ధంగానే 'రాష్ట్రం' వున్నదని అర్థం చేసుకోవాలి. 'మనవాళ్ళు బ్రీఫ్‌డ్‌మి' అంటున్న రెండుకళ్ళ సిద్ధాంతపు చంద్రబాబుకు తెలంగాణలో 'టిడిపి' ప్రస్తుతపు స్థితిగతుల గురించి, సరైన 'బ్రీఫింగ్' వుందా అన్నది క్వశ్చను? ఎవరైనా టిడిపిలో చేరతారంటే ఎక్కడ తెలంగాణలో ఆ పార్టీ బలపడుతుందోననే భయం కెసిఆర్‌కు వైరి వైఖరిగా వుండడం సహజం! అసలు ఆ భయంతోనే కుట్రపూరితంగా తనను 'ఓటుకు నోటు' కేసులో ఇరికించారని, రేవంత్ బెయిల్ దొరికాక మరీ రెచ్చిపోయి మాట్లాడటం, హర్షించదగిందిగా లేదన్న మాట ఎవర్నడిగినా చెబుతారు. తెలంగాణ సెంటిమెంట్‌ను నిలపడానికి ఆంధ్రులనూ, వారి పాలనా వైఖరులనూ కెసిఆర్ గీర్వాణంలో తూర్పారపట్టడం జీర్ణించుకోగల తెలంగాణ ప్రజలు, తెలంగాణ టిడిపి రేవంత్ – టిఆర్ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కుటుంబాన్నీ విమర్శించడం జీర్ణించుకోలేరు! ఎందుకంటే తెలంగాణలో 'టిఆర్ఎస్' కేవలం పాలనాపార్టీయే కాదు, ఉద్యమ పార్టీగా తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన పార్టీగా, భావింపబడుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావడానికి టిఆర్ఎస్ మాత్రమే కారణం కాదనీ, అసలుతెలంగాణ ఇచ్చింది, తెచ్చింది

కాంగ్రెస్ అని కొందరూ, తాము సంతకం చేసిన లేఖవల్లనే రాష్ట్రం ఏర్పడింది కనుక ఘనత తమదేనని తెలంగాణ టిడిపి వారూ భావించి, ఆ భావనను తెలంగాణ ప్రజల్లోకి చొచ్చుకుపోయేలా చేస్తూ, కెసిఆర్ పట్ల వ్యతిరేకతను పెంచే ప్రయత్నాలు శతథా, సహస్రధా చేస్తూనే వుంటారు. అది జరుగుతూనే వుంటుంది. తాము కోరుకున్న తెలంగాణ ఇదికాదన్న అసంతృప్తిని జనంలో జ్వలింపచేసి, కెసిఆర్‌ని కుటుంబ పాలన అంటూ, అతని నాయకత్వంలోని టిఆర్ఎస్‌ని రాజకీయంగా దెబ్బతీయాలన్న తహతహ కాంగ్రెస్‌కూ, టిడిపికి వుండడం అర్థం చేసుకోలేనిదేమి కాదుకదా!

'ఇండియాయే ఇందిర, ఇందిరయే ఇండియా' అని ఒకప్పుడు నినాదం వచ్చినట్లు తెలంగాణ అంటే కెసిఆర్, టిఆర్ఎస్ అనీ, టిఆర్ఎస్ కెసిఆర్ అంటేనే 'తెలంగాణ' అనీ అన్నంతగా బలపడుతూ ఆకర్ష్ అయస్కాంతంలా పనిచేస్తుంటే, టిఆర్ఎస్‌లో విభేదాలు పొడచూపి పతనమవ్వాలని, పరితపించే పాపచింతకులూ వుంటారు. 'బ్రీఫ్డ్ మీ'– 'బీటెడ్‌మీ' కాకుండా, అధినేతలు జాగ్రత్త పడడం ఆరోగ్యదాయకం.

**(4.7.2015)**

# వదులుకుంటా!...రా?!

ప్రధానమంత్రిగారి సందేశం ఛానెల్లో ప్రసారమవుతుంది. గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకొమ్మని. అందువల్ల ఎందరో పేదల వంటిళ్లు ఆధునికం అవుతాయట! తన తల్లి కట్టెలపొయ్యి దగ్గర కష్టపడిన రోజులు గుర్తుతెచ్చుకుని, కంటనీరు పెట్టుకుని, తన గ్యాస్‌సబ్సిడీ వదిలేసుకోడానికి ఓ సగటు మధ్యతరగతి జీవి సన్నద్ధమై పోయినట్లుగా ఆ ప్రకటన ఉంటుంది! ఈ వదిలేసుకోవడాలు దేశం కోసం... గొప్ప త్యాగాలు అన్నమాట! .. బానేఉంది.

కానీ 'చెప్పేటందుకె నీతులు వున్నాయి' అన్న మాటలు- పాలకులకు వర్తించినట్లు మరెవరికీ వర్తించవు అనాలి! ఎందుకంటే-వాళ్లు త్యాగాల గురించి సందేశాలు ఇస్తారు, చెబుతారు. 'తమదాకా వస్తే మాత్రం' ఏవీ వదులుకోవడానికి ఇష్టపడరు! ప్రజలు 'త్యాగధనులు' కావాలికానీ, తాము మాత్రం అధికారం అడ్డుపెట్టుకుని, ఎంతయినా – కూడబెట్టుకోవచ్చు, కొల్లగొట్టుకోవచ్చు, అదీ తంతు! మున్సిపల్ కర్మచారి జీతాలు పెంచమంటే – అందుకు సమ్మె చేస్తే, అది అరాచకంగా కనిపిస్తుంది. పార్లమెంట్ సభ్యుల వేతనాలు పెంచడం అంటే మాత్రం – ఎలాంటి ప్రతిఘటనా లేకుండా సజావుగా జరిగి పోతుంది! సామాన్యులు హోటల్లో తినాలంటే వందలు ఖర్చుపెట్టాలి. పార్లమెంట్‌క్యాంటిన్‌లో రేట్లు మాత్రం బహుచౌకగానే వుంటాయి! ఒక్క ఎంఎల్‌సిగానీ, ఎంఎల్ఎ గానీ, మంత్రిగానీ, ఎంపిగానీ తమకు ప్రభుత్వంనుంచి లభించే సౌకర్యాలు ఒక్కటీ వదులుకోరు. సామాన్యపౌరులు మాత్రం ప్రభుత్వం అరకొరగా ఇచ్చే సబ్సిడీలయినా స్వచ్ఛందంగా వదులుకోవాలిట! సెలబ్రిటీల స్థానంలో వున్నారుగా! సలహాలు, సందేశాలు కేం కొరత!

ఏం? ఈ పాలకులకు ఏం లోటుట? గ్యాస్ సబ్సిడీలే కాదు, వాళ్లు చాలాచాలా వదులుకోవచ్చు! తమ ఆస్తులు కోట్లలో వున్నట్లు వాళ్ళ ప్రకటించుకుంటుంటారు కదా! మరి వదిలేసుకోవడాల దగ్గరకొచ్చేసరికి – తామెందుకు 'త్యాగధనులు' కాలేరు? ప్రజల కోసం ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, పార్లమెంటులో నిజంగా ప్రజలకోసం చేస్తున్నదేమిటో, 'గుండెమీద చెయ్యివేసుకు' చెప్పగలరా? నిజమైన

పౌరులుగా ముందు తామెందుకు ప్రవర్తించరు? ఎన్నికల్లో గెలిచి పదవిలోకి వచ్చేసరికి – ఇక తాము పౌరులు కారా?

రైళ్లల్లో, బస్సుల్లో అందరిలా వారు ప్రయాణం చేయకూడదా? అసలు కారు అంటూ లేని, ఉపయోగించని ప్రజాప్రతినిధి అంటూ వున్నారా? గొప్పలకోసం ఒకసారి, రెండు సార్లు బస్సు యాత్రలంటూ చేయడం కాదు, తమ నిత్యజీవితంలో అందరు పౌరుల్లాగే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌నే వినియోగిస్తే ఏమిటట? కానీ ఆ పని సుతరామూ చేయరు. వాళ్ల విలాసాలు, విహారాలకు ప్రజలు కట్టే పన్నుల నుంచే డబ్బు ఖర్చవుతోందని వారికి తెలీదా? టెలిఫోన్, విద్యుత్తు, నివాసగృహాలు, ప్రయాణాలు అన్నీ వారివి ఖరీదైనవే! ఎన్నో ఉచిత సదుపాయాలు అనుభవిస్తున్నది వారే! వారికి వైద్యం కావాలంటే – గొప్పగా, ఖరీదైనది లభిస్తుంది. వారు నేరం చేశారన్నా – జైళ్లలో అద్భుతమైన సదుపాయాలుంటాయి. ఏం అవన్నీ వదులుకోలేరా? ఎన్నికల్లో గెలిచేసరికి సాధారణ పౌరుడికన్నా పదిరెట్లు ఉన్నతి ఎందుకు వచ్చేయడం? వారు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపరు. కానీ గవర్నమెంట్ స్కూల్స్ అభివృద్ధి చెందాలని ఘోషిస్తారు. ప్రైవేటును పెంచి పోషిస్తున్నది వారే! ప్రభుత్వ పాఠశాలల, ఆసుపత్రుల దైన్య స్థితిగతుల హేతువూ వారే! వారు వినియోగిస్తే అవి బాగుపడతాయి.

అంతెందుకు! ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుని పాసయినవారికి మాత్రమే – ప్రభుత్వ ఉద్యోగాలు అని ఒక్క నియమం చట్టబద్ధం చేసి, పాటించండి చూద్దాం! ఎందుకు గవర్నమెంట్ స్కూల్సు బాగుపడవు! మీరు పొందే సౌకర్యాలనెన్నింటినో స్వచ్ఛందంగా మీరు వదులుకుని, ముందు మీరు త్యాగధనులు కండి! ఎంత వదులుకున్నా మీకు, ఆస్తులుండనే వుంటాయి! మీరేమి దారిద్ర్యరేఖకు దిగువకు పడిపోరుగాక పడిపోరు! ఒక్క రెండు తెలుగు రాష్ట్రాల్లోనే నూటముప్పై అయదుకోట్ల జనాభాకు తలో కోటి రూపాయలు ఇచ్చినా, ఇంకా కోట్లాది రూపాయల ఆస్తిగల నేతలున్నారు. టాక్సులు ఎగ్గొట్టేదీ, నల్లధనం పోగేసేదీ వ్యాపారులు, ఈ పాలకులేగాని – ఈ దేశంలోని పేదవాళ్లూ, మధ్య తరగతి ప్రాణులూ కాదు. పాలకులకు 'జడ్‌ప్లస్' భద్రతలుంటాయి. పౌరుల రక్షణకు పూచీయే లేదు. చట్టాలను మీ చుట్టాలుగా చేసుకునేది మీరే! సామాన్యపౌరుడు – ఇన్‌కమ్‌టాక్స్, సర్వీస్‌టాక్స్, వాల్యూ యాడడ్ టాక్స్, వెల్త్ టాక్స్, కార్పొరేషన్ టాక్స్, వాహనాల రిజిస్ట్రేషన్ టాక్స్, ప్రాపర్టీ టాక్స్ అంటూ తన సంపాదనలో సగం పైగా ఈ పన్నుల చెల్లింపులకే

వెచ్చిస్తుంటే, మీరు మాత్రం నేతలుగా, పాలకులుగా ఎన్నో మినహాయింపులు, బోలెడు అదనపు సౌకర్యాలు అనుభవిస్తున్నారు! దేశిసరుకుల కన్నా విదేశీ సరుకులు ఎక్కువగా వాడేదీ, విమాన ప్రయాణాలూ, విదేశీ పర్యటనలు అంటూ పదవి అడ్డంపెట్టుకు ప్రయాణాలు చేసేదీ, సుఖభోగాలు అనుభవించేది ఈ నేతలే!

నీతిగా, నిజాయితీగా బ్రతికే పౌరుడిని త్యాగధనుడిని కమ్మని సందేశించడానికి ముందుగా ఈ మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎంపిలు తాము స్వచ్ఛందంగా త్యాగం చేసి తాము నిజంగా ప్రజల్లో ఒకరమేననీ, ప్రజాసంక్షేమంకోసం బ్రతుకుతున్న వారమనీ నిరూపించుకోవాల్సి వుంది! ఆదర్శాలు వల్లించడంకాదు. తమస్థాయిలో ఆచరణలో అవి చూపగలగాలి. నిరాడంబరత, నిస్వార్థ సేవా పరాయణత వారిలో ప్రజలకు కనబడాలి. అలా వారు బ్రతకాలి.

వదులుకుందాం రా! అని వారిలో వారు కలిసికట్టుగా ప్రజలకోసం త్యాగధనులుగా ముందు మారి, దేశాభ్యున్నతికై నిలవగలగాలి! అదీ కావలసింది. అది జరిగే పనేనా!

**(11.7.2015)**

# పుష్కరుడు - ముష్కరులు

వేరుకుంపట్లు పెట్టుకోవచ్చు, కానీ విడివిగా బ్రతుకుతున్నంత మాత్రాన, ఒకరిపట్ల ఒకరు ద్వేషం పెంచుకోవడాలు, ఒకరిపొడ ఒకరికి గిట్టకపోవడాలు సరికాదు! ఎవరి కుటుంబాన్ని వారు అభివృద్ధిపథంలో నడుపుకునేందుకు సోదరులు పోటీపడవచ్చు. కానీ అందుకోసం పరస్పర ప్రేమానురాగాలు వదులుకోకూడదు! మాటలు మానేసుకోవడాలు, ఒకరింటికి మరొకరు రాకపోకలు వదిలేసుకోవడాలు, ఎదుటివారి కష్టంలో పాలుపంచుకోకుండా – వారికి ఆపద జరిగితే, తమకేవీ పట్టనట్లుండటం మంచిది కాదు! తమ చేతనైన సాయం చేసి, అవసరమైతే ఆదుకోగలగడం, లేదంటే వారి కష్టానికి కనీసం సానుభూతి ప్రకటించడం మానవతాధర్మం!

గోదావరి పుష్కరాలకు తెలంగాణ ప్రజలు రాజమండ్రి వెళ్లకూడదా? నీళ్లు లేకున్నా – 'బాసర'కే వెళ్లాలా? అలాంటి ప్రతిబంధకాలున్నాయా? ఉన్నట్లు ఎవరూ భావించరు. రాజమండ్రిలో మొదటిరోజే గోదావరి పుష్కర స్నానాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ముప్పైమంది దాకా ప్రాణాలు కోల్పోవడం విషాదకర సంఘటన!

తెలంగాణలో గోదావరి ప్రవహిస్తున్న చోట్ల ఇక్కడా పుష్కరాలు జరుగుతున్నాయి. రాజమండ్రిలో వున్నంతగా గోదావరినీరు ఇక్కడ వుండకపోవచ్చు. పుష్కరఘాట్‌ల నిర్మాణాలు ఇక్కడా జరిగాయి. కానీ ఏ తొడతొక్కిడీ లేకుండా, నదీ స్నానాలు చేసే వీలు లభించింది! రాజమండ్రియో, కొవ్వూరో, ధవళేశ్వరమో వెళ్లి చేస్తేనే గోదావరి స్నానం కాదు. కాళేశ్వరంలో చేసినా, ధర్మపురిలో చేసినా స్నానం స్నానమే! వేదంలా ప్రవహించే గోదావరి ఎక్కడయినా అదే నీరు! అదే పవిత్రత కదా!

అసలు ఆధ్యాత్మికవేత్తలు, పండితులు కొందరు తమ ప్రవచనాలతో ఊదరగొట్టి, పుష్కరస్నానాల పట్ల జనాల్ని కొన్ని మూఢనమ్మకాలతో రెచ్చగొట్టారనీ, పుష్కరస్నానాలు చేస్తేగానీ పాపాలు పోయి, పుణ్యం ప్రాప్తించదనీ, అది కూడా నదిలో మట్టిచల్లి మంత్రం పఠించి, శాస్త్రోక్తంగా చేసి తీరితేనే ఫలితం ప్రాప్తిస్తుందనీ, ఛానెల్స్ ద్వారా హోరెత్తించారు! నదిలో మట్టివేయడం మాటేమోగానీ, పుష్కర స్నానాల పేర

'మట్టికొట్టుకుపోయారు'కొందరు! సముద్రస్నాన నియమాలను పుష్కరస్నానాలకు అంటించి, భక్తులను కొందరు పెడదోవలు పట్టిస్తున్నారని మరికొందరు వాపోతున్నారు. వినేవారున్నారుకదా అని చెప్పేవారు చెలరేగిపోకూడదు. పుష్కరుడు అయినా తను ఆశ్రయించిన నదిలో స్నానం చేసిన మాత్రాన 'ముష్కరుల' పాపాలు పోగొడతాడనుకోవడం భ్రమ! పుష్కరుడిని కూడా ఓ దేవుడిని చేసి కూచోబెడుతున్న సమయం ఇది. ముష్కరులూ పుష్కలంగా పెరుగుతున్న కాలం!

అసలు 'స్నానం' అంటే కల్మషాలను కడుగుకోవడం. శారీరక, మానసిక మాలిన్యాలను పోగొట్టుకోవడానికి వ్యక్తి నిరంతరం కృషిచేయాలి. రోజులతరబడి స్నానం చేయకపోతే శారీరక దుర్గంధం తప్పనట్లే, తన మనస్సును పరిశుద్ధంగా చేసుకోలేనివాడికీ, ఉంచుకోలేనివాడికీ నిరంతరం పాపచింతనే ఉంటుంది. "ఎవరు చస్తారా? ఓదారుద్దాం" అని ఎదురుచూడడం కూడా పాపచింతనే మరి! ఆలయాల్లోకి అన్యమతస్తుల ప్రవేశం నిషిద్ధం అని గగ్గోలెత్తేవారు నదిలోనో, సముద్రంలోనో ఒక్క హిందువులు మాత్రమే స్నానం చేయాలంటే, అంతకుమించిన అవివేకమూ ఉండదేమో! వైఎస్సార్ సిపి నాయకుడు జగన్ పుష్కరస్నానం చేసి తన తండ్రికి తర్పణాలు వదలడం కొందరికి ఆశ్చర్యం కలిగించిందట! ఆయన దైవకుమారుడని విశ్వసించే వారున్నారు కదా మరి!

హిందూ, ముస్లిం, క్రైస్తవ, పార్శీ మతం ఏదయినా అందరూ మానవులు అన్నది ప్రాథమిక సూత్రం! మనిషి మనిషిగా జీవించడం ముఖ్యం. మతాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ఏవయినా – మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దేవయితే ఆచరణీయాలు కానీ, మానవహితం కోరనిదేదయినా త్యజించాల్సిందే! మునుపు అనుకున్న మాటే అయినా–

"మతమన్నది మా కంటికి మసకయితే
మతమన్నది మా మనసుకు మచ్చయితే
మతం వద్దు గితం వద్దు మారణహోమం వద్దు
నారాయణ నారాయణ అల్లా అల్లా
మా పాలిటి తండ్రిని నీ పిల్లలమేమెల్లా" అన్నారు కృష్ణశాస్త్రిగారు.
ఎప్పటికీ అది గుర్తుంచుకోదగింది.

**(18.7.2015)**

# మాటకు మాట

మాటకు మాట తెగులు
నీటికి నాచు తెగులు

అన్నమాట ఊరికే రాలేదు. వ్యక్తుల వ్యవహారసరళిలో మాటకున్న ప్రాముఖ్యం ఎనలేనిది. ప్రాణాధారమైన నీటికి నాచుపడితే ఎంత చేటో, ప్రభావోపేతమైన మాటగా ఒకరన్న దానికి ప్రతిగా మరొకరు ఎదురుమాట అనడం కూడా చేటుగా పరిణమిస్తుంది. "నన్నంటే ఊరుకుంటానా? అంతకంతా ఎదురు సమాధానం ఇచ్చి తీరుతాను" అంటూ ఎవరోఏదో అంటే పడివుండాల్సిన ఖర్మమేమీ లేదని ఒకరి మాటకు అంతకు రెట్టింపు నోరుపారేసుకోవటం జరుగుతూనే ఉంటోంది. అటువంటప్పుడే విజ్ఞత ప్రశ్నార్థకమవుతూంటుంది.

నిజమే! ఆత్మాభిమానం దెబ్బతీసేలా మాట్లాడటం సహృదయతకాదు.

సత్యం బ్రూయత్ ప్రియంబ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం
ప్రియంచ నానృతం బ్రూయాత్
ఏషా ధర్మః సనాతనః

అని రామాయణంలో లక్ష్మణుడికి రాముడు ఏనాడో పథ నిర్దేశం చేసాడు. సత్యమే చెప్పవచ్చు. కాని అది ఎదుటివారికి నొప్పు కలిగించకూడదు. ఇతరులకు అప్రియమైన సత్యాన్ని చెప్పకపోయినా నష్టం లేదు. కానీ అసత్యం మాత్రం చెప్పకూడదు, అది ఎదుటివారికి ఆహ్లాదం కలిగించేది కదా అని!. ఒక్కొక్కసారి మాటకన్నా మౌనం ఉత్తమమైంది అవుతుంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య మాటకుమాట వ్యవహారాలు పొడచూపుతూండడం విషాదకరం! ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రుల నుండి తెలంగాణవారు పొందిందేమిటో, తెలంగాణ వారి నుండి ఆంధ్రులు పొందింది ఏమిటో ఎవరికి వారికి పరస్పరం తెలిసిన సంగతే! కలిసి సాధించినవి ఏమిటో, నష్టపోయిన వేమిటో అంతఃకరణలే ప్రమాణాలు.

విడివడి అభ్యున్నతి సాధించాలని నిర్ణయించుకున్నాక ఒకరి విషయాల్లో ఒకరు కొన్నింటిలో అనవసర జోక్యాలు వదులుకోవడం మంచిది. తమపనేదో తాము చేసుకోవాలి గానీ తగుదునమ్మా! అని ఎదుటివారి వ్యవహారసరళిని వ్యాఖ్యానించడం, ఎకసెక్కం చేయడం మర్యాదకాదు. ముందు పోల్చుకోవడాలు మానాలి. ఎవరి పాలనవారు వారి పద్ధతిలో నిరభ్యంతరంగా సాగించుకుంటారు. ఇదేమీ పోటీ కాదు? ఇదేమీ పరీక్షకాదు. ఇతర రాష్ట్రాలు వేటికవి స్వతంత్రంగా ఎలా ఎదుగుతున్నాయో, తెలుగు రాష్ట్రాలు రెండూ కూడా వేటికవి ఎదగాలి. పరస్పరం సహకరించుకోవడం ఇష్టంలేకపోతే మానె! పరస్పర విద్వేషాలు ఇంకా ఎందుకు?

పూను స్పర్ధలు విద్యలందే
వైరములు వాణిజ్యమందే

అని గురజాడ అన్నారు. ఎదుటి రాష్ట్రంకన్నా తమ రాష్ట్రం అన్నింటా ముందుండాలనీ, అందరికీ ఆదర్శవంతం అనిపించుకునేలా ఎదగాలని ఆశించి పాలకులు, ప్రజలు కృషి చేయడం మంచిదే, కానీ అందుకోసం ఎదుటివారిని నిందించడం, పోలికలు తెచ్చి పరిహసించడం, అనవసరంగా రెచ్చగొట్టే మాటలు, చేష్టలు చేయడం బుద్ధిమంతుల లక్షణం అనిపించుకోదు. ఉదయమే నిద్రలేచే అలవాటు ఒకరు నేర్పక్కర్లేదు. పనులు చేసుకుంటూ ఆలస్యంగా రాత్రి నిద్రపోయే అలవాటు కొందరికి వుంటుంది. ఎప్పుడు లేచామన్నది కాదయ్యా కొశ్చెను. జాగృతమై చరించి చేసిందేమిటన్నదే పాయింట్. ఎవరికుండే అలవాట్లు వారికి వుంటాయి. ఏవి మార్చుకుంటారో ఏవి అనుసరిస్తారో ఎవరిష్టం వారిది? మేలును, ప్రయోజనాన్ని చేకూర్చే విధానాలు పాటించాలనే దృష్టి ఎవరిది వారిదే! పోలికలు, పోటీలు ద్వేషభావాన్ని రగిల్చేవి అయనప్పుడు, వాటి జోలికి పోనేపోకూడదు. ప్రతిభ దైవదత్తం అంటారు. అయినా కెసిఆర్ అన్నట్లు ఎవరి ప్రతిభ వారికి వుంటుంది! ప్రతిభా మూర్తులను గౌరవించడం నేర్చుకోవాలేగానీ, కెసిఆర్ అయినా ప్రాంతీయతా భావాలను ఇంకా రెచ్చగొట్టాల్సిన అవసరం లేదన్నది కటికసత్యం. ఇరువురు ముఖ్యమంత్రులూ ఇంకా పరిహసించడం, నిందించడం అనే వ్యవహార సరళిని ఎంతతొందరగా మానుకుంటే ఇరు రాష్ట్రాల ప్రజలకూ అంతమంచిది. 'నువ్వు నన్ను ఒకటంటే నేను నిన్ను పది అంటా' అన్న పంతాన్ని పెంచుకుంటూ పోయే పరిస్థితులు రాకూడదు. సంయమనం రెండువైపులా అవసరం, విద్యుత్తును, విద్వత్తును జనసంక్షేమపథంలో

వాడుకోవడం ముఖ్యం. మేధావులు, కవులు–కళాకారులు తమ ప్రాంతీయ అస్తిత్వం నిలబెట్టుకుంటూనే విశ్వజనీనులు కావడం అవసరం.

“దురంత పద్మవ్యూహాల వల్ల కానిది
రవ్వంత అనురాగం వల్ల అవుతుంది”

అంటారు సి.నా.రె. ‘కాలం నా కంఠమాల’ అన్నాడు దాశరథి. నా తెలంగాణ కోటి రత్నాలవీణ అంటూనే మహేంద్రోదయాన్ని సౌజన్యంతో స్వాగతించాడు. “మీ రాజధానిని బాగానిర్మించుకోండి. మాకు సంతోషం” అని కె.సి.ఆర్. దాశరథి సౌజన్యం అందిపుచ్చుకున్నాక, సంయమనం సాధ్యమే మరి!

**(25.7.2015)**

# అఖండ స్నేహదీపం

తైలాలు లేకుండ వెలిగేటి దీపం
విద్యుత్తు లేకుండ వెలిగేటి దీపం
హృదయాలలో ఎపుడు నిలిచేటి దీపం
నిజమైన దీపం మా స్నేహదీపం
మనసులో దీపం మలిపితే పాపం

అంటాడు మహాకవి దాశరథి. 'దోస్తీని మించింది లేదు లోకాన – రత్నాలకంటె అది మిన్న తూకాన' అన్నది కూడా ఆయనే. ఈ ఆగస్టు 2 ఆదివారం 'ఫ్రెండ్‌షిప్ డే', ఏటా ఆగస్టు నెల మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా అంతర్జాతీయంగా భావించడం జరుగుతోంది. స్నేహం అంటే చమురు అని అర్థం వుంది. తైలం అంటే కూడా నూనెకు వాడుతున్న పదమే. తైలాలు లేకుండా వెలిగేటి దీపం 'స్నేహం' అన్నాడందుకే కవి.

నిజానికి బంధుత్వాలకన్నా స్నేహబంధమే గొప్పగా నిలుస్తుండటం ఎందరికో అనుభవంలోని విషయమే. చిన్ననాటి స్నేహాలు మరపురానివేకాదు ఎంతోకాలం పటిష్టంగా నిలబడగలిగేవి కూడాను. అన్నదమ్ముల్లా విడిపోయిన తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పుడు నిజానికి హృదయాలలో నిలిచి వెలుగవలసింది స్నేహదీపం. దాశరథి 'కవితా పుష్పకం'లోని 'స్నేహగీతి'లో– 'మిత్రుడే కావాలి సుఖమున శోకాన – అతడు లేకున్నచో నగరమే కాన' అన్నాడు. అంతేకాదు

చీకట్లలో దారి చూపేది నేస్తం
కళ్లు తలకెక్కితే దింపేది నేస్తం
మనలోని లోపాలు తెలిపేది నేస్తం

నిజమైన మనిషిగా నిలిపేది నేస్తం. అనే రమణీయ మానవీయతను కూడా కమనీయంగా చెప్పాడు దాశరథి.

'దోస్తానా' అంటే రెండు స్థానాలు ఏకోన్ముఖంగా అభివృద్ధి చెందడం అనవచ్చు. "మైసెల్ఫ్+మైసెల్ఫ్ అండ్ యువర్ సెల్ఫ్" కలిస్తే మైత్రి (MY THREE) అనీ

చమత్కరించవచ్చు! తుఫానులోనయినా మునిగిపోని 'షిప్' ఏదయినా వుండగలదంటే అది 'ఫ్రెండ్‌షిప్'యే! "అఘమువలన మరల్చు– హితార్థకలితుజేయు– గోప్యంబుదాచు –బోషించు గుణము విడువడాపన్ను–లేవడి వేళనిచ్చు మిత్రుడీ లక్షణంబుల మెలగుచుండు' అని భర్తృహరి సుభాషితాన్ని ఏనుగు లక్ష్మణకవి తెలుగులో తేట తెల్లం చేశాడు.

భారతదేశాన్ని అత్యున్నత స్నేహ దేశంగా గుర్తించింది కనుకనే – అమెరికా, మాజీ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం మృతిపట్ల మునుపెన్నడూ జరుగని విధంగా, తన వైట్‌హౌస్‌మీద పతాకాన్ని గౌరవసూచకంగా 'అవనతం' చేసింది. ఒబామా కలాంపట్ల తన మైత్రీభావాన్ని అలా నిరూపించుకున్నాడు! అబ్దుల్ కలాం – స్నేహానికి అంగలార్చి ప్రాణమిచ్చే మహనీయవ్యక్తి. రామేశ్వరంలో జన్మించిన అబ్దుల్ కలాం మసీదు వీధిలో నివసిస్తున్నా – ప్రతిసాయంకాలం శివాలయం వీధిలో సంచరించేవారు. ఒక ముస్లిం కుర్రవాడు అలా అక్కడ తిరగడం వింత దృక్కులతో కొందరికి కానవచ్చేది! కానీ ఆలయ మంత్రోచ్చారణలంటే కలాంకు ఎంతో ఇష్టం! అవేమిటో అర్థంకాకపోయినా, అతనిని అవి కట్టిపడేసేవి. అంతేకాదు! కలాం తన ప్రాణమిత్రునిగా సంభావించిన 'రామనాథశాస్త్రి' ఆ దేవాలయవీధిలోనే వుండేవాడు. అతడు ఆలయ ప్రధానార్చకుడి కొడుకు. తండ్రి పక్కన అర్చనవేళ వుండే – 'రామనాథశాస్త్రి' అబ్దుల్‌కలాం కోసం ఎదురు చూస్తుండేవాడు. బడిలో ఇద్దరూ మొదటి బెంచీలో పక్క పక్కనే కూర్చునేవారు. నుదుట నామాలతో, జంధ్యంతో రామనాథశాస్త్రి, ముస్లిం టోపీతో కలాం పక్కపక్కనే అంత స్నేహంగా కూర్చోవడం, వారు అయిదవ తరగతిలో వుండగా వచ్చిన ఓ కొత్త టీచర్‌కు ఏ మాత్రం నచ్చలేదు. 'ఆలయ ప్రధానార్చకుడి కొడుకు పక్కన కూర్చుంటావా? లేచి చివరి బెంచీలో కూర్చో' అంటూ ఆ టీచర్ కలాంను లేవగొట్టాడు. కంటనీరు తిరుగుతుండగా – కలాం చివరి బెంచీకి వెళ్లాడు. తమ స్నేహానికి ఒక తెరపడినట్లేనని మిత్రులిద్దరూ మౌనంగానే రోదించారుట! ఆ సాయంత్రం ఇంటికెళ్లినప్పుడు తండ్రి – కలాం ముఖంచూసి "ఎందుకేడుస్తున్నావ్" అని అడిగితే, జరిగిన కథంతా చెప్పాడు. అలాగే రామనాథశాస్త్రి కూడా తన తండ్రికి బడిలో జరిగిన విషయం చెప్పాడు.

ఆ మర్నాడు ఉదయం రామనాథశాస్త్రి – కలాం ఇంటికి పరుగుపరుగునవచ్చి "మా నాన్న గారు వెంటనే నిన్ను మా ఇంటికి రమ్మంటున్నారు" అని చెప్పేసరికి,

కలాం గుండెలు భయంతో కొట్టుకున్నాయి. శాస్త్రితో వాళ్లింటికెళ్లేసరికి – అక్కడ 'కొత్తటీచర్' కూడా వుండేసరికి మరింత గాభరాపడ్డాడు. రామనాథశాస్త్రి గారి తండ్రి ఆ టీచర్‌తో – "నేను చెప్పినట్లుగా పిల్లవాడు కలాంకు క్షమాపణ చెప్పు" అని దృఢంగా అన్నారు.

ఆలయ ప్రధానార్చకుడు అయిన ఆయన, అలా అనేసరికి కలాం ఆశ్చర్యంతో నమ్మలేకపోయాడు. "దేవుడి దృష్టిలో పిల్లలందరూ సమానమే. టీచర్‌గా నువ్వు పిల్లలందరూ కలిసి మెలిసి వుండేలా చూడాలి. వారి మధ్య స్నేహాన్ని పెంచాలి. లేదంటే నువ్వు బడిలో టీచర్‌గా అనర్హుడివి" అని ఆయన అనేసరికి, ఆ టీచర్ కలాంను క్షమాపణ కోరుకున్నాడు. ఆ రోజు నుండి రామనాథశాస్త్రి, కలాం మొదటిబెంచీలో స్నేహితులుగా కొనసాగి, వారి స్నేహాన్ని అలాగే కలకాలం నిలుపుకున్నారు! ఈ విషయం అబ్దుల్ కలామ్ స్వయంగా చెప్పుకున్నారు. "స్నేహానికన్న మిన్న – లోకాన లేదురా" అన్నదానికి తార్కాణంగా రాష్ట్రపతి స్థాయికి ఎదిగినా తన స్నేహితులను ఏనాడూ మరువని 'కలాం' .. యువతకు వర్ణ, వర్గ, ప్రాంత రహితమైన స్నేహబంధాన్నే ప్రబోధించారు. ఆదర్శంగా నిలిచారు.

ఒకరన్నట్లు భారతదేశపు ఒక గొప్ప ముస్లిం, హిందువుల పర్వదినమైన తొలి–ఏకాదశినాడు, ఒక క్రిస్టియన్ హాస్పిటల్‌లో కన్నుమూయడం కాకతాళీయమే అయినా, మృత్యువులోనూ 'సెక్యులరిజం' ద్యోతకమైన మానవీయ మహనీయ మూర్తి కలాం! దేశాల మధ్య కూడా పటిష్ఠం కావాల్సిన స్నేహానికి కలాం ఓ 'ఆరనిదీపం'.

**(1.8.2015)**

# ఉల్లితల్లిమేలు

'ఉల్లి చేసే మేలు తల్లికూడా చేయదు' అని ఓ నుడి. పప్పు, కూర, సాంబారు ఏమీ లేకుండా – 'ఉత్త' అన్నంలో, ఓ పచ్చిమిరపకాయ, ఓ ఉల్లిపాయ నంజుకుని అదే 'భోజనం'గా జీవించే పేదలు ఇప్పటికీ వున్నారు. దారిద్ర్యరేఖ దిగువవారికి సంపన్న పదార్థం 'ఉల్లిగడ్డ'యే! కానీ ఇవాళ పోరుగడ్డ తెలంగాణలో – 'ఉల్లిగడ్డ' కంటనీరు తెప్పించే పరిస్థితి వచ్చింది! మంత్రి హరీష్‌రావుగారే స్వయంగా అన్నట్లు – 'ఉల్లిగడ్డ కోస్తే కాదు, కొంటే కంట్లో నీళ్లొస్తున్నాయి' అనుకునే పరిస్థితి దాపురించింది.

బహిరంగమార్కెట్లో నలభై అయిదు రూపాయలు కిలో పలుకుతున్న ఉల్లికి, సామాన్యులను ఆదుకుంటున్నామని ... సబ్సిడీధరకే విక్రయించే ఔదార్యాన్ని ప్రవేశపెట్టింది రాష్ట్రప్రభుత్వం. పెరిగే ధరల నియంత్రణ గురించి మాట్లాడకుండా, ఆర్థికంగా ఇబ్బంది కలగకుండా మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి తెచ్చి, కిలో ఇరవై రూపాయలకే అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేటర్ పరిధిలో సబ్సిడి ఉల్లి అమ్మకాల ప్రారంభోత్సవం మొన్న బుధవారం నాడు రైతుబజార్లలో మంత్రుల హడావుడిల మధ్య 'అట్టహాసం'గా జరిగింది. బంగారు నగలషాపుల ప్రారంభోత్సవాన్ని మించి – ఉల్లి మార్కెట్ సబ్సిడీ విక్రయాల ఉద్ఘాటనం జరగడం వింతేమరి! అయిదు రైతుబజార్లలో అయిదుగురు మంత్రులు సబ్సిడీ ఉల్లిగడ్డల విక్రయకేంద్రాలను ప్రారంభించడం బంగారు తెలంగాణకు గొప్ప వార్త అయింది!

కిలో ఇరవై రూపాయల ఉల్లిపాయలను ఓ రెండు కిలోలు కొనుక్కోవడానికి (అంతకు మించి ఇవ్వలేదు మరి!) గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. కౌంటర్లు ఎక్కువమొత్తంలో లేకపోవడంతో – మాటల ఎన్‌కౌంటర్లూ జరిగాయిట! గ్రేటర్ పరిధిలో వున్న ఇరవై నాలుగు లక్షల కుటుంబాలకు సరిపడా ఉల్లిని అమ్మాలంటే మామూలు విషయం కాదుకదా! నగరంతో పాటు, తెలంగాణలో ఎనభైఆరు కేంద్రాలలో సబ్సిడీపై ఉల్లిగడ్డలను విక్రయించడం ఇప్పుడో మహత్తర యజ్ఞమైంది!

ఉల్లికోసం తల్లి, చెల్లి, మల్లి అందరూ క్యూలు కట్టారు గానీ – కొనుగోలుదారులు 'ఆధార్' కార్డు చూపితే గానీ, ఆ రెండు కిలోలు అమ్మేది లేదని అధికారులు భీష్మించడం

మరో మహత్తర పరిణామం! (ఆధార్ లేకోయినా – ఓటర్ కార్డు అయినా ఫరవాలేదు అన్నారు లెండి!) ఆధార్‌కార్డు చూపించినందుకయినా అయిదుకిలోలు అయినా ఇస్తే బాగుండేదని ఓ 'అమ్మ' కంటతడిపెట్టింది!

నగరంలో పదకొండు రైతుబజార్లతోపాటు, మరో 34 గుర్తించిన ప్రాంతాలలో సబ్సిడీ ఉల్లిగడ్డలను ప్రత్యేకంగా నిర్ణయించిన సమయాల్లో విక్రయిస్తున్నారు. తల్లి, ఉల్లి చేయలేని మేలు ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్నందుకు మనం ఆనందించాలి! పేదల ఆకలితీరే మార్గంలో ఇదీ ఓ పునర్నిర్మాణమే!

ఒకప్పుడు కందమూలాలు, ప్రకృతి వనరులైన నీరు, గాలి ఉచితంగా అందరకూ లభించే స్థితి ఉండేది. నాగరికత పెరిగి మనం చాలా దూరం నడిచివచ్చేసాం. 'నీరు' ఇవాళ మినరల్‌వాటర్ బాటిల్స్‌గా కొనుక్కుతాగితేనే మనుగడ అయిపోయింది. కూరగాయలు ఏవయినా 'గాయాలే' చేస్తున్నాయి–పండించే రైతుకూ, కొనుగోలు చేసే సామాన్యుడికీ కూడాను. సహజంగా జరగవలసినవి అన్నీ ఆర్భాటాలుగా, ఉద్ధరింపులుగా మారిపోతున్నాయి. కార్పొరేట్ కల్చర్‌లో డెమొక్రటిక్ విధానాలు సాగితేనైనా సంతోషమే కానీ...

ప్రజాస్వామ్య ముసుగుల్లో ఫాసిజముందండీ
సామ్యవాద వెలుగుల్లో
పసిగడ్తా రండి

అని ఎనభైల్లో అడుగుపెట్టిన ఎర్రజెండా కవి డా॥ ఏటుకూరి ప్రసాద్ ఈ వయసులోనూ తన కలాన్ని, గళాన్ని మొన్న తన పుట్టినరోజు మైత్రీ సమావేశంలో ఎలుగెత్తి చెప్పినట్లు, మారుతున్న విలువల్లో రచయితల బాధ్యతలు ప్రధానమవుతున్నాయి! కవులు, కళాకారులు కలిగించిన ఉద్యమ స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం సుగమమైందన్నది కాదనలేని సత్యం. ఇక కవులు, కళాకారులు ప్రభుత్వ పక్షానకాక, మరింత దీక్షగా ప్రజాపక్షాన నిలిచి, బంగారు తెలంగాణను సాధించుకోవడం కర్తవ్యం. పాతవన్నీ కూల్చడమే నవనిర్మాణం కాజాలదన్నదీ వివేకంతో గుర్తించాల్సిన విషయం.

పాలనలో అవినీతిని
ఎండేద్దాం రండి

పాలకముఖాల రంగులు

కడిగేద్దాం రండి

అనీ, "నవభావన జనచేతన వినిపిద్దాం రండి" అనీ- అన్న మానవీయ కమ్యూనిష్టు కర్మయోగి ఏటుకూరి ప్రసాద్ సందేశపుబాట, అనుభవాల ఊట- వామపక్ష భావజాలం కలిగినవారంతా అందిపుచ్చుకోవాల్సినదే మరి!

'అక్షరాల ఆక్రోశం - ఆలిద్దాం రండి

చెమటచుక్క కన్నీళ్ళను తుడిచేద్దాం రండి"

అంటూ నవచేతనను వయసూ, వృద్ధాప్యంతో నిమిత్తం లేకుండా అంతా సమష్టిగా అందుకున్నప్పుడే జనకోసం సంధించిన చాపంగా సాహిత్య లక్ష్యంగా గల నవచేతన - మసిబారిన బతుకుల్లో వెలుగివ్వగలుగుతుంది.

'కసితో రగిలేవాళ్లతో కలిసెల్దాం రండి' అని తెలంగాణ ప్రజ కదంతొక్కినపుడే - ప్రసాదమయమైన సుఖశాంతుల జీవనపు మనతెలంగాణ ఏర్పడి భాసిస్తుంది! ఉల్లిమేలును మించి, తెలంగాణ తల్లి జనజీవన కల్పవల్లిగా వెల్లివిరుస్తుంది.

**(8.8.2015)**

# ఆరనీకుమా ఈ దీపం.....

ఇవాళ స్వాతంత్ర్యదినం. ధనవంతుడి స్వాతంత్ర్యానికీ, పేదవాడి స్వాతంత్ర్యానికీ తేడా వుంది. – బాగా డబ్బున్నవాడు పంచె ఎగగట్టి, గ్రామాన్ని ఉద్ధరింపచేసేవాడు అయితే – మన గ్రామీణ వ్యవస్థ ఇలా ఎందుకు దిగజారేది? పదిమంది శ్రమను దోచుకుని గ్రామంలో ఒకడు ధనవంతుడై, తన పెత్తనం రాజకీయ అండతోబాటు సాగిస్తూ, పెట్టుబడిదారు, దోపిడిదారు అయ్యాడనే కదా – ఆ పదిమంది శ్రమను దోచేవాడిని మట్టుపెట్టయినా, వ్యవస్థను శ్రమజీవుల పరంచేయాలని 'నక్సల్బరీ' ఉద్యమాల వంటివి కూడా అసలుకు పుట్టుకొచ్చింది.

మునసబులు, కరణాలు, పటేల్ పట్వారీలు వీరంతా గ్రామ పెద్దలు, ఒకప్పుడు గ్రామాలు సమష్టి జీవన ప్రమాణాలతో ఆత్మీయతలతో, బంధుత్వాలతో ప్రేమమయంగా విరాజిల్లేవి. 'రైతేరాజు'గా బ్రతికిన రోజులున్నాయి. అయితే 'తేహినోదివసా గతాః'. తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకోసం గ్రామాలలో వివిధ వృత్తులు చేసుకునే వారిమధ్య కూడా విభేదాలు సృష్టించి, 'పెద్దమనుషులు'గా చెలామణీ అవుతూనే దురాగతాలకు పాల్పడి, సంపదను తమ ఖాతాలోనే పోగేసుకున్న కామందులు, రాబందులు పుట్టుకొచ్చారు. రైతు ఎప్పుడయితే చితికిపోవడం మొదలయ్యిందో గ్రామీణ వ్యవస్థకు క్రమేపీ చితిపేర్చినట్లయింది. పల్లెలు వదిలి పట్టణాలకు వలస పోవడాలు పెరిగాయి. నేతలు అభివృద్ధి అంతా కూడా పట్టణాలకే పరిమితం చేసి ప్రభుత్వాలు 'నగరీకరణ'కు ఇచ్చిన ప్రాముఖ్యం, గ్రామీణాభివృద్ధికి కాగితాలపై తప్ప కార్యాచరణలో చూపకపోవడంతో– పల్లెలను పాడుపెట్టి తలదీపం పెట్టినట్లే అయింది. ఇవాళ గ్రామజ్యోతి ప్రకాశనం సమకట్టబడింది. భారత స్వాతంత్ర్యజ్యోతి అరవై ఎనిమిదేళ్ళుగా అఖండంగా వెలుగుతూనే వున్నా గ్రామాలలో–చీకటి ఇంకా తొలగి పోలేదన్న ఆర్తియే హేతువు!

మంచికి ప్రోద్బలకంగా నిలిచేవాటిని, అభినందించాల్సిందే! అంతర్గతంగా దాగిన సందేశాన్ని అందిపుచ్చుకోవాల్సిందే. కానీ "ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా! నిజంమరచి నిదురపోకుమా" అన్న వైతాళిక స్వరాన్ని

విస్మరించకూడదు! కన్నతల్లిని, కన్న ఊరును కంటిపాపలా చూసుకుని, ప్రేమానురాగాలతో సంరక్షించుకోవాలే గానీ – 'దత్తత' అంటూ సవతి భావన పరివ్యాప్తం కాకూడదు. 'ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా?' అన్నట్లు, అన్నంపెట్టే గ్రామాలను అనాథలను చేసి, పారిశ్రామికీకరణే శిరోధార్యం అనుకోవడం పొరపాటు. వ్యవసాయాన్నీ, రైతునూ విస్మరించి దేశం అభివృద్ధి చెందగలదనుకోవడం తప్పు! ఇవాళ 'నవీనత' పేరుతో వెల్లివిరుస్తున్నవి కొన్ని – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలుగా ప్రవేశపెడుతున్నవి కొన్ని – వేళ్ళకు బంగారు ఉంగరాలు సమకూర్చేవిగా కనబడుతూనే, మణికట్టు దగ్గర నరాలనే బలహీనం చేసేవిగా వుంటున్నాయన్న ఎరుక ముఖ్యం!

తెలంగాణలో నిజానికి 1956 తరువాత గ్రామాలెన్నో తమతనాన్ని కోల్పోతూ వచ్చాయి. గ్రామీణ సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, గ్రామీణ కాంతులు ఇతరేతర శక్తుల పెత్తనాలవల్ల అణచివేతకు గురికావడం, నిరాదరణ పాలుకావడం జరిగింది. కేంద్రప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ఇచ్చే ఆర్థిక వనరులు ప్రభుత్వ ఖజానాల్లోపడినా, అవి చేరవలసిన చోటికి చేరడం సందేహాస్పదంగానే వుండింది. అందుకే ఇప్పుడు నేరుగా గ్రామపంచాయతీలకే నిధులు ఇవ్వడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామజ్యోతి పథకం ద్వారా బంగారు తెలంగాణ కృషిలో భాగంగా, పంచాయతీవ్యవస్థను పునర్నిర్మాణం చేసి తీరాలని గ్రామాల సర్వతోముఖాభివృద్ధిని తలపెట్టింది. గుడి, బడి, గడి, చెరువు, వివిధ వృత్తిజీవనవాడలన్నింటినీ కూడా ఒకప్పటి గ్రామీణ వైభవ పునరుద్ధరణకు దీటుగా, అందరి భాగస్వామ్యంతో చేయాలని సంకల్పించింది! నిజమే! ఒక విధంగా నేడు నిధులకు కొరతలేదు. కానీ విధులను నిజాయితీతో, చిత్తశుద్ధితో చేసేవారుండడం ముఖ్యం.

తెలంగాణ పదిజిల్లాల్లో ఎనిమిదివేల ఆరువందల ఎనభైఏడు పంచాయతీ లున్నాయి. సుమారు పదివేల జనావాస గ్రామాలున్నాయి. ఆరువందలదాకా జనాభాలేని ఊళ్ళూ ఉన్నాయి. తెలంగాణలో అనేక గ్రామాలకు వెయ్యేళ్ళపైబడిన అస్తిత్వం వుంది. అలంపూర్, పాకాల, నకిరేకల్, ఇందూర్, దుద్దెడ, బొజ్జంకి, భైంసా, ముథోల్, బోధన్ ప్రాచీనవైభవంగల గొప్ప పల్లెలే! తెలంగాణ గ్రామ వ్యవస్థపై – నిజాం నిరంకుశ ప్రభావం వుండడం వల్లనే నాడు దొరల మీద ప్రజానీకం తిరగబడ్డారు. గ్రామీణ జీవన పరిస్థితుల ఆధారంగానే – తెలంగాణ సాయుధ

పోరాటం జరిగింది. ఉద్యమాలకు ఊపిరులు ఊదింది గ్రామీణులే! తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కూడా అన్ని జిల్లావాసుల, గ్రామప్రజల చైతన్యం పోషించినదే ప్రధానపాత్ర! అందుకే నేడు తెలంగాణ అభివృద్ధి, నవనిర్మాణం– కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితంకాకూడదనీ, తెలంగాణ గ్రామాలన్నీ సర్వతోముఖాభివృద్ధి చెందాలని 'గ్రామజ్యోతి' ఆశయంగా గుర్తించడం ముఖ్యం! ప్రజలలో వివేకాన్ని, నవచేతనను ప్రోదిచేసి సమష్టి కార్యశీలతవైపు నడిపించినప్పుడే – నిజంగా గ్రామజ్యోతి ఆరని వెలుగవుతుంది.

**(15.8.2015)**

# "కల్లు తెరవండోయ్!"

'ళ' కారం ఉచ్చరించలేక, 'ల'కారంతో అనడం కాదు. ప్రస్తుతం తెలంగాణలో పరిస్థితి ఇదే! 'ఛీప్ లిక్కర్ – అనగా 'చౌకమద్యం'ను ఊరూరా సరఫరా చేయడానికి కెసిఆర్ సర్కార్ నిర్ణయించడం, ఆందోళనకు దారితీస్తోంది! 'కల్లు' కుటీర పరిశ్రమ అయితే, 'ఛీప్‌లిక్కర్' వాణిజ్య వ్యాపారమే.

ఒకప్పుడు 'కల్లు కాంపౌండ్'లు విరాజిల్లాయి. జంట నగరాల్లో ఏ చిరునామా కనుక్కోడానికయినా, 'ల్యాండ్‌మార్క్'గా వెలిగాయి! మా చిన్నప్పుడు హైదరాబాద్‌లో గుర్రబ్బగ్గీలపై కల్లుకుండలు రావడం ఉదయాన్నే ఓ సుందరదృశ్యం! ఆ కుండలు 'నురగలు' కక్కుతూ, గొప్ప పరీమళాన్ని దారమ్మట గాలిలో నింపేవి.

తాటిముంజలతో బాటు మధ్య తరగతి జీవులు 'నీరా'కోసం ఆరాటపడడమూ వుండేది. పదిపైసలకే 'నీరా' ముంత లభించేది. సూర్యరశ్మి తగలకముందే ఈత, తాటిచెట్లు నుంచి తీసే – 'నీరా'లో ఔషధ విలువలున్నాయని కూడ అనేవారు. నగరీకరణం చెట్లను కూడ సర్వనాశనం చేసింది. ఈత, తాటి వనాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం తెలంగాణ పది జిల్లాలంతటా కలిపినా, ఈతచెట్లు, తాటిచెట్లు ఆరు కోట్లకు మించి లేవన్నది ఒక సర్వే!

కల్లుగీత వృత్తిలో జీవించే కుటుంబాల్లో గౌడులు కూడా ముఖ్యులు. గీతకార్మికుల సహకార సంస్థలు కూడా నేటికీ వున్నాయి. నేరుగా కల్లుగీత వృత్తిలోనే నేటికీ కొనసాగుతున్న కుటుంబాలు – ఆయా కుటుంబ సభ్యులందరితో కలిపి, దాదాపు పదిలక్షల మంది వరకే వుండవచ్చన్నది అంచనా! ఊర్లలో కల్లు డిపోలు, పట్టణాల్లో కల్లు కాంపౌండ్లు, చెట్లకింద మండువాతిన్నెలలో కల్లు అమ్ముతూ – ప్రభుత్వానికి వీరు చెల్లిస్తున్న ట్రీ టాక్స్ వంటి వన్నీ కలిపి, అరవై కోట్ల రూపాయల మేరకు ఉంటోంది అన్నది కాదనలేని సత్యం.

తాము అధికారంలోకి రాగానే – జంట నగరాల్లో మూసేసిన కల్లు కాంపౌండ్లను తెరిపిస్తానని కెసిఆర్ హామీ ఇచ్చి, కొన్ని తెరిపించారు కూడాను. అయితే ఇప్పుడు గ్రామగ్రామాన కూడా 'ఛీప్‌లిక్కర్' తీసుకురావాలనే ఆయన సంకల్పం

– గీతకార్మికుల పొట్టకొట్టడమే అవుతుంది. ఒక పక్క అయిదుకోట్లకు పైగా ఈత చెట్లను, తాటిచెట్లను పెంచుతామని హరితహారం కబుర్లు చెబుతూ, అందుకు గీతకార్మికులకు భూమిని కేటాయిస్తామంటూనే, మరోపక్క కల్లు అనే సంప్రదాయ వ్యాపారాన్ని, 'ఛీప్‌లిక్కర్' అనే వాణిజ్య వ్యాపారంతో – కోలుకోలేని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం, గీత కార్మికసంఘాలకు మింగుడుపడని విషయమవుతోంది! ఇప్పుడున్న సారా, కల్లు – చౌకమద్యం ముందు చతికిలబడిపోతాయి. అది ఖాయం! అయిదువందలకు పైగా గీత కార్మిక సంఘాలు ఇప్పటికే మూతపడ్డాయి. సరఫరాకు 'నీళ్లు' సంగతి కన్నా, గ్రామాలకు – 'చౌకమద్యం' సంగతే సర్కారు ఎక్కువగా పట్టించుకోవడం విస్మయదాయకం కాదా మరి!

'నా తెలంగాణ కోటిరత్నాలవీణ' అని దాశరథి గారంటే–'నా తెలంగాణ చౌకమద్యం బాన' అన్నట్లుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారనీ, 'యథా రాజా–తథాప్రజా' అన్నట్లు, తెలంగాణ గ్రామాలు తాగి ఊగేవిగా మత్తులో ముంచెత్తడమే 'బంగారు తెలంగాణ'నా? అనీ మహిళా సంఘాలు గొంతెత్తుతున్నాయి. 'జనాభాప్రాతిపదికన మద్యం అమ్మకం సిగ్గుచేటు కాదా?' అని నినదిస్తున్నాయి! "సంపూర్ణ మద్యనిషేధం అమలు సాధ్యం కాదనీ, గుజరాత్, కేరళలే దీనికి నిదర్శనమనీ" 'ఛీప్‌లిక్కర్'ను – మహిళా ఎంపి. కవితమ్మే సమర్థించడం స్త్రీలకు మింగుడు పడడంలేదు. 'ఛీప్‌లిక్కర్' వెనుక బీహార్, ఢిల్లీలకు చెందిన ముఠావుందనీ, తాగాలి... తాగి ఊగాలి అన్న అలవాట్లను ప్రజలపై రుద్దడం సరికాదనీ గళమెత్తిన మహిళా సమాఖ్య వుంది! 'చౌకమద్యం' ఆరోగ్యానికి హానికరం కాదని కెసిఆర్ అనడం శోచనీయమే! కాదనగలమా?

ప్రభుత్వం చేయలేకపోయినా – సంపూర్ణ మద్య నిషేదాన్ని ప్రజలే అమలు చేసుకుంటున్న గ్రామాలు ఎక్కడో కాదు. ఈ తెలంగాణలోనే వున్నాయి! వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో... మూడు దశబ్దాలుగా – మద్యపాన నిషేధం అమలు అవుతోంది! ఇరవై ఏళ్లుగా అక్కడ ఒక్క పోలీసు కేసు కూడా లేదు. గర్వించండి! మెదక్ జిల్లా రామచంద్రాపురం మండలంలోని ఉస్మాన్‌నగర్, ఆదిలాబాద్ జిల్లా భైంసా మండలంలోని మాటేగాం, కరీంనగర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని సత్తక్కపల్లి, హైదరాబాద్‌కు యాభై కిలోమీటర్ల దూరంలోనే రంగారెడ్డిజిల్లాలోని దేవునిఎర్రపల్లి గ్రామాలూ – మద్యనిషేధం కఠినంగా పాటిస్తూ,

ఆదర్శ గ్రామాలుగా వర్ధిల్లుతున్నాయి. బంగారు తెలంగాణ – ఇలాంటి ఆదర్శ గ్రామాల పెంపువల్ల ఏర్పడుతుందికానీ, 'ఛీప్ లిక్కర్'తో గ్రామజ్యోతి వెలగదు! కూలీల ఉపాధి హామీ పథకాల ఆర్జననంతా 'మద్యం మహమ్మారి' కబళించే – పేదల వ్యతిరేక ఆలోచన ప్రభుత్వమే చేయడం సరికాదు. చేతనైతే 'బంగారు తెలంగాణ'ను మద్యరహిత రాష్ట్రంగా చేయాలిగానీ, నూతన ఎక్సైజ్‌విధానం పేర, అబ్కారీ సర్కారీ – ప్రజల ధన, మాన, ప్రాణాలతో ఆడుకోవడం అభ్యుదయం కా(జాల)దు!

చౌక మద్యం నిల్వగుంటలుగా – గ్రామాలను కల్వకుంట్లవారు చేయరాదన్నది అధికశాతం ప్రజాభీష్టం! ఇప్పుడు 'కళ్ళుతెరవండోయ్' అనే అందాం, పాలకులనే కాదు, ప్రజలను కూడా.

**(22.8.2015)**

# ‘గిల్లీదండా-గల్లీ దందా’

గిల్లీ దండా–గల్లీ దందా : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అంటే ఇదే అన్న ధోరణి! నిజానికి క్రీడా ప్రపంచం ‘క్రీనీడ’ల పాలవుతోందనే ఆవేదన కనబడుతోంది! ‘క్రీడాస్ఫూర్తి’ కొరవడిన చోట, రాజకీయాలతో ‘గేమ్స్’ ఆడుకునే అవలక్షణాలూ పొటమరిస్తాయి.

వాలెంటైన్‌డేలు, హగ్గింగ్‌డేలు గుర్తుంటాయి గానీ, ‘క్రీడాదినోత్సవం’ ఎందరికి గుర్తుంటుంది? నిజానికి జాతికి గర్వకారణంగా, ఆగస్టు 29 జాతీయ క్రీడాదినోత్సవం వర్ధిల్లాలి! కానీ మీడియాగానీ, ప్రభుత్వాలుగానీ ఈ రోజు గురించి శ్రద్ధపెడుతున్న దాఖలాలు తక్కువే!

మన జాతీయ క్రీడ ఏమిటంటే – చాలామంది ‘క్రికెట్’ అనే అనుకుంటున్నారు. ఎందుకంటే ‘స్పోర్ట్స్’ అంటే అది తప్ప మరేమీ గుర్తుకురాని స్థితిలోకి, మన యువత నెట్టబడుతూనే ఉంది. నిజానికి ‘హాకీ’ మన దేశ జాతీయ క్రీడ. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మించిన రోజే ఆగస్టు 29. ఆ మహనీయుడి పుట్టినరోజునే – జాతీయ క్రీడాదినోత్సవంగా ప్రకటించుకున్నాం! అయితే ఇదో ‘తంతు’గా సాగుతోంది కానీ, నిజానికి ఒక నిర్దిష్టమైన ‘క్రీడావిధానం’ కనబడడం లేదు.

ఏటా ఆగస్టు 29ని జాతీయ క్రీడాదినోత్సవంగా, ఆ రోజు దేశానికి ప్రపంచస్థాయిలో కీర్తిప్రతిష్టలు తెచ్చి పెట్టిన క్రీడాకారులకూ, కోచ్‌లకూ – ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య లాంటి అవార్డులను, పురస్కారాలను ప్రదానం చేయడం జరుగుతోంది. జాతీయ క్రీడా దినోత్సవానికి ప్రాముఖ్యం సంతరించి పెట్టవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వుంది.

ముఖ్యంగా క్రీడలపట్ల ఒక సమగ్ర అభివృద్ధికరవిధానం ఉండాలి. క్రీడారంగానికి సోకుతున్న క్రీనీడలకు తాజా తార్కాణం – సానియాకు ప్రతిష్టాత్మక ఖేల్‌రత్న అవార్డు ఇవ్వడంపై, కర్ణాటక హైకోర్టు ‘స్టే’ విధించడం! ‘సానియా’ గొప్ప క్రీడాకారిణే! కాదనం! తెలంగాణలో ఆవిడ ‘అంబాసిడర్ హోదాలో, కెసిఆర్ నుండి లక్షల పురస్కారాన్ని కూడా అందుకుంది. తనకు ‘ఖేల్‌రత్న’ ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది ఈ ప్రభుత్వమే!

ప్రతిభ ఆధారిత పాయింట్ల విధానంతో – సాధారణంగా అవార్డుల ప్రదానానికి క్రీడాకారులను ఎన్నుకోవడం జరుగుతూంటుంది. ప్రభుత్వమే ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్, ఆసియాడ్, కామన్వెల్త్ క్రీడలపోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా పాయింట్లు ఇవ్వాలి. 'సానియా'కు అవార్డు ప్రకటించడాన్ని సవాలు చేస్తూ, పారా ఒలింపిక్స్ రజతపతక విజేత హెచ్.ఎన్.గిరీశ్ కర్ణాటక హైకోర్టు కెక్కాడు! ప్రస్తుతం అమలులో వున్న పాయింట్ల విధానంలో తమనకు 90 పాయింట్లు వున్నాయనీ, 'సానియా' ఆ పాయింట్లకు దరిదాపుల్లో కూడా లేదనీ, పైగా పాయింట్లు ఇవ్వడానికి గుర్తించే పోటీల్లో అసలు వింబుల్డన్ పేర్కొనబడేలేదనీ, గిరీశ్ వాదించాడు. కర్ణాటక హైకోర్టు దీనిపై క్రీడామంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసింది. పదిహేనురోజుల్లో వివరణ ఇవ్వాలనీ, టెన్నిస్ క్రీడాకారిణి సానియామీర్జాకు 'ఖేల్‌రత్న' అవార్డు ఇవ్వడంపై స్టే విధించింది. పరిణామం ఎలా వుంటుందో చూడాల్సి వుంది. ఏమయినా ఇప్పటికీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్రీడావిధానం ఏమిటో – 'స్పష్టత' లేదు. నిజానికి తెలంగాణా గ్రామీణ క్రీడలు ఎన్నోమరుగున పడుతున్నాయి. 'క్రికెట్' తప్ప మరే ఆటపట్ల శ్రద్ధపెట్టని స్థితి వుంటోంది. 'టెన్నిస్' వంటివాటికి సానియా వల్ల 'గ్లామర్' వచ్చింది కనుక ఆలోచిస్తున్నారుగానీ – హాకీ, కబడ్డీ వంటి వాటికే దిక్కులేకుండా పోతోంది. ముఖ్యంగా జాతీయ క్రీడ అయిన 'హాకీ' పరిస్థితి మరీ శోచనీయంగా వుంది.

కీ.శే. ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాకారునిగా మూడు ఒలింపిక్స్‌లలో మన దేశానికి బంగారు పతకాలు సాధించిపెట్టిన మేటి ఆటగాడు. 1928 ఆమ్‌స్టర్ డామ్, 1932 లాస్ ఏంజిల్స్, 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో 'ధ్యాన్‌చంద్' ఆటతీరుకి, నాటి నాజీ నియంత హిట్లరే మంత్రముగ్ధుడయ్యాడు. 'జర్మన్' సైన్యంలో చేరితే మేజర్ హోదానిస్తానని ప్రలోభపెట్టాడు. కూడాను! కానీ ధ్యాన్‌చంద్ దేశభక్తిగల పౌరునిగా, భారతసైన్యంలో సిపాయి గానే తన కెక్కువ గౌరవం అంటూ హిట్లర్‌నే కాదన్నాడు. అలాంటి 'హాకీ'ల పరిస్థితి ఇవాళ దైన్యంగానే వుంది. బెట్టింగ్‌లు, మ్యాచ్‌ఫిక్సింగ్‌లు అంటూ జరుగుతున్న – క్రికెట్ పట్ల వున్న వ్యామోహం నుంచి బయటపడి, దేశం మన క్రీడారంగాన్ని పటిష్ఠం చేసుకోవాల్సివుంది..

బడిస్థాయినుంచి పిల్లల్లో క్రీడాసక్తిని, సామర్థ్యాన్ని పెంచాల్సి వుంది. ఆటస్థలాలే కరువవుతున్న పరిస్థితుల్లో,ఉన్న క్రీడామైదానాలు కూడా – వాణిజ్య భవంతులుగా

మార్చే దుర్మార్గపు ఆలోచనలు విడనాడాలి! ఆరోగ్య దాయకమైన, శక్తివంతమైన సమాజమూ, యువతరం రూపొందడానికి ప్రభుత్వాలు ఇప్పటికయినా – క్రీడారంగం పట్ల శ్రద్ధ పెట్టాలి.

ఒలింపిక్స్‌లో క్రికెట్ లేనేలేదు. క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చే ఒలింపిక్ క్రీడా విభాగాలన్నింటా మన దేశ క్రీడాకారులు పోటీపడి విజయం సాధించే సామర్థ్యం అలవడాలి. అప్పుడే నిజమైన జాతీయ క్రీడా దినోత్సవ మహోత్సవం. గిల్లీ దండా –గల్లీ దందా మాత్రమే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కావు.

**(29.8.2015)**

# సారొస్తారొస్తారు....!

గురువులకు విలువ తగ్గిపోతున్న ఏ వ్యవస్థలోనయినా, ఉపాధ్యాయ దినోత్సవాలు మొక్కుబడి తద్దినాలుగా వుంటాయి తప్ప, గురుశిష్య సంబంధ స్ఫూర్తిని ప్రదీప్తం చేయవు. తల్లిపాలు వదలి పోతపాలమీద ఆధారపడినట్లు విద్యావ్యవస్థ మాతృభాషను, అది బోధించే పంతుళ్ళను విస్మరించి, కానివారికి కంచాల్లో వడ్డించినట్లు అన్యభాషను తలకెత్తుకుని, అదే సర్వస్వం అన్నట్లు ఊడిగం చేయడం ఆంగ్లేయుల పరిపాలన అంతరించినా బానిస బుద్ధులు పోనట్లే! స్వచ్ఛంద దాస్యానికి ఒడిగట్టడం ఆత్మహత్యా సదృశమే!

నిజమే! నేడు విద్య లక్ష్యం ఉద్యోగం సంపాదించడంగా వుంది. విజ్ఞానసముపార్జన అనేది ఆనుషంగికంగా మారింది. ఉద్యోగాలు ఇప్పించలేని చదువులు వ్యర్థమనే భావన ప్రబలింది. కానీ దేశంలో, రాష్ట్రంలో తలుచుకుంటే ఉద్యోగాలు చేసుకోవడానికి అనువుగా మాతృభాషను ప్రభుత్వాలు తీర్చిదిద్దకపోలేవు. ఆంగ్లాది అన్యభాషలు నేర్వవద్దనీ, అందులో నిష్ణాతులు కావద్దనీ ఎవరూ అనరు. కానీ ఆంగ్లమే సర్వస్వంగా, విధాయకంగా, మాతృభాషను తృణీకరిస్తూ అందలాలు ఎక్కించడం ఎక్కడి విజ్ఞత? కుప్పంలో ఆంగ్లవిద్యాబోధనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండుకోట్లు కేటాయించిందన్నా, తెలంగాణ ప్రభుత్వబడులలో ఒకటోతరగతి నుంచే ఆంగ్లంలో బోధిస్తామంటున్నా–మన విద్యావిధానం ఎటుపోతోందన్న విచికిత్స పొడచూపక మానదు. ప్రపంచంలో ఎక్కడ నెగ్గుకురావాలన్నా ఇంగ్లీషురావాలి, కావాలి. నిజమే! కానీ అందుకోసం తెలుగును, ఉన్నవూరిలో కన్నభాషను చంపేసుకోనక్కర్లేదు.

ఏటా ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా ఉత్తమ అధ్యాపకులను ఎంపికచేసి గౌరవించుకోవడం అనూచానంగా వస్తోంది. అది భారత మలి రాష్ట్రపతి తెలుగువాడయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం కావడం దేశానికే గర్వకారణం. విద్య ఏదయినా ఉద్యోగం కోసమే అనుకోవడం సరికాదు. విద్యవల్ల వివేకం, సంస్కారం ఏర్పడతాయన్నది మరిచి పోకూడదు. మనదైన సంస్కృతీ, సంప్రదాయాల వికసనానికి,

తాత్త్వికతా ప్రకాశనానికి దోహదపడేది మనదైన మాతృభాషయే తప్ప అన్యం కాదు. గురువులను ముఖ్యంగా భాషా ఉపాధ్యాయులను గౌరవించుకోలేని జాతికి, సినిమాల్లో వారిని హాస్య పాత్రలుగా ఎగతాళిచేసి నవ్వుకునే దిగజారుడు స్థాయి జాతికి, జీవనవికాసం కల్ల. పొందే అభివృద్ధి ఒక డొల్ల. నవీన విద్యాభ్యాసాలు వేళ్ళకు బంగారు ఉంగరాలు సమకూరుస్తున్నాయిగానీ మణికట్టు వద్ద నరాలనే బలహీనం చేసేస్తున్నాయి. అన్నమాట పునరుక్తి అయినా యథార్థోక్తియే!

యథారాజా తథాప్రజా అన్నట్లు ప్రజాస్వామ్యంలో నేతల చేతలే ప్రజలు అనుసరించడం జరుగుతుంటుంది. అవినీతి ఊడలు తన్నుకోవడం ఏలికల నుంచే మాలికలల్లుకుంటోంది. నేత కూడా ఒక ఆదర్శ ఉపాధ్యాయుడిలా ప్రజలకు కనబడాలి. విద్యావినయ వివేక సంపన్నుడిగా పరిపాలకుడు కనబడాలిగానీ–రౌడీగానో, గూండాగానో కాదు. తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి కెసిఆర్ ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం బడిలో తనకు పాఠాలు చెప్పిన గురువు డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారికి మొట్ట మొదటి తెలంగాణ ప్రభుత్వం ఏర్పరచిన దాశరథి పురస్కారాన్ని అందచేస్తూ ఆ సభలో ప్రసంగించిన తీరు, తన గురువుకు మనస్ఫూర్తిగా పాదాభివందనం చేసిన తీరు చూసినప్పుడు ఆ సంస్కారానికీ, ఆయన హృదయ జాత చర్యకు సభా సదులే కాదు, మరునాడు వార్తల్లో విన్న, చూసిన అందరూ కూడా ఆశ్చర్యానందాలు పొందారు. ఒక ముఖ్యమంత్రి బడిలో చిన్నప్పుడు పాఠాలు చెప్పిన ఆ ఉపాధ్యాయునిపట్ల ప్రదర్శించిన ఆ మాట, చేత శిష్యుల ఉన్నతికేకాదు గురుశిష్య సంబంధానికే ప్రశంసార్హ దృశ్యం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతిగా దీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణానంతరం తన షష్టిపూర్తివేళ ఇటీవల అభ్యుదయకవి, అరసం అధినేత అయిన ఆచార్య ఎస్వీ సత్యనారాయణ కొన్ని గ్రంథాలు ఆవిష్కరింప చేసుకున్న వేడుకలో ఆయన వద్ద పాఠాలు చదువుకున్న విద్యార్థుల ప్రతిస్పందనలను గ్రంథంగా వెలువరించడం ఒక అభినందనీయచర్య. అదేరీతిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా చేసి రిటైరయినా తనకు ఉపాధ్యాయవృత్తే, పాఠాలు చెప్పడమే పరమ సంతోషదాయకమైన సంగతి అంటూ కాకతీయ విశ్వవిద్యాలయంకు చెందిన ప్రముఖ పద్యకవి శ్రీ అనుమాండ్ల భూమయ్య గారు తన శిష్యులు తనపై ఆత్మీయంగానూ, తామిచ్చిన స్ఫూర్తికి ప్రతిస్పందనంగానూ

వెలువరించిన వ్యాసాల సంపుటిని ఆవిష్కరింపవేసుకోవడమూ అభినందనీయ విషయం.

నిజమే! ఒక గురువుకు శిష్యుల ప్రతి స్పందనాన్ని మించిన సత్కారం ఏముంది? 'శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్' అని తన శిష్యులు తమకన్న ఉన్నతస్థానాలు, ఎక్కువ కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించడం గురువులకు గర్వకారణం కూడాను. అయితే ఆ స్థాయికి చేరిన శిష్యులు తమ గురువుపట్ల ప్రకటించే గౌరవాదరణలు ఎలాంటివనేదే గురుశిష్య సంబంధ ఉత్థానపతనాలను వ్యక్తీకరించే చర్య అవుతుంది.

బోధగురువులు, బాధగురువులూ సమాజంలో ఇద్దరూ వున్నారు. శిష్యురాండ్ర పట్ల దుశ్చేష్ఠలతో ఉపాధ్యాయవృత్తికి కళంకం తెస్తున్న వారి వార్తలూ వింటున్నాం. నీతిపాఠాలు విస్తరించాలి కానీ బూతుపాటలు కాదు 'సారొస్తారొస్తారు..' అనడంలో గౌరవాదరణాలు చిప్పిల్లే నైజాలుంటున్నాయా? ఏమయినా విద్యావ్యవస్థ బాగుపడాలన్నా, గురుశిష్య సంబంధాలు మానవీయంగా బలపడాలన్నా, జాతి సంస్కారం అభివృద్ధి చెందాలన్నా ప్రాథమికస్థాయి నుంచీ పునఃప్రక్షాళన జరగాలి. గురువందనం పాదా క్రాంతంగా చేయగల సంస్కారం గల ముఖ్యమంత్రి ఏలుబడిలో తనదైన పాఠాలతో తెలంగాణ నవజీవన గానం చేయాలని ఆశిద్దాం.

**(5.9.2015)**

# ఇదేనా సిలబస్!

విద్యాప్రమాణాలను గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంతమంచిది అన్నట్లుంటోంది. మొన్న మధ్యాహ్నం 'స్టార్ మహిళ' ఛానల్ ప్రోగ్రాంలో పాల్గొన్న స్త్రీలు ఒకరిద్దరు చెప్పిన సమాధానాలు పాతిక ముప్పై ఏళ్లవారి అవగాహనా స్థాయి కూడా భాషా సాంస్కృతికంగా ఎంతగానో శోచనీయంగా వున్నాయని తెలియచేశాయి. పురుషులపేర్లకు ముందు గౌరవ వాచకంగా వుండే అక్షరం ఏమిటో తెలియదు. మహాప్రస్థానం రాసిందెవరు అన్నదానికి ఛాయిస్ అడిగికూడా సి. నారాయణరెడ్డి, శ్రీశ్రీ అని పేర్లు చెబితే సినారె అని సమాధానం వచ్చింది.

కాళోజీ జయంతిని సెప్టెంబర్ 9న భాషా దినోత్సవంగా ప్రకటించుకుని వేడుకలు చేసుకోవడం బాగానే ఉందిగానీ, భాషను సంరక్షించుకునే, అభివృద్ధి పరచుకునే దిశగా ఉన్న ప్రణాళికలు ఏమిటి అన్నది స్పష్టం కాలేదు. సిలబస్ మార్చేసుకుంటూ తెలంగాణ అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలన్న భావన మంచిదే! ఎవరూ కాదనరు. కానీ ఆ సిలబస్ చదువుకోవడం ద్వారా విద్యార్థుల స్థాయి పెరిగేలా వుండాలి. వానమామలై వరదాచార్యులు, దాశరథి, కాళోజీ, సినారెల పాఠాలు పెట్టడానికీ, నిన్న మొన్నటిగా రచన చేస్తున్న వారి పాఠాలు పెట్టడానికీ తేడాఉంది. అంతేకాదు–ముఖ్యంగా పోటీపరీక్షల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ముందుకు తెచ్చిన సిలబస్ ఉద్యోగార్థులైన అభ్యర్థులను ఉన్న పళాన సమగ్ర తెలంగాణ అవగాహనపరులై వుండి తీరాలన్న తీరుగా తోస్తోంది.

మూడుగంటల్లో / బహిర్గతం కావాలని / శాసింపబడిన విజ్ఞానం / విద్యార్థి పరీక్ష... అన్నట్లుగా తరతరాల తెలంగాణపై భౌగోళిక, రాజకీయ, సామాజిక, సాహిత్యక అంశాలన్నీ ఇప్పటికిప్పుడు అపోసన పట్టాలన్నట్లు నిర్బంధిస్తున్నట్లుండడం విజ్ఞత అనిపించుకోదు. పోటీ పరీక్షల మొత్తంపై నలభై శాతం మార్కులు తెలంగాణా అంశాలకే కేటాయించడానికి నెల రోజులుపైగా సిలబస్ కూర్చిన మేధావులు– గొప్ప మేధోమథనం చేసినట్లున్నమాట నిజమేగాని– అందరూ కలిసి అభ్యర్థులపై మోపిన భారం సంగతి ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. పోటీపరీక్షల సిలబస్

రూపొందించడంలో అభ్యర్థుల విద్యాస్థాయి ప్రమాణాలను ఈ మేధావులు ఏ మేరకు పట్టించుకున్నారన్నది సందేహంగా వుంది. తమ అభిరుచులను, అభీష్టాలను, తమతమ పరిజ్ఞానాలను సిలబస్ రూపకర్తలు అభ్యర్థులపై మోపుతున్నట్లు ఉండడమే గాక ఇంతవరకు విద్యార్థులు పాఠశాల నుంచి కళాశాలవరకు చదివిన అంశాలను ఒక్కసారిగా పక్కనబెట్టి రాత్రికి రాత్రి తెలంగాణ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నట్లుగా ఇంత తక్కువ వ్యవధినిస్తూ శాసించడం ఔచిత్యం కాజాలదు.

ఇప్పుడిప్పుడే పాఠశాల స్థాయినుంచి పాఠ్య ప్రణాళికలో తెలంగాణ అంశాలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. కొత్త సిలబస్‌ను ఆత్మ గౌరవంతో చదువుకోవడం మొదలయింది. పోటీ పరీక్షల సిలబస్‌లో అప్పుడే తెలంగాణ అంశాల సమగ్ర అధ్యయనం కావాలనడం, అందులోనూ హార్డ్‌కోర్ విషయాలను చేర్చడం కాకుండా, పరిశోధనచేసి తీరాల్సిన అంశాలతో కాకుండా జనబాహుళ్యంలో ప్రసిద్ధమైవున్న రాజకీయ, ఉద్యమగత, సాహిత్య సాంస్కృతికాంశాలను మాత్రమే ప్రశ్నలుగా ప్రస్తుతానికి జతపరుస్తూ, టీపీఎస్సీ– తెలంగాణ పరిశోధనాత్మక అంశాలను సగానికి కుదించాలని అభ్యర్థులు కోరుకోవడంలో తప్పులేదు.

తెలంగాణ ప్రాంత ఉనికి, ప్రారంభం, ఎల్లలు, వాతావరణ రీతులు, చరిత్ర, నాటినుంచి నేటివరకు సాగిన పాలనావైఖరి, ఉద్యమాలు, వ్యావసాయిక అంశాలు అభ్యర్థులు ఇప్పటికిప్పుడే ఓ ఆరేడు నెలల్లోనే అధ్యయనం చేసి, ఆయా విషయాలపట్ల నిష్ణాతులు కావలసిందే ఆనడం అన్నప్రాశననాడే అవకాయ తొక్కు తినమన్నట్లే వుంటుంది.

పాల్కురికి సోమనాథుడు. పోతన, కాళోజీ–తెలంగాణ కవిత్రయం అని మొన్న ఒక సభలో కె.వి. రమణాచారి గారు పేర్కొన్నారు. తెలంగాణ ప్రాచీన కవుల నుండి దాశరథి, సినారె వంటి అధునాతన కవులు ఎందరో భాష అభివృద్ధికి, వికాసానికి తోడ్పడినవారే. బడిపలుకుల భాష కాక, పలుకు బడుల భాషను ఉపయుక్తం చేసిన ప్రసిద్ధ నవలా, కథారచయితలు ఎందరో ఉన్నారు. వారికి సంబంధించిన అంశాలను తెలుగుసిలబస్‌లో చేర్చడం బాగుంటుందికానీ, బొడ్డూడని నిన్నమొన్నటి కుర్రకవుల రచనలు, సంకలనాలగురించి సిలబస్‌లో చేర్చడం, రెండోరకం స్థాయి భాషా వైదుష్యంగలవారి రచనలను తవ్వి తలకెత్తడం, భాషాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో ఆలోచించాలి. సిలబస్ నిర్ణాయకులు, వైయుక్తిక ఇష్టాలకు–

ఆస్మదీయులకు మేలు కూర్చాలనీ, పేరుతేవాలనీ తాపత్రయ పడడం కాకుండా, ఆ సిలబస్ తెలంగాణా భాషాభివృద్ధికి, వికాసానికీ, అభ్యర్థుల విద్యాప్రమాణాల రాణింపుకూ దోహదపడేలా వుండడం చూసుకోవాలి. గురువుల సిలబస్‌కాక, లఘువుల సిలబస్‌రుద్దితే ప్రమాణాలు పడిపోవడం ఖాయం! విద్య- విజ్ఞాన,వికాసాలను కలిగించాలి. మనిషి సంస్కారాన్ని పెంచాలి. జీవన ప్రమాణాలను, మానవీయ విలువలను ప్రోది చేయాలి. అలాంటి సిలబస్‌ను అందిపుచ్చుకుని అధ్యయనం చేసి విద్యా, ఉద్యోగార్థులు పురోగమించినప్పుడే అక్షరమైన బంగారు తెలంగాణ సాధ్యం.

**(12.9.2015)**

# తప్పుడు సంకేతాలు

ఏ ముహూర్తాన పొట్టిశ్రీరాములు 'ఆత్మహననం' అమరంగా కీర్తింపబడిందో గానీ, అప్పటి నుంచే తప్పుడు సంకేతాలు ప్రసారితమయ్యాయనిపిస్తుంది! భారత స్వాతంత్ర్యం కోసం – భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వంటి వారు ప్రాణత్యాగం చేసారు. కానీ అవి ఆత్మహత్యలు కాదు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించి, వీరులుగా 'ఉరికంబం' మీద దేశంకోసం ప్రాణాలు విడిచారు వారు.

నిజానికి పొట్టిశ్రీరాములు ఆరోగ్యం గొప్పదేమీ కాదు. భార్య కాన్పులో బిడ్డను కని మరణించింది. ఆ బిడ్డా కొద్దిరోజులు బ్రతికి కన్నుమూసింది. ఆ తరువాత కొంతకాలానికి ఆయన తల్లి మరణించింది. ఆ ఎదురుదెబ్బలతో ఆయనకు జీవితం మీద ఆసక్తి పోయింది. గాంధీ అనుయాయిగా సత్యాగ్రహం, సహాయ నిరాకరణాదుల్లో పాల్గొన్న ఆయన, తెలుగు వారికి ఒక రాష్ట్రం కోరి ఆమరణ నిరాహార దీక్షకు ఉపక్రమించాడు. దాంతో ఆయన ఆరోగ్యం మరీ దిగజారింది. "ఈ రకమైన చర్య– రాజకీయ నిర్ణయాలపై ఒత్తిడి తేవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే చేటు" అని ప్రధాని పండిత జవహర్‌లాల్ పొట్టిశ్రీరాములు దీక్ష యాభై రెండవరోజుకు చేరినా స్థిరంగా ప్రకటించాడు, కానీ యాభై ఆరవరోజు అసలే అనారోగ్యంతో వుండిన పొట్టిశ్రీరాములు ఆరోగ్యం పూర్తిగా వికటించి, మరణించాడు. "మద్రాసు తెలుగువారికే చెందాలి" అనేది కూడా పొట్టిశ్రీరాములు దీక్షలోని ప్రధాన అంశమే! పొట్టిశ్రీరాములు మరణంతో మద్రాసు అట్టుడికినా, నాటి భారత పార్లమెంటు ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించటానికి కూడా నిరాకరించింది. కానీ ప్రతిపక్ష ఆందోళనలూ, హింసాత్మక ఘటనలూ జరిగాయి. ఆంధ్ర రాష్ట్రం భాషాప్రాతిపదికన నెహ్రూకు పూర్తి సమ్మతి లేకపోయినా, మొత్తానికి ఏర్పడింది. అయితే మద్రాసు మటుకు దక్కలేదు. ఆంధ్ర రాష్ట్రం 1953లో ఏర్పడింది. కర్నూలు రాజధానిగా అది అలాగే కొనసాగివుంటే పరిస్థితులు వేరేలా వుండేవి. నిజాం వ్యతిరేక పోరాటంతో, తెలంగాణలో తెలుగుభాష వ్యాప్తికీ, తెలుగువారి జీవన అస్తిత్వానికి కూడా ఘర్షణ పడవలసివచ్చింది. ఆంధ్రరాష్ట్రంతో కలిసి విశాలాంధ్రగా ఏర్పడాలన్న ఆకాంక్ష ఇరు వైపులా బలీయంగా

రావడంవల్లనే, కొందరు వ్యతిరేకించినా–నెహ్రూయే 'బలవంతపు పెళ్లి' అని పోల్చినా, దాశరథి వంటి వారి ఆకాంక్షలకు అనుగుణంగానే 'మహాంధ్రోదయం' జరిగింది! సెప్టెంబర్ 17న జరిగిన విమోచన హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి మాత్రమేకాదు, తెలుగు వారంతా ఒక్కటి కావడానికీ ప్రాతిపదికలు వేసింది. అలా 1956లో హైదరాబాద్ రాజధానిగా తెలుగువారికి ఒక రాష్ట్రం "ఆంధ్రప్రదేశ్" ఏర్పడింది. తమిళనాడు లాగా ఏ 'తెలుగునాడు' వంటి పేరుతోనే రాష్ట్రం కొనసాగివుంటే ఎలా వుండేదో తెలీదుగానీ, 'ఆంధ్ర' అనే మాట తెలుగుభాషకు పర్యాయంగా గాక – 'ఆధిపత్య ధోరణులకు', 'పెత్తనానికి' ఊతమిస్తూ పెరగడం వల్లనూ, ఒక న్యూనతా భావం తెలంగాణ అన్న ప్రాంతానికీ, భాషకూ సంక్రమింపచేసే పరిణామాలవల్లనూ, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మొగ్గతొడిగి, అరవైఏళ్ళపాటు అరవిరుస్తూనే వచ్చింది. త్రుంచాలనుకున్నా పెంచుతూనే సాగింది.

ప్రత్యేక తెలంగాణకోసం కె.సి.ఆర్. నిరాహారదీక్ష చేసినప్పుడు ఆయననూ పొట్టిశ్రీరాములుతో పోల్చబోయిన వారుండిరి. కానీ కేవలం నిరాహారదీక్ష వల్ల పనికాదనీ, 'తెలంగాణ' ప్రజా ఉద్యమంగా పరిఢవిల్లాలనీ, ఎప్పుడయితే రాజకీయపు ఎత్తుగడలతో, రాజీనామాల పదవి త్యాగాలతో, కెసిఆర్ ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షను ప్రజాభీష్టంగా ముందుకు తెచ్చి ఉద్యమస్ఫూర్తి చూపారో, ఆ ఆవేశంలో – ఒక నాయకుడుకాదు వందలాది మంది.. ముఖ్యంగా యువకులూ, విద్యార్థులూ ప్రాణత్యాగానికి సిద్ధపడి, కేంద్రాన్ని ఎదిరించడానికే కాక బెదిరించడానికీ, మరోవంక ఆశయం సిద్ధించదేమోనన్న నిరాశ నిస్పృహలతోనూ, కొంత ఆవేశంతోనూ, ఆత్మహత్యలు చేసుకున్నారు. పెట్రోలు పోసుకు 'ఆత్మ హననం' చేసుకున్నారు. నిజానికి అది గొప్ప విషాదం! బంగారు తెలంగాణను కనులారా చూసి, ఆ వ్యవస్థలో తమ జీవితాలను సుఖసంతోషమయం చేసుకోవలసినవారు, అలా బలవన్మరణాల పాలుకావడం గొప్ప ప్రమాదం! అయితే – అది వీరోచిత కార్యంగా, ఆ అమరుల బలిదానాలే రాష్ట్రసిద్ధి హేతువులుగా గణనకెక్కాయి. 1969లో తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఎందరో అలా అసువులు బాసారు. ఆత్మత్యాగాల వలన రాష్ట్రం సిద్ధించేటట్లయితే ఆ నాడే రావాలి కదా! అందువల్ల పొట్టిశ్రీరాములు అయినా, తెలంగాణలోని యువకులయినా, ఇప్పుడు ఆంధ్రలో ప్రత్యేక హోదా కోసమయినా, ఎవరు ఆత్మహననం చేసుకున్నా దానిని వీరత్వంగా భావించడం తప్పుడు సంకేతాలు

ఇచ్చినట్లు అవుతుంది! ఇవాళ దేశంలోని రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం పెరుగుతోంది! ప్రభుత్వం ఆ కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం, మరేవిధంగానో సహాయంచేయడం, కొన్ని పార్టీలు సానుభూతి యాత్రలంటూ ఆ ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాల పట్ల శ్రద్ధ కనబరచడం – ఇదంతా 'ఆత్మాహుతి' చుట్టూ ఒక విశేష ప్రాచుర్యాన్నీ, మీడియా వెలుగులనూ పెంచుతోంది!

నిజానికి ఆత్మహత్యలకు గల కారణాలను అన్వేషించి, ఆ సమస్యలను సమూలంగా పరిష్కరించే చర్యలు సాగవలసిందిపోయి, రాజకీయ ప్రయోజనాల కేళిలో ఇలాంటి ఘటనలు ఉపయుక్త అంశాలన్నట్లు, గ్లామరైజ్ కావడం మహాదారుణం! 'ఆత్మహత్య మహాపాతకం', 'ఆత్మహత్యలు పిరికి చర్యలు' అనేది భారతీయ భావన. చచ్చిసాధించేదేమీ లేదు. చావు పరిష్కారం కాదు.

సమస్యలకు ఎదురొడ్డి నిలిచి, పోరాడి గెలవాలి, జీవితం జీవించడానికే, పిరికితనంతోనో, త్యాగంపేరుతోనో పణం పెట్టడానికి కానేకాదు. శోకగృహాలుకాదు, నిండు బతుకమ్మ పండువెన్నెలల ఇండ్లు కావాలి. తప్పుడు సంకేతాలను అరికట్టి, 'గ్రామజ్యోతి' జీవన జ్యోతిని అఖండంగా ప్రకాశింపచేయాలి.

**(19.9.2015)**

# అసలు చరిత్ర

"చరిత్ర చింపేస్తే చిరిగిపోదు. చెరిపేస్తే చెరిగి పోదు" అని మునుపటి ఓ సినిమాలో డైలాగు. నిజమే! కానీ చరిత్రను వక్రీకరించే వారూ, అసలు ఘటనలను, చరిత్రకెక్కకుండా చూసే వారూ వుంటూంటే 'ఇతి హాసపు చీకటికోణం – అట్టడుగున పడి కాన్పించని – కథలన్నీ కావాలిప్పుడు – దాచేస్తే దాగని సత్యం!' అన్న శ్రీశ్రీ గర్జన ఆవశ్యకత బలీయంగా ఉంటుంది! బలీయమైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు కూడా – సాహిత్యంలో కానీ, సామాజికంగా కానీ, తమ చరిత్రను తొక్కిపెట్టారనీ, చరిత్రలో తమ ప్రాంతానికీ, వ్యక్తులకూ, సంస్కృతికీ, తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనీ – తెలంగాణ పౌరులు పొందిన ఒక ఆర్తి కూడా బలీయమైన కారణమై ప్రజ్వరిల్లింది! తెలంగాణ రాష్ట్రం వచ్చాకనే బతుకమ్మ పండుగకు ప్రాధాన్యం వచ్చింది! ఆంధ్ర సారస్వత పరిషత్తు–తెలంగాణ సారస్వత పరిషత్తుగా పరిణమించింది. విద్యారంగంలో పాఠ్యగ్రంథాలలో తెలంగాణ అంశాలకు ప్రాధాన్యత కల్పించబడినది. పోటీ పరీక్షలలో తెలంగాణ సమగ్ర అధ్యయనం అభ్యర్థులకు అనివార్యమయ్యింది. ఒక ఆహ్వానించదగిన పరిణామమొచ్చింది.

'చరిత్ర అడక్కు – చెప్పింది విను' అనే పెత్తనపు వైఖరి ఇక చెల్లదు. అసలు చరిత్ర – చరిత్రకారులు గురించి తెలుగు విషయంలోనే కాదు, భారతదేశం మొత్తాన అసంతృప్తులు వున్నాయి. అసలు కన్నా కల్పితాలూ, ఊహాగానాలూ చారిత్రక అంశాలుగా అయికూర్చున్న సందర్భాలూ వున్నాయి! స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కూడా కొందిరికే ప్రాధాన్యం లభించి, నిజమైన సమరయోధులు మరుగునపడ్డారన్న మాటా వుంది. అంతెందుకు! స్వాతంత్ర్య సమరయోధులుగా పింఛనులు, తామ్రపత్రాది గౌరవాదులు అందుకున్న వారిలోనూ కుహనాయోధులు చాలామంది వున్నారనీ, నిజమైన సమరయోధులు, త్యాగధనులు ప్రభుత్వం ఇచ్చే పింఛనులూ, భూములూ, తామ్రపత్రాలూ త్రోసిరాజని తమ అంత్యదశను దుర్భర జీవనంలో చాలించారనీ చరిత్ర కందని కథలున్నాయి. అవి కటిక వాస్తవాలు.

అంతవరకు ఎందుకు?–'ఆజాద్ హింద్ ఫౌజ్' స్థాపించి భారత స్వాతంత్ర్య సంగ్రామానికి – బ్రిటీష్‌వారిని వణికించే మలుపు నిచ్చిన, నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'మరణం' దేశస్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా, ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది! అసలు చరిత్ర తెలియనే లేదు. ప్రభుత్వమే నేతాజీకి సంబంధించిన అనేక ఫైళ్ళను గుప్తంగా ఉంచేసింది. కారణమేమిటో ఎవరికీ తెలియదు. విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారనే – ఉన్న చరిత్ర నమ్మబలికింది! కానీ అప్పట్లోనే స్వయంగా మహాత్మాగాంధీయే 'నేతాజీ మరణించారంటే నమ్మశక్యంగా లేదు' అని 1945లో ఓ సభలో ప్రకటించాడు. 1946 ఏప్రిల్ 8న ఇంటెలిజెన్స్ వర్గాలు రూపొందించిన నివేదికలో ఇలా వుంది 'నేతాజీ పై గాంధీజీ చేసిన ప్రకటన కేవలం ఆయన స్వీయ భావన కాదు. ఆయన వద్ద కీలక సమాచారమున్నట్లు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. తాను రష్యాలో ఉన్నట్లు నేతాజీ నుంచి నెహ్రూకు ఒక లేఖ అందిందనీ, అక్కడినుంచి తప్పించుకుని భారత్‌కు రావాలని అనుకుంటున్నాని బోస్ పేర్కొన్న దాని ఆధారంగానే – గాంధీ ఆ ప్రకటన చేసి వుండవచ్చు' అనీ ఆ నిఘానివేదికలో వుంది. 'పలు రహస్యాలు గాంధీకి తెలుసు. బోస్ మరణం ప్రశ్నార్థకమైనందునే కర్మకాండలు జరిపించవద్దని గాంధీజీ ఒత్తిడి చేశారు.' అని నేతాజీ మునిమనుమడు చంద్రబోస్ తెలిపాడట!

చరిత్రను దాచటం సరియైనది కాదు! ముఖ్యంగా మహనీయుల విషయంలో పారదర్శకత వుండాలి. స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద రహస్యంగా మారిన నేతాజీ అదృశ్యంపై చిక్కుముడులు వీడి, ఇప్పటికయినా అసలు చరిత్ర తెలిసేందుకు మార్గం సుగమం చేస్తూ, గాజు తెరలమాటున, పోలీస్ భద్రత మధ్య ఉన్న, నేతాజీకి చెందిన 'ఈ–ఫైళ్ళ'ను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గత శుక్రవారం సెప్టెంబర్ 18న బయటపెట్టారు. బోస్ ఫైళ్ళకు సంకెళ్ళు వీడాయి. ఈ మీ కాలమిస్టు సుధామ నాడు సతీసమేతంగా కలకత్తాలోనే వుండడమేకాదు. శనివారం 19వ తేదీ నేతాజీ భవన్‌ను సందర్శించి, ఆ మహనీయుడు జన్మించి జీవించిన భవనాన్నీ, ఆయన దుస్తులనూ, వస్తుసంచయాన్నీ, 1941లో ఏ మెట్లమీదుగా దిగి, ఏ కారులో, సిసిర్‌కుమార్ బోస్ నడపగా ప్రయాణించి, భారత్ నుండి అంతర్ధానమైందీ చూస్తుంటే – ఆ సమరయోధుని జ్ఞాపకాలతో, శరీరం రోమాంచితమైంది. దేశభక్తితో హృదయం 'జైహింద్' అని నినదించింది. నేతాజీ అసలు సిసలు 'భారతరత్న' కదా? అన్పించింది.

“ఇదో చరిత్రాత్మక సందర్భం. నేతాజీ ఫైళ్ళను బహిర్గతం చేశాం! భరతమాత వీరపుత్రుడి గురించి తెలుసుకునే హక్కు దేశంలో ప్రతిఒక్కరికీ వుంది. మా పని మేం చేశాం. ఇక కేంద్రం కూడా స్పందించాలి” అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆ 64 ఫైళ్ళకూ, మొత్తం దానిలో పన్నెండువేల ఏడువందల నలభైనాలుగు పేజీలకూ, డిజిటల్ కాపీ డివిడిని బోస్ వారసులైన కుటుంబసభ్యులకు అందచేస్తూ, పారదర్శకతను కల్పించారు.

నేతాజీ ముని మనుమడు చంద్రబోస్ – చారిత్రక యధార్థ సత్యావిష్కరణలకు తోడ్పడే ఈ చర్యను స్వాగతిస్తూ, కేంద్రంవద్ద కూడా సుభాష్ చంద్రబోస్‌కు సంబంధించిన 130 రహస్య ఫైళ్ళు వున్నాయనీ, వాటిని కూడా బహిర్గతం చేయాలని కోరారు. అది ఆవశ్యం జరగవలసిన పని! “సుభాష్ చంద్రబోస్ అదృశ్యంపై ఇప్పటి దాకా వదంతులు, ఊహాగానాలే ప్రచారంలో వున్నాయి. ఇప్పుడు నిజాలు బయటకి వస్తాయి.” అని నేతాజీ కుటుంబానికి చెందిన మాజీ పార్లమెంటు సభ్యులు కృష్ణబోస్ ఆశించినట్లుగా అసలు చరిత్ర ఆవిష్కృతమవుతుందని ఆకాంక్షిద్దాం!

పశ్చిమబెంగాల్‌లో నేటి మమతాసర్కార్ ఈ పారదర్శకచర్య ఒక చరితార్థక మైనదిగా భావించడంలో తప్పులేదు! చరిత్ర–దాచేస్తే దాగని సత్యంగా ‘కాలనాళిక’నూ చీల్చుకుని, ఎప్పటికయినా బయటపడుతుందని చారిత్రకప్రియుల దృఢ విశ్వాసం!

.

**(26.9.2015)**

# తిండి-పోటుగాళ్ళు!

ఎవరు ఏమితింటారన్నది వారి ఇష్టం! ఆహారపు అలవాట్లను కూడా శాసించడం అంటే – అది 'ఆధిపత్య' అహంకారానికి పరాకాష్ఠ. నీ ఇంటి కొచ్చిన వారికి నువ్వు వండిపెట్టే భోజనం నీ ఇష్టప్రకారం వుంటే తప్పేం లేదు. అతిథులకు వారికి ఇష్టమయ్యే పదార్థాలే వండివడ్డిస్తావా లేదా అన్నది నీ ఇష్టం! వారు నీ ఇంట ఆ భోజనం తృప్తిగా, ఆప్యాయంగా తింటారా లేదా అన్నది వారి ఇష్టం! కానీ ఎదుటి వారింట్లో – వారు ఏం వండుకు తింటారో అది వారి ఇష్టం! వారు ఫలానాదే తినాలని శాసించడానికి నువ్వెవరు?

శాకాహారులు, మాంసాహారులు అని ఆహారపు అలవాట్ల ప్రకారం మనుషులు రెండుగా వర్గీకరింపబడినా, ఒకే ఆహారపు అలవాటుకు కట్టుబడివుండక, శాకాహారులుగా వేరుబడ్డ కులాలవారూ, వర్గాల వారు మాంసం భుజించిన ఘటనలూ, అలాగే మాంసాహారులే అయినా – అనునిత్యం మాంసంతోనే ముద్దతినడం కాక, శాకాహారతిండి తినే–విస్తృత సందర్భాలు వుంటూనే ఉంటాయి! కొన్ని పదార్థాలు కొందరికి శాకాహారంగానే భావన కూడాను. గుడ్లు, చేపలు వెజిటేరియన్‌గా భావించే ప్రాంతాలూ వున్నాయి.

దేశంలో అనేకచోట్ల ఇటీవలికాలంలో పండుగలు ఉత్సవాల కొన్ని ప్రత్యేక సందర్భాలలో – మాంసాన్ని నిషేధించటం జరుగుతోంది. ఒక విధంగా ఇది నైతిక ఆధిపత్య సంస్కృతియే! గో పరిరక్షణ చట్టం ప్రకారం గోవధకు పాల్పడితే ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఏడేళ్ళ జైలుశిక్ష ఉంటోంది. కానీ గోమాంసం కలిగివున్నారనో, తిన్నారనో – సాకుతో ఒకరిని హత్యచేయడం అత్యంత అమానుషమైన చర్య! దాద్రీ ఘటన ఇందుకు పరాకాష్ట! బిసారా గ్రామంలో మహమ్మద్ ఆఖ్‌లాఖ్ అనే యాభై ఏళ్ళ వృద్ధుడిని – ఆవుమాంసం తిన్నాడని హత్య చేయడం, అత్యంత హేయం! అతను గోవధకు పాల్పడ్డాడని అన్నట్లయితే, చట్టం ప్రకారం అరెస్టుచేసి శిక్షించాలి కానీ, ఉన్మాదంతో ఆ వృద్ధుడినే హత్య చేయడం ఏమిటి? పైగా అలా హత్య చేసినవారిని ప్రభుత్వ యంత్రాంగం ఉపేక్షించడమేమిటో అర్థం కాని వ్యవహారం!

మోదీ అధికారంలోకి వచ్చాక – హిందూ మతోన్మాద శక్తులు పేట్రేగిపోతున్నాయనడానికి ఇది తాజా ఉదాహరణగానే కానవస్తోంది! మాంసాహారం భుజించినందుకు ప్రజలను హత్యచేసిన చరిత్ర నిజానికి ప్రపంచంలో ఎక్కడాలేదు. రాముడు, కృష్ణుడు అని పూజించే దైవాలు కూడా – వారి కుల ధర్మం ప్రకారం మాంసభక్షణ చేసినవారే! శాకాహారుల బ్రాహ్మణకులాలవారు – ఆ దేవుళ్ళను పూజించడం లేదా? నిజానికి బ్రాహ్మణులనే వారిలోనూ మాంసభక్షకులున్నారు. తినేతిండి అన్నదాని మీద, ఆంక్షలు పెట్టేదెవరు? దానికెవరికీ అధికారం లేదు. శరీర ఆరోగ్యానికీ, ఆయుష్షుకీ, రుచికీ ఏ ఆహారం మంచిదన్నది ఎవరికివారు నిర్ణయించుకోవాల్సిందే ! అన్నవిజ్ఞాన శాస్త్రంలో చెప్పబడే విషయాలేవయినా – అన్వయించుకు పాటించడం అనేది,, ఎవరిష్టం వారిదే!

మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గడ్ వంటి రాష్ట్రాలలో బిజెపి పాలన ఉంది. జైనులపండుగ సందర్భంగా మాంసం అమ్మకాలను నిషేధిస్తూ, ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి! జమ్మూ–కాశ్మీర్‌లో ముస్లింలు అధికం అన్న విషయం అందరికీ తెలిసిందే! అయితే – ఆ రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. దాని పై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. ఇదే భిత్తికగా ఆహారపు అలవాట్లపై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ ఊపందుకుంటోంది.

ఇప్పుడు దసరారోజులు ఇక ప్రవేశిస్తున్నాయి. రాబోయే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా మాంసం అమ్మకాలను తొమ్మిది రోజుల పాటు నిలిపివేయాలని – కేంద్ర సాంస్కృతిక అమాత్యులు మహేష్‌శర్మ సూచన కూడా వివాదాస్పదమవుతోంది. దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, క్రిస్టియన్లు తదితరులలో గొడ్డు మాంసం తినడం మామూలే! ఆ మాటకొస్తే గొడ్డుమాంసం ఎగుమతి చేయడంలో అనేకదేశాలతో పోల్చినా భారత్ అగ్రస్థానంలోనే ఉంది. పశుమాంసం ఎగుమతిని ప్రభుత్వం నిషేధించగలుగుతోందా?

మాంసాహారులే హింసాత్మక చర్యలకు పూనుకుంటారనీ, మనిషిలో పశుత్వాన్నీ, దానవత్వాన్నీ, రెచ్చగొట్టే శక్తి మాంసాహారానికి వుందనీ అందువల్ల నేరప్రవృత్తికీ, హింసాప్రవృత్తికీ వారే అధికంగా పాల్పడతారనీ అనేవారున్నారు. కానీ అందుకు ఋజువులు ఏమున్నాయి? గోమాంసం తిన్నారని, విద్వేషంతో వృద్ధుడిని సంహరించింది ఒక శాకాహారియే అయినప్పుడు, నైజానికీ, ఆహారపు అలవాటుకీ

ముడిపెట్టడం కూడా తప్పే అవుతుంది. చదువు, సంస్కారం, పెరిగిన వాతావరణం, వ్యక్తి మానసిక నైజం.. ఇవన్నీ ప్రవర్తనకు కారణం అవుతాయి. తిన్నతిండి ప్రభావం శారీరక, మానసిక స్థితులపై వుండడం వాస్తవమే కావచ్చు. కానీ అంత మాత్రాన ఈ ఆహారమే సరియైనది, ఇది కాదు అని నిర్ధారించడం, ఫలానాదే తినాలని ఒత్తిడులు తేవడం ఎవరు ఎవరిపట్ల కనబరిచినా అది గర్హనీయం! నిశితంగా ఖండించవలసిందే! కులం, మతం వంటివేకాక – 'ఆహారం' కూడా రాజకీయం అయిపోయి, సామాజిక వాతావరణాన్ని స్వార్థ ప్రయోజనాలతో కలుషితంగానూ, విషతుల్యంగానూ మార్చడం క్షమించరాని తప్పు! ఆ పని ఎవరు చేసినా క్షమార్హం కాదు.

"తిండి కలిగితె కండకలదోయ్!

కండకలవాడేను మనిషోయ్" – అని గురజాడ అన్నారంటే జాతి ఈసురోమంటూ వుండకూడదనే గానీ, కండకావరంతో మెలిగే విద్వేష ఆధిపత్య అహంకృత సంస్కృతి గురించి కారు. ఆహార నియంతృత్వం గురించి కాదు.

**(10.10.2015)**

# ని'రసన' పంథా

అవార్డు తిరిగి ఇచ్చేయడమంటే ఏమిటి? పుచ్చుకున్న నగదు మొత్తాన్నీ, ఆ యోగ్యతాపత్రాన్నీ, జ్ఞాపికనూ, శాలువనూ అకాడమీకి తిరిగి పంపివేస్తేనేకదా, తిరిగి ఇచ్చివేసినట్లు! అలాకాక కేవలం – తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటన చేస్తే సరిపోతుందా? అదీకాక–అసలు తమ నిరసనను తెలియజేయడానికి తమకు లభించిన గౌరవాన్నీ తమనుతాము తక్కువ చేసుకోవడం ఎందుకు?

తమరు అవార్డు లభించిన కాలం, అప్పుడున్న ప్రభుత్వం వేరయినప్పుడు.. ఇప్పటి ప్రభుత్వంపై నచ్చని విషయంపై నిరసన తెలియజేసేందుకు, అప్పటి గౌరవాన్ని ఇప్పుడు కాదనుకోవడం ఎందుకు –నిజమే! నచ్చని సంగతులపై నిరసన ప్రకటించే హక్కు సాహిత్యకారులకుఎప్పుడూ ఉంది. అసలు కవులు, రచయితలు అంటేనే సమాజానికి హితమైన బాటలు, తమ రచనల ద్వారా నిర్దేశించి చూపగలవారు, రచయిత ఎప్పుడూ ప్రజలపక్షమే గానీ, ప్రభుత్వాలకు బాకాలు ఊదేవాడు కాకూడదు. రాజకీయంగా ప్రతిపక్షం ఎలాగో – సాహిత్యకంగా, రచయితల పక్షం అటువంటిదే! అవార్డుల వాపసులో 'ఔచిత్యాన్ని' పరిగణనలోకి తీసుకుకోవాలి. దేశంలో మనకు నచ్చని ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఎమర్జెన్సీ విధించినప్పుడు కలాలకు పడిన సంకెళ్ళు ఇప్పటికీ చేదు జ్ఞాపకాలుగా వున్నాయి. ఏడాది క్రితం ముజఫర్‌నగర్‌లో ఊచకోతలు జరిగాయి. గుజరాత్ గాయం అందరికీ తెలిసిందే! తస్లీమాపై దాడి జరిగింది. మరి ఆ సందర్భాలలో ఎప్పుడూ రచయితలు ఈ తీరున ఎందుకు స్పందించలేదు? అన్న ప్రశ్న సహజంగానే ఉద్భవిస్తుంది.

అకాడమీపై గౌరవం లేకపోతే, అసలు అవార్డును తీసుకోకూడదు. తీసుకున్న అవార్డును వెనక్కు ఇవ్వకూడదని అనం! కానీ దానికి వారెంచుకున్న కారణం, ఎంచుకున్న సమయం సహజంగానే పరిగణనలోనికి తీసుకుంటారు. దాద్రీ ఉదంతంతో బాటు, కల్బుర్గి హత్యకేసులో ప్రభుత్వం ఏ ఒక్కరినీ అరెస్టు చేయకపోవడం ప్రగతిశీల రచయితలకే కాదు, సామాన్యులకు కూడా విడ్డూరంగానే కనబడుతోంది! అది తప్పక నిరసన తెలియచేయ వలసిన సంఘటనయే.

కానీ – తాము ఎప్పుడో పొందిన అవార్డులను ఇప్పుడు ఆయా రచయితలు తిరిగి ఇచ్చేయడం అంటే, అవార్డుకున్న విలువ, ప్రతిష్ఠ, తాము పొందిన గౌరవం దెబ్బతినేలా తామే ప్రవర్తించడం కావడం లేదా? సాహిత్య అకాడమీ స్వతంత్రసంస్థగానే వుంది. ప్రభుత్వ జోక్యంలేని సంస్థేగానీ – అకాడమీ అధికారుల మీద ఒత్తిడులు, సిఫారసులు రావడం లేదని అనలేము. కానీ – జరిగిన దుర్ఘటనలకు అకాడమీని తప్పుపట్టినట్టు అవుతుంది; అవార్డులు తిరిగి ఇచ్చేయడం అంటేను. నిరసనల్లోకి – "సాహిత్య అకాడమీని అనవసరంగా లాగొద్దు" అని అసోమా సాహిత్యసభ చేసిన సూచనలో సామంజస్యం వుంది. పెద్దిబొట్ల సుబ్బరామయ్యగారి ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన పలువురు తెలుగు రచయితలు కూడా తమ నిరసనను తెలియజేస్తూ, సమష్టిగా ఓ పత్రికా ప్రకటన ఇచ్చారు. కానీ తమ అవార్డులను వాపసు ఇచ్చేస్తున్నామనలేదు. అవార్డులు వెనక్కి ఇచ్చే బృందంలో గత బుధవారం హిందీ రచయిత్రి కృష్ణసోబ్తీ, బెంగాలీ రచయిత శీర్షేందుముఖోపాధ్యాయ, మంద క్రాంత సేన్, మహారాష్ట్ర రచయిత ఇబ్రహీం అఫ్గాన్, ఉత్తరప్రదేశ్ కవి కె.కె. దారు వాలాలు తాజాగా చేరి, తమ అవార్డులు వెనక్కి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. నిజంగా వీరంతా తాము పుచ్చుకున్న నగదు మొత్తాన్ని సాహిత్య అకాడమీకి తిరిగి పంపివేసిన ఋజువులు మాత్రం రాలేదు. తాము ఏ సభల్లో పాల్గొన్నా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అని తమ పేరుకు ముందో, వెనుకో – ఆహ్వాన పత్రాల్లో రాయించు కోవడం వారంతా మానివేసిన దాఖలాలు లేవు. మరో బెంగాలీ రచయిత సమరేశ్ ముందార్ తన అవార్డును వెనక్కి ఇచ్చేది లేదని తెగేసి చెబుతూ – సాహిత్యఅకాడమీని జరిగిన ఘటనలకు బాధ్యులను చేస్తూ తప్పుపట్టడం 'హాస్యాస్పదం'గా వుందని తేల్చిచెప్పారు.

'పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రమా' అన్నట్లు గానే – నిరసనమార్గం – అవార్డు తిరస్కరించడం కాదనీ, తమ గౌరవాన్ని తామే తక్కువ చేసుకున్నప్పుడు ఒక నిరసన స్థాయిని కూడా తక్కువ చేసుకున్నట్లేనని, అకాడమీ అవార్డు గ్రహీతలైన సృజన కారు లెందరో దీనిని నిరసిస్తున్నారని – ఒక సంఘటనపట్ల అందరి దృష్టిని ఏకీకృతం చేయడానికి, అవార్డు తిరస్కరణ కాక – అవార్డు గ్రహీతల సమష్టి నిరసన స్పందనే, ప్రభావోపేతమని గ్రహించాలి.

"దాద్రీ సంఘటన, పాక్ గాయకుడిపై వ్యతిరేకతలు అవాంఛనీయం, దురదృష్టకరం. కానీ కేంద్ర ప్రభుత్వానికి వాటితో సంబంధం ఏమిటి" అని ప్రధాని వ్యాఖ్యానించడం సరికాదు!

బిజెపి ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తోందని అనిపించకుండా, సంఘటన జరిగిన వెంటనే, ప్రభుత్వపరంగా తీసుకోవల్సిన చర్యలు వెనువెంటనే తీసుకోవాల్సిన బాధ్యత వుంటుంది. మోదీ ఖండన కూడా పేలవంగా వుందని కన్నడ రచయిత్రి శశిదేశ్ పాండే – వూరికే అనలేదు. మౌనాన్ని వీడి స్పందించడంలో కూడా ఓ పద్ధతి వుంటుంది. అదేమీ లేక – నెత్తిమీద మొట్టి, సారీ అనేసినట్లుండకూడదు కదా!

'పుండొకచోట – మందొకచోట' అన్నట్లు కాకూడదు, తుంటిమీద కొడితే మూతిపళ్లు రాలవు. సృజనకారుల నిరసన ఆహ్వానించదగిందే! కానీ అందుకోసం తమ గౌరవ ప్రతిష్టలను తామే తక్కువ చేసుకుంటూ అనవసరంగా అకాడమీ అవార్డులు తిరిగి ఇచ్చేయక్కర్లేదేమో!

**(17.10.2015)**

# భద్ర భావన

అరవై ఎనిమిదేళ్ళ స్వతంత్ర భారతదేశంలో ముస్లింలు ఇంకా 'అభద్రత'కు లోనవుతున్నారా? అన్నది పెద్ద ప్రశ్న. నిజానికి పాకిస్థాన్‌లో ఉన్న హిందువులకంటే, భారతదేశంలోని ముస్లింల జనాభా గణనీయంగా ఎక్కువ. దేశజనాభాలో 14.2 శాతం ఇస్లాం మతానుయాయిలున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 172 మిలియన్ల మంది ముస్లింలున్నారు. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా హిందూ జనాభాకంటే ముస్లిం జనాభాయే బాగా పెరిగిందని ఒక అంచనా, తమ ఉనికికీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం వుంటే – జననాల సంఖ్య ఎలా పెరుగుతుంది అని అడిగేవారున్నారు. కానీ భారత్‌లోని ముస్లింలు వారి దేశభక్తి విషయంలోనూ, అంతరంగంలో పాకిస్థాన్ పట్లనేగల ప్రేమ విషయంలోనూ అనుమానింపబడుతూనే ఉన్నారనీ, దేశంలో జరిగే ఆరాచకాల వెనుక వారి హస్తమే అనివార్యంగా ఉంటుందనే భ్రమలు వారి పట్ల ఇంకా తొలగిపోలేదనీను, సంఘటనలు ఋజువు చేస్తూనే ఉన్నాయి! కాగా నిజానికి భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర అవిస్మరణీయం. అబుల్‌కలాం ఆజాద్, హకీమ్ అజ్మల్ ఖాన్, రఫీ అహ్మద్ కిద్వాయ్ వంటి వారి పాత్ర తక్కువేమీకాదు. అలాగే 'సరిహద్దు గాంధీ'గా పిలువబడిన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ తన తొంభై అయిదు సంవత్సరాల జీవితంలో 45 ఏళ్ళ జైలులోనే గడిపిన గొప్ప జాతీయవాది. సిపాయిల తిరుగుబాటులో ప్రాణాలు పోగొట్టుకున్న ముస్లిం యోధులెందరో వున్నారు. మీర్జా గాలిబ్ గొప్ప ఉర్దూ కవిగా ఆనాటి విషయాలను తన లేఖల్లో ఉటంకించాడు. స్వతంత్ర భారతంలో జాకీర్ హుసేన్, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, అబ్దుల్ కలాం వంటి ప్రముఖులు అందించిన సేవలు మహత్తరమైనవి.

నిజమే! ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ముస్లింలకేకాదు, లౌకిక ప్రజాస్వామ్యవాదులందరికీ ఖేదాన్ని కలిగించేవిగా ఉన్నాయి. ఇండోనేషియా, పాకిస్థాన్‌ల తర్వాత మూడవ అత్యధిక ముస్లిం జనాభా కలిగిన దేశం భారతదేశమే.

ప్రపంచపు అత్యధిక ముస్లిం మైనారిటీ జనాభా కలిగినదీ భారతదేశమే. నిజానికి అనేక మతాల కూడలిగా వర్ధిల్లుతున్న దేశం మనది. మతాచారాలు, వివాహ పద్ధతులు ముస్లిం జనాభా పెరగడానికి ఒక కారణంగా సోషియాలజిస్టులు పేర్కొంటున్నారు. కుటుంబ సంక్షేమ పద్ధతులు అవలంబనం తక్కువ కావడానికి వారి లోని పేదరికం, అవిద్యకూడా కారణాలుగా పేర్కొనబడుతున్నాయి. ఏమయినా జీవికమీద విశ్వాసం, ఉనికి మీద నమ్మకం లేనిదే జనాభా పెరుగుదల సాధ్యంకాదనే మాట కూడా వుంది.

మతఘర్షణలను నివారించడం, శాంతి సామరస్యాలను విస్తరించడం ప్రభుత్వ కర్తవ్యం. ముఖ్యంగా మైనారిటీ వర్గాలలో అభద్రతా భావం తొలగింపబడడం చాలాముఖ్యం! అందుకు తీసుకుంటున్న చర్య లేమిటనేవి ఎవరైనా నిశితంగా పరిశీలించేవే! ఇంతపెద్ద దేశంలో ఎక్కడో అక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగడం అనివార్యం కావచ్చు. కానీ వెంటనే దానికి ప్రభుత్వ స్పందన, ప్రతిచర్యలేమిటనేవి ప్రధానమవుతాయి. మోదీ ప్రభుత్వం వచ్చాకనే ఇటువంటి అభద్రతా భావం వారిలో అధికమైందనే దానికి ఋజువులు, సాక్ష్యాలు ఏమిటని ప్రశ్నించే వారుంటారు. ఇదంతా ప్రతిపక్షాల అల్లరేననీ, ప్రసారమాధ్యమాలు గోరంతలు కొండంతలు చేస్తున్నాయనీ వాదించే వారూ ఉన్నారు. కవులు, రచయితలు ఇటీవలి ఘటనలపట్ల వ్యక్తీకరించిన నిరసనలు మునుపెన్నడూ లేవు.

వామపక్ష భావజాలంగలవారే ఎక్కువగా ఈ ఆరోపణలు చేస్తున్నారనీ, జాతీయతాభావస్ఫూర్తికి ఆఘాతం కలిగిస్తున్నారనీ, కొందరు ఘోషిస్తున్నారు. నిప్పులేనిదే పొగరాదు అనే మాట మరిచి పోకూడదు. భావప్రకటనా స్వేచ్ఛకే కాదు, ఆహారపు అలవాట్ల స్వేచ్ఛకు కూడా భంగం వాటిల్లడం సరికొత్తగా దృశ్యమానమవుతున్నప్పుడు – మానవ హక్కుల గురించీ, మానవీయ విలువలగురించీ ఆర్తిచెందే వారెవరైనా కలవరపడతారు. మోదీ ప్రధాని అయిన నేపథ్యం, ఆయన ఎదిగివచ్చిన వాతావరణం తెలిసినవరెవరయినా పూర్తిగా హిందూత్వ ముద్రవేసి లౌకిక ప్రజాస్వామ్యస్థితికి చేటు కలుగుతోందని ఆరోపించడం సహజం! ఆ వాస్తవం తెలుసుకనుకనే మరింత జాగరూకతతో, కేంద్రప్రభుత్వం వ్యవవహరించవలసి వుంటుంది. తప్పులెంచడమే

పనిగా, రంధ్రాన్వేషణ దృష్టితో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని పడగొట్టడమే లక్ష్యంగా వుండడం రాజకీయ క్రీడలో భాగమే కావచ్చు. కానీ ప్రతిపక్షాల క్రియాశీలత్వం కూడా సదా అవసరమే! ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదు కావలసింది. మైనారిటీల అభద్రతాభావం తొలగిపోవాల్సి వుంది. అదే సమయంలో వారిలోనూ దేశభక్తి, జాతీయతా స్ఫూర్తి మరింతగా ప్రబలవలసి వుంది. 'జైహింద్' అన్నా ఈ దేశంలో 'జైభారత్' అనడమే, అనే భావం ప్రచులితం కావాలనుకోవడం దోషం కాదు.

**(24.10.2015)**

# రేపు తెలుస్తుంది

బీహార్‌లో మొన్న చివరి దశ పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా స్వయంగా వందకుపైగా సభల్లో పాల్గొన్నారు. బీహార్‌లో ఎన్నికల్లో ఓటర్లు ఎటుమొగ్గు చూపారో రేపు తెలిసిపోతుంది. మూడింట రెండువంతుల మెజారిటీ లభించడం ఖాయమని సుశీల్ కుమార్ మోదీ వ్యాఖ్యానించారు. గానీ అంతసీన్ వున్నట్లు కనబడటం లేదు.

'మహాగఢ్బంధన్' ముస్లిం - యాదవ్-ఓబీసీ ఓటు బ్యాంకును పూర్తిగా నమ్ముకుంది. అయితే తొలిదశల పోలింగ్ తరువాత బిజెపి తన వ్యూహాన్ని మార్చుకోక తప్పలేదు. ప్రధాని కూడా స్వయంగా సభలలో పాల్గొన్నప్పుడు యధారీతి జనం పెద్ద సంఖ్యలో హాజరుకావడం, యువత అధికంగా తరలిరావడం బిజెపి గెలుపు నమ్మకాన్ని సజీవం చేసిన మాట వాస్తవం! బీహార్ ఎన్నికల ఫలితాలతో నరేంద్రమోదీ కేంద్రంలోని ప్రభుత్వ పనితీరును ముడిపెట్టలేమని బిజెపి ఎంత బీరాలు పలుకుతున్నా ఫలితాలు వచ్చినప్పుడు ఈ అనుకూల, అననుకూల వాదన అతిసహజంగా పైకివస్తుంది. హిందువుల ఓట్లు చీలిపోకుండా అరెస్సెస్ కార్యకర్తలు పట్టుదలగానే ప్రచారం చేశారు. లాలూతో బాటు ఆయన ప్రత్యర్థి పప్పూయాదవ్ ప్రభావమూ తేలికగా తీసిపారేయవలసిందికాదు.

తొలి నాలుగు దశల పోలింగ్ కన్నా మొన్న జరిగిన చివరిదశ పోలింగ్‌కు పరిగణన మరీ ఎక్కువగా వచ్చింది. కారణం ముస్లిం జనాభా అధికంగ వున్న సీమాంచల్ ప్రాంతంలోని 24 స్థానాలతో సహా మొత్తం యాభైఏడు స్థానాలకు చివరి పోలింగు పోరు సాగింది. లాలూప్రసాద్ యాదవ్ మొదలైన వారు 'బీఫ్'పై చేసిన వ్యాఖ్యలతో తయారు చేసిన బిజెపి ప్రకటన వివాదాస్పదమై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు దాకా వెళ్ళింది. ఆ ప్రకటనలను నిషేధిస్తూ ఆదేశాలు కూడా జారీ అయ్యాయి.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలను ప్రధాని నరేంద్ర మోదీ సీరియస్‌గా తీసుకోవడంవల్లనే ఆయన పలుమార్లు సుడిగాలి పర్యటనలు చేసి మూడు పదులకు పైగా సభల్లో ప్రసంగించారు. లాలూ, నితీశ్, సోనియాలను వీలున్నచోటల్లా నిశితంగా

విమర్శించారు. ముఖ్యంగా ముస్లింల విశ్వాసాలు, వారి ఆహారపు అలవాట్లపై ప్రతిఘటనలు ఎక్కువయ్యాయన్న భావన విస్తృతమయింది. ఆహార ఫాసిస్టు దాడులు పాలకవర్గాల కుట్రల పర్యవసాన మేననీ, సామాజిక సంబంధాల్లో చీలికలద్వారా అధికార సుస్థిరతకు కేంద్రం ప్రయత్నిస్తున్నదనే వాదన ఒకటి బలంగా రేగుతోంది. భారతీయ ఆహార మార్కెట్‌ని బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేసే దిశగానే హిందూత్వ పేరుతో బరితెగింపు సాగుతోందనే అభిప్రాయం వేళ్లూనుతోంది.

మతాహంకార పాలనలోని ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా మేధావులూ, రచయితలూ తాము గతంలో పుచ్చుకున్న అవార్డులను కొందరు తిరిగి ఇస్తున్నట్లుగా ప్రకటించడం, సినిమా సెలబ్రిటీలయిన షారుక్‌ఖాన్, కమల్‌హసన్ వంటి వారు కూడా ఈ వివాదంలో తమ భావ ప్రకటనలు చేయడం జరిగింది. ప్రభుత్వ కార్యాచరణను ఎవరు ఎలా ప్రశ్నిస్తారన్నది వారి వారి ఇష్టమే! కానీ నిరసన గళం బలంగా వున్నప్పుడే సామాన్యుడు సైతం ఆలోచిస్తాడు. అందునా మార్పుకు అవకాశం వున్న ఎన్నికలలో తన ఓటు ఆయుధాన్ని ప్రయుక్తం చేయడానికి దేశంలో ఏర్పడిన వాతావరణం, జరుగుతున్న చర్చలు తప్పకుండా ప్రభావం చూపుతాయి. మతతత్త్వ ధోరణి తెచ్చే బీభత్సం ఏదయినా అనాగరికమే! అది అందరూ గ్రహించాల్సిందే. బీహార్ ఎన్నికల్లో ఈ పరిస్థితుల ప్రభావం ఎలా వుంటుందో గాని అరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ రిజర్వేషన్‌లపై చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు తెచ్చాయి. దీంతో పార్టీ విజయావకాశాలకోసం మల్లగుల్లాలు పడి తాము రిజర్వేషన్లకు కట్టుబడి వున్నామని అదే పనిగా ప్రకటించుకోవాల్సి వచ్చింది. తాను బీసీల అభివృద్ధికి గుజరాత్ ముఖ్యమంత్రిగా పాటుపడ్డానని మోదీ సైతం చాటింపు వేసుకోవాల్సి వచ్చింది. బీహార్ ఎన్నికల ఫలితాలు బిజెపి ప్రభుత్వానికి రెఫరెండంగా వుండబోతాయో లేదోగాని ఒక నిర్ణయాత్మక శక్తిని ప్రతిబింబిస్తాయనే మాట మటుకు ఉంది. బీహార్‌కు లక్షన్నరకోట్ల ప్యాకేజీ ప్రకటించడం దగ్గర నుంచి, అనేక వ్యూహాలు పన్ని బిజెపి ఆఖరికి గోమాతను కూడా అడ్డం పెట్టుకుంది గెలుపు కోసం. నితీశ్ కుమార్ వికాస్‌ను ప్రజలు నమ్ముతున్నారని తెలియరావడంతో కులాల లెక్కలతో కుస్తీలు పట్టడం ముందుకు వచ్చింది.

ఏమైతేనేం బీహార్ ఫలితాల పట్ల నిరీక్షణాసక్తి ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా ఉంది. వామపక్షాలు, బిఎస్‌పి, ఎస్‌పి, మజ్లిస్, ఎన్సీపి వంటి పార్టీలు కూడా బీహార్ ఎన్నికలలో నిలిచాయని మరిచి పోకూడదు.

ఇంత పెద్ద దేశంలో ఎక్కడో ఏదో జరుగుతూనే వుంటుంది. అవాంఛనీయ సంఘటనలను అసాంతం నిరోధించడం ఎవరి వల్లాకాదు అనడం సులభమే! కానీ జనం చూసేది అలాంటి ఘటనల పట్ల ప్రభుత్వ స్పందన ఎలా ఉందనేదే! ఎన్నికల్లో కూడా – ఎక్కడో ఏదో జరుగుతూనే ఉంటుంది.

ఫలితాలకు మేం బాధ్యులం కాము అని త్రోసిరాజనలేరుకదా! ప్రజాభిప్రాయ ప్రకటనకు ఓటింగ్ అనేదే తిరుగులేని మరో ప్రత్యామ్నాయంలేని ప్రజాస్వామిక సంవిధానం. పరిస్థితులు కాలానుగుణంగా మారుతుంటాయి. బలపడేవి కొన్నయితే, బలహీనపడేవి కొన్ని, విశ్వాసాన్ని ప్రోదిచేసేవి కొన్నయితే, అభద్రతను తలపించేవి ఇంకొన్ని. ప్రజలు తమ నిఘానేత్రం మూసుకు కూర్చుంటారనుకోవడం తప్పు. నిజానికి రీకాల్ విధానమే వుండివుంటే పనితీరు మరోలా వుంటుంది. ఒకసారి అధికారం కట్టబెట్టాక అయిదేళ్ళ వరకూ మేము ఏం చేసినా చెల్లుతుంది అనే ధీమా, భరోసా కూడా సరికాదు. ప్రజలు తలుచుకుంటే మధ్యంతరాలు వస్తాయి. ఏ అభ్యంతరాలు వచ్చినా చైతన్య ధనుష్ప్రాణులైన ప్రజలు అదనుచూసి ఎవరికి ఎప్పుడు ఏ గుణపాఠాలు చెప్పాలో అవి చెప్పే తీరుతారు. 'బీఫ్–ఆహార్' మొదలయినవాటి ప్రతిస్పందనలూ 'బీహార్' ఫలితాలు రుచిచూపుతాయని ప్రజాస్వామికవాదులు ఎదురుచూస్తున్నారు. ఎవరికి హారాలో, ఎవరికి చీడీలో ఎలాగూ తేటతెల్లమవుతుంది. ఎగ్జిట్‌పోల్స్ కూడా ఏమీ స్పష్టంగా తేల్చనందున ఉత్కంఠ మరీ హెచ్చింది.

**(7.11.2015)**

# పిల్ల(ల) సినిమాలు

**బా**లల చలన చిత్రోత్సవం సందడి ప్రతి రెండేళ్ళకోసారి హైదరాబాద్ వేదికగానే సాగుతూ వస్తున్న సంరంభం. నిజంగా ఈ చలనచిత్రోత్సవం బాలబాలికలకు ఏ మేరకు ఉపయుక్తమవుతోందో, పిల్లల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతోందో కచ్చితంగా చెప్పలేంగానీ, పిల్లలపేరు చెప్పుకుని సంరంభంలో పాలుపంచుకునే పెద్దల ప్రమేయం బాగానే ఉంటోంది.

అసలు పిల్లల సినిమా అంటే ఏమిటి అనే ప్రశ్నకు పిల్లలు ఎలా వుండాలో, వారికి ఏది నచ్చాలో తాము ఉద్దేశించిన తీరుగా పెద్దలు నిర్ణయిస్తున్న వైఖరే కనబడుతోందిగానీ, పిల్లల సృజనాత్మకతకి దోహదపడేవిగా, వారిచే స్వయం నిర్మితాలైనవిగా కనబడుతున్నవి తక్కువగానే ఉంటున్నాయి. అసలు 'బాలహిత్యం' విషయమూ అలాగే ఉంది. స్త్రీలు రాసింది స్త్రీవాద సాహిత్యం, దళితులు రాసింది దళిత సాహిత్యం అయినట్లుగా బాలబాలికలు రాసింది బాలసాహిత్యంగా చెలామణీ అవడం కన్నా, పిల్లల కోసం తాము తమ దృక్పథాలతో ఆలోచించి రాసిందే బాలసాహిత్యంగా వర్ధిల్లుతూ, అవే బహుమాన పాత్రమయ్యేవిగానూ అకాడమీలతో గుర్తింపబడుతున్నాయి. అంతేగానీ బాలబాలికల్లో రచనాసక్తినీ, వ్యాసంగాన్నీ పెంచి పోషించేవిగా దృశ్యమానమవుతున్న దాఖలాలు క్వచిత్తుగానే వుంటున్నాయి.

బాలలకోసం సినిమాలనేవి ఇప్పుడు కొత్తగా రూపొందుతున్నవేమీ కాదు. తెలుగుచలనచిత్ర పరిశ్రమ ప్రారంభంలోనే పిల్లలు నటించిన చిత్రాలు ప్రముఖంగానే వచ్చాయి. 1937లోనే ప్రాచ్యఖండ షర్లిటెంపుల్ అని ప్రసిద్ధిపొందిన బేబి సరోజ నటించిన 'బాలయోగిని' చిత్రం కె. సుబ్రమణ్యం, గూడవల్లి రామబ్రహ్మంగార్ల సంయుక్త దర్శకత్వంలో వచ్చింది. నటీనటులు అందరూ పిల్లలుగా, పైగా అందరూ 13 సంవత్సరాలలోపువారుగా సతీ అనసూయ, ధ్రువవిజయం మొదటి పిల్లల సినిమాలుగా రెండూ కలసి ఒకటిగా విడుదలయ్యాయి. అవి 1936లోనే వచ్చాయి. సి. పుల్లయ్య నిర్మించిన ఆ చిత్రానికి అడవిబాపిరాజు కళాదర్శకత్వం వహించగా, కవి బలిజేపల్లి లక్ష్మీకాంతం సంభాషణలు, ప్రభల సత్యనారాయణ సంగీతం

సమకూర్చారు. 1934లోనే లవకుశ, 1938లో భక్తమార్కండేయ, 1942లో భక్తప్రహ్లాద, బాల ప్రధాన పాత్రల చిత్రాలే. అప్పట్లో ఆంధ్ర బాలానంద సంఘం పిల్లలెందరో సినిమాల్లో బాలపాత్రలు వేసేవారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారి శిక్షణలో అలా రాణించిన బాలనటులెందరో వున్నారు. ఆపై రోజా రమణి, కుట్టిపద్మిని, నాగరాజు, సుబ్రహ్మణ్యం, షామిలి, తరుణ్ బాలనటీనటులుగా తెలుగుతెరను పండించారు.

సినిమాల్లో పిల్లలపాత్రలను ముదురు సంభాషణలతో, వెకిలిహాస్యంతో భ్రష్టుపట్టించడమూ చూశాం. ఏమయినా సినిమాల్లో బాల పాత్రలు వేరు. ఆద్యంతమూ పిల్లల చిత్రంగా పేరుపడడం వేరు. బాలమిత్రులకథ, బాలరాజుకథ, లేతమనసులు, లిటిల్ సోల్జర్స్, అంజలి వంటి సినిమాలు పిల్లలను బాగా ఆకట్టుకుని పిల్లలసినిమాలే అనిపించుకున్నాయి. అయితే బాలచిత్రాలు అంటూ ప్రత్యేకంగా తీసిన 'మిణుగురులు' వంటి సినిమాలకు రావలసినంత ప్రాచుర్యం లభించిందనలేం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఇప్పుడు హైదరాబాద్‌లో 19వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం జరుగుతోంది. నిజానికి బి. నర్సింగరావు వంటి ఇక్కడి దర్శకులు బాలల చిత్రాలమీద గతంలోనే మంచి శ్రద్ధపెట్టారు. తగిన వనరులు, ప్రోత్సాహం లభించినట్లయితే బాలల చిత్రాలు తీయడానికి ముందుకు రాగలుగుతారు కానీ లేదంటే నిర్మాతలు ముందుకు రాగలగడం కష్టమే. విదేశీ బాలల చిత్ర నిర్మాణంతో పోల్చినపుడు మనం ఇంకా వెనుకబడి వున్నామని అంగీకరించక తప్పదు. ఈ ఏడాది 80 దేశాల నుంచి పన్నెండు వందల నాలుగు ఎంట్రీలు రావడం చలనచిత్రోత్సవం ప్రాధాన్యతకు కారణం. వివిధ దేశాల చిత్రాలను బాలబాలికలు వీక్షించే అవకాశం ఈ చలన చిత్రోత్సవం కల్పిస్తుంది. అయితే కేవలం నగర బాలలకే పరిమితం కాకుండా, తెలంగాణ జిల్లాల ముఖ్యకేంద్రాలలో కూడా వీటి ప్రదర్శనకు వీలుకల్పిస్తే బాగుంటుందనే అభిప్రాయం ఉంది. ఈసారి డిజిటల్ ఇన్‌స్టాలేషన్స్ ద్వారా పిల్లలకు చిత్రవినోదాన్ని మరింతగా అందుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఐసిఎఫ్ఎఫ్ చైర్మన్ ముఖేష్‌ఖన్నా ప్రకటించారు. 'దిఎవల్యూషన్' అనే చిత్రం చలన చిత్రాల అభివృద్ధి వికాసాలకు అద్దంపట్టే చిత్రంగా, 'ది బిగ్ పిక్చర్' అనేది డిఎస్ఎల్ఆర్ కెమేరా నిలువెత్తు పనితనాన్ని పరిచయం చేసేదిగా ఈ

చిత్రోత్సవంలో అలరించగలవని ఫెస్టివల్‌డైరెక్టర్ శ్రవణ్‌కుమార్ ప్రకటించారు. ఆసియా పనోరమ చిత్రాలు ప్రత్యేకతతో భావించగలవనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు వినోదం ప్రధానమే! వారి హక్కులు కాపాడబడుతూ విద్య, వికాసం అనేవి మరింత ప్రధానం అనేది మరిచిపోకూడదు. చలనచిత్రాల ప్రభావం జీవితాలమీద కంఠదఘ్నంగా వుందనుకుంటున్న తరుణంలో బాలలకోసం తీయబడే చిత్రాలు అనివార్యంగా ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. కేవలం ఇలాంటి ఉత్సవాలవేళ ప్రదర్శనకని కాకుండా, సినిమారంగం బాలలభవిష్యత్తును దృష్టిలో వుంచుకుని కృషి సాగించాలి.

**(14.11.2015)**

# నిర్లక్ష్యపు నీడలొద్దు

నిర్లక్ష్యం అంటే లక్ష్యం లేకపోవడం మాత్రమే కాదు, ఉన్న లక్ష్యాన్ని ఉదాసీనతతో పట్టించుకోకపోవడం కూడాను. వ్యవస్థలో అనేక సంఘటనలు నిర్లక్ష్యంతో కూడుకున్నవిగా విస్తరిస్తున్నాయి. పట్టించుకోవాల్సినవారు పట్టించుకోకపోవడం – వారు అధికారులైనా, ప్రభుత్వాధినేతలైనా నిజానికి క్షమార్హంకానేకాదు. చాలా విషయాలు 'తనదాకావస్తే' గానీ చందాన కూడా చతికిలబడుతున్నాయి. ఈ నిర్లక్ష్యపు నీడల కారణంగా బలైపోతున్న వారు బలైపోతూనేవున్నారు. అలా జరిగినప్పుడు విచారాన్ని ప్రకటించి, కంటి తుడుపు చర్యగా ఏవో నష్టపరిహారాలు అంటూ చేతులు దులుపుకోవడాలూ కనిపిస్తూనే వున్నాయి.

రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల గురించే ఈ ఆవేదన అనుకోనక్కర్లలేదు. తన స్కూల్ లిఫ్ట్‌లో, లిఫ్ట్‌కూ గోడకూ మధ్య తల ఇరుక్కుపోయి అరగంటదాకా విలవిల్లాడి అసువులు బాసిన చిన్నారి పాప ఘటన కూడా నిర్లక్ష్యపు నీడలోనిదే. అట్టహాసంగా బాలల చలన చిత్రోత్సవాలు జరుగుతున్న సమయంలో ఓ పసిపాప మరణం ఉత్సవ ఉత్సాహాలనా? ఉబికివస్తున్న ఉత్పాతాలనా? దేని గురించి శ్రద్ధపెట్టాలని ప్రశ్నించితీరుతుంది. నిబంధనలను తుంగలోతొక్కి – సరైన ఆట ప్రదేశాలు, వసతులు లేకుండా, బహుళ అంతస్తుల భవనాల్లో చిన్నారుల ప్లే స్కూల్ వంటివి సాగుతూంటే– ఇలాంటి ప్రమాదాలు జరిగితే తప్ప ఆ వైపు ఆలోచనే సారించని ధోరణులను ఏమనుకోవాలి? విద్యాశాఖ పరిధిలోకే లేకుండా గుర్తింపు లేని పాఠశాలలగా నడిచిపోతున్నవీ, అరకొర సౌకర్యాలతోనే విద్యావ్యాపారం మట్టుకు చేసుకుంటున్నవీ నగరంలోనే పలు సంస్థలున్నాయి. ఒకే ఒక ఇరుకైన మెట్లదారితో ల్యాండింగ్‌గేటు, తాళం లేకుండా వున్న లిఫ్ట్‌తో నడుస్తున్న హైదరాబాద్‌లోని ఓ ప్లే స్కూల్‌లో నాలుగేళ్ళ ఫాతిమా దారుణ మరణం నిర్లక్ష్యపు నీడలకు పరాకాష్ఠవంటిదే. ఇలాంటి కిండర్‌గార్డెన్ పాఠశాలలను పర్యవేక్షించడానికి పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి ఇవి రావనడం, ఇవి లేవనడం, నిజంగా విడ్డూరమే! లిఫ్ట్ ఇన్‌స్పెక్టర్లంటూ

ఇతర రాష్ట్రాలలో వున్నటువంటి ఒక వ్యవస్థ మన దగ్గర లేకపోవడం ఒక విషాదమే! అక్యుపెన్సీ సర్టిఫికేట్లను మున్సిపల్ అధికారులు ఇలాంటి బహుళ అంతస్థుల భవనాలకు కళ్లు మూసుకుని ఇచ్చేస్తూండడం మామూలై పోతోంది కూడాను.

"ఎవరి మరణాలకూ ఎవరూ హేతువుకాదు. వారి ఆయుష్షు తీరి వారు మరణిస్తున్నారు. ఎవరు సహజ మరణం చెందుతారో, ఎవరు ప్రమాదం వల్ల మరణిస్తారో ముందుగా ఎవరేం చెప్పగలరు. మృత్యువుని ఎవరూ ఆపలేరు" బాపతు వేదాంతం పలుకులు పలకడం కాదు. నివారించదగిన వాటిని శ్రద్ధపెట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం విధాయకం. వైద్యరంగం మనుష్యుల ప్రాణాలను కాపాడడానికీ, అనారోగ్యం పోగొట్టడానికి వుంది. అలాగే ప్రమాద నివారణ చట్టాలు. రక్షక చర్యలు వున్నాయి. రోడ్డు రూల్స్ అనేవి సరదాకి పెట్టుకున్నవి కాదు. హెల్మెట్ వంటి వాటి ఉపయోగాలు తెలియచెప్పి పౌరులు వాహనదారులుగా వాటిని స్వచ్ఛందంగా వాడేలా చేయవలసిన బాధ్యత రహదారిపోలీసుశాఖ మీద ఉంది. అలాగే ఎక్కడ ఎలాంటి ప్రమాదాలకు తావుందో అక్కడ అవి జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు పటిష్టంగా అమలు జరిగేలా చూడాల్సిందే! ఆహారపు తావుల్లో నయినా, వినోద స్థలాల్లో నయినా, విద్యాలయాల దగ్గరయినా ఎక్కడ తీసుకోవాల్సిన రక్షక చర్యలు అక్కడ తీసుకోవాలి.

ప్రమాదం అంటే–అధికారపార్టీలకు తాము ఎన్నికల్లో అధికారం కోల్పోతామేమో అన్న భయమే అయితే, ఎలా గెలుపుకోసం అహరహం కష్టపడుతూ అనేక గట్టెక్కే మార్గాలను అన్వేషిస్తారో, అలాగే ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశాలపట్లా, ప్రజాసంక్షేమం దృష్ట్యా జాగ్రత్త వహించాల్సిందే మరి!

ఇవాళ వరంగల్‌లో పోలింగ్ జరుగుతోంది. ఈ ఎన్నిక ఫలితాలమీద ఎనలేని ఉత్కంఠ ముఖ్యంగా ఇతర పార్టీలకు ఎక్కువగావుంది. తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్., టి.ఆర్.ఎస్.పార్టీకి ఇక్కడి విజయం ఎంత ముఖ్యమో, వ్యతిరేకిస్తున్న వారికీ అంత ప్రధానమే! కెసిఆర్‌కు ఒక షాకు తగలాలలని భావిస్తున్న వారికి కొదవేం లేదు. అందుకే మొన్నటివరకు జరిగిన ప్రచారపర్వంలో మాత్రం ఎలాంటి నిర్లక్ష్యమూ చూపక బలగాలన్నీ మోహరించి మరీ ప్రచారం చేశాయి. తమ గెలుపు నల్లేరు మీద బండినడక అని అధికార టిఆర్ఎస్ పార్టీకూడా భావించలేదు కనుకనే కెసిఆర్ స్వయంగా ప్రచారపథంలో పాల్గొని ప్రజలకు బంగారు తెలంగాణ పట్ల

విశ్వాసాన్ని కలిగించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి కొత్తపథకాలను, కల్యాణలక్ష్మి వంటి వాటిలో బి.సి., ఓ.బి.సి.లను కూడా కలుపుకునే రాయితీలను సిఎం ప్రకటించారని ప్రతి పక్షాలు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు కూడా చేశాయి.

ఎన్నికల్లో పౌరుల ఓట్లు సంపాదించే విషయంలో ఫలితమేమిటో తెలియకపోయినా, ఎలా ప్రచారహోరులో నిర్లక్ష్యం ప్రకటించరో, అలాగే అధినేతలు, అధికారులు తమ కర్తవ్యనిష్ఠలో కూడా నిర్లక్ష్యపునీడలు సోకకుండా పనిచేస్తే, అనేక సమస్యలు నివారించబడతాయి. గెలుపుతో అయిదేళ్ళ ధీమా అనే అహంకారం తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా నేతలెవరయినా వుండడం చాలా ముఖ్యం. అన్నదానికీ ఆచరించేదానికీ హస్తిమశకాంతర భేదం వుండకూడదు. నిజానికి అధికారం అత్యంత బాధ్యతాయుతమైనది. నమ్మిగెలిపించిన అనేక వర్గాల ప్రజల ఆశలకు చిపురులు తొడిగి పుష్పవికసనం జరగాలే కానీ, మొగ్గలోనే రాలిపోయే వైఖరులు పనికిరావు. ఇప్పటికే రైతులు, ఉద్యోగులు అసంతృప్తికి చేరువవుతున్నారన్న సంకేతాలు పొడచూపుతున్నప్పుడు, బంగారు తెలంగాణ నేత కర్తవ్యనిష్ఠ నిర్లక్ష్యపు నీడల్లోంచి ఆసాంతం బయటపడాలి. ప్రజల విశ్వాసమే 'లిఫ్ట్' అనే ఉద్ధారకయంత్రం. యంత్రాంగం దానిని సక్రమంగానూ, సంరక్షక సమున్నత పద్ధతితోనూ నడపాలి. లిఫ్ట్‌కూ గోడకూ మధ్య ఏ తలా-అది రైతుదయినా, ఉద్యోగిదయినా, విద్యార్థిది అయినా, చిన్న పసిపాపది అయినా నలిగి చితికిపోకూడదు. జీవేన శరదాం శతం.

**(21.11.2015)**

# పాక'కళాశాల'!

అన్నింటికంటే ఆవుమీద వ్యాసం రాయడం సులభం అని ఒక భావన ఉంది. "ఆవు పాలు ఇచ్చును, ఆవు పాలు శ్రేష్ఠము. ఆవు తల్లివంటిది" అని తరగతి గదుల్లో – ఏళ్లుగా విద్యార్థులెందరో వ్యాసాలు రాసి రాసి పెద్దయిపోయారు. పాలు ఆవు ఒక్కటే ఏమీ ఇవ్వడం లేదు. నిజానికి బర్రెలు, గొర్రెల, మేకలు కూడా ఇస్తున్నాయి. గాంధీగారు ఆవుపాలు కాదు, మేకపాలే తాగారు. పాలిచ్చే జంతువులు మరివేటికీ లేని పవిత్రత గోవులకే ఎందుకొచ్చింది? అని అడిగితే కోప్పడేవాళ్లున్నారు. ఇటీవల వీళ్ళు మరీ ఎక్కువై పోయారన్న భావనా కలుగుతోంది.

నిజానికి లక్షలాది కుటుంబాల్లో నేడు ప్రస్తుతం నిత్యం జరుగుతున్న పాలవాడకం – బర్రెలదే. ఆవుపాలు టీ, కాఫీలకు వాడేవాళ్ళు తక్కువ. ఆ మాట కొస్తే, రోజూ ఆవుపాలు తాగేవారి శాతమూ తక్కువే. నిజానికి ఎందరికో పాలిస్తున్న జంతువు బర్రె. కానీ బర్రెకు ఆవుకున్న పవిత్రత వున్నట్లు లేదు. తెల్లనివన్నీ పాలనుకోకోయ్ అనే సామెత వుంది. కానీ పాలు ఇస్తుందంటూ తెల్లని ఆవుకు ఇచ్చిన ప్రాధాన్యతను నల్లగా వుంటుందనే గేదెలకు ఇవ్వడం లేదా? అన్న ఊహలు కంచె దాటడంలో తప్పేం లేదు! తెల్లనివన్నీ గొప్పవనుకునే భ్రమ – తెల్లదొరలే ఇచ్చిపోయిన వదుల్చుకోలేని మన బానిస భావజాలమేనేమో!

హిందువులు పూజించే రాముడు, కృష్ణుడు 'నీలమేఘశ్యాములే' కానీ తెల్లనివారు కాదు. కానీ తెల్లావులకున్న, ఆపాదించుకున్న పవిత్రత, గొప్పదనం, కర్రావులకు, నల్లావులకు కూడా వున్నట్లు లేదు. ఆవుపాలే కాదు, పేడ, మూత్రము కూడా పవిత్రంగా భావించడం కద్దు. ఆవు ముఖం కన్న పృష్టభాగానికే పూజలు చేస్తారు. కానీ పాలిచ్చే ఇతర జంతువుల మొహాలకి ఆ మాత్రం విలువ కూడా ఇవ్వరు! మోదీ సర్కార్ వచ్చాక – ఆవు విలువ గురించి, 'ఆవురావురుమనే' వాళ్ళెక్కువయ్యారు! ఆవులను చంపకూడదని గోవధ నిషేధ చట్టాలు పకడ్బందీగా అమలు చేయచూస్తున్న రాష్ట్రాలలో – బర్రెలను, గొర్రెలను, మేకలను చంపితే మాత్రం తప్పేంలేదు. ఆవు

మాంసం తినడం తప్పుగానీ, మిగతా జంతువుల మాంసాలు తినడం తప్పుకాదు, నేరం కాదు, యథేచ్ఛగా సాగిపోతూనే ఉంటుంది.

అసలు మాంసాహారం తినేవారిని తామసులుగా, రాక్షసులుగా, గుణహీనులుగా, తక్కువవారిగా చూసే దృష్టికోణమూ ఈ దేశంలో విస్తారంగానే ఉంది. ఆహారపు అలవాట్ల గురించీ, తినేతిండి గురించీ ఎదుటివారిపై ఆంక్షలు, కట్టుబాట్లు విధించడానికి ఎవరికి మాత్రం ఏ అర్హత వుంది? ఏ హేతుబద్ధత – ఏం తినాలి అన్న దానిని నిర్దేశిస్తుంది? పంది మాంసం, కుక్కమాంసం తినేవాళ్లున్నారు. నెమళ్లను, జింకలను, పావురాలను, పిచ్చుకలను తినేవారున్నారు. చైనాలో పాములు ఫలహారంచేసే వారున్నారు. మరమరాలు వేయించుకుతిన్నట్లు గండు చీమలను వేయించుకు తినేవారున్నారట!

వండే వంటపదార్థంలో ఈగో, దోమో, బొద్దింకో, బల్లో పడితే నానాయాగీ చేస్తారుగానీ, మాంసహారులయినా గుటుక్కున మింగేస్తారను కోలేం!

తిండి గలిగితే కండకలదోయ్
కండకలవాడేను మనిషోయ్

అన్నాడు గానీ గురజాడ, అదెలాంటి తిండియో చెప్పలేదు. కానీ కండపుష్టి అవసరమేగానీ, కండకావరం కాదు. కానీ ఎలాంటి తిండి తినాలో తాము నిర్దేశించే అహంకారులూ పెత్తందార్లు తయారై, ఆవుమాంసం తిన్నారన్న నెపంతో ఒక మనిషిని చంపేసే దౌష్ట్యం ప్రబలిన తరువాత, అసహనం కలగకుండా ఎలా వుంటుంది? ఇప్పుడు చదువుకోవాల్సిన పిల్లల మెదళ్ళలోకీ, కళాశాల ప్రాంగణంలోకి కూడా ఈ తిండిలొల్లివచ్చి తిష్ఠవేస్తోంది! పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాలు అంటూ, నిర్దేశిత తిండి సూత్రాలను, పాళ్ళనూ, పదార్థాలను కూడా ప్రభుత్వమే ప్రవేశపెట్టాక, ఎన్నో బడులు 'వంటశాలలయ్యాయి. 'పాఠాల' కంటే పాకాల మీద శ్రద్ధ పెరిగింది. బియ్యం దొడ్డుదా, సన్నదా అనేది కూడా రాజకీయాల కనుసన్నల్లో నిర్ధారితమవుతూ వచ్చింది! విద్యాలయాల్లో విద్యార్థులు విద్యార్జన పట్ల దృష్టిపెట్టాలి. కానీ వివిధ తిండి అలవాట్లమీద కాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'బీఫ్' పండుగ, పెద్దకూరపండుగ అంటూ విద్యార్థులు తలపెట్టారు. దానికి పోటీగా పందిమాంసం వండి వడ్డించాలనే వేడుకతో కొందరూ, మేకలు, గొర్రెలు 'మెనూ'తో కొందరూ తయారైపోయారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం కళాశాల స్థాయినుంచి 'వంటకళా'

శాలగా మార్చాలనే ఈ తలపోతలనే మార్చాల్సి వుంది! ఎవరు ఏం తింటారన్నది వారిష్టం. వారి ఇళ్ళల్లో ఏం వండుకుంటారో, ఏ హోటల్స్ కెళ్లి ఏం ఆర్డరిచ్చుకుని తింటారో వారి ఇష్టం. కానీ ఈ వండి వడ్డించడాలకు యూనివర్శిటీని ప్రాంగణం చేయడమే పద్ధతికాదు అని తెలంగాణ ఉపముఖ్యమంత్రి సైతం ఉపదేశ వాక్యాలు పలికారు. ఈ 'ఫెస్టివల్స్' విద్యాప్రాంగణాల్లో చేయాల్సినవి కానేకావన్నది వివేకం! కానీ ఆ వివేకమే కొరవడి, 'పూను స్పర్థలు విద్యలందే' అన్నమాట – ఈ 'ఫుడ్‌ఫెస్టివల్స్' పేర, వ్యర్థ కలహాలు పెంచేదిశగా అడుగులేస్తోంది!

నడిరోడ్ల మీద 'వంటా–వార్పు' చేసే రాజకీయం ఎప్పుడు ఉద్యమంగా ముందుకు వచ్చిందో, ఇక ఈ తరహాలో తమ నిరసనలకూ, మనోభావాల ప్రకటనలకూ వంటకాల మంటలకు ఉద్యమించడం ఓ ఫ్యాషనయింది.

ఈ అసహనాలు, నిరసనలు ఉద్యమాల మధ్య ఈ 'తిండిరంథి' ఏమిటో, అసలు ఆహారం అనేదే అసహనాలకూ, నిరసనోద్యమాలకూ హేతువు కావడం ఎందుకో, ఏమిటో, అర్థంకాని దశ ఏర్పడుతోంది. ప్రతిదీ రాజకీయమే అయిపోతోంది. మానవత్వం, మనిషితనం 'పిగ్మీ'లా అవుతోంది. 'ఉల్లిపాయ' నుంచి 'గోవుతల్లి' వరకు ఏది ఎప్పుడు ఏ ప్రభుత్వాలను పడగొడుతుందో, ఈ ఆవ్యవస్థ ఎప్పుడు సువ్యవస్థ కాగలుగుతుందో తెలియరాని అయోమయంలో సామాన్యుడు నోరుతెరుచుకునే వుంటున్నాడు!

**(5.12.2015)**

# 'గ్యాస్' కబుర్లు

'గ్యాస్ కబుర్లు అంటే – 'పోచికోలు', 'అభూతకల్పన' కబుర్లు కాదు. నిజంగా 'గ్యాస్' కబుర్లే. 'వంటగ్యాస్' వినియోగం నేడు బాగా పెరిగింది. మధ్యతరగతి కుటుంబాల్లో 'గ్యాస్‌పొయ్యి వంటలు' బానే సాగుతున్నాయి. ఒకప్పుడు బొగ్గుల కుంపట్లు, కట్టెలపొయ్యిలు. ఆ తర్వాత కిరోసిన్ స్టవ్‌ల దశలు దాటి, గ్యాస్ వినియోగం అమలులోకి వచ్చింది. గేటెడ్ కమ్యూనిటి ఇళ్ళల్లో–గ్యాస్ సరఫరాకు ఇంటింటికీ గొట్టాలు కూడా ఏర్పరుస్తున్నారు. కానీ ఇప్పటికీ గ్రామాల్లో కట్టెపొయ్యిలు కనుమరుగు కాలేదు.

పేదల సన్నిధికి గ్యాస్‌పొయ్యిలు, గ్యాస్ సిలిండర్లు చేరాలంటే, గ్యాస్ మీద లభిస్తున్న సబ్సిడీ వదులుకోవాలని కేంద్రప్రభుత్వమే సంపన్నులనుద్దేశించి ప్రకటనలు కూడా విడుదల చేస్తోంది. సిలిండర్ మీద సబ్సిడీ వదులుకోవడం ద్వారా, మరో పేద కుటుంబానికి 'గ్యాస్' అందే అవకాశం వుందనీ, భరించగల స్థోమత ఉన్నవారు ఉదారంగా సబ్సిడీ వదులుకునేలా ఉద్యమించాలనీ – ఉపదేశ కథనాలు టీవి ఛానెల్స్‌లో ప్రసారమవుతూనే వున్నాయి. నిజానికి ఓ పదిమంది సభ్యులున్న కుటుంబంలో ఒక గ్యాస్ కనెక్షన్ సరిపోదు. మునుపు ఇండియన్ గ్యాస్, హెచ్‌పిగ్యాస్ అంటూ రెండు కనెక్షన్లు వున్నవారు వుండేవారు గానీ, ఎప్పుడయితే గ్యాస్‌కు 'ఆధార్' కార్డ్‌తో లింకు పెట్టారో – అప్పుడు ఒక ఇంటికి ఒక గ్యాస్ కనెక్షన్ అనేది అమలులోకి వచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం వంటివి వచ్చాయి. గ్యాస్ సబ్సిడీని నేరుగా బ్యాంక్ అక్కౌంట్‌లోనే జమ చేయడం జరుగుతుందనీ జరూరుగా చెప్పేశారు. గ్యాస్‌తో, బ్యాంక్ అక్కౌంట్‌తో, 'ఆధార్' లింకు అనివార్యమైపోయింది. సబ్సిడీ మీద పన్నెండు సిలిండర్లు మించి సప్లయ్ చేయడం జరగదన్న నియమమూ వచ్చి చేరింది. దాంతో – 'ఒక చిరునామాకు ఒక్క గ్యాస్ కనెక్షనే' వుంటుందనే సరికి, పెద్దకుటుంబాలకు కొంచెం ఇబ్బందులూ మొదలయ్యాయి. అదీకాక గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సప్లయ్ చేయడంలో వినియోగదారులను, వారి కష్టాలను పూర్తిగా దృష్టిలో వుంచుకున్నా యనలేం!

సరే! వంటగ్యాస్ సంగతి అలావుంటే – ఆటోలు, కార్లూ కూడా 'గ్యాస్'తో నడిచేకాలం వచ్చేసింది. పెట్రోలు కన్నా 'గ్యాస్' చవకేననీ, అదీకాక గ్యాస్‌లో ఎక్కువ 'మైలేజీ' కూడా లభించగల అవకాశం ఉందనీ, సదరు వాహనదారులు – తమ వాహనాలను గ్యాస్ ఆధారిత శకటాలుగా మలుచుకోవడమూ జరుగుతోంది. నిజంగా గ్యాస్ సిలిండర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. సిలిండర్లు పేలి మృత్యువాత పడేవారి కథనాలు వార్తల్లో వస్తూనే ఉన్నాయి. వరకట్న మరణాల్లో గ్యాస్ సిలిండర్ల పాత్రే ఎక్కువగా ఉంటోందిట! అయినా 'గ్యాస్ స్టవ్' వుండడం ఒక ప్రిస్టేజి కూడా అయిపోయింది. అగ్గిపెట్టె, లైటర్ వాడకుండానే నేరుగా వెలిగించుకునే గ్యాస్‌స్టవ్‌లు వచ్చేశాయి.

గ్యాస్‌సప్లయ్‌లో ఆలస్యాన్ని వినియోగదారులు భరించలేకపోతున్నారు. యాభయ్యో, వందో ఎక్కుయినా వెంటనే సప్లయ్ కావాలని అభిలషించి, అందుకై తాపత్రయపడేవారున్నారు. సిలిండర్ సప్లయ్ చేసేవాడికి – క్రమానుగత బుకింగ్ సప్లయ్ ద్వారా సిలిండర్‌వచ్చినా పాతికో పరకో చెల్లించుకోక తప్పడం లేదు. ఆ బాయ్‌కు డబ్బులిచ్చి ఏమాయచేసో ముందుగానే సిలిండర్ సప్లయ్ చేయించేసుకోవాలనీ తహతహపడే వారూ ఉన్నారు.

ఇప్పుడు గ్యాస్ దొంగతనాలూ వార్తలవుతున్నాయి. సముద్రగర్భంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నయన్నది ఆశ్చర్యకరమైన వార్తేకానీ, వట్టి గ్యాస్ కబురు కాదట! ఓఎన్‌జీసి గ్యాస్‌ను – కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకటైన 'రిలయన్స్' దోచేస్తోందనీ, ఏడేళ్లుగా ఇది సాగుతూనే ఉందనీ – స్వయంగా ఓఎన్‌జీసీయే ఎలుగెత్తింది. ఓఎన్‌జీసికి పదకొండు వేల కోట్ల రూపాయలకు పైగా నష్టం కలిగిస్తూ – సాంకేతికంగా వున్న హద్దులను అతిక్రమించి, సహజ వాయు నిక్షేపాలు గల సువిశాల సముద్ర గర్భంలో, ఓఎన్‌జిసివారి జి–4 ఫీల్డ్‌సరిహద్దుకు దగ్గరగా 'రిలయన్స్' ఎడాపెడా బావులు తవ్వి, వారి బావుల్లోకి ఓఎన్‌జిసి గ్యాస్‌ను పారింపచేసుకుందన్న అభియోగం అవాస్తవం కాదనీ, యుపిఎ – 2 హయాంలోనే ఈ అక్రమానికి ఆరంభం జరిగి, ఏటికేడాదిగా విస్తరిస్తూ వచ్చిందనీ, తెలుస్తోంది! రిలయన్స్ ఆ మాట ఒప్పుకోలేదు. తాము తమ క్షేత్రంలోనే తవ్వుకున్నామంది. ఓఎన్‌జిసి–రిలయన్స్‌ల ఈ వివాదం చిలికి చిలికి గాలివానయై, నిజనిర్ధారణకు అమెరికాకు చెందిన డీ అండ్ ఎం (డీగొలియర్ అండ్ మెకనాటన్)కు అప్పగించారు. గ్యాస్ చౌర్యం గురించి ఓఎన్‌జిసి ఢిల్లీ హైకోర్టు

కెక్కింది. రిలయన్స్‌తోపాటు కేంద్రప్రభుత్వాన్ని కూడా ప్రతివాదిగా చేర్చడం ఇక్కడ విశేషం. అంటే కేంద్రంపైనే కేంద్రప్రభుత్వ రంగ సంస్థ ఆరోపణలు చేసిందన్నమాట! అందుకు కారణం – నాటి యుపిఎ–2 ప్రభుత్వం 'రిలయన్స్'కు వంతపాడడమేననేది ఓఎన్‌జిసి వేదన! అందుకు ఆనాటి వీరప్ప మొయిలీ మంత్రిగారు కస్సుమన్నారు కూడాను! గత సెప్టెంబర్‌లో ఢిల్లీ హైకోర్టు తీర్పునిస్తే నిజనిర్ధారణకై నియమితమైన డీఅండ్ఎం సంస్థ తుదినివేదిక ననుసరించే నిర్ణయం తీసుకోవాలి అంది. వారం క్రితమే ఆ సంస్థ తన నివేదికను డైరెక్టరేట్ ఆఫ్ హైడ్రోకార్బన్స్‌కు అందచేస్తూ – "ఓన్‌జిసిగ్యాస్‌ను రిలయన్స్ తవ్వుకోవడం నిజం" అని పేర్కొందిట! అంటే "గ్యాస్ చౌర్యం"కు బడాబడా సంస్థే పాల్పడిందన్న మాటే కదా!

సామాన్యుడి గ్యాస్ కబుర్లు గ్యాస్‌కష్టాలు ఎవరికి పడతాయి. ఓఎన్‌జిసికే దిక్కులేనప్పుడు? ఏమయినా 'దొరికితే దొంగలు' – లేకపోతే 'దొరలు', సబ్సిడీ వదులుకోగల బడా బడా సంపన్నులు కిమ్మనరు గానీ, మధ్యతరగతి వాడుమాత్రం పేదల సంక్షేమం కోసం తన సబ్సిడీ స్వచ్ఛందంగా వదులకోవాలన్న నీతిదృశ్యాలూ, ప్రబోధచిత్రాలూ ఛానెళ్ళలో హోరెత్తుతూనే వుంటాయి. అదీ సంగతి!

**(12.12.2015)**

# 'చలియోగం' లేదా?

"చలి చలి చలి చలి సమ్మక్క –
దుప్పటిలోన దూరక్కా"

అని చిన్నప్పుడు శీతాకాలంలో ముడుచుకు పడుకోవడం, పాడు కోవడం గుర్తుండే వుంటుంది. అది ఋతుచక్రం సవ్యంగా తిరిగేకాలం! ఇప్పుడు 'చలికాలం' అన్న స్పృహే కలగడం లేదు. డిసెంబర్ చివరిరోజులు అంటే చలితో గడగడ వణికిపోయే వాళ్ళం. హైదరాబాద్‌లో డిసెంబర్ చలి – గొంగళ్ళు, మఫ్లర్లు, రజాయ్‌లుతో బాటు వేడివేడి ఇరానీచాయ్ పొగల మధ్య ఎదుర్కొవడం ఎంతో హాయిగా వుండేది. చలికాలం అంటే సరదాగా వుండేది. బారెడుపొద్దెక్కినా రగ్గు కప్పుకుని మునగదీసుకుని పడుకోవడంలోని హాయి ఒకటే కాదు, కొత్త దంపతులకు రగ్గులను మించి, వారి కౌగిళ్ళ వెచ్చదనానికి చలి ఆస్కారమిచ్చేది. అందుకే నవ వరుడు 'చలి' అన్నా, 'చెలి' అన్నా ఉవ్విళ్ళూరేవాడు. తెల్లవారుజామునే లేచినా – చితుకుల మంటలు వేసుకుని, మంటచుట్టూ నలుగురూచేరి, కబుర్లతో బాటు వెచ్చపడడం వుండేది.

కానీ అప్పుడు కాలం గతి తప్పినట్లే కనబడుతోంది. ఏ ఋతువులోని ధర్మాలు, ఆ ఋతువులో కనబడకుండా – చ్యుతమైపోతున్నాయి. అంతటా ఒక్కటే వేడిమి! 'భూ తాపం' ఇంతలా పెరిగిపోవడం అనేక ప్రకృతి అసమానతలకు, వైపరీత్యాలకు దారి తీస్తోంది. మొన్న పారిస్‌లో జరిగిన సదస్సులో ఈ కాలుష్య కారణాల గురించి విచికిత్స జరిగిన మాట వాస్తవమే కానీ, ఉపయుక్త చర్యలకు – ప్రపంచం దీక్షగా సమాయత్తమయ్యే దాఖలాలేమీ పొడచూపలేదు. ముఖ్యంగా సంపన్నదేశాల 'వ్యర్థాలు' ఇతర దేశాలకు 'అనర్థాలుగా' మారుతున్నాయి. చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ రసాయనిక వ్యర్థాలను, పనికి రాని ఓడల్లో నింపి వాటిని సముద్రంలో ముంచేస్తున్నాయి. ఈ మధ్య మన దేశపు నిఘావిభాగం ఫ్రాన్స్ దేశపు అలాంటి పడవనొకదానిని పట్టుకుని, వెనక్కుపంపడం కూడా జరిగింది. కానీ, మనకు

తెలియకుండా – అలా సముద్రంలో మునుగుతున్న పడవలు ఎన్నో! వ్యర్థ రసాయనాలు సముద్రంలో ముంచడం వల్లకూడా, పర్యావరణానికీ, భూమి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడానికి కారణమవుతోందన్నది – శాస్త్రజ్ఞులు చెబుతున్నమాటే! ఇటీవల గత వందేళ్ళలో ఎన్నడూ లేనంతగా – చెన్నైనగరం వర్షాల పాలై, వరదబీభత్సంతో అల్లకల్లోలం కావడం వెనుక కూడా, మద్రాస్ ప్రాంత దిశగా ఏర్పడిన ఇలాంటి ఉత్పాతమే హేతువు అన్న వార్తలూవచ్చాయి.

అంతెందుకు? భారతదేశానికి పెట్టని కోటలుగా భావించే హిమాలయాలు అంటేనే 'మంచుకొండలు'గా భావిస్తాం! అలాంటిది హిమవత్పర్వత సానువులు కూడా కరిగినీరవుతున్నాయంటే – అధిక ఉష్ణోగ్రతలే కారణం! ఇప్పటికే పదమూడు శాతం హిమవన్నగాలు కరిగిపోయాయి. కరిగినపుడు నీరు ఏరులై పారడం, పల్లపు ప్రాంతాలకు అవి వరదలై ముచెత్తడం జరుగుతుంది. మరి! టిబెట్‌లో ప్రకృతి విధ్వంసం వల్ల మనకెదురవుతున్న ప్రమాదాలు ఇంతింత అనరానివి కానీ, ఆ విషయం చైనా ఒప్పుకోదు.

తాము చేసిందే ధర్మం అనీ, అదే సరైనదేననీ – మొండివైఖరి చూపుతున్న సంపన్నదేశాల అవాంఛిత చర్యల మూలంగా, బడుగు దేశాలు మరీ బలిపశువులయ్యే స్థితి ఏర్పడుతోంది! నిజానికి అడవులు, పర్వతాలు, నదులు వాటి వాటి నిష్పత్తులలో మనగలిగినపుడే ప్రకృతీ, దాని నైజం సజావుగా వుంటాయి. మనం అడవులను నరికేస్తున్నాం. పర్వతాలు కూల్చేస్తున్నాం. నదులను కూడా నేలమట్టంచేసి పారేస్తున్నాం. మనం అంటే ఇక్కడ మానవులం అనే! ఏ దేశం మనుషులు, ఏ ప్రాంతం మనుషులు అనికాదు, అంతా ప్రకృతిని కబళించి, హస్తగతం చేసుకోవాలనుకునే ఆరాటజీవులు కావడమే విషాదం!

మన తెలంగాణ ముఖ్యమంత్రి స్వయంగా చెప్పిన మాట వుంది – రంగారెడ్డి జిల్లాలోని అనంతగిరి అడవుల్లో నుంచి 'ముచికుంద' నది ప్రవహించేది. ఆ ప్రాంతంలో ఓ రెండు రోజులు సంచరించి వస్తే, ఎలాంటి రుగ్మతలయినా నశించి, ఆరోగ్యభాగ్యం లభించేది. అమృతమయమైన ఎన్నో ఔషధ మొక్కలు, చెట్లు, 'ముచికుంద' తీరం వెంబడి వుండేవి. అక్కడిగాలి, ఆ నీరు, అనేక రోగాల నుండి విముక్తి కలిగించి 'స్వస్థత' నిచ్చేవి! ఈ 'ముచికుంద' యే మూసీనది! ఇప్పుడు 'మూసీ' అంటే మురికి కూపంగా భావించే స్థితి ఏర్పడింది. మూసీ అంటే కాలుష్య ప్రవాహానికి సంకేతమై

పోయింది. ఈ దుష్పరిణామ హేతువులు ఆలోచించామా? ఎన్ని సహజ కుంటలు, చెరువులు కనుమరుగు చేసేసారీ భూ దోపిడీదారులు!

చలికాలం కాదు డిసెంబర్ నెల కూడా ఇప్పుడు హైదరాబాద్‌లో ఎండాకాలాన్ని తలపిస్తోంది! పగటి ఉష్ణోగ్రత ఇంకా కనీసంగా ముప్పై అయిదు డిగ్రీలుగానే వుంటోంది అంటే – ఆశ్చర్యం కలుగుతుంది కానీ, అదియథార్థం! రాత్రిళ్లు కూడా ఇళ్ళలో 'ఉడుకు' తగ్గడం లేదు. ఉబ్బరిస్తూనే వుంటోంది! ఇరానీ చాయ్‌లు, వేడివేడి మిర్చీబజ్జీలు కాక శీతలపానీయాలు, ఐస్‌క్రీమ్‌లకే ఈ కాలంలోనూ గిరాకీ వుంటోంది అంటే ఉన్సురుమనిపిస్తోంది. చలికాలంలో వేడిమి, వెచ్చదనం కోరుకుంటాం కదా! ఇదేగా ఇప్పుడున్నది అంటారేమో! చలివుండి, అలా చలికివణికి పోతూ, పొందేవెచ్చదనం కదా అసలు హాయి! ఆ హాయిని కోరుకుంటారు ఎవరైనా! అదీ అసలైన అనుభూతితో నిండినది. చలికి స్వెట్టర్లు వేసుకుతిరగాలి, ఉలెన్ కోట్లు వేసుకోవాలి. కాళ్ళకు సాక్స్ తొడుక్కోవాలి. పరుపుల పై రగ్గులు కప్పుకోవాలి. నిజంగా శాలువాలు ఉపయుక్తంకావాలి. వేడివేడి చాయ్‌లు తాగాలి. గరంగరం మిర్చీ బజ్జీలు తినాలి. మొక్కబుట్టలు కాల్చుకు ఊదుకు తినాలి. జొన్నరొట్టెలు వేడివేడిగా ఆరగించాలి. అసలు సినలు కౌగిళ్ళలో, పరిష్వంగాలలో దంపతులు 'చలిపులి'తో యుద్ధం చేసే ఆహ్లాదకేళిసాగాలి. అదికదా అసలైన చలికాలం! అలాంటి చలికాలానికి దూరమౌతున్నామంటే – అది 'స్వయంకృతాపరాధంగా' మారకూడదు అన్న వివేకం పెరగాల్సివుంది. పర్యావరణ పరిరక్షణ అంటే మరేమిటోకాదు – మనరక్షణ, మానవీయరక్షణ, ప్రకృతిలో తల్లీనమై తరించగల మానవ జీవన రక్షణ అన్నది గ్రహించాలి! ఋతుచక్ర గతులు తప్పకుండా ఋషులు కాదు, మనుషులే దృఢదీక్షా సంకల్ప యజ్ఞంచేయాలి. 'చండీయాగం' వల్ల చలియోగం కలుగుతుందని విశ్వసించగలమా?

**(19.12.2015)**

# 'సరి-బేసి'ల దారి...

గాలీ, నీరూ ప్రాణాధారాలు, ప్రకృతి నుండి సహజంగా లభించే వీటిని మనిషి కాలుష్యమయం చేసి, ప్రాణాంతకం చేసుకుంటూ, మళ్ళీ స్వచ్ఛమైన గాలి, నీరూ కావాలని ఆరాటపడుతున్నడు! కొన్ని దశాబ్దాల క్రితం ఎన్నడూ లేనిది – నీటిని కొనుక్కోవడం – ఇప్పటి రోజుల్లో జరుగుతోంది. ముమ్ముందు గాలిని కూడా (స్వచ్ఛమైన గాలిని) కొనుక్కోవాల్సిన పరిస్థితి రావచ్చు. ఇప్పటికే చైనాలో ఇది మొదలైందిట! అత్యధిక జనాభాగల చైనా దేశంలో విపరీతమైన వాయుకాలుష్యం కారణంగా, స్వచ్ఛమైన గాలిని క్యాన్‌లలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విధానం ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. స్వచ్ఛమైన గాలి క్యాన్ల అమ్మకానికి అంకురార్పరణ జరిగి పోయింది.

కాలుష్యం విషయంలో – మనమూ ఏమి తీసిపోలేదు. చైనా రాజధాని బీజింగ్‌లో వారం రోజుల కాలుష్యం 139.7 మైక్రోగ్రాములు లేదా క్యూబిక్ మీటర్లు వుంటే మన దేశరాజధాని ఢిల్లీ నగరంలో కాలుష్యం 230.3 మైక్రోగ్రాములు / క్యూబిక్ మీటర్లు వుంటోంది. అంటే కాలుష్యంలో మన ఢిల్లీ నంబర్‌వన్ అన్న మాట. చైనాతో పోలిస్తే వాహనాలు విడిచిపెడుతున్న ఉద్గారాల కారణంగా వాయుకాలుష్యం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడం, మెట్రోనగరాలలోఎక్కువయ్యింది. ఢిల్లీలో వాయుకాలుష్యం ఇప్పుడు భయానకంగా మారింది. ఏటా పదివేలమంది ఢిల్లీలో ఈ వాయుకాలుష్యం కారణంగానే మరణిస్తున్నారని తాజా సర్వేలు సూచించాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అందుకే ప్రయోగాత్మకంగా కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ దిశగా ఒక నిర్ణయం తీసుకున్నారు.

2016 కొత్త సంవత్సరం జనవరి ఒకటి నుంచి – ఢిల్లీ రోడ్లమీద కార్లు, ట్రక్కులు, మొదలైనవి తిరగడం తగ్గించడానికి 'సరి–బేసి' విధానాన్ని ప్రయోగాత్మకంగా పక్షం రోజులు అమలుపరచనున్నారు. ఆ ఫలితాలను బట్టి ఆ విధానాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని భావిస్తున్నారు. ఢిల్లీలో డబ్బై లక్షలకు పైగా వాహనాలున్నాయట! ముఖ్యంగా ప్రైవేట్ వాహనాల విషయంలో ఈ సరి–బేసి

విధానం ఖచ్చితంగా అమలు పరచడానికే సంకల్పించారు. ఈ విధానాన్ని అనుసరించి – వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్‌లోని చివరి సంఖ్యను బట్టి, రోజు విడిచి రోజు, ఒక రోజు సరి సంఖ్యతో ముగిసేవాహనాలూ, మర్నాడు బేసి సంఖ్యతో ముగిసేవాహనాలూ మాత్రమే రోడ్లపై ప్రయాణించవలసి వుంటుంది. నిబంధనలను అతిక్రమించి ప్రయాణించే వాహనాలకు రెండువేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుంది. సరిసంఖ్యతో ముగిసే వాహనాలు, బేసిసంఖ్యతో ముగిసే వాహనాలు – రోజు విడిచి రోజు రోడ్డెక్కాల్సిందే, తద్భిన్నంగా జరిగితే కఠినచర్యలు, జరిమానాలు తప్పవు అని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. డీజిల్ వాహనాల వల్ల వాయుకాలుష్యం మరీ పెరిగిపోతోందిట! ఈ విధానం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఆరువేల కొత్తబస్సులు, కొత్త ఆటోలు ప్రయాణసౌకర్యానికై రాబోతున్నాయి.

ప్రైవేటు కార్లు, ట్రక్కులు, లారీలు, వ్యాన్‌లు ఈ విధానం క్రింద ప్రయాణించ వలసివుంటుంది. కాబట్టి ఢిల్లీరోడ్లమీద గణనీయంగా వాహనాల ట్రాఫిక్ సగానికి సగం తగ్గగలదని ఆకాంక్షిస్తున్నారు. ఈ ఆడ్–ఈవెన్ సిస్టమ్ బాగుందని – సుప్రీం కోర్టు చీఫ్‌జస్టీస్ శ్రీ టి.ఎస్. ఠాకూర్ స్వయంగా మెచ్చుకోవడం విశేషం!

ఢిల్లీలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెడుతున్న ఈ విధానం విజయవంతమైతే – మెట్రో నగరాలన్నింటా ఇదే విధానాన్ని అమలు చేయడం జరగవచ్చు. ఈ విధానం పట్ల కొంత ప్రతికూలత విన్పించినా, ఇది మేలు కలిగిస్తుందనే భావన వుంది. అదీకాక నలుగురు ప్రయాణించే కార్లకూ, మహిళలు నడిపేవాటికి, సి.ఎన్.జి. సర్టిఫికెట్ ఉన్న కార్లకూ, బైకులకూ, ఈ సరిబేసి సంఖ్య విధానం నుండి మినహాయింపు ఇవ్వాలనీ, ద్విచక్ర వాహనాల విషయంలో ఈ విధానం ఇప్పుడిప్పుడే అమలు పరచబోవడం లేదనీ ఢిల్లీ ప్రభుత్వం అంటోంది.

ఏమయినా కాలుష్యనివారణ గురించి తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సిన ఆగత్యం నేడు అనివార్యంగా వుందన్నమాట వాస్తవం. వాయు కాలుష్యం మెట్రోనగరాలలో మరీ పెచ్చరిల్లుతోంది. హైదరాబాద్ నగరం కూడా ఇందుకు అపవాదుగా ఏమీ లేదు. రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాక హైదరాబాద్ రద్దీ తగ్గుతుందనుకున్న భావన సరికాదేమోనని, నగరం రద్దీ తెలియచెబుతూనే వుంది. హైదరాబాద్ రోడ్ల మీద కూడా ఏటికేడాదిగా కార్ల సంఖ్య పెరిగిపోతోంది. వాహనాలు విడిచే ఉద్గారాలు

ప్రమాద ఘంటికలు మ్రోగిస్తూ వున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఈ విషయమై ఆలోచించాల్సివుంది. అసలు టిఆర్ఎస్ పార్టీ గుర్తే కారు కనుక, రోడ్లమీద యథేచ్ఛగా కార్లు తిరగడం, కార్లు సంఖ్యలో పెరిగిపోవడం అభివృద్ధి చిహ్నంగా భావిస్తున్నారేమో తెలియదు!

ఒకప్పుడు ముచికుందా నది స్వచ్ఛప్రవాహం పై నుండి స్వచ్ఛవాయువులతో తేజర్లిలిన నగరం – అదే 'మూసి' నదిగా కాలుష్యకారణంగా మారి పోయిందనడం విషాదమేమరి! నగరంలో పచ్చదనం – పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ, వాయుకాలుష్య నియంత్రణకై చర్యలు తీసుకోవాల్సిన ఆగత్యం వుంది. ఢిల్లీ తరువాత దేశం మొత్తమ్మీదనే కాదు, విదేశీ దృష్టి కూడా – హైదరాబాద్‌పైనే అధికంగా వుంది.

పదేళ్ళపాటు ఉమ్మడి రాజధాని అయివుండచ్చు గానీ, హైదరాబాద్‌పై సర్వాధికారాలూ ఎప్పటికైనా తెలంగాణవే! తెలంగాణ ప్రభుత్వానివే! ఆయుత చండీయాగం తలపెట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్ స్వచ్ఛవాయువుల, స్వచ్ఛజలాల పరిశుద్ధ జంటనగరాల అభివృద్ధికి సమాయత్తం కావాలి మరి! అన్నింటికీ ఒకే మంత్రం పనిచేయదు కదా!

జనవరి ఒకటి నుండి ఢిల్లీలో మొదలవబోతున్న సరి–బేసి విధానం వంటి ఆలోచనలు పర్యావరణం పట్లా, దాని పరిరక్షణ పట్లా మౌలికంగా మన ఆలోచనలను సరిజేసి జీవనపురోగతికి ఆచరణాత్మక పథంలో అడుగిడేలా చేయాలని ఆకాంక్షిద్దాం.

**(27.12.2015)**

# 'కొత్త' వెలుగు

కొత్త సంవత్సరం 2016 ప్రవేశించి అప్పుడే ఒక రోజు గడిచిపోయింది. గతసంవత్సర అనుభవాలతో గతులను సవరించుకుని, నవవత్సర శుభాకాంక్షలతో అంతా కొత్త ఏడాదికి సంసిద్ధమవడం అనివార్యంగా జరిగే అంశమే!

అప్రతిహతంగా, రాజకీయంగా తెలంగాణాలో సాగిపోతున్న తె.రా.స. పార్టీకి ఇటీవలి మండలి ఎన్నికలు ఓ కుదుపునిచ్చాయి. కొత్త సంవత్సరంలో మరింత అప్రమత్తం కావాల్సిన ఆగత్యాన్ని సూచించాయి. సాధారణంగా 'కొత్త' ఒక వింత పాత ఒక రోత అన్నమాట వింటూ ఉంటాం. అందుకే పాతబడకుండా నిత్యనూతనంగా ఉండడానికి ప్రయత్నిస్తూ ఉంటాం. అయితే పాతబడటం కూడా అనివార్యమైన సంగతే! అయితే ఆ ప్రాచీనత మరింత విలువైనదిగా స్థిరపడటం గొప్ప. కొన్ని పురాతన వస్తువులకు, విషయాలకు ఎక్కడలేని ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్నీ మరిచిపోకూడదు. ఓల్డ్ ఈజ్‌గోల్డ్ అని 'పాతబంగారం'గా ఏదయినా భావించబడటం గొప్ప కానీ, ఇంక పనికిరాని చెత్తసరుకు అనిపించుకోకూడదు.

నూటపాతిక సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ దేశంలో తన వెలుగును కోల్పోయింది. ముఖ్యంగా తెలుగు వారిని రెండు రాష్ట్రాలుగా విభజించిన ఖ్యాతి మూటగట్టుకోవాలనుకున్నది, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చావుదెబ్బే తిన్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దిగిన తమ అభ్యర్థులు అధికార టిఆర్ఎస్‌లోకి చేరితే నిస్సహాయస్థితిలో వుండిపోయిన కాంగ్రెస్‌కు రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కడం కొత్త సంవత్సరంలోకి ఒక ఆశావహమైన కానుకే! నల్గొండ, మహబూబ్‌నగర్‌లలో కాంగ్రెస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయడం వల్లనే గులాబీముల్లు గుచ్చుకోకుండా 'చేతి'ని రక్షించుకోగలిగారన్నది వాస్తవం.

నిజానికి ఖమ్మంజిల్లా తొలినుంచి – కమ్యూనిస్టులది. కాంగ్రెస్, టిడిపిలు అనంతరం ప్రాబల్యం పొందినవి. స్థానిక సంస్థల్లో గులాబీకి నిజానికి తగిన సంఖ్యాబలం లేదు. సిపిఐ అభ్యర్థికి కాంగ్రెస్, టిడిపి అండగా నిలబడ్డా అక్కడ

టిఆర్ఎస్ గెలవడం, కారుమేఘం క్రమ్మడం జరిగింది. అధికారం వల్ల సర్వశక్తులూ ఒడ్డినా స్థానిక సంస్థల పన్నెండు స్థానాలూ తమకు దక్కక, 'కారు'కు రెండు బ్రేకులు పడడం తె.రా.సకు కొత్త సంవత్సరంలోకి ఒక విధంగా తొలి నిరాశ.

ఉదయం కానే కాదనుకోవడం నిరాశ.

ఉదయించి అలానే ఉంటుందనుకోవడం దురాశ – అన్న కాళోజీ మాటలు అక్కడ అధికార పార్టీకి ఇప్పుడు సరిగ్గా వర్తిస్తాయి. అందువల్ల 2016 తొలి హెచ్చరిక మ్రోతతో మొదలైందని గుర్తించి ముందుకెళ్ళడం అవసరం.

బంగారు తెలంగాణ బాటలో ఆశావహదృక్కులతో ఎదురుచూస్తున్న తెలంగాణ యువతకు గ్రూప్–2, 439 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ కావడం శుభసూచకం. మొత్తం 796 పోస్టుల భర్తీకి గతసంవత్సరాంతంలో దరఖాస్తులు స్వీకరించడం, ఆన్‌లైన్ ద్వారా మొదలు పెట్టడం సంతోషదాయకమైంది. తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ నాలుగు నోటిఫికేషన్ల జారీతో నాలుగైదు లక్షల మంది అభ్యర్థులకు నూతన సంవత్సర ఆశలు చిగురింపచేసింది. 220 పోస్టులు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులే కావడం విశేషం! రాష్ట్రప్రభుత్వం మరో పదివేల పోస్టుల భర్తీకి త్వరలో అనుమతి ఇచ్చే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది! నిరుద్యోగ విద్యార్థుల్లో ఆశలు చిగురింపచేసిన ప్రభుత్వం రైతుల బ్రతుకుల మీద కూడా దృష్టిపెట్టాల్సి ఉంది.

ఈ కొత్త సంవత్సరంలోనైనా రైతులు ఆత్మహత్యలకు నివారణ కలుగుతుందా? వ్యవసాయ సంక్షోభం తీరుతుందా? అని అర్తిచెందడం సహజం. రైతులకు ఆదాయ భద్రత, ఆత్మగౌరవ జీవనం లభించినపుడే వ్యవసాయరంగం బాగుపడినట్లు! తెలంగాణ రైతు జెఏసీ వ్యవసాయమంత్రి గారికి చేసిన లేఖాత్మక సూచనలు పరిగణనలోనికి తీసుకోవాల్సినవే! తెలంగాణను విత్తన భాండాగారంగా మార్చుతామని అమాత్యులు పలికే మాటలు వినడానికి బాగుంటాయి. కానీ ఆ ప్రయత్నం బహుళజాతి కంపెనీలకు మేలు చేసేవిగా కాక రైతులకు ప్రయోజనదాయకం కావాలి మరి! బహుళపంటల విధానాలు ఒక లక్ష్యంగా ముందుకు రావాలి. పారిశ్రామిక విధానం వలెనే రాష్ట్ర వ్యవసాయ విధానం ప్రకటించబడాలి.

ఇటీవల మంచుకొస్తున్న మరో ప్రమాదం వ్యవసాయేతర అవసరాలకు వ్యవసాయ భూములు బలికావడం. ఇది సరియైన అవగాహనతో నియంత్రించవలసిన ఆగత్యం ఉంది.

దళిత, ఇతర పేద కుటుంబాలకు భూమిని అందించడం, ఆదివాసీ ప్రాంత వ్యవసాయానికి అవసరమైన మద్దతు నివ్వడం అనేది వాగ్దానాలకు, కాగితాలకు పరిమితం కాక, ఈ నూతన సంవత్సరంలోనైనా ఆచరణలో అమలు కావాలని అభిలషిద్దాం! పెంచిన ఎక్స్‌గ్రేషియా రుసుములతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడం కన్నా, అసలు రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా వారికి తగిన ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయడం ముఖ్యం.

2016 అంకెలు కూడితే తొమ్మిది అనీ, 'నవ' సంఖ్య నవనవోన్మేష సంకేతమనీ సంఖ్యాశాస్త్రజ్ఞులు అంటున్నారు. మూఢనమ్మకాలు ప్రోత్సహించబడకూడదు కానీ, 'ఆశావహ పలుకులు' ఏవైనా ఆనందదాయకాలే! మనిషికి ఆత్మవిశ్వాసం ముఖ్యం! ప్రార్థించే పెదవుల కన్నా పనిచేసే చేతులు గొప్పవి! సహస్రవృత్తుల సమస్త చిహ్నాలూ శ్రీశ్రీ అన్నట్లు నిజానికి ప్రాణం, ప్రణవం! శ్రమయేవ జయతే అన్నది ఏ రంగంలోనైనా సుసాధ్యమే! గెలుపోటములు, ఓడలు బండ్లు కావడం, బండ్లు ఓడలు కావడం సహజపరిణామాలే! స్థిరచిత్తంతో, దృఢదీక్షతో, కర్తవ్యోన్ముఖంగా జీవనం సాగించడమే చేయాల్సింది. అందరికీ మరోమారు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**(2. 1. 2016)**

# గుండెబలం కావాలి!

ఇప్పుడు దృష్టి అంతా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలవైపు మరలుతోంది! గత కొన్ని రోజులుగా వీధులు బానే కనపడుతున్నాయి. జిహెచ్ఎంసి ఉద్యోగులు అపార్ట్‌మెంట్స్‌లోనూ ఇంటింటికీ వచ్చి చెత్తసేకరించడం, చెత్తడబ్బాలు పంపిణీ చేయడం కూడా జరుగుతోంది. ఈ హడావుడి అంతా రానున్న ఎన్నికలకోసమే నన్నది బహిరంగ విషయమే!

జిహెచ్ఎంసి ఎన్నికల షెడ్యూల్‌ను కుదించి – పదవతేదీనే నోటిఫికేషన్ విడుదల చేసి, ఈ నెల 21 దాకా ప్రచారానికి వీలిచ్చి, 23న పోలింగ్ జరిగి, 27నే లెక్కింపు చేయాలనీ, మొత్తం తతంగం అంతా రిపబ్లిక్‌డే లోగా జరిగేలా జరిగిపోవాలనీ భావించేశారు. ఇలా జిహెచ్ఎంసి ఎన్నికల షెడ్యూల్ కుదించే అధికారం ప్రభుత్వానికి లేదనీ, ఇది 1955 మున్సిపల్ చట్టానికి విరుద్ధమైనదనీ, చట్టంలో మార్పు తేవాలంటే ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియ జరగాలనీ, ఇలా ఏకపక్ష వ్యవహారం కూడదనీ, దీనిపై తాముకోర్టును ఆశ్రయించదలిచామనీ టీపీసీసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు కూడాను. మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడిస్డీ, సి. హెచ్. రఘునందన్‌రావు, అనేవ్యక్తి దాఖలుచేసిన పిటిషన్‌లను విచారించిన హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వం తొందరపాటుకు బ్రేకు వేసింది. జనవరి 9న నోటిఫికేషన్ జారీచేసి 31 రోజులలో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. ఫిబ్రవరి 2న పోలింగ్ జరుగుతుందనేది తాజా ప్రకటన.

గ్రేటర్‌ఎన్నికల ఓటమి భయంతోనే – అధికార టిఆర్ఎస్ ప్రభుత్వం, పలు ఎత్తుగడలు పన్నుతోందని విపక్షాలంటున్నాయి. గ్రేటర్ పరిధిని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తామని ఒకసారి, వార్డుల సంఖ్యను రెండువందలకు పెంచుతామని మరోసారీ చెప్పి, వార్డుల పునర్విభజన పేర కంగాళీ సృష్టించిందనీ, ప్రతిపక్షాలూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా – ఇష్టారాజ్యంగా వ్యవహరించడం జరిగిందనీ విపక్షాలంటున్నాయి. వాస్తవానికి ఎన్నికల సంఘం ప్రతి ఏటా జనవరి 11న ఓటర్ల జాబితా విడుదలచేస్తుంది. కానీ ఈసారి అది మార్చి నెలకు వాయిదా పడింది.

గ్రేటర్ ఎన్నికల్లో – ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు ఏడులక్షల ఓటర్లను తొలగించడమే కాకుండా, 19లక్షలమందికి నోటీసులు ఇచ్చారట! తెలంగాణలో 55శాతం బిసిలు వుండగా హైదరాబాద్‌లో 26 శాతమే ఉన్నారని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందనీ, అదీకాక 'క్రీమీలేయర్' విధానం పాటించడం అంటే, బీసీలను అణగద్రొక్కే కుట్రేననీ ఆరోపణలూ ఉన్నాయి.

స్థానిక ఎన్నికల్లో బి.సి. రిజర్వేషన్ అమలవుతుంది. కానీ వారిలో ఎదిగిన, అధిక సంఖ్యాక కులాలే బీసీ రాజకీయ రిజర్వేషన్‌వల్ల లబ్ధిపొందాయి! అత్యంత వెనుకబడిన బిసిలూ, సంచార తెగల కులాలకు అన్యాయం జరుగుతోందని సుప్రీంకోర్టే అభిప్రాయపడింది. జనాభా ప్రాతిపదికన ఎబిసిడి వర్గీకరణ చేసాకే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరపాలని 2009లోనే సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు ఇచ్చింది. కానీ అప్పుడు – ఇప్పటికే ఎన్నికలు జరగక చాలాకాలమైందనీ, పాతపద్ధతిలోనే ఈ మాటుకు కానిచ్చి, ఆ పై ఎన్నికల్లో వర్గీకరణ చేసి ఎన్నికలు జరుపుతామనీ, ప్రభుత్వం కోర్టుకు అభ్యర్ధన చేసి, ఒప్పించుకుని, ఎన్నికలు జరిపింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ సవరణచట్టం 2011ను అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించింది కూడాను. వెనుకబడిన వర్గాలను నిర్వచిస్తూ – ఏబీసీడీ వర్గీకరణతో నిమిత్తంలేని క్రీమీలేయర్ వర్తించే వెనుకబడిన వర్గాల పౌరులని ఉటంకించింది. సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని అలా ఉల్లంఘించడం, ఈ మాటు కూడా సుప్రీంకోర్టు మాటను ప్రభుత్వం పట్టించుకోక, ఏబీసిడి విభజన అనేదేమీ చేయకుండానే, జిహెచ్ఎంసి ఎన్నికలకు సమాయత్తమవడం జరుగుతోంది! బీసీల్లోని కొన్ని బలమైన కులాలకే లబ్ది కలుగుతుందన్న కొందరి ఆర్తి సహజమైనదే మరి!

క్రీమీలేయర్‌ను ఉద్యోగ నియామకాలకు వర్తింప చేయాలని 2014లో జీవో కూడా వచ్చింది. తెలంగాణ పాలకులు కూడా బీసీ క్రీమీలేయర్ పేరుతో మరో రాజకీయకుట్రకే తెరలేపినట్లయిందని ఎంబీసీలు భావిస్తున్నారు. ప్రభుత్వమూ, ఫార్వర్డ్ బీసీలు కారణంగా, వాస్తవానికి లబ్ధిపొందవలసిన వారు అణగద్రొక్కబడుతూనే వున్నారన్న వాదన విన్పిస్తోంది! సామాజిక న్యాయానికి ఇది విఘాతం కలిగించేదిగానే వుంటోంది. బీసీ రాజకీయ రిజర్వేషన్‌ను ఏబీసీడీ కేటగిరీలుగా వర్గీకరించకుండా – ఎన్నికలు జరిగినంతకాలం ఈ వివక్ష తప్పదనే భయాందోళనలు వ్యక్తమవుతూనే ఉంటాయి.

నిజానికి హైదరాబాద్ మహానగరం భిన్న సంస్కృతుల కూడలి. ఉమ్మడి రాజధానిగానే వుండడం వల్ల ఇంకా ఇక్కడ బాగా ఆంధ్రుల సంఖ్య ఓటర్లుగా నమోదయ్యే వుంది. ముస్లిం ఓటర్ల సంఖ్య బలీయంగా ఉంది. అందువల్ల గ్రేటర్ హైదరాబాద్ మీద పట్టుసాధించడం, ఇతర తెలంగాణ జిల్లాల్లో కేవలం సెంటిమెంటు మీద పనిచేసినట్లు ఇక్కడ చేయకపోవచ్చుననే సందేహం అధికార టిఆర్ఎస్‌కు ఉండి వుండవచ్చు. ఎంఐఎం కూడా నగరంలో పట్టుసాధించాలనే పట్టుదలతో సహజంగానే ఉంటుంది. మరోప్రక్క బిజెపికి కూడా నగరం మీద ఆశలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు అందుకే ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నగరం మీద టిఆర్ఎస్ జెండా ఎగరేస్తేనే అధికార పక్షం మనుగడ తిరుగులేనిదిగా నిరూపించుకోబడుతుంది! హైదరాబాద్– తెలంగాణ 'గుండెకాయ' అని నిరూపించుకోవాలి! అందుకోసం సర్వశక్తులూ ఒడ్డడానికి అధికార టిఆర్ఎస్ సమాయత్తం అవుతోంది. ఇప్పటికే నగరంనిండా హోర్డింగులతో, ప్రభుత్వ పథకాల విస్తృత ప్రచారంతో దూసుకువెడుతూ ఉంది. గ్రేటర్ ఎన్నికల కోసం, ఉగ్రవాదులను ప్రోత్సహించే మజ్లిస్‌తో టిఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటోందని బిజెపి ఆరోపిస్తూ, కేంద్రం నిధులు రాబట్టుకుంటూనే, మోదీపై విమర్శలు చేస్తోందనీ గోలపెడుతోంది.

ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపైనే అందరి కన్నూ! 'విశ్వనగరంగా హైదరాబాద్' అంటూ కేసిఆర్ నగరంపై వరాలజల్లు కురిపిస్తున్నారు. 2009లో గ్రేటర్ పరధిలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే, టిఆర్ఎస్ కేవలం మూడంటే మూడు సెగ్మెంట్లలోనే విజయం పొందగలిగింది. ఇప్పుడు నగరంలో ఇతర పార్టీలనుంచి వచ్చి గులాబీ కండువాలు కప్పుకున్నవారికీ కొరత లేదు. గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక, టిఆర్ఎస్‌పార్టీ ప్రచారంలో భాగంగా – సిఎం కెసిఆర్ స్వయంగా రెండు భారీ బహిరంగసభల్లో పాల్గొనాలని నిర్ణయించారట! నగరం 'గుండె' గెలవడం ముఖ్యం మరి ఇప్పుడు! మేయర్ పీఠమా! మజాకానా?

**(9.1.2016)**

# ఇంట(ర్) 'నెట్టు'కు రారేమో?

'మేక్ ఇన్ ఇండియా' అంటే – ఇండియా అంటేనే 'మేకు'గా భావించే దౌర్బల్యం ప్రబలుతోంది. అన్నింటికీ అమెరికా వైపే! ఇండియా కుర్రాడికీ అమెరికా 'వైఫే' కావాలి! ఇవాళ మనకి 'మొహం' ఎక్కడ పెట్టుకోవాలో తెలీడం లేనట్లుంది. చదువులకీ – అమెరికా మోజే పెరిగాక, ఇక్కడ 'బుక్స్' ఆనడం లేదు. మన 'ఫేస్'లూ, మన 'బుక్స్' అన్నీ ఇప్పుడు 'ఫేస్‌బుక్' వైపే! మనదేశంలో పన్నెండుకోట్ల మంది ఇప్పటికే, 'ఫేస్‌బుక్' పాలయ్యారు. 'ముఖపుస్తకం' మనవాళ్ల మస్తకాలకు ఎక్కింది!

నిజమే! సద్వినియోగం చేసుకుంటే – ఎంతో ఉపయుక్తమైనదే! కానీ పిచ్చాపాటీలు, పిచ్చిజోకులు పచ్చిబొమ్మలు, చచ్చు రచనలు, ఫేస్‌బుక్‌తెరిస్తే దొర్లుకొస్తాయి. ఎన్ని 'లైకు'లు వచ్చాయా? ఎన్ని 'కామెంట్లు వచ్చాయా? ఎవరు 'షేర్' చేశారా అన్న ఆత్రంలో – అతుక్కుపోయే జనం అసంఖ్యాకంగా వున్నారు. ఇవాళ జనాలకు అంటుకుంటున్న పెద్ద వ్యసనం, వదుల్చుకోలేక పోతున్న జాడ్యం ఏదయినా వుందా అంటే, అది ఈ 'ముఖపుస్తకం' వ్యవహారమే! సామ్రాజ్యవాద సంస్కృతికి కనబడకుండా – 'కన్ను' పడినదేదయినా వుందా అంటే ఇదే అనాలేమో!

జుకర్‌బెర్గ్, అమెరికాలో బిలియన్లకు పడగెత్తిన శ్రీమంతుడు అయ్యాడంటే – 'ఫేస్‌బుక్' అనే సోషల్ నెట్‌వర్క్‌తో దేశదేశాల్లో విస్తరించడమే! 'ఫేస్‌బుక్' ఉచితంగా లభిస్తుంది సరే! అయితే దానికి 'ఇంటర్నెట్ సౌకర్యం విధాయకం. నూటముప్ఫై కోట్ల మన జనాభాలో ఇంకా 'అంతర్జాలం' ఆవలవున్న వారు కోట్లాదిగా ఉన్నారు చిత్రంగా ఇప్పుడు 'ఇంటర్‌నెట్ సౌకర్యం లేని పేదవారు' అనే వర్గం రూపొందిందన్న మాట!

ఇదిగో! దారిద్ర్య నిర్మూలనమే ధ్యేయంగా భారతదేశంలో జుకర్‌బర్గ్ ఉద్ధరిస్తానని బయలు దేరాడు. ఇది ఆకలిదప్పుల దరిద్రం కాదుస్మీ! ఇంటర్నెట్ సౌకర్యంలేని దరిద్రం! అయితే 'సర్వరోగ నివారిణి' ఔషధంలా దేశంలో విద్య, వైద్య, వ్యవసాయాది రంగాల దరిద్రాన్ని పారద్రోలడానికి తనవద్దే దివ్యౌషధం వుందంటున్నారు.

భారతదేశంలో తన వ్యాపార లావాదేవీల భాగస్వామి అయిన రిలయన్స్ అంబానీతో ప్రచారదిగ్గజపు 'అంబారీ' ఎక్కి 'ఫ్రీబేసిక్స్' అంటూ హంగామా చేస్తున్నాడు!

ఇప్పుడు విస్తృతంగా ఊరేగుతున్న పదం – ఈ 'ఫ్రీ బేసిక్స్' ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తానంటూ, తన బుట్టలో మన వాళ్లను వేసుకునేందుకు చేసిన సంకల్పం ఇది. ఇంటర్నెట్ వాడుకునే వారికి పూర్తి స్వేచ్ఛ వుండాలి అనేది ప్రాథమిక సూత్రం. కానీ 'ఫ్రీ బేసిక్స్' వల్ల డబ్బులేవీ చెల్లించకుండానే ఇంటర్నెట్ సదుపాయం లభిస్తుంది కానీ, అది ఫేస్‌బుక్, దాని అనుబంధ సంస్థల సేవలు ఉచితంగా పొందడానికి మాత్రమే నియంత్రించదలచడం ద్వారా, జుకర్‌బర్గ్ తన అమెరికా పెత్తందారీ తనాన్ని రుద్దదలుచుకుంటున్నాడని ఎందరికి అర్థమవుతుంది?

'అంతర్జాలం' మీద సార్వభౌమత్వం సాధించాలను కుంటున్న కుట్ర తప్ప ఇది నిజానికి వేరొకటి కాదు. కానీ మన పిచ్చి జనాలు – 'ఉచితం' అనే సరికి, 'ఫ్రీగా వస్తే ఫినాయిల్ తాగే' రకాల్లా – లేకిగా తయారయ్యే ప్రమాదం భయంకరంగా పొంచి ఉంది. శతాబ్దాల క్రితం 'ఈస్టిండియా కంపెనీ'కి తలుపులు తెరిచి, బ్రిటీష్ దొరల బానిసత్వంలో బ్రతికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా స్వీయ బానిస భావ బంధనాలు వదుల్చుకోలేని వారు, ఇప్పుడు సరికొత్తగా ఈ అమెరికన్ సామ్రాజ్యవాద కబంధ హస్తాలలోకి – స్వచ్ఛందంగా తరలిపోయే మాయలు పన్నబడుతున్నాయి, అంటే కూడా నమ్మలేని వ్యామోహంలోకి కొట్టుకుపోతున్నారు మరి.

అమెరికాలో చదువులు, ఉద్యోగాలు అంటూ – ఒకప్పుడు నిరసించబడిన 'మేధోవలసలకు', ఇవాళ 'ఎర్రతివాచీ పరచబడుతోంది! తెలుగు విద్యార్థులు పైచదువులకు అంటూ అమెరికన్ యూనివర్సిటీలకు దరఖాస్తులు పంపుకుని, అక్కడి నకిలీ విశ్వవిద్యాలయాల బారినపడి, ఒకవైపు అష్టకష్టాలు పడుతూంటే, అమెరికన్ కాన్సులేట్ చే అవమానాలపాలై ఇటీవల ఎందరో విద్యార్థులు వెనక్కుపంపబడుతుంటే, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఆవరించినట్లుగానే, తగిన జాగ్రత్తలు పడకపోతే జుకర్‌బర్గ్ 'ఫ్రీబేసిక్' మాయాజాలంలో చిక్కుకుని, మనం మరో కొత్తరకం బానిసలుగా కావడం ఖాయమవుతుంది!

మనదేశంలోని టెలికం ఆపరేటర్లమీద, సర్వీస్ ప్రొవైడర్లమీద మన ప్రభుత్వానికి కట్టడి చేసే అధికారం వుండాలి గానీ, ఆ ఉచిత ఇంటర్నెట్ ఏదో అయితే గియితే

మనవాళ్లకు మనసర్కారు కలిగించగలగాలిగానీ, 'ఫేస్‌బుక్' కబంధ హస్తాలలోకి వెళ్లి పోవడం, భారతీయులమైన మనం ఇంటర్నెట్ ద్వారా ఏ రకమైన డిజిటల్ సర్వీసులను బేసిక్‌గా పొందాలి అన్నది – జుకర్‌బర్గ్ గారు శాసించడం, మహాదారుణమవుతుంది.

కొన్నేళ్లక్రితం 'మాన్‌సాంటో – విదేశీ రాకాసి మనవ్యవసాయపు పంటలమీద బిటి విత్తనాలతో, ఎరువులు, పురుగుమందులు అన్నింటిమీద పెత్తనం వహించి, మన రైతులను ఎలా భ్రష్టు పట్టించిందో, ఇప్పటికే పత్తిరైతులు విదేశీ పేటెంట్లు, మేధో హక్కుల కారణంగా – ఎలా మోసపోతూ, ఆత్మహత్యలవైపు నెట్టబడుతున్నారో చూసీ, అనుభవించీ కూడా.. ఆ మాన్‌సాంటో లోని పెట్టుబడిదారులే ఇప్పుడీ 'ఫేస్‌బుక్' పెట్టుబడిదారులుగా పెద్దవాటాలతో వున్నారన్న విషయం తెలిసికూడా, 'ఫ్రీబేసిక్స్' ఉచ్చులోపడితే ఇక మనకి దిక్కెవరు? మనల్ని రక్షించేదెవరు?

'దేశీయత', 'జాతీయత', 'మేక్ ఇన్ ఇండియా' – అనేవి వట్టి నినాదాలుగా, విదేశీటూర్ల నడుమ విసిరే పదబంధాలుగా కాకుండా – నిజంగా చిత్తశుద్ధితో దేశాభ్యున్నతికీ, ప్రజాసంక్షేమానికీ ఉపయుక్తమయ్యే దిశగా ప్రభుత్వ చర్యలు కదిలితే బానే వుంటుంది! సోషల్ నెట్‌వర్క్‌ను మంచికి ఉపయోగించుకునేదిగా కట్టడి చేయగల సామర్థ్యం – మన ప్రభుత్వాలకు వుండాలి. లేదంటే తాముకూడా – మతం రంగు ముఖాలతో, యాగాలయోగాల చిత్తరువుల ప్రచారార్భాటరోగాలతో నెట్టుకుపోతూంటే, 'ఇంటర్నెట్' అయినా – ఇంటనే నెట్టుకు రాలేని, మాయాజాలంలో కూరుకుపోవడం తథ్యం!! అందువల్ల 'ఫ్రీబేసిక్స్' విషయంలో తస్మాత్‌జాగ్రత్త అని మేధావివర్గంతో సహా, అంతా అప్రమత్తం కావల్సిన ఆగత్యం వుంది. అదే మన తక్షణ కర్తవ్యం! అవును! 'మాయా'బజార్ పాలుగాకుండా అదే మన తక్షణ కర్తవ్యం!!

**(17.1.2016)**

# వ్యవస్థ పు(రో)హిత్‌లేనా?

అనగనగా ఒక పులి ఉండేది. ధర్మపన్నాలు పేదలగూర్చి వల్లించేది. అడవిలోకి వచ్చినవారికి మేలుచేస్తానని కంకణం కట్టుకున్నట్లు, బంగారంది ఒక కంకణం పట్టుకు కూర్చుని, ఆశపెట్టి, దరిచేరిన వారిని గుట్టుచప్పుడు కాకుండా మట్టుపెట్టేది. ఎప్పుడో చిన్నప్పుడు చదివిన కథ అది. కానీ అనేక విశ్వవిద్యాలయాల వ్యవస్థ, క్రమేపీ ఇలానే మారిపోతోంది. యూనివర్సిటీలు అడవుల్లానూ, వి.సి.లు ధర్మపన్నాల పులుల్లానూ మారి, గొప్ప చదువుల కోసం ఆశతో దరిచేరిన పేదలు బలిఅయిపోయే కథ సాగుతోంది.

పులులు, సింహాలు ఆగ్రవర్ణాల్లోనే వుంటాయని మనం నమ్మాలి. పిల్లికూడా పులివంశందే అంటారు. గానీ, పులులు ఒప్పుకోవు కదా! పిల్లి 'మ్యావ్' అన్నా 'మావో' అందనీ, అంచేత అది కమ్యూనిస్టుదనీ రాజకీయం ముద్రవేసే వాళ్లున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యకన్న రాజకీయం విస్తారంగా వుంది అని ఇవాళ తేటతెల్లం అవుతోంది. హిందూత్వానికీ, అంబేద్కరిజానికీ మధ్య పచ్చగడ్డి వేసి మంటపెట్టాలనుకునే చర్యలు ఒక వంకా, ఎర్రజెండా నీడన వెలివాడలు చేరుతాయేమోనని భయపడి కుట్రలు చేసే ధోరణులు మరోవంకా పెచ్చరిల్లుతున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయం అంటే కేంద్రమంత్రులు తమ కనుసన్నల్లోనే సాగాలనుకుంటున్నారేమోనని అనుమానం వేస్తోంది కూడాను.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఒక ప్రతిభా కుసుమం నేలరాలింది. రోహిత్ పిహెచ్‌డి పరిశోధక విద్యార్థి. అతను బలి అయింది కచ్చితంగా రాజకీయాలకే. దానికి ఇప్పుడు కులం రంగు కూడా అలదబడుతోంది. అతను దళితుడు కాదని కొందరూ, బిసి అని కొందరూ. రోహిత్ సూసైడ్ నోట్ చదివితే అతనెంత మేధావో తెలుస్తుంది. ఒక యువమేధావిని యూనివర్సిటీ విద్యావ్యవస్థ ఇంతగా డిస్టర్బ్ చేయడం అంత శోచనీయస్థితి మరోటి లేదు. నిజమే! ఆత్మహత్య మహాపాతకం! చరిత్ర ఎరుగని మహాపాతకం ఇదేమీ కాదు. ఇప్పటికే ఎన్నో ప్రతిభా కుసుమదళాలు నేలరాలతూనే

ఉన్నాయి. కానీ రోహిత్ ఆత్మహత్య అనేక ప్రశ్నలను ముందుకు తెస్తోంది.

విశ్వవిద్యాలయాల్లో రాజకీయాలు విద్యార్థుల ప్రతిభాపాటవాలను పెంచేందుకు దోహదపడే స్టూడెంట్ యూనియన్లుగా వుండడం వేరు. భవిష్యత్ దేశ నేతలను రూపొందించగల తాలింఖానాలుగా వుండడం వేరు. కానీ భ్రష్టమైన రాజకీయ వ్యవస్థ చేతి కీలుబొమ్మలుగా విద్యార్థులు మారిపోయేలా నెట్టబడడమే జీర్ణించుకోలేని విషయం. తన చావుకు తాను తప్ప మరెవరూ కారణం కాదన్న రోహిత్‌లో అతని సంస్కారం కనబడుతోంది గానీ, తనను చావువైపుకు నెట్టిన ఘోర పరిస్థితులను, అందుకు కారణమైన వ్యక్తులను క్షమించడం ఎలా? ఏ కులం వాడయినా, ఏ మతం వాడయినా, ఏ వృత్తివాడయినా, ఏ వయసు వాడయినా ఆత్మహత్య చేసుకునే మానసిక దౌర్బాల్యానికి ఆ వ్యక్తిని నెట్టుతున్న పరిస్థితులనూ, ఆ వ్యవస్థనూ సమూలంగా మార్చవలసి ఉంది. ఎవరికీ తాను చచ్చిపోవాలి అనీ, తన సమస్యలకు చావు మాత్రమే పరిష్కారం అనీ అనిపించకూడదు. వ్యక్తిని రక్షించడం అంటే శరీరాన్ని రక్షించడం మాత్రమే కాదు మనఃప్రాణాలను కూడా రక్షించాలి. క్షేమం బాహిరం మాత్రమే కాకూడదు. అంతరంగికం కూడా కావాలి.

నిజానికి విద్య చేయవలసింది కూడా మనిషికి 'ఆత్మస్థైర్యాన్నీ, బ్రతుకుపై భరోసాన్నీ కలిగించడం. పాఠశాలలో చదువుకుంటున్నా, విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే వారి కుటుంబ నేపథ్యం, వారి పెంపకపు విధానమే కారణాలు అని తప్పించుకోవడం కుదరదు. విద్యావిధానం కూడా, ఆ విధానాన్ని అనుసరిస్తూన్న బోధనాలయాలు కూడా, ఆ బోధనాలయాలకు ఆధిపత్యం వహిస్తున్న నిర్వాహకుల వైఖరులుకూడా కారణాలే!

పిల్లల గొడవల్లో పెద్దలు జోక్యం చేసుకోవడం, ఆ గొడవలు సద్దుమణిగేవే అయినా, హద్దులు మీరేవిగా మారుతూ పోయేందుకు కారణం. విద్యార్థులు వేటికి ప్రతిస్పందించాలి? అనేది కూడా తెలియకుండా రాజకీయాలు పెచ్చరిల్లుతున్నాయి. బొంబాయి పేలుళ్లకు కారణమైన వాడికి శిక్షపడితే విశ్వవిద్యాలయ విద్యార్థి జోక్యం చేసుకోవాలా? నిరసనలు తెలపాలా? అని ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది! విద్యాలయాలు కులసంఘాలుగా, కుహనా రాజకీయాల కొమ్ముకాసే కూటములుగా మారిపోవడమంత విషాదం మరొకటి లేదు.

గణతంత్రం-ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో ప్రతిపౌరుడి జీవన వికాసానికీ, బ్రతుకు భరోసాకీ భిత్తికగా, మూలకందంగా నిలబడాలిగానీ, మానవ విలువల పతనానికి ఇచ్చే స్వేచ్ఛారాజ్యం కాకూడదు.

'స్మృతి ఇరానీ' అయినా రోహిత్ 'స్మృతి'ని చెరిపి వేయలేదు. రోహిత్ చావు భండారు బండారాన్ని అయినా దాచేయలేదు. రోహిత్ దళితుడు కాక 'బి.సి'యే అయినా, వి.సి. క్షమార్హుడు అయిపోలేడు. ఒక మరణం అనేక ప్రశ్నలను పుట్టించి, అవ్యవస్థపై రణం నినదిస్తుంది. మనువయినా మనిషి మనుగడను తాను శాసించలేడు. తనువయినా శాశ్వతం కాకపోవచ్చుకానీ, తనకుతాను ఆత్మహత్య చేసుకునే మనోగతం ఎవరికీ కలగకూడదు. అదీ ముఖ్యం!

**(23.1.2016)**

# గ్రేటర్ ఓటర్ మేటర్

'గాడ్సే' మహాత్మాగాంధీని హత్యచేశాడు. కాబట్టి గాంధీ కీర్తిశేషుడిగా బతికిపోయాడుగానీ, లేదంటే ఇప్పటి పరిస్థితుల్లో అయితే ఈ వ్యవస్థలో ఇమడలేక 'ఆత్మహత్య' చేసుకునేవాడు అన్నాడు ఒకాయన ఈ మధ్య. గాంధీ, నెహ్రూల పేరు చెప్పుకుని ఎన్నోఏండ్లుగా బ్రతికేసిన కాంగ్రెస్ ఇప్పుడు 'చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే' స్థాయిలో కూడా లేదు. సరికదా 'పువ్వులమ్మినచోట కట్టెలమ్ముకునే స్థితి' కూడా లేని దురవస్థపాలయింది.

ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని బతికించుకోవాలని బహుధా ఆశపడుతోంది! జనవరి 30 అంటే గాంధీ వర్ధంతినాడు ఒకప్పటి రోజుల్లో నగరంలో 11 గంటలకు ఉదయం 'సైరన్' మ్రోగేది. రెండు నిమిషాలపాటు మహాత్మునికి నివాళి ఘటిస్తూ ఎక్కడి ట్రాఫిక్ అక్కడ ఆగిపోయేది కూడాను. దేశభక్తి క్కూడా అర్థాలు మారిపోతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వేడుకలు - ప్రధాని, రాష్ట్రపతుల సందేశాలు దినపత్రికల మొదటిపేజీల్లో పతాక శీర్షికల్లో వచ్చే రోజులూ ఈనాడు లేవు సరే. సినిమా థియేటర్లలో సినిమాపూర్తవగానే వెండితెర మీద 'జనగణమన' వచ్చేదన్న సంగతి ఈ తరానికి తెలియదు కూడా నేమో! అలాగే ఆకాశవాణి ప్రసారాలు రాత్రి జాతీయగీతంతో ముగిసేవి. ఆ రోజుల్లో వెండితెరపై గాంధీ, నెహ్రూలు కనబడితే జనం చప్పట్లు కొట్టేవారు. అదంతా కాంగ్రెస్ పురావైభవమై పోయింది. జెండాకు, జాతీయగీతానికే ఇవాళ విలువలెలా వున్నాయో తెలియనిదెవరికి? - నిజమే! కేవలం గాంధీనే 'జాతిపిత' అనచ్చుకానీ, దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన మహనేతల్లో - నేతాజీ, భగత్‌సింగ్ వంటివారి ఆవిస్మరణీయ పాత్ర చరిత్రపుటల అడుగున పడిపోకూడదుకదా! స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశంలో నగరాల నుంచి అద్భుతమైన నాయకత్వం వచ్చింది అన్న మాటా వాస్తవం! సుభాష్ చంద్రబోస్, సర్దార్‌వల్లభ్‌భాయ్ పటేల్, టంగుటూరిప్రకాశం లాంటి ఎందరో మహానాయకులు నగరాలకు మేయర్లుగా, ఛైర్మన్‌లుగా వ్యవహరించారు. హైదరాబాద్ మహానగరం కూడా నిజాంకాలంనాటికే వైభవకీర్తులు

ఆర్జించినా, మాడపాటి హనుమంతరావు వంటివారు నగర మేయర్లుగా వన్నెకెక్కినవారే! నగరం గొప్పనాయకులను రూపొందించగలగాలి!

రెండు పార్లమెంట్ స్థానాలు, పదిహేను అసెంబ్లీ స్థానాలు జంటనగరాలవే కానీ, ఇప్పుడు విస్తృతి దృష్ట్యా గ్రేటరు మున్సిపల్ పరిధిలో ఇంకా నూటయాభై వార్డులే వున్నాయి. 2009లో జిహెచ్ఎంసి ఎన్నికలు జరిగాయి. మళ్ళీ ఇప్పుడు ఈ 2016లో జరుగుతున్నాయి. షెడ్యూల్డ్‌కాస్ట్‌కు 10 రిజర్వ్ స్థానాలు (అందులో అయిదు మహిళలకు) అలాగే బిసి రిజర్వేషన్‌లో ఇరవైఅయిదు స్త్రీలకుగాను వుంటూ.. మొత్తం యాభైస్థానాలు, మిగితా 88లో కూడా జనరల్ క్యాటగిరీలో మహిళలకు 44 రిజర్వ్‌డ్ స్థానాలు వున్నాయి. మొత్తం 150 వార్డుల్లో ఇలా రిజర్వ్‌చేయబడిన స్థానాలు ఏ నెంబర్ వార్డులకు అన్నది కూడా 'వార్డ్‌రిజర్వేషన్ లిస్ట్ జి.ఓ. ఎంఎస్ నెంబర్ 25లో స్పష్టంగా పేర్కొనబడింది. నిజానికి గతంలో లేనంతగా ఈ మాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల కోలాహలం కనబడుతోంది! ప్రచారసరళి గత కొద్ది రోజులుగా హోరెత్తుతోంది! అన్ని పార్టీలూ నగరంలో ఆధిపత్యంకోసం ఆర్రులుచాస్తున్నాయి. తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్ పై టిఆర్ఎస్ పట్టుసాధించడం ఇప్పుడు అనివార్యం. లేకపోతే పార్టీ పేరు ప్రతిష్టలకే భంగం వాటిల్లుతుందనే భయంలేకపోలేదు. కానీ తెలంగాణ సెంటిమెంట్ ధీమా–నగరంతోనే ముఖ్యంగా ముడిపడి వుండాలన్న ప్రగాఢవాంఛ పార్టీశ్రేణుల్లో బలీయంగావుంది.

ఆంధ్రా చంద్రుడు కూడా నగరవీనీలాకాశంలో ప్రకాశించాలని పరితపిస్తున్నాడు! తమ రెండు కళ్ళసిద్ధాంతం ఇక్కడైనా గెలవాలన్న తపన టిడిపిది. ఇక ఎంఐఎం అయితే నగరం తన 'అడ్డా' అనే భావిస్తుంది. దానిని అడ్డుకోగలనని హిందూత్వ బిజెపి కలలుగంటుంది. కమ్యూనిస్టుల పాత్ర అజేయమైనది. నగరంలో సామాన్యుడికి అండగా ఎర్రజెండా ఎప్పుడూ రెపరెపలాడుతూ వుండాలనే కృషీ వలత్వం లేకపోలేదు. కొత్తగా లోక్‌సత్తా ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీలాగా – ఇక్కడ నగరంలో తాను ఈలవేసి గెలవగలనని ఆశపడుతోంది. ఫైనల్‌గా ఏమవుతుందో చూడాలి!

నగర ఓటర్లమనోగతం ఏమిటన్నదే ఇప్పుడు అందరిముందున్న సవాల్. నగరంలో జనాభాకన్నా ఓటర్లసంఖ్య అధికంగా వుందంటూ – ఓటర్ల జాబితా గురించీ కొన్నాళ్లక్రితమే హడావుడి జరిగింది! ఓటర్ల జాబితా సవరించడం

జరిగిందన్నారు మరి! నిజానికి పోలింగ్‌శాతం సాధారణ ఎన్నికల్లో నగరంలో ఆశించినంతగా నమోదుకాలేదని, అప్పట్లోనే అభిప్రాయం వ్యక్తమైంది. నగరంలో 'ఫ్లోటింగ్ పాపులేషన్' దానికి కారణమన్నవారున్నారు. ఈ గ్రేటర్ ఎన్నికల్లోనయినా పోలింగ్‌శాతం భారీగా వుండాలని ఆశిద్దాం. అసలు ఓటింగ్ సరళిని కూడా ఇంకా సులభతరం చేయవచ్చునీ, బ్యాంక్ ఏటిఎం కార్డుతరహాలలో ఓటరు కార్డు వంటిది రూపొందించి, ఆన్‌లైన్ ద్వారా కూడా పోలింగ్ నిర్వహించే సదుపాయాలుంటే మరింతగా ఓటింగ్ శాతం పెరుగుతుందనీ, ప్రతిపాదిస్తున్న వారున్నారు. నగరం రూపురేఖలు మారిపోతూనే వున్నాయి. నాలుగువందల ఏళ్ళపైబడ్డ చరిత్రగల హైదరాబాద్ – గ్రేటర్ ఎన్నికల ఫలితాల తర్వాత, కొత్త చరిత్ర ఏదయినా రాయబోతోందా? అన్న ఉత్కంఠ కంఠదఘ్నంగా వుంది. నగరపౌరులు ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షిదాం.

**(30.1.2016)**

# నవాభ్యుదయగళహారం-నగరం

"అంతా ఒక్కటే మనమంతా ఒక్కటే.." అంటూ చిన్నప్పుడు సర్వమానవ సమానత్వ గీతాలు వినేవాళ్ళం. కులభేదాలను త్రోసిరాజని అభ్యుదయ చింతకులు తమపేర్ల చివర కులసూచకంగా కనిపించే పదాలను విసర్జించి తమ పేర్లను సవరించి వాడుకునేవారు. సహపంక్తి భోజనాలు చేసి అస్పృశ్యత అనేమాటనే వుండకూడదని భావించేవారు. నిజంగా ఎందరో సంస్కర్తలు, సహృదయ శీలురు కులరహిత సమాజంకోసం పరితపించి పని చేశారు. అటువంటి సంస్కరణ భావాలు కలవాళ్లు కమ్యూనిస్టులుగా తమపై ముద్రపడినా ఆచరణ పథంలో అభ్యుదయగాములుగానే సాగారు.

ఒకప్పుడు 'మాలపిల్ల' చిత్రం ఓ సంచలనం. ఒక కులంవారు మరో కులంవారిని వివాహమాడడమే నేరంగా పరిగణించే కాలాన్ని దాటి చాలా ముందుకు వచ్చేశాం. ఇప్పటికీ కొందరు అలాంటి వారు లేకపోలేదుగానీ ఇప్పుడు వివాహాదివిషయాల్లో అందునా ప్రేమ వివాహాలు క్రమేపీ ఆమోదయోగ్యాలు అవుతూ వచ్చాక కులవివక్ష నిజానికి పూర్తిగా సమసిపోవాలి. అర్థిక వెసులుబాటు లభించాక, విద్య, ఉద్యోగ, వ్యాపారాదులలో ఎందులోనైనా రాణించగల అవకాశాలు సమకూరాక, ప్రతిభా పాటవాలకు, సమర్థతలకు కులం ప్రాతిపాదిక కాజాలదన్న సత్యావిష్కరణలు జరగుతున్నప్పుడు నిజానికి మహనీయులు ఆశించిన సమానత అందరి మధ్య ఈ పాటికి నెలకొనవలసి వుండింది.

కానీ చిత్రంగా శాస్త్ర, సాంకేతికరంగాలలో ఎంత పురోగమించినా, ప్రభుత్వాలు సమానవకాశాల కల్పనకు ఎంతగా తాపత్రయ పడుతున్నా, నిజానికి రాజకీయం ఇవాళ కులాల కుంపట్లను మరింతగా రగిలించేదిగా మారుతూండడమే విషాదం! మునుపు ఎన్నడూ లేనంతగా ఇవాళ కుల సంఘాలు విస్తరిస్తున్నాయి. ఒకప్పుడు తమ పేర్ల చివర కులనామాలను తొలగించుకునేవారుంటే, నేడు పనిగట్టుకుని తమపేరు చివర ఆ కులనామాన్ని చేర్చుకుని మరీ ప్రత్యేక అస్తిత్వం కోసం, గుర్తింపుకోసం,

నాయకత్వంకోసం ఆరాటపడేవారు పెరుగుతున్నారు. కులలవారీగా గుర్తించబడడానికే ప్రాముఖ్యం ఇచ్చేవారు కనపడుతున్నారు

నిజానికి ఇవాళ ఒకరి కులం నిర్ధారించడం కూడా కష్టమే! కాలగతిలో వివాహాలు కులమతాల కతీతంగా జరిగినవి ఎన్నో వున్నాయి. తల్లికులం వేరు, తండ్రి కులం వేరు. మరి వారికి కలిగిన బిడ్డలది తండ్రి కులం అవుతుందా? తల్లి కులం అవుతుందా? అంటే-సౌలభ్యంకోసం, రిజర్వేషన్ సౌకర్యాలకోసం కులమార్పిడి, మతమార్పిడీ చేసుకునే వాళ్లూ పెరిగారు. నిజానికి పేదరికానికి కులం ఎక్కడుంది? ఇన్నేళ్ళ కాలగతిలో అగ్రవర్ణాల్లో పేదలూ వున్నారు. అట్టడుగు వారనుకున్న వారు అవకాశాలను అందిపుచ్చుకుని ఎదిగి సంపన్నులు అయినవారూ ఉన్నారు. అధికారస్థానంలో కూర్చున్నాక ఆ అధికారికి ఎవరయినా అభివాదాలు చేస్తారు. ఇవాళ గౌరవింపబడడానికి డబ్బూ, పదవీ ముఖ్యమనేది స్థిరీకరింపబడిన సత్యం.

నిజమే!, ఎన్నో అవమానాలు, ఎంతో వివక్షత ఎదుర్కొని ఎదిగివచ్చిన దళితులున్నారు. అత్యున్నత స్థాయికి ఎదిగినవారున్నారు. కానీ నిజానికి సమాజంలో ఎంతో మార్పు వచ్చిందనీ కులాతీత, మతాతీత, భాషాతీత, ప్రాంతాతీత వివాహాలతో కుటుంబాలు విస్తరిస్తున్నాయనీ- ఒక వంక మార్పు గోచరిస్తూనే, మరోవంక తమలో తమకే పడక, కులాలలోని ఉపశాఖలమధ్య కూడా స్పర్ధలు పెరగడం జరుగుతోంది. ఎవరు ఏ వర్గానికి చెందుతారు అన్నది కూడా సరికొత్త పరిణామాల ప్రశ్నలను లేవదీస్తోంది. రిజర్వేషన్ల సదుపాయాలు పొందడం కోసం రాజకీయపుటెత్తుగడలు రూపుదిద్దుకుంటున్నాయనిపిస్తోంది. వెనుకబడిన వర్గాలలో చేరాలనే ఆరాటం, ఉబలాటం కొందరిలో అభివ్యక్తమవుతోంది.

నిజానికి రాజ్యాంగంలో పటిష్టమైన సూత్రాలు వున్నాయి. అవి మనం రాసుకున్నవే కనుక అవసరార్థం రాజ్యాంగాన్ని మార్చి కొత్తగా సవరణలు చేసుకోవాలంటే చేసుకోకూడదని ఎవరూ అనలేం. కానీ అది ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి మరి. పొరుగున ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు కాపులను బిసిలలో చేర్చాలనే విషయంలో తర్జనభర్జనలు సాగుతున్నాయి. తమకు అందువల్ల అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని బిసి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

నిజానికి తెలంగాణలో కన్నా కులాధిక్య ధోరణులు, కులవివక్షలు, పోరాటాలు అటువైపే ఎక్కువ కనబడతాయి. చుండూరు వంటి సంఘటనలు, కారంచేడు ఘటనలు

వంటివి అందుకు ప్రబలతార్కాణం. తెలంగాణలో హైదరాబాద్ కేంద్రంగా ఒకప్పుడు మతఘర్షణలు ఎక్కువగా జరిగేవి. కానీ సామరస్యం క్రమేపి నెలకొనగలిగింది. కానీ రాజకీయాలు చేయడానికి మతం అడ్డుపెట్టుకునే పార్టీలు ప్రశాంతత భగ్నం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటాయి. అందుకు అప్రమత్తం కావలసిందే. ఒకప్పుడు భుజంభుజం, కలుపుకు ఎదిగిన కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఘర్షణ చెలరేగడం విషాదమే! బిజెపి అధికారంలో ఉండడంవల్లనే దేశంలో అసహనం పెరుగుతోందని కాంగ్రెస్ అంటూంటే ఇక్కడ హైదరాబాద్‌లో కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య అసహన ధోరణులు పెరగడం చిత్రమే! గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో విజయభేరి మ్రోగించిన వారు 'భిన్న సంస్కృతులు ఎదిగి పూచిన పాదు'ను పదిలంగా అభివృద్ధిపటాన నిలబెట్టవలసిన బాధ్యత ఉంది. నగరం కులమతాలకతీతంగా సర్వమానవ సమానతా పతాకను ఎగురవేయాలని ఆకాంక్షిద్దాం.

**(6.2.2016)**

# వ్యవస్థీకృత వలపు

వయసు పూలతోట
తొలివలపు పూలబాట

అన్నాడో సినీకవి. యవ్వనపు గాలులు అలాగే అనిపిస్తాయి. ప్రణయపు పంథాలో కూడా వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు పెళ్ళాడి ప్రేమించుకునేవారు. ఇప్పుడు ప్రేమించుకున్నాకా, పెళ్లాడుతారన్న నమ్మకం లేదు. భారతీయతలో వివాహ వ్యవస్థ గొప్పదన్న భావన బలీయమైంది. ఫిబ్రవరి 14 ప్రేమికులరోజు.

వేలంటైన్స్ డే అనే ఈ సంస్కృతి మనదికాదని దానిని వ్యతిరేకించే మహానుభావులు వున్నారు. యువతీయువకుల జంటలు కలిసి తిరిగితే, పార్కుల్లో కనబడితే పెళ్లి చేసేస్తామని వీరంగం వేసేవాళ్లూ ఉన్నారు. ప్రేమించుకోవడం అకృత్యం ఏమీ కాదు. ప్రేమ పేరుతో వెర్రి మొర్రి వేషాలు వేయడం, ప్రేమించలేదని యాసిడ్ దాడులు చేయడం వంటివి ఖండించి అరికట్టవలసినవి.

'పుండు ఒక చోట మందు ఒకచోట' అన్నట్లుగా అసలు సమస్య ఒక చోటవుంటే దానిని పట్టించుకోక తామే గొప్ప చికిత్సకులుగా బయలుదేరి బలవంతంగా మందుపట్టించేవారు–సారీ! మందు అలదేవారు ఎక్కువవుతున్నారు. ప్రేమ అంటేనే నిజానికి విశ్వాసం, నమ్మకం, బలీయమైన స్నేహం. ఇద్దరు వ్యక్తుల మధ్య అది ఏర్పడటం ఆరోగ్యదాయక పరిణామమే! అంచునా యువతీయువకుల మధ్య ఆ సదవగాహన సమాజంలో వ్యష్టిని సమష్టి చేస్తుంది. ప్రేమ అన్నప్పుడు అది పరస్పరం ప్రయుక్తమవ్వాలి. ఏకపక్షం అయినా ఎదుటి వారికి ప్రమాదం కానంతవరకూ ప్రమోదమే! కానీ బలవంతంగా ప్రేమను పొందగలగడం కుదరదు. యువతలో ప్రేమకు, ఆకర్షణకూ తేడా తెలుసుకోగల శక్తి పెంపొందించాల్సి వుంది.

వలపు వలన బ్రతుకు బహురుచ్యమైనది
ఎడద తీయదనము బడయసాగె

బాధకౌషధమ్ము బడసియు డెందంబు
మందులేని బాధ నొందెమరల

అంటారు గాలిబ్ దాశరథి తెలుగు సృజనలో. ప్రేమ ఔషధం అన్నది ఎంత నిజమో, మందులేని బాధ అన్నదీ అంతనిజం! అయితే 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అన్న ఫిలాసఫీని స్వీకరించి ప్రేమ త్యాగం కోరడం జరిగితే ఆమోదించే దిటవులేని బలహీనుడు, కక్షల కార్పణ్యాల బలం పెంచుకుని ప్రియురాలిపై దాడులకు పాల్పడే హింసానేర ప్రవృత్తుల పాలవుతూండడం ఆధునిక విషాదం.

నిజానికి గొప్పగా చెప్పుకునే ప్రేమ కథలన్నీ విషాదాలే! సుఖాంత ప్రేమికులు చరిత్రలో నిలిచిన సాక్ష్యాలు తక్కువ. కానీ మన భారతదేశంలో మాత్రమే యాభయ్యవ, డబ్భైఅయిదవ వివాహ వార్షికోత్సవాలు చేసుకున్న జంటలు కనిపిస్తారు. విదేశాల్లో తొంభై ఏట కూడా భార్యను విడిచి వేరే పెళ్లి చేసుకున్న కథనాలు కనబడవచ్చు. అందువల్ల అసలు సిసలు ప్రేమికుల రోజుకి ఆదర్శంగా నిలవగల వ్యవస్థ మనదగ్గరే సాధ్యం.

నిజమే! పాశ్చాత్య సంస్కృతీ సంప్రదాయాల తాకిడి నేడు పెరుగుతోంది. ఇవాళ వివాహ వ్యవస్థలోని అనుబంధాలు కరుగుతూ, బంధాలు తెగుతున్న యువత గోచరిస్తోంది. మరోప్రక్క సహజీవనం అనే సరికొత్త వైఖరి వేళ్లూనడం మొదలైంది. ఒప్పందంతో కలిసి బ్రతకడం అనే 'కొత్తగాలి' వీస్తోంది. నిజానికి ఒక విధంగా ఇవేవీ పూర్తి కొత్తవీ అసలేం! మనది భరతవంశం. ఆ భరతుడు శకుంతల కొడుకు. శకుంతలా దుష్యంతులు సహజీవనం చేయడంతో జన్మించిన వాడే. రాజయిన దుష్యంతుడు తన గుర్తుగా ఓ ఉంగరం ఇచ్చి తన రాజ్యానికి ఇవాల్టి పరిభాషలో 'జంప్' అయిపోవడం, అంగుళీయకం పోగొట్టుకుని ఆమె అగచాట్ల పాలవడం, దుష్యంతుడు రాజ్యసభలో ఆమెను అన్నాళ్ళ సహజీవనం చేసినా గుర్తించకపోవడం ఈ కథంతా మనకు తెలిసిందే. అలాగే శకుంతల తల్లిదండ్రులైన మేనకా విశ్వామిత్రులు కూడా భార్యాభర్తలు కాదు. ఆకర్షణతో సహజీవనం చేసిన వారే!

ఈ కథల వెనుక పరమార్థాలు, ప్రయోజనాలు, నిగూఢార్థాలు ఎన్ని చెప్పినా యువతకు అర్థమయ్యేది బయటకు కనబడుతున్న సత్యం మాత్రమే. అందుకే సీతారాములను ఆదర్శదంపతులుగా పేర్కొంటూ వివాహ వ్యవస్థనూ ఒకే బాణం – ఒకే భార్య అంటూ ఏక పత్నీవ్రతాన్ని ఎలుగెత్తు చాటుతాం. అయినా వ్యవస్థ చెదురుతూనే

ఉంది. నాటికీ నేటికీ స్త్రీ పురుష సంబంధాల్లో ఎన్ని సలక్షణాలు ఉన్నాయో, అన్ని అవలక్షణాలూ ఉన్నాయి.

వ్యవస్థ ఎంత ముందుకెళ్ళినా, ఎంత మారినా, స్త్రీల అవస్థలో కష్టాలకు, కడగండ్లకు కొత్త రూపులొస్తున్నాయి తప్ప సమానతనుగానీ, సాధికారతను గానీ పూర్తిగా సాధించలేదనే చెప్పాలి. స్త్రీల ఆలోచనా విధానాల్లో, నడవడిలో మునుపెన్నడూ లేనంత తీవ్రత ఈనాడు వుంది. స్రీవాదం, స్త్రీవాద సాహిత్యం వారిలో ప్రభావోపేతమైన మార్పులకు బాటలువేస్తున్నాయి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో, ఆర్థిక వెసులుబాటులో, నిర్ణాయకశక్తిలో గణనీయమైన పెనుమార్పులు కానవస్తున్నాయి. అదే సమయంలో ఆ పరిణామాలు కూడా పురుషాధిక్యతకు మరోరకంగా దోహదపడేవి అవుతున్నాయన్న వైఖరులూ కానవస్తున్నాయి.

సహజీవనంవల్ల కూడా పురుషుడు లాభపడినంతగా స్త్రీ స్వేచ్ఛా పథగామి కాగలిగింది అనుకోలేం. ఇప్పటికీ 'చాకిరీ' అనేది ఆమె ఏదో రూపంలో చేయవలసివస్తోంది. దాని నుంచి తప్పించుకోలేని అసహాయత, కాదంటే కొత్త కష్టాలు కానవస్తున్నాయి. బంధాలుకాదు, అనుబంధాలు ముఖ్యం అన్నది గుర్తెరగవలసిన సత్యం. స్త్రీ పురుష సంబంధాల్లో ఆరోగ్యదాయకమైన కలుషితం కానీ కెమిస్ట్రీ పనిచేయాలి. హృదయంలోని ప్రేమైకరస రసాయనం శాశ్వత స్నేహానుబంధంతో క్షాళితమై పునీతం కావాలి.

ప్రేమించు ప్రేమకై
ప్రేమించు ముక్తికై

అని కవి అన్నారంటే ప్రేమ ఒక బాహిర అంశం కాదనీ, ఆంతరిక జీవనవికాసశక్తి అనీ గ్రహించాలి. ప్రేమికుల రోజు అనేది ఏడాదికి ఒక రోజు కాదు మానవసంబంధాలలో ప్రతినిత్యమూ సతతహరితంగా వెలుగొందే రోజు కావాలి. స్త్రీ పురుషుల సమష్టి శక్తిగా వ్యవస్థను అనుబంధాలతో పురోగమింపచేసేది కావాలి.

**(13.2.2016)**

# పాపం! దేశభక్తి

"ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ లేక పోవడం దేశభక్తి కన్నా హీనమైన పాపం" అంటాడు ఒకచోట రచయిత చలం. ఇవాళ పాపం దేశభక్తి అనే మాట కూడా విచికిత్సలో పడింది. ఎవరికి తోచినట్లు వారు మాట్లాడటం, తమ ఆలోచనా సరళే అనుసరణీయం అని శాసించే స్థితికి తీసుకురావడం ఓ వ్యూహంగా సాగుతోంది. సంక్లిష్ట సమాజంలో–అంశాలను కూడా సంక్లిష్ట పరచడం జరుగుతోంది. భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందంటూనే తమ భావాలకు విరుద్ధమైన ప్రకటన వినబడినంతనే పెచ్చు రేగిపోయే అసహనం పెరిగిపోతోంది. దొంగే "దొంగ దొంగ" అని అరచి గోలచేసినట్లు, నేరస్తులే చట్టాలను శాసించాలను కుంటున్నారు. కాలాంబరకవచధారులై తిమ్మిని బెమ్మిని బెమ్మిని తిమ్మిని చేయగల న్యాయవాదులు తమ నల్లకోటు మాటున కోర్టుల ఆవరణలో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లుగా వ్యవహరించడం ఏమి న్యాయమో అర్థంకాక సభ్య సమాజం విస్తుపోతోంది.

ఎవడు దేశభక్తుడు? ఎవరు దేశద్రోహి అని నిర్ణయించేదెవరు? అధికార పక్షీయులు దేశభక్తులు, వారికి వత్తాసు పలకని, బయటనుంచయినా సమర్థించని ప్రతిపక్షమంతా దేశద్రోహులేనా? బ్రిటీష్ హయాంలో గాంధీ కూడా దేశద్రోహి కిందే లెక్కమరి! ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఎలా ఎలుగెత్తినా, దానికి దేశద్రోహ ముద్ర వేయడం రాజ్యానికి కొత్తకాదు. అయితే ఇప్పుడు తెలివిమీరినతనం విశృంఖలమవుతోంది.

కశ్మీర్ భారత్ పాక్‌ల మధ్య సరిహద్దు మాత్రమే కాదనీ, దానికంటూ, ఒక అస్తిత్వం, ఒక ఆత్మవున్నాయని నెహ్రూయే పార్లమెంట్‌లో వక్కాణించిన సందర్భాలు అనేకం వున్నాయి. కశ్మీర్ ప్రజలకు వారి వైన ఆకాంక్షలు వున్నాయి. వారి స్వయం ప్రతిపత్తి 1960 దశకం వరకూ బానే వుండింది. మఖ్బూల్ భట్ కశ్మీర్ తిరుగుబాటుదారుడిగా 1984లో ఉరితీయబడగా గత ఏడాది ఉరితీయబడిన అఫ్జల్‌గురు కూడా కశ్మీరీయే!

నిజానికి ఉరికి వ్యతిరేకంగా, ఉరిశిక్షలకు వ్యతిరేకంగా మానవహక్కుల గురించి ఆలోచించే వారు ఎప్పటినుండో మాట్లాడుతూనే వున్నారు. ప్రశ్నిస్తూనే వున్నారు. తీవ్రవాదుల పట్ల సానుభూతి వేరు. ఉరిని వ్యతిరేకించడం వేరు అంటే కూడా కొందరికి మింగుడుపడని స్థితి. జమ్ము, కశ్మీరులో పిడిపితో కలిసి బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరి అప్పుడు నిజానికి పిడిపి అఫ్జల్‌గురు ఉరిని ఖండించిన విషయం వారికి గుర్తురాలేదా అని అడిగితే కూడా తప్పేనా?

తాము అంటున్న దానికీ, చేస్తున్న దానికీ హస్తిమశకాంతరం వున్నా, తమ ఆలోచనల్లో హేతుబద్ధత, తార్కికత కొరవడుతున్నట్లున్నా దేశభక్తి పేరు చెప్పి హీనమైన పాపం చేయడం వైక్లబ్యమే. సుప్రీం కోర్టే నిర్ఘాంతపోయేలా పాటియాలా కోర్టు ముంగిట న్యాయవాదులు ఓ అర్థశతం మంది జెఎన్‌యు విద్యార్థులను, అధ్యాపకులనూ తమ దాడికి గురిచేసి కల్లోలం సృష్టించడం, విద్యార్థి నేత కన్హయ్య కుమార్‌ను ముందుగా తామే శిక్షించ బూనడం ఏ రకమైన దేశభక్తియో చెప్పేదెవరు?

నిజానికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నాణ్యతా ప్రమాణాలకు పేరెన్నికగన్నది. భావప్రకటనా స్వేచ్ఛకు, మేధోమయ వాతావరణానికి ఉపబలకంగా వున్నది. కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు గురించి గత వారంలో అఘాషాహిద్ అలీ రాసిన ఓ కవిత “ఏ కంట్రీ వితౌట్ పోస్టాఫీస్” అన్న దానిని మూలకందంగా చేసుకు జరిగిన సాంస్కృతికసమావేశం పెద్ద తప్పై పోయింది. యూనివర్సిటీలు తమ భావజాలం గుప్పిటలోంచి జారిపోతున్నాయేమోన్న భయమే దేశభక్తి తమ పేటెంట్ అన్నట్లు భుజానవేసుకున్న పరివారం తామే అల్లరి సృష్టించి, తామే నినాదాలు ఇచ్చి, దానికి బాధ్యులుగా తెలివైన విద్యార్థులను, కొందరు అధ్యాపకులను చిత్రించి పోలీసులను, మీడియాను తమకు అండగా నిలవకపోయినా కండబలం చూపే కార్యాచరణకు సమకట్టి, వీరంగం వేయడం ఏ విధమైన జాతీయతా స్ఫూర్తియో ఆలోచించనక్కర్లేదా?

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ మరణం, జెఎన్‌టియులో కన్హయ్యకుమార్ పట్ల ఆరోపితమౌతున్న దేశద్రోహం, కుట్ర సక్రమంగా అర్థంచేసుకోలేకపోతే, వాస్తవాలను పక్కదారులు పట్టించి, విపరీత వ్యాఖ్యానాలను, అవాంఛిత ఆరోపణలను గావిస్తే ఎవరుచేసినా అది తప్పే! తప్పు ఎవరుచేసినా అది తప్పే! అగ్రరాజ్యపు అడుగులకు మడుగులొత్తుతూ, వారి కనుసన్నల దారిలో అభివృద్ధి

మంత్రాలను పఠిస్తూ, ప్రణాళికలు రచిస్తూ సాగడం దేశభక్తి అవుతుందా అని పౌరుడు ప్రశ్నించడం దేశద్రోహమై పోతుందా? అదే జరిగితే "నిన్నూ, ఈ దేశాన్నీ రక్షించడం నావల్లకాదు" అన్నట్లే అవుతుంది.

కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా ఉత్తాలమైన విలువలతో నిలిచేది జాతీయత. దేశంకోసం దేశంలో వుంటూ దేశీయుడిగా దేశాభివృద్ధికి పాటు పడడం, చదివిన చదువును, పెంచుకున్న మేథస్సును పైన ఎక్కడో తాకట్టు పెట్టక దేశంకోసం వెచ్చించడం-విద్యార్థులకు యూనివర్సిటీలు కర్తవ్యంగా మనసారా అందించగలిగితే, స్వదేశంలోనే అవినీతి, అశ్రితపక్షపాతాల పదఘట్టనల క్రింద నలగడం, కులాల పేరిటి కుంపట్ల చిచ్చులో ఆహుతి కావడం జరగకుండా వుంటే-అదికదా మానవవనరుల అసలుసిసలు దేశ సౌభాగ్యం!

హక్కుల పోరాటాలతో, బాధ్యతల అనుసరణంతో, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల పథంలో నిజమైన ప్రజాస్వామ్యయుత దిశగా విద్యార్థిలోకం ఎదిగి రాణించగల కాలం ఎప్పటికో మరి!

**(20.2.2016)**

# ఆరోగ్యమే మహాభాగ్యం

బాగా గుర్తు, చిన్నప్పుడు మా మలక్‌పేట కాలనీలో ప్రభుత్వ ఆసుపత్రి వుండేది. జ్వరం వస్తే అక్కడికెళ్లి మందుగోళీలు, అరకుమందు తెచ్చుకు వేసుకుంటే టక్కున తగ్గేది. పిల్లలం ఆడుతూ కిందపడి దెబ్బలు తగిలించుకుంటే, ఆసుపత్రిలో టించర్ అయోడిన్ వేసి మందురాసి, గాజుగుడ్డతోకట్టు కట్టేవారు. ఎప్పుడూ ఆసుపత్రిలో డబ్బులిచ్చినట్లు కూడా లేదు. ఎంతో అవసరమైతే తప్ప, ఇంజక్షన్ అంటే సూదిమందు కూడా ఇచ్చేవారు కాదు. ఎంతో పెద్ద జబ్బు అనుకుంటే తప్ప అసలు ఉస్మానియాకు, గాంధీ ఆసుపత్రిదాకా కూడా వెళ్లవలసిన అవసరమూ వుండేది కాదు.

నేనెరిగిన ఒక అర్ధశతాబ్దపుపైని హైదరాబాద్ నగరంలోనే – ఇవాళ ప్రభుత్వ ఆసుపత్రులు కళావిహీనమై కార్పొరేట్ ఆసుపత్రుల కల్చర్ ఇంతగా విస్తరించడం నిజంగా అబ్బురపరుస్తుంది. ఇవాళ విద్య తరువాత బాగా ఖరీదైన రంగంగా వైద్యం మారి పోయింది. మా నాన్నగారు కీ.శే. అల్లంరాజు కామేశ్వరరావు గారు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్‌లో పనిచేశారు. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో లే–సెక్రటరీ అండ్ ట్రెజరర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. డైరెక్టరేట్‌లో వున్నప్పుడు మా యింటికి ఎందరో ప్రభుత్వ డాక్టర్లు వారి ట్రాన్సఫర్ల గురించీ, వాటి గురించీ వస్తుండేవారు కూడాను. నాన్నగారు విధ్యుక్తధర్మం పాటించడంలో క్రమశిక్షణా యుతులు. ఎందరినో ఒప్పించి గ్రామాల ఆసుపత్రులలో డాక్టర్లు అందుబాటులో వుండి పని చేయాల్సిన ఆవశ్యకత గురించి చెబుతుండేవారు.

అలాంటిది సర్కార్ దవాఖానాల మీద ప్రజలకు క్రమేపీ దురభిప్రాయం ఏర్పడే పరిస్థితులు ఎలా వచ్చాయో తలుచుకుంటే ఆశ్చర్యమనిపిస్తుంది. 'నేను పోను బిడ్డో సర్కారు దవాఖానాకు' అని ఆసుపత్రుల అమానవీయతల మీద పాటలు కట్టి పాడుకునే దుస్థితి తెలంగాణకు సంప్రాప్తించడానికి, నాటి పాలకుల ధోరణీ, వైద్యవ్యాపారం చేసే అవాంఛనీయతలకే కొమ్ముకాసిన వైఖరీ స్పష్టమేనని చెప్పాలి. ఇవాళ సామాన్యుడికి వైద్యం అంటే భయం పట్టుకుంది. లక్షలు ఖర్చుపెడితే గానీ, స్వాస్థ్యత చిక్కదన్న దిగులుపట్టుకుంది. కార్పొరేట్ వైద్యం ఎంత ఖరీదయినా –

నిష్ణాతులైన డాక్టర్లు అక్కడే వుంటారనీ, ప్రాణాలను నిలబెట్టగల సామర్థ్యం వారికే వుందనీ ఒక బలీయమైన విశ్వాసం జనంలో ఏర్పడింది. ప్రైవేటు ఆసుపత్రులు అయినదానికీ కాని దానికీ వైద్యపరీక్షలు అంటూ డబ్బులు ఖర్చయ్యేలా చేస్తున్న హడావుడి, చికిత్స పేరుతో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని రూమ్‌కనీ, మందులకనీ, వైద్యసేవలకనీ వసూలు చేస్తున్న రొఖ్ఖం చూస్తుంటే – వైద్యానికంటూ అయ్యే ఖర్చుడబ్బుతో ఓ కుటుంబం ఓ ఏడాది హాయిగా తిని బతకచ్చు అనేలాగానే వుంది.

మొన్న బుధవారం తన క్యాంపు ఆఫీసులో జరిగిన వైద్యశాఖ బడ్జెట్ సమీక్షలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సర్కారు దవాఖానాలపట్ల ప్రజలకు విశ్వాసం కలిగే పరిస్థితి రావాలనీ, ప్రజావసరాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించడానికి కోరినన్ని నిధులు వైద్యశాఖకు ఇవ్వడానికీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించడం ఎంతో ముదావహమైన సంగతి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి టీచింగ్ ఆసుపత్రుల వరకు అన్నింటిలో పరిస్థితి మెరుగుపడాలి అంటూ కెసిఆర్ పూర్తి స్థాయి సంస్కరణలను తీసుకువస్తామని అనడం ఆనందదాయకం. నిజమే! అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ పోస్టులు, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీచేస్తూ అవసరమయితే కొత్తపోస్టులనూ మంజూరు చేస్తామనడం బాగుంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నా ప్రైవేటు క్లినిక్‌లు పెట్టుకోవడం, ప్రభుత్వ దవాఖానాకు వచ్చిన పేషెంట్లను అక్కడకాక తమ క్లినిక్‌లవైపు మరల్చుకోవడం, కొందరు ఆఫీసులోంచి పెన్సిళ్లు, కాగితాలూ వంటివి ఇంటికి పట్టుకుపోయినట్లు, ఆసుపత్రికి సప్లయ్ అయ్యే ఉచిత మందులను తమ క్లినిక్‌లకు తరలించుకోవడం, కొందరు డాక్టర్లు కలిసి ప్రైవేటుగా పోలీ క్లినిక్‌లు స్థాపించడం ఇలా ఒక విషవృత్తంగా మొదలై, కొందరు డాక్టర్లు పడే డబ్బు కక్కుర్తి మూలకందంగానే వైద్యరంగంలో ప్రైవేటు కల్చర్, కార్పొరేట్ కల్చర్ వెల్లూనుతూ వచ్చింది. పట్టణాల్లో తప్ప గ్రామాలకు వెళ్ళి ప్రజలకు సేవచేయాలనే అంకిత భావం వైద్యవిద్యార్థుల్లో లోపించే వాతావరణం ఏర్పడింది. కెసిఆర్‌గారు హెచ్‌ఓడీల నుంచి అధికార వికేంద్రీకరణ జరగాలని, ఆసుపత్రుల వారిగా బడ్జెట్‌ను కేటాయించి, స్థానిక అవసరాలమేరకు ఆ నిధులను వినియోగించుకునే హక్కు యూనిట్ సూపరింటెండ్లకు ఇవ్వాలని సూచించడం నిజంగా మంచిది. ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్లదోపిడీకి గురికాకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య పరికరాలను కొనడం, వినియోగించడం చాలా ముఖ్యం. గ్రామీణ,

ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అగత్యం ఎంతైనా ఉంది.

నిజమే! మార్పు ఓ రాత్రికి రాత్రి తెల్లవారేసరికల్లా వచ్చేయదు. కానీ కొన్ని కఠిన నిర్ణయాలు ఒక్కోసారి అవసరమైతే, అసలు వైద్యవిద్య అనేది ప్రజాసేవకు పరాకాష్ఠ వంటిదనీ, ఆ సేవాభావన గలవారే వైద్యులుగా అర్హులనీ ప్రభుత్వం ఆచరణలో పెట్టగలిగితే మంచికి మార్పు జరుగకమానదు. వైద్యాన్ని వ్యాపారం చేసుకున్న కార్పొరేట్ హాస్పిటల్స్ ఆ రోగమే మహాభాగ్యం అన్నట్లు, ఇప్పుడు నిజంగా సర్కార్ దవాఖానాలు బాగుపడి ఆరోగ్యమే మహాభాగ్యం అన్న ఆరోగ్యసంపదను, ఆయుస్సంపదను జనావళికి అందించగలిగితే అదికదా బంగారు కాలం! ఆ రోజెంతో దూరం లేదు అని ఆకాంక్షిద్దాం మరి!

**(28.2.2016)**

# 'ప్రాణహిత' చర్యలు

యుద్ధరంగంలోకి వెళ్ళే వీరుడు శిరస్త్రాణాలు ధరించినట్లు, ఇప్పుడు రోడ్లమీదకి వెళ్ళే వాహనచోదకుడు శిరస్త్రాణం అనగా హెల్మెట్ ధరించక తప్పనిసరి అవుతోంది. నిజమే! రహదారి ప్రయాణాలు యుద్ధభూమిని తలపిస్తున్నాయి. గణనీయంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు రహదార్లు రక్తసిక్తమవుతూనే ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ వుంటుందని నమ్మాలి. మామూలు సైకిల్ మీద వెళ్ళే వాళ్ళు కూడా హెల్మెట్ ధరించక తప్పని కఠిన నిబంధనలు వచ్చినా వచ్చేస్తాయి. కానీ ట్రక్కులు, లారీలు, టిప్పర్లు, బస్సులు, కార్లు ఇవన్నీ కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. ప్రమాదాల పాలవుతున్నాయి. ఆటోరిక్షాలు కూడా రోడ్డు ప్రమాదాలకు యథాశక్తి తోడ్పడుతున్నాయి.

అసలు రోడ్ల గురించి, వాటి అధ్వాన్నస్థితి గురించీ పట్టించుకుని వాటిని ప్రయాణ యోగ్యంగా చేసే కృషికి గండికొట్టి, వాహన చోదకుల మీద పడి చలాన్లు, జరిమానాలు అంటూ రెచ్చిపోవడం మామూలైపోయింది. కౌన్సిలింగ్ ఇచ్చినా, ఈ-చలాన్లు చేతికిచ్చినా వాహనదారుల్లో సరైన స్పందన రావడం లేదన్న ట్రాఫిక్ పోలీసుల ఆవేదన కొట్టిపారేయలేం! ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయడం మంచిదే కానీ ఆ ట్రాఫిక్ రెగ్యులైజేషన్, ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన బాధ్యత పోలీసులదే కదా! ట్రాఫిక్‌జామ్ కాకుండానూ, అయితే వెంటనే చక్కదిద్దడానికీ-ట్రాఫిక్ పోలీసులు తమ కర్తవ్యాలను ఏ మేరకు నిర్వహిస్తున్నారన్నదీ ప్రశ్నే. ఈ-చలానా, రూపంలో గత నాలుగేళ్లలో 160 కోట్ల రూపాయలు జరిమానాగా ట్రాఫిక్ విభాగం రాబట్టిందట! అంటే ఏమిటన్నమాట! పౌరులలోని ఒక విధమైన అసహనానికి గుర్తుగానే ఇది తోస్తోంది. డబ్బు పోతేపోయింది ప్రయాణం సుఖంగా జరగాలన్న ధోరణిలో ట్రాఫిక్ ఉల్లంఘనల ద్వారా స్వేచ్ఛాయుత ప్రయాణాన్ని అభిలషించే వైఖరి కానవస్తోంది.

యువత ముఖ్యంగా సాహసాన్నీ, వేగాన్నీ కోరుకుంటుంది. ఆ వయసు తీరే అటువంటిది. అందునా బైక్‌లు అనేవి వారిచేతికి చిక్కాయంటే ఆ ఉత్సాహపు ఉరకలేవేరు. నిజమే! నిదానమే ప్రధానం. కానీ ఆ వయసులో అది ఎక్కడ

తలకెక్కుతుంది. ఎందరో సెలబ్రిటీల కుమారులు అతివేగపు ప్రమాదాల్లో అసువులు బాసిన కథలున్నాయి. బైక్ ప్రయాణాల నిబంధనలు కఠినతరం చేయవలసిందే, కుర్రకారు ఆగడాలకు అడ్డుకట్ట వేయవలసిందే! అయితే గేర్‌బండ్ల విషయంలో, వాటిని నడిపేవారి విషయంలో, అలాగే స్త్రీలు, వృద్ధులు నడిపే గేర్‌లెస్ బండ్లు అంటే స్కూటీలు, యాక్టివాలు, టీవీఎస్ వంటి వాహనాల విషయంలో ట్రాఫిక్ పోలీసులు ఒకేలాంటి కఠిన వైఖరి తీసుకోవడం సబబుకాదనే భావన ఇటీవల ప్రబలంగా వినబడుతోంది. ఒకప్పుడు సైకిల్‌కు కూడ లైసెన్స్ వుండేది. ఆనాటి రవాణా వ్యవస్థ వేరు. నేటి వ్యవస్థలో చిన్న వాహనాలకు కొన్నింటికి కొన్ని విషయాల్లో అలాంటి మినహాయింపు ఇవ్వవచ్చు. అతి వేగంగా దూసుకుపోయే వాహనాలను, ఆ వాహన చోదకులను నియంత్రించవలసిందే!

హెల్మెట్ నిబంధన అనేది కొత్తదేమీ కాదు. దానిమీద అనేక తర్జనభర్జనలు సాగాయి. హెల్మెట్ ధరించడంవల్ల జుట్టు రాలిపోవడం, చెవులు వినపించకపోవడం, ఎండాకాలంలో చెమటలవల్ల శిరస్త్రాణం పెద్ద భారంగా మారడం ఎందరో ఫిర్యాదు చేసిందే! హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయాలు ప్రమాద పరిస్థితుల్లో నియంత్రించడం సాధ్యమంటున్నా, తలపగిలి పుర్రె హెల్మెట్‌కు అతుక్కుపోయిన ప్రమాద గాథలు గతంలో విన్నవీ ఉన్నాయి. ఇంతకీ వానరాకడ – ప్రాణంపోకడ అన్నారు. ప్రాణం పోయేదే వుంటే ఏ వాహనం మీదా కాక, పాదచారియై వెడుతున్న వారిని వాహనం గుద్దేసి ఆ పాదచారులు క్షతగాత్రులవుతున్న సందర్భాలూ, అసువులు పోగొట్టుకుంటున్న ఘటనలూ అనేకం వున్నాయి. ఒకాయన రోడ్డు మీద నడుస్తుంటే ఓ కారు గుద్దేయబోయింది. ఆ కారు అతన్ని "చూసుకు నడపలేవూ?" అని బాటసారి అడిగితే, తనదే తప్పయినా బుకాయిస్తూ ఆ కారు యజమాని – "నేను పదేళ్లుగా కారు నడుపుతున్నాను తెలుసా! నువ్వు చూసుకు నడవలేవూ?" అని పాదచారినే గద్దించాడట! దానికి పాదచారి "నేను నలభై ఏళ్లుగా నడుస్తూనే వున్నాను" అని సమాధానం ఇచ్చాడట! తప్పిదాలు జరుగుతాయి. లోపాలూ వుంటాయి. కానీ మౌలికంగా శ్రద్ధ, క్రమశిక్షణ, జాగరూకత అవసరం. రోడ్లు కేవలం తమవే అన్నట్లుగా, ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తూ వాహనాలు నడపడం దోషం! అలాగే పాదచారులకూ నియమాలూ, సూత్రాలు వున్నాయి. ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించకుండానూ, అవసరమైన చోట పరస్పర సహకారంతోనూ సాగడం

అవసరం. అంబులెన్స్‌కు దారి ఇవ్వాలన్న జ్ఞానం ఇప్పటికీ మనవాళ్లలో ముఖ్యంగా జంటనగరాలలో కనబడడం లేదు. ట్రాఫిక్ పోలీసులు రాజకీయ నాయకుల వాహనం అయితే నిరాటంకంగా సాగిపోవడానికి తగిన హంగామా రోడ్లపై సృష్టిస్తారు కానీ, ప్రాణాపాయ స్థితిలో వున్న రోగిని తీసుకెడుతున్న అంబులెన్స్‌కు ఏ ట్రాఫిక్ పోలీసూ దగ్గరుండి దారి ఇప్పించిన దాఖలాలు కనబడవు. నిజానికి విధిగా జరగవలసిన ఆ నిత్యవ్యహరాలకు నూటికో కోటికో ఒక పోలీసు ఆ పనిచేస్తే, అది గొప్పవార్తగా చెప్పుకు ఆనందించే దౌర్భాగ్యస్థితిలో వుంటున్నాం మనం! నిజానికి ట్రాఫిక్‌భద్రత అనేది ప్రతి ఒక్కరి కర్తవ్యం. స్వేచ్ఛగానూ, సురక్షితంగానూ ప్రయాణాలు సాగాలి. కఠినతర నిబంధనలు మొండి వాళ్ళుగా జనాలను మార్చేవిగా కాకుండా, నిజంగా స్వచ్ఛందమైన మార్పుకు దోహదకారిగా వుండాలి. అందరికీ లైసెన్సులు వుండి, అందరూ హెల్మెట్లు ధరిస్తే ఇక ఒక్క రోడ్డు ప్రమాదమూ జరగదనీ, అలా జరగకుండా మేం బాధ్యత వహిస్తామనీ ప్రభుత్వం ముందుకొస్తుందా? చూడాలి!

**(5.3.2016)**

# మానవ సంబంధ విని'యోగం'!

పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడాల నుంచి అమ్మకం, కొనుగోళ్ళ స్థాయికి మానవ జాతి ఎప్పుడైతే పరిణామం చెందిందో, అప్పుడే స్వార్థం, దోపిడీ వేళ్ళూనుకున్నాయి. ఒకప్పుడు సమూహాలు తమ ఉత్పత్తులను ఇతర సమూహాలకు ఇచ్చి, వారి ఉత్పత్తులను తాము పంచుకునేవారు. పంటలైనా, కూరగాయలైనా అంతే! పనిచేయించుకున్న యజమాని – పనివారికి తన ఉత్పత్తుల్లో వాటా ఇచ్చేవాడు. కుంచాలతో కొలిచి ధాన్యాలను పంటచేతికి రాగానే పనివారికీ పంచేవారు. వారూ వీరూ కూడా సంతోషంగా సహజీవనం చేసేవారు.

కానీ ఆ కాలం పోయింది. మనిషికీ మనిషికీ మధ్య ఇప్పుడు గట్టిపడుతున్నదల్లా వ్యాపార సంబంధాలే! అవే... ఆర్థికసంబంధాలు. ఎదుటి వాడి వల్ల 'తనకేంటి?' అనే ఆలోచన మునుపటి రోజుల్లో ఇంతలా వుండిందనుకోలేం! ఇప్పుడు విజృంభిస్తున్నదల్లా కన్స్యూమరిజం! మానవ సంబంధాల్లో కూడా బేరసారాలు చొచ్చుకు పోయాయి. నిజానికి వ్యాపారము అంటే 'పని' అని అర్థం. పనికొచ్చే పని చేయడం అసలుకి వ్యాపారం. వ్యష్టి సమష్టి గురించి వ్యాప్తమై పని చేయడం నిజానికి 'వ్యాపారం' కావాలి. కానీ తన స్వార్థంకోసం పనిచేయడం. ఇతరులను వంచించి అయినా తన పని కానిచ్చుకోవడం అనే దిశకు సమాజం చేరుకుంది. ఎటొచ్చి దీనిని పతనం అని కాకుండా 'ఉత్థానం'గా భావించే ధోరణి ప్రబలింది.

మార్చి 15 వినియోగదారుల దినోత్సవం. ప్రతి మనిషి ఏదో రకంగా వినియోగదారుడే! వస్తువులను, సేవలను వినియోగించుకోకుండా ఎవరూ మనలేరు. ఎటొచ్చీ ఇప్పుడు ప్రతి వస్తువుకీ, సేవకీ ఒక ఖరీదుకట్టడం, అది కావాలనుకున్నవారు చెల్లించి పొందడం వ్యవస్థీకృతమైంది. అమ్మకాలు ఎప్పుడైతే అనివార్యమయ్యాయో అవసరం పడినవారికి వాటి కొనుగోళ్ళు ఆవశ్యకమయ్యాయి. ఇచ్చిపుచ్చుకోవడాలు పోయి అమ్మకం, కొనడం అనే వ్యాపారీకరణం జరిగాక వినియోగదారుడికి హక్కులు గుర్తురావడంలో తప్పులేదు. తాను కొనే వస్తువు నాణ్యమైనదీ, ఎన్నికయినదీ, మన్నికయినదీ కావాలనీ, తాను వెల ఇచ్చి పొందుతున్నదేదీ వెలవెల బోయేలాగా,

తాను విలవిలలాడేలానూ వుండక, అందువల్ల ఆనందంతో, ఉపయోగంతో కళకళలాడాలన్నది అభిలాష! అది సహజం.

అయితే ఎదుటివాడి అవసరాన్ని ఆసరాగా తీసుకుని వారి తక్షణావసరాలు తీర్చేనెపంతో నాసిరకం వస్తువులను అంటగట్టడం, అరకొర సేవలు అందించడం మోసం! వినియోగదారులు మోసపోకూడదనీ, వంచన పాలవకూడదనీ వినియోగదారుల రక్షణచట్టం 1986లో మన దేశంలో ఏర్పడింది. నాణ్యతలేని సరుకులు, చిత్తశుద్ధిలేని సేవలు ప్రశ్నించబడడం వినియోగదారుడి హక్కు అయింది. డబ్బు చెల్లించి పొందేది ఏదయినా వినియోగదారుల రక్షణచట్టం పరిధిలోకి తేబడింది. ఆఖరికి వైద్యసేవలు కూడాను. డాక్టర్‌కూ రోగికీ మధ్య వ్యాపారబంధం అసలు వుండకూడదు. వైద్యోనారాయణో హరి ః అంటూ వైద్యుడు దైవసమానుడిగా భావింపబడే చోట, చచ్చినశవం మీద కార్పొరేట్ ఆసుపత్రులవారు వైద్యచికిత్సలపేర కాసులు దండుకోవడం అమానుషంగా అభివ్యక్తమైన ఘటనలూ జరిగాయి! కన్స్యూమర్ కోర్టులు ఏర్పడి న్యాయం కోసం సామాన్యుడు వాటి గడప ఎక్కే వీలునిచ్చాయి.

కానీ అనేక చట్టాల్లాగానే అది నేడు కాగితాలకే పరిమితమైనట్లుగా, యథేచ్ఛగా వ్యాపార మోసాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఎటొచ్చీ అవన్నీ ఆకర్షకంగా కొత్తరూపెత్తుకుంటున్నాయి. 'ఉచితం' అనే మోజుతో వినియోగదారులైన మనల్ని బలంగా ఆకర్షించే వ్యాపార సూత్రం– ఒకటి కొంటే రెండు ఉచితం అనీ, ఒక వస్తువు కొంటే మరేదో వస్తువు దానితో ఫ్రీ అని ఊదరగొట్టి, అక్కరలేకున్నా కొనిపించే వైఖరి వ్యాపార 'దక్షత'గా ప్రబలుతూనే ఉంది. ఇవాళ 'మాల్స్' చేస్తున్న గోల్‌మాల్స్ నిజానికి బోలెడు. కానీ జనం బకరాలు అయ్యేందుకే సిద్ధమై పోతున్నట్లుంది. సూపర్‌మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లో సీల్ చేయబడిన కూరగాయలను బేరం ఆడకుండా అది చచ్చువైనా, పుచ్చువైనా కొనేసే జనమే, చిరు వ్యాపారస్తుడు బండిమీద కూరగాయలు అమ్ముకోవడానికి వస్తే వాడితో గీచిగీచి బేరమాడుతూ, తానే స్వయంగా సరుకును ఏరుకుంటూ కూడా, వాడేదో తనను మోసం చేసేస్తున్నట్లు భావించుకోవడం చూస్తుంటే నిజంగా ఎడతెగని ఆర్తి కలుగుతుంది.

సూపర్ బజార్‌కు వెళ్లినవాడు తన ట్రాలీలో అన్నీ అవసరమైన వస్తువులే వేసుకుని బిల్లు చెల్లించి కొనుగోలు చేస్తున్నాడనుకునేలా లేదు. అక్కరలేని వస్తువులు, ఆకర్షణతో బులిపించే సరుకులు, తత్కాల బహీనతలకు లోనై అదనంగా కొంటూనే

వుంటున్నాడు. నిజానికి చిల్లర దుకాణాలు, బండ్లమీద అమ్ముకునే వారూ వీరితో వినియోగదారుడికి ఒక ఆత్మీయ బంధం ఏర్పడగలిగే అవకాశమున్నట్లుగా, మాల్ యాజమాన్యాలతో వుండదుగాక ఉండదు. కూరగాయలు, పాలు, నిత్యావసరసరుకులు వాడికగా చిన్న దుకాణాలు అనుకుంటున్న చోట నుంచి కొనుగోలు చేయడంలో నిజానికి ఒకరూపాయి అదనంగా ఖర్చయినా పటిష్టమయ్యే మానవీయ సంబంధాలను ఏ మూల్యంతో కొనగలం?

వ్యాపార ప్రకటనల హోరు, జోరు ప్రభావం కూడా కంఠదఘ్నంగా వుంటోంది. ఇంట్లో ముందుగదిలోనే తిష్ఠవేసుకుని కూర్చున్న టీవి ఛానెల్స్ మెదళ్ళను కన్స్యూమరిజంతో నింపుతున్నాయి. ఇవాళ 'ఆన్‌లైన్' వ్యాపారమూ వచ్చేసింది ఫ్లిప్‌కార్డ్లు, అమెజాన్‌లు ఒక వంకా, నేచర్ బాస్కెట్, బిగ్‌బాస్కెట్‌లు ఒకవంకా, నేప్‌టాల్ అమ్మకాలు ఒకవైపు, సెకండ్ హ్యాండ్ సరుకులకై 'ఓఎల్ఎక్స్' వ్యవహార సరళి బలీయమై, స్థిరపడుతున్న అంతర్జాల సరికొత్తవిపణి అయ్యింది. ఇంట్లోంచి కదలకుండానే అమ్మకాలూ కొనుగోళ్ళూ చేసేయవచ్చు అనే సరికి, ఇక పరస్పరం మనిషీ మనిషీ ఎదుటపడి కలుసుకుని మాటాడుకునే దగ్గరతనమూ మటుమాయమవుతోంది! మానవ సంబంధ వినియోగ దినోత్సవాలేనేమో మునుముందు. ఏమో? ఏం చెప్పగలం?!

**(12.3.2016)**

# దేశం 'అమ్మ'కాదే..!

మట్టి అనుకుంటే ఏదయినా మట్టే! పుట్టుక–భూమి మీద పడినప్పుడే! చావూ–మట్టుబెట్టినా, మట్టిన పెట్టినపుడే! "మనిషిని బ్రహ్మయ్య! మట్టితో చేసెనయ్యా!" అని ఓ కవి అంటే, "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్నాడు గురజాడ.

మట్టిని మట్టిగా చూడడానికీ, మనసుతో ముట్టి, ఆత్మతో తట్టి పవిత్రంగా చూడడానికీ తేడా వుంది. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అంటూ కన్నతల్లీ, జన్మభూమి చాలా గొప్పవనీ, స్వర్గాన్ని మించిన పవిత్ర ఆనంద సంధాయకాలనీ హైందవ భావన బలీయంగా చెబుతోంది.

అమ్మకు జేజే అనడం, తల్లిని తండ్రికన్నా పవిత్రంగా, గౌరవంగా చూడమనడం ఇస్లాం మతం కూడా ప్రబోధించిందే! మతం వైయక్తికం కానీ జాతీయత సమష్టిభావం. బంగ్లాదేశ్ ఇస్లామిక్ కంట్రీ అనిపించుకోవడం కన్న జాతీయ భావన ప్రాముఖ్యంగల కంట్రీ అనిపించుకోవాలని అక్కడ యువత ఆలోచిస్తోందట! మతం అనేది ఒక మార్గం! ఎవరు ఏ మతాన్ని అవలంబించినా, తాను నివసించే దేశాన్ని గౌరవించే అభిమతం వుండాలి అనడం దేశభక్తికి మూలాధారనాడిగా భావింపబడుతోంది. ఇస్లాం జన్మభూమిని గురించి ఏం చెప్పిందనే కౌతుకానికి ఇప్పుడు తెర తేచింది.

దేశానికి మాతృభావనను ఎంఐఎం నేత, పార్లమెంట్ సభ్యుడు అయిన అసదుద్దీన్ ఒవైసీ అంగీకరించడం లేదని తేటతెల్లమైంది.

"నేను ఛస్తే భారత్‌మాతాకీ "జై" అనను. అలా అనమని రాజ్యాంగం ఏమీ సూచించడం లేదు" అని ఒవైసి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పద మయ్యాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో గతబుధవారం ఎంఐఎం ఎమ్మెల్యే వారిస్‌పఠాన్ "భారత్ మాతాకీ జై" అని అనబోనని ప్రకటించినందుకు సస్పెండ్ చేశారు. ఈ ఘటనను ఒవైసీ తీవ్రంగా ఖండించారు. నినాదం ఇవ్వడం, ఇవ్వకపోవడం రెండూ భావస్వేచ్ఛలో భాగమే అన్నారు.

ఈ 'భావస్వేచ్ఛ' అనే మాట 'మనోభావాలు దెబ్బతిన్నాయి' అనే మాటలాగా తయారయింది. ఇప్పుడు 'నేలను తల్లిగా భావించను' అనే వారితో ఏమని వాదించగలం? మట్టికి పవిత్రత వుందన్న భావనే లేకపోతే, దేని గురించి పట్టుబట్టగలం?దేశంలో నివసించే ప్రతి ఒక్కరి జాతీయతకూ ఒకే ఒక్క నిర్వచనం 'భారత్‌మాతాకీ జై' అన్న నినాదమేనని అధికశాతం ప్రజల అభిప్రాయం. బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ ఈ విషయాన్నే నొక్కి వక్కాణించాడు. బాలీవుడ్ రచయిత, రాజ్యసభ సభ్యుడు– జావేద్ అక్తర్ కూడా ఒవైసీ వ్యాఖ్యలను తప్పుబట్టారు. "భారత్ మాతాకీ జై అనడం నా కర్తవ్యమా? కాదా? అనే విషయాన్ని నేను పట్టించుకోను . అయితే అలా అనడాన్ని నా హక్కుగా భావిస్తాను" అన్నారాయన. దైవభక్తి కన్నా దేశభక్తి పౌరులందరికీ వున్నప్పుడే జాతీయతా స్ఫూర్తి వెలుగొందుతుంది. దేశాన్ని విచ్ఛిన్నం చేసే అజెండాతోనే బిజెపి, మజ్లిస్‌లు ఈ నినాద వివాదాన్ని లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ అంటోంది.

భారతీయుడైనవాడు, భారతదేశాన్ని మాతృభూమిగా భావించడం, దేశమాతను గౌరవించడం విధాయకం. "తేనెలతేటల మాటలతో మన దేశమాతనే కొలిచెదమా!" అని పిల్లలకు దేశభక్తిని రంగరించి చూపేందుకు– 'భారతమాత' అనడం కొత్తగా పుట్టుకొచ్చిందేమీ కాదు. "ఇండియా ఈజ్ మై కంట్రీ! ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్" అన్న పాఠశాల ప్రతిజ్ఞను తెలుగుచేసినప్పుడు "భారత దేశము నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు" అని పేర్కొంటున్నాం. "అన్నదమ్ములవలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్" అని దేశభక్తిలో గురజాడ ప్రబోధించాడు. ఒక దేశంలో నివసిస్తున్న పౌరుల మధ్య సోదరభావం అన్న కాన్సెప్టే దేశాన్ని 'తల్లి' గా భావించడానికి ప్రాతిపదిక. నేల 'తల్లి' అయినప్పుడు నేలమీద నివసించే సాటివారి పట్ల 'సోదరభావం' సమంజసమే! అయితే 'సౌభ్రాతృత్వం' అనేది అంగీకారయోగ్యమై, తనదైన దేశానికి, తాను పుట్టిన దేశానికి మాతృభావన ఎందుకు అంగీకారయోగ్యం కాదో మరి?

'భారత్' అనడంలో హైందవత్వం' లేదని, అందువల్ల 'జైహింద్' అనకుండా 'జైభారత్' అనే వాళ్ళున్నారు. 'నమో హిందుమాతా జైజై నమోదేశమాతా" అని పాడడం కూడ గిట్టక 'వందేమాతరం' అనడం కూడా నచ్చని భావస్వేచ్ఛ వాతావరణం ప్రబలుతోంది! మాతృభావన, హైందవం సెక్కులరిజానికి అవరోధాలుగా, అవన్నీ

ఒక రాజకీయ పార్టీ పాక్షికతలుగా ఆరోపించడం అనే వైఖరి పొడచూపుతోంది. ఒవైసీ నాలుకను కోసి తెచ్చినవారికి 21లక్షల రూపాయల బహుమానం ఇస్తానంటూ మీరట్ కాలేజీకి చెందిన విద్యార్థిసంఘం మాజీనేత దుష్యంత్‌తోమర్ ప్రకటించడం అగ్నికి ఆజ్యం పోసినట్లవుతోంది. ఒవైసీపై చర్యలు కోరుతూ హైదరాబాద్ కోర్టులో ఫిర్యాదు దాఖలైంది. కోర్టు ఒవైసీపై సెక్షన్ 153 కింద కేసు నమోదు చేయమని నేరేడ్‌మెట్ పోలీసులను ఆదేశించింది.

కన్నతల్లితండ్రులనే నిరాదరిస్తూ, వృద్ధాశ్రమాల పాలుచేస్తూ, అనాథలుగా మరణించే దుస్థితి కల్పిస్తూ, ముందుకు పోతున్న తరానికి జన్మభూమి పట్ల మాతృభావన వుండాలని ఆశించడం, దేశాన్ని తల్లిగా సమాదరిస్తూ జైకొట్టాలనడం మరి పిచ్చిగానే తోస్తుంది కొందరికి. భారత్ మాతాకీ జై అనడం నామోషీగానో, అలా నినదించడం భావస్వేచ్ఛకు ప్రతిఘాతంగానో, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు జాతీయతా స్ఫూర్తితో కాపు కాయవలసిన గౌరవ పార్లమెంట్ సభ్యులే వివాదాస్పదం చేస్తున్నప్పుడు దేశగౌరవప్రతిష్టలు నగుబాటు కావడంలో వింతేమీ లేదు. అమ్మను 'మమ్మీ' ని చేసిన తరం, దేశాన్ని 'డమ్మీ' గా మేధోవలసలతో 'ఎగిరిపోతే ఎంతబాగుంటుంది' అని వ్యవహరిస్తున్నప్పుడు గుండెబరువెక్కడం మినహా ఇక ఆర్తులకు మిగిలేదేముంది. "జైబోలో! స్వతంత్ర భారత్‌కీ జై!"

**(20.3.2016)**

# విశ్వాసమార్గంలో...

హింస ప్రతిహింసను కోరుతుందంటే అర్థం చేసుకోవచ్చుగానీ, అకారణంగా హింసా స్వభావాన్నే కలిగివుండి, ఇతర మతాలవారిపై దాడిచేయడం వంటి చర్యలను అర్థంచేసుకోవడం ఎలా? రెచ్చగొట్టడమే కొందరి స్వభావం! నిర్మల కాసారాన్ని భరించలేక రాళ్ళురువ్వి అలజడులు సృష్టించడం కొందరికి కేళి!

గత కొంతకాలంగా ప్రపంచంలో ఉగ్రవాదం జూలు దులుపుతోంది. సామ్రాజ్యవాద ధోరణులను ప్రతిఘటించడానికి అది ఒక మార్గంగా ఎంచుకున్నా మంటున్నవారు–నిజంగా ప్రతీకార ధోరణులతోనే హింసాకృత్యాలకు పాల్పడుతున్నారా లేక జిహాదీ స్వభావమే అదా అనేది తేల్చిచెప్పడం కష్టమైపోతోంది. అమెరికా హెరిటేజ్ ఫౌండేషన్ వెల్లడించిన జాబితాలో భారతదేశం పేరులేదు గానీ, మన దేశంలోనూ ఆ ప్రకంపనలు చోటుచేసుకుంటూనే వున్నాయి. జాతీయత పేరుతో మైనారిటీలను రెచ్చగొట్టే వైఖరి ఇటీవల పెరుగుతోందని ఒక ఆదుర్దా మొదలైంది. సర్వసత్తాక దేశ సమగ్రతకు– అవాంఛనీయ ధోరణులను అరికట్టక తప్పదనీ, స్వేచ్ఛ పేరున చెలరేగే విచ్చలవిడితనానికి కళ్ళెం వేయవలసిందేనని అంటున్న వారున్నారు.

త్వరలో అమెరికా నూతన అధ్యక్షుడిని ఎన్నుకోబోతోంది. అమెరికా సామ్రాజ్యవాద ధోరణుల పట్ల ఇప్పటికే నిరసనలు, ఇస్లామిక్ రాజ్యాల ప్రతిఘటనాస్వరాలు విన్పిస్తుండగా డొనాల్డ్ ట్రంప్ వంటి వారి వ్యాఖ్యలు అమాయకులను అనుమానితులను చేసే ధోరణికే స్కెచ్ వేస్తున్నట్లున్నాయి. భీతావహంకాని చోటు అంటూ, దేశం అంటూ, ఏదయినా వుందా అనే ప్రశ్న ఉదయిస్తూ వుంది.

మొన్నటికి మొన్న బెల్జియం రాజధాని బ్రెస్సెల్ భూగర్భ మెట్రోలో విమానాశ్రయంలో జరిగిన దాడులు ఐరోపా దేశాలమీద దాడుల తీవ్రతకు మరో మెట్టుగానే వుంది. ఉగ్రవాదం పంజా విప్పుకుంటున్న విధంగానే ఆందోళన కలిగించింది.

ఫ్రాన్స్ దాడుల సూత్రధారిగా భావించబడిన సలే అబ్దేస్సలామ్ బ్రెస్సెల్స్‌లోని మొలాంబిక్‌లో అరెస్టు అయ్యాడు. అందుకు ప్రతీకారంగా అన్నట్లుగానే, మొన్న

బుధవారం బ్రెస్సెల్స్‌లో ఐఎస్ఐఎస్ దాడి జరిగిందన్నది విదితమవుతున్న విషయమే!

పాకిస్థాన్, కజక్, సౌదీ అరేబియా వంటి ఇస్లామిక్ దేశాలే ఐఎస్ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నది కేవలం అనుమానం కాక–పలుమార్లు ఋజువై, కొన్నిమార్లు వారే గొప్పగా ప్రకటించుకున్న సందర్భాలున్నాయి. మన దేశంలోనూ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థల నుండి ముప్పు వుందన్న హెచ్చరికలు వస్తూనే వున్నాయి. హైదరాబాద్ నగరం ఎప్పుడూ ఉగ్రవాద కార్యకలాపాలకు అనుమానిత నగరంగానే వుంది.

ఉగ్రవాదదాడుల భయం నుండి భారతదేశమూ విడివడిలేదు. తిన్నింటి వాసాలు లెక్కించే ప్రబుద్ధులూ అన్నింటా ద్యోతకమౌతూనే వున్నారు. గత వారంలోనే ఢిల్లీ విమానాశ్రయంలో జెట్ విమానయాన సంస్థకు చెందిన లోహవిహంగంలో బాంబులు పెట్టారన్న వార్త అలజడి రేపింది. ఇండిగో విమానం ఒకటి గత బుధవారం గంటల కొద్ది నిలిపివేసి పరీక్షలు చేయవలసి వచ్చింది. 'అదిగో పులి అంటే ఇదిగో తోక' అన్నట్లు ప్రపంచంలో ఏ మూల ఉగ్రవాదం పంజా విప్పినా– దాని ప్రకంపనలు మనదేశాన్ని తాకుతూనే వున్నాయి. ఇక్కడా భద్రతాచర్యలు కట్టుదిట్టం చేయడం జరుగుతూనే వుంది. తెలంగాణ గుండెకాయ అయిన హైదరాబాద్ ఉగ్రవాదచర్యల అనుమానిత నగరం అనే ముద్రను చెరిపివేసుకున్నప్పుడుగానీ 'బంగారు తెలంగాణ' అన్న ఆశయం నెరవేరినట్లు కాదు. పాకిస్థాన్ ముఠాలు నగరంలో వున్నాయనీ, ఇప్పటికీ ఇక్కడి ముస్లింలు కొందరు దానినే తమ స్వదేశంగా భావిస్తూ ఇక్కడ పౌరులుగా జీవిస్తున్నారనీ అనుమానించడం, ఆ అనుమానానికి అనుకూలమైన వ్యాఖ్యలు, చర్చలు వినరావడం, కనరావడం నిజంగా శోచనీయమే మరి!

త్రికరణశుద్ధిగా ఇది నాదేశం అనీ, నేను భారతీయుడననీ, దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పరిరక్షణకూ, దేశ గౌరవ ప్రతిష్టలకూ దోహదంగా మసలుకుంటాననీ మైనారిటీలు భరోసా ఇవ్వగలగాలి అంటే ముందు వారికి అభద్రతా భావం తొలగిపోవాలి. వారిని కేవలం అనుమాన దృక్కులతో మాత్రమే చూసే వైఖరి, వారిని అణచివేసే లేక రెచ్చగొట్టే ధోరణులు సమసిపోవాలి. కలుపుమొక్కలు ఏరివేయాలే గానీ పంటనే నాశనం చేసుకోకూడదు. నిజమే కన్నాలు వేసే కలుగుల్లో ఎలుకలు వుంటే ఇంటికి నిప్పెట్టుకోకూడదు కదా! ఎలుకలను పట్టాలి. అందులకు కొండను తవ్వాల్సి వచ్చినా తప్పదు మరి. విశ్వాసం ముఖ్యం. విశ్వసించినపుడే మంచి జరుగుతుంది. మోసాన్ని ఎదిరించడానికి కూడా విశ్వాసులే ముఖ్యం.

**(26.3.2016)**

# అసంపూర్ణానికే స్వర్ణం భళీ!

**జా**తీయ చలనచిత్ర అవార్డుల చరిత్రను తిరగరాసిన ఘనత తెలుగు సినిమాకే దక్కుతుంది. గతంలో ఎన్నడూ ఇంతటి ఘనమైన గుర్తింపు నోచుకోని తెలుగు చిత్ర పరిశ్రమకు ఈ ఏడాది జాతీయ చలనచిత్ర అవార్డులలో అత్యున్నతమైన ప్రతిష్ఠాత్మక 'స్వర్ణ కమలం' దక్కడం, అదీ రాజమౌళి 'బాహుబలి' చిత్రానికి కావడం నిజంగా విశేషమే!

అవార్డు సినిమావేరు, కమర్షియల్ సినిమా వేరు, అనే భావన ఇంతకాలంగా జాతీయ చలనచిత్ర అవార్డుల సరళిని చూసినవారు బలీయంగా కలిగి వుంటున్నమాట నిజం!. ఎందుకంటే కథాబలం ఉన్న ఎన్నో మంచి తెలుగు సినిమాలు ఈ స్థాయి గుర్తింపుకు ఎప్పుడూ నోచుకోలేదు. ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రాలుగా ఎన్నికైన సినిమాలున్నాయి గానీ, దేశం మొత్తంమీద అత్యున్నత అవార్డు తెలుగు సినిమాకు దక్కడం ఇదే ప్రథమం. పైగా 'బాహుబలి' కమర్షియల్ చిత్రంగానూ మంచి వసూళ్ళు చేసింది. రాజమౌళి దర్శకత్వంలో భారీ ఎత్తున నిర్మితమైన 'బాహుబలి' సాంకేతికంగా హాలీవుడ్ చిత్రాలకు తీసిపోదన్న టాక్ కూడా బలంగా వినవచ్చింది. కానీ ఉత్తమ దర్శకుడిగా రాజమౌళికి అవార్డు ఏమీ దక్కలేదు.

తెలుగుసినిమా జాతీయస్థాయికి ఇన్నాళ్ళూ చేరకపోవడం వెనుక ఉత్తరాది లాబీయింగ్ బలంగా పనిచేస్తూ వచ్చింది అనేవాళ్ళు. కానీ హిందీ చిత్రాల ఉధృతిని కూడ తట్టుకుని 'బాహుబలి' అవార్డు దక్కించుకోవడం ఆనందదాయకమే గానీ, నిజానికి ఒక 'అసంపూర్ణ చిత్రానికి' ఈ అవార్డు రావడం ఆశ్చర్యమే మరి! ఎందుకంటే 'బాహుబలి–2' రూపొందుతోంది. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడన్న ఒక ఉత్కంఠ దేశం మొత్తాన్ని ఊపివేసింది. నిజానికి దానికి సమాధానం రెండోభాగం వస్తేగానీ తెలియదు. ఉత్కంఠరేపి వదిలిపెట్టిన అర్ధాంతర చిత్రానికే ఇంత ఖ్యాతి దక్కడం అబ్బురమే మరి! కథాపరంగా అసమగ్ర చిత్రమేగానీ, సాంకేతిక విలువల దృష్ట్యా, గ్రాఫిక్స్ దృష్ట్యా అత్యున్నత ప్రమాణాలను వెలార్చిన చిత్రం ఇది! అయితే

జాతీయ స్థాయి గుర్తింపు– చిత్రంలో ఏం చూసి ఇచ్చినట్టు అని సినీవిమర్శకులు కొందరు చర్చనీయాంశం చేయడమూ చూస్తున్నాం!

ఇన్నాళ్ళకు తెలుగు బావుటా సినీ రంగాన ఎగిసిందన్నది సంతోషదాయకమే! కమర్షియల్‌గా రికార్డులు సాధించిన సినిమాకు అవార్డు రావడం మరీ సంతోషం! ఎందుకంటే అవార్డు సినిమా అంటే ఆ మూస వేరు అనేదే ఇన్నాళ్ళూ చెలామణీలో వున్న సంగతి. దీనిమీద ఓ పరిహాస కథనం కూడా ఉంది. సినిమా పల్లెటూరి వాతావరణంలో ఉంటుందిట! ఓ మామూలు వ్యక్తి చెంబు పట్టుకుని పొలం గట్టమ్మట వెడుతూంటాడట! అలా వెడుతూ వెడుతూ చెఱువుగట్టునకు వచ్చి చెఱువులో చెంబు ముంచుకోవడంతో సినిమాకు– విశ్రాంతి! అంటే మొదటి భాగం పూర్తయిందన్న మాట!. ఇక విశ్రాంతి తరువాత సదరు మనిషే ఖాళీ చెంబుతో తిరిగి ప్రసన్నవదనంతో నడచినడచి తిరిగి రావడంతో సినిమా ముగుస్తుంది! అవార్డు చిత్రంమీద చెలామణీలోని అపహాస్య కథనం ఇదే ఇన్నాళ్ళూ! దేశం యొక్క దరిద్రాన్ని గ్లోరిఫై చేస్తేనే అవార్డులు వస్తాయి అనే వారు కొందరు, మురికివాడలనో, వేశ్యావాటికలనో భిత్తికగా చేసుకున్న సినీ కథనాల చిత్రాలే అవార్డుకు అర్హం అనేవారు ఇంకొందరు!' అన్నింటికంటే జ్యూరీని ప్రభావితం చేయగలగడం ముఖ్యం అనేవారు మరికొందరు, అసలు జ్యూరీలో తెలుగువారయిన సభ్యులకు తగిన స్థానం లేనేలేదనే మాట వినవస్తూండేది. ఉత్తరాది డామినేషన్ తట్టుకోవడం రాకనే తెలుగుకు జాతీయస్థాయి అవార్డు రాలేదని వ్యాఖ్యానించేవారు. ఏమైతేనేం! ఆ భావనల్నింటినీ పరాస్తంచేస్తూ ఈ సంవత్సరం జాతీయ చలన చిత్ర అవార్డులలో అగ్రేసర స్థాయిని 'బాహుబలి' చేజిక్కించుకుంది. మరీ ముఖ్యంగా మంచి సినిమాకు డబ్బులూ వస్తాయి, గుర్తింపూ వస్తుంది అని నిరూపించుకుంది. అయితే ఏది మంచి? అని నిర్ణయించడం, దేనివల్ల 'మంచి' అని నిర్ణయించడం అంత సులభం కాదు. సినిమాలకు జాతీయ పురస్కారాలివ్వడం 1954 నుండి మొదలైంది. ఏటా వచ్చిన సినిమాల నుంచి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి సినీ వైభవానికి సిరిచుక్కలద్దడం జరుగుతూ వస్తోంది. బంగారు పాపనుండి మొదలుకొని శంకరాభరణంతో సాగుతూ, ఎన్నో మంచి తెలుగు సినిమాలు వచ్చినా ప్రాంతీయ స్థాయిలో తప్ప, ఇన్నాళ్ళూ జాతీయస్థాయి హోదాకు నోచుకోనేలేదు. తెలుగు సినిమా ఎదగడం లేదనీ, అవార్డు స్థాయికి చేరుకోవడంలేదనీ ఇన్నాళ్ళూ విమర్శకులువాపోతూనే వచ్చారు. ఈ ఏడాది ప్రాంతీయ ఉత్తమ చిత్రంగా తెలుగులో

'కంచె' ఎన్నిక కావడం కూడా సంతోషప్రదం. నిజానికి మంచి కథ, విలువల నేపథ్యం గల చిత్రం 'కంచె'.

'బాహుబలి' సంచలనాల కేంద్రకం అయింది. ప్రతిదానికీ 'బాహుబలి'తో లంకెవేసే ప్రతీకాత్మక దృశ్య చిత్రం అయింది. పైగా 'ఉత్కంఠ'ను ఇంతలా రేకెత్తించి వదిలిన సినిమా, తరువాత ఏమౌతుంది? అసలు కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు? అనే మిలియన్ డాలర్ల ప్రశ్నతో దేశం మొత్తాన్ని రాజమౌళి 'బాహుబలి'తో నిలబెట్టాడు. బహుశా అదే జాతీయస్థాయి ఎంపికకు ప్రధాన హేతువైందేమో! ఇంతటి సాంకేతిక విలువలు హాలీవుడ్ చిత్రాల్లోనే తప్ప తెలుగు సినిమాలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో అభివ్యక్తం కావడం కూడా ఈ విజయానికి కారణమే! 'బాహుబలి'లోని సామాజిక న్యాయం అనే కోణం, సరికొత్త భాషా సృష్టి కూడా– ఈ విజయానికి దోహదపడ్డాయనుకోవచ్చు. ఏమయినా రాజమౌళి తెలుగు సినిమాకు విరాజమానమయ్యే కీర్తి మౌళిని సంతరించిపెట్టాడు. బాహుబలి–2కు ఈ జాతీయ అవార్డు నేపథ్యంలో మరింత 'క్రేజ్' సమకూరడం ఖాయం! ఏమయినా సినిమా చరిత్రను ఈ విజయంతో సరికొత్తగా తిరగరాసిన ఘనత తెలుగువాడికే దక్కుతుంది.

**(2.4.2016)**

# దుర్మార్గం సన్మార్గంగా...

సామాన్యుడికి అన్నీ అనుకున్నట్టుగా జరగవు. "అనుకున్నామని జరగవు అన్నీ... అనుకోలేదని ఆగవు కొన్నీ... జరిగేవన్నీ మంచికనీ, అనుకోవడమే మనిషిపని" అని పాడుకుని సర్దుబాటు చేసుకోవడమే జరుగుతూ వుంటుంది. కానీ డబ్బున్నవాడి సంగతి, అధికారం వున్న వాడి సంగతి వేరు. అపరకుబేరులను అన్ని విధాలా అన్ని వ్యవస్థలూ ఎలా తలకెత్తుకుని సహకరిస్తాయో, 'పనామా పేపర్స్' ఉదంతం విశదీకరించింది. డబ్బు, రాజకీయం, అధికారం మూడు ముచ్చటగా పెనవేసుకుంటే చీకటి సామ్రాజ్యమైనా ధగధగా వెలిగిపోతుంది. బోగస్ కంపెనీల ముసుగులో బడాబాబుల నల్లధనం కోట్లకొద్దీ విదేశాలకు తరలిపోయి, తెల్లదైపోయి మనం తెల్లముఖాలు వేసుకునేలా చేస్తుంది. నిజాలు వెలుగు చూసినా, వారి ధ్వజాలు ఎగురుతూనే వుంటాయి. సిషెలిస్‌లో మోజాక్ ఫోన్సెకా పదిహేను వేల బోగస్ కంపెనీలు సృష్టించిందట. ఒక అర్ధశతాబ్దపు అవినీతి, రెండున్నరవేల గిగాబైట్ల–కోటికిపైగా డాక్యుమెంట్లలో కప్పడిపోయింది ఇన్నాళ్లూ! పరిశోధనాత్మక పాత్రికేయుల అంతర్జాతీయ కూటమి ఏడాది శ్రమించి, వాటిని డీకోడ్ చేసి వెలుగులోకి తేవడంతో, చీకటి ప్రపంచపు చిరునామా బహిర్గతమైంది. విదేశీ ఖాతాలన్నీ అక్రమ లావాదేవీలు కాదంటే వాటిని నిరూపించుకోవాల్సిన అగత్యం లేదా?

కానీ పాపం సామాన్య ప్రజలు గొర్రెలుగానే బ్రతుకుతున్నారు. వారి బ్రతుకుల్లో అభివృద్ధి, అభ్యుదయం– 'గొర్రెతోకబెత్తెడే'. సంపన్నదేశాల నాటకాలకు ప్రేక్షకపాత్ర వహించడం అనివార్యమైన బ్రతుకులపట్ల, చేయగలిగింది కూడా కనిపించదు మరి!

డబ్బు విషయంలో డాలర్ ఎప్పుడూ కాలర్ ఎగరేస్తూనే ఉంది. అమెరికా మన మెరికల్లాంటి సంతానాన్ని ఆకర్షిస్తూనే వుంది. చదువుకోసం, ఉద్యోగం కోసం దేశంకాని దేశంకు వెళ్లిపోతున్నారంటే, మన దేశాన్ని మనం ఏ స్థితికి తెచ్చుకుంటున్నామో విదితం కావడం లేదా? స్వయంకృతాపరాధాలు గొప్ప వరాలుగా సంభాషించుకునే వైఖరిలోని దోషం మనదే అవుతుంది. నిజమే మరి! మన దేశంలోనే ఉంటూ డబ్బూ, అధికారం, రాజకీయం కలవారు విదేశాల్లో అక్రమ లావాదేవీలు

నెరపుకుంటుంటే, సామాన్య మధ్య తరగతి జీవులు– ఉద్యోగాలపేర విదేశీ ఊడిగాలు చేసుకుంటూ జన్మభూమికీ, కన్నవారికీ దూరంగా బ్రతకాల్సి రాక ఏమవుతుంది? మానవ వనరులను రక్షించుకోలేని దేశం, మేధోవలసలను అరికట్టుకోలేని దేశం, మనవారివల్లే అమెరికా లాంటి దేశాలు వెలిగిపోతున్నాయని సమాధాన పరచుకుని సంతృప్తిపడడం మినహా మరింకేం చేయగలదు?

పనామా పేపర్స్ ఉదంతాలు ఒక వంక, అనామకంగా బ్రతుకులు వెళ్లదీస్తున్నవారి ఉదంతాలు మరోవంకగా, కాకిగూట్లో కోకిల గుడ్లు పెట్టినట్లు 'పరభృత' జీవితాలు అనివార్యమైపోతే, బ్రతుకు ఉగాది 'దుర్ముఖి'గానే సాగుతుంది. పేరును చూసి పెదవి విరచడం ఎందుకనే, కుదుట పడుతుంటాం. అసలు రంగులు బయటపడినా ప్రభుత్వాలు, నాయకులు స్పందిస్తున్న తీరు నిరాశ కలిగిస్తుంది. సంవత్సరాదుల కాలచక్రం తిరుగుతున్నా, మన వాత్సల్యసంతానతరం భవిష్యత్తు ఎటు పయనిస్తోందని అనిపిస్తూంటుంది. నిజమే! సాంకేతికత అద్భుతాలను ఆవిష్కరిస్తోంది. శక్తియుక్తులను ద్విగుణీకృతం చేస్తోంది. ఇప్పుడు ఆర్తి అంతా మానవ సంబంధాల గురించి మాత్రమే! ఆర్థిక వనరులకన్నా, 'హార్దిక' వనరులే సమస్యాత్మకం అవుతున్నా, పట్టని ఉదాసీనతలోకి నెట్టబడడమే మన్మథ దుర్ముఖిగా పరివర్తనం చెందడం ప్రతీకాత్మక మనిపిస్తుంది.

తెలుగు సంవత్సరాది దుర్ముఖి ఈ రోజు మొదలైంది. తెలుగువారు రెండు రాష్ట్రాలుగా పురోగమిస్తున్నారు. దేశ విదేశాల్లో ఇవాళ తెలుగువారెందరో జీవిక సాగిస్తున్నారు. జన్మభూమి భారతదేశం మొత్తమే త్వరలో ఒక వృద్ధాశ్రమంగా మారిపోయేలా వుందని ఒకాయన భోరుమన్నాడు. నిజానికి ఒక దేశం అభివృద్ధి ఎప్పుడూ–విదేశీ వనరుల మీద ఆధారపడదు. పడకూడదు. కానీ ఇవాళ విదేశీ పెట్టుబడులకు, విదేశీ వ్యాపారస్తులకు రాష్ట్రాలు పోటీపడి ఎర్రతివాచీలు పరుస్తూ, అందువల్లే తాము అభివృద్ధిచెందుతామని భావించే దశ సంప్రాప్తిస్తోంది. వర్తకం పేరుతో ఒకప్పుడు బ్రిటిష్ వారు మనపై పెత్తనం చేస్తే, స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మనమే, స్వతంత్ర భారతదేశం షష్టిపూర్తి దాటిన కాలంలోనూ ఇష్టపూర్తిగా సామ్రాజ్యవాద సంస్కృతికీ, విదేశీ వ్యాపారాది సంస్థలకూ ఆహ్వానం పలుకుతూ అస్వతంత్ర భావాల పరభృతంగా మారిపోతున్నామేమో ఆత్మవిమర్శ చేసుకోవద్దా!

మన నాయకులు, పాలకులు, ప్రజలను సంక్షేమం పేర ఎటు తీసుకువెడుతున్నారో తీవ్రంగా తలపోసుకోవద్దా!

మనకాళ్లమీద మనం, మనదేశంలో, మనదైన శక్తియుక్తులతో, పురోభివృద్ధితో అన్నిరంగాలలో స్వయం సమృద్ధమై, యావత్ప్రపంచం మనమీద ఆధారపడగల అభ్యున్నతిని సాధించుకోవద్దా! అదికాదా అసలు యుగాది! దుర్ముఖితో ముఖస్థంగా ఆ పరిపూర్ణ అభ్యుత్థానదిశగా లావాదేవీలు హృదయంగమంగా చేసుకుని, తెలుగు వెలుగులతో తేజరిల్లాలని ఆకాంక్షిద్దాం.

**(8.4.2016)**

# నీటిరాతలు!

ఊరు అంటే నీరు ఉండాలి. 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు' వున్న వూర్లోనే చొరబడమన్నాడు సుమతి కారుడు. నీటికి కటకట పడటం అంటే-జీవన మూలాలకు కటకట పడడమే! ఎండాకాలంలో చెరువులు, బావులు ఎండిపోతే నీటిఎద్దడి అర్థం చేసుకోగలంగానీ.. ఎప్పుడూ 'ఎండ్‌లెస్'గా ఎండాకాలం అన్నట్లు, నీటికి ఇబ్బంది పడడం అనేది ఇటీవల మరీ పెరిగిపోయింది! 'సుజలాం... సుఫలాం' అనుకునే దేశంలో - ఇప్పుడు జలవనరులూ అడుగంటిపోతున్నాయి. నీటికోసం నిజంగానే ముమ్ముందు 'పానీపట్టు' యుద్ధాలు జరిగే ప్రమాదాలు పొడచూపుతున్నాయి.

ఇంటికొచ్చిన అతిథికి ముందు మంచినీరు త్రాగడానికి ఇవ్వడం భారతీయ సంప్రదాయం. కాళ్ళకు నీళ్ళివ్వడం అనేది కూడా తెలుగు సంప్రదాయం. బయటకు వెళితే కాళ్ళు కడుక్కుని లోపలికి రావడం గ్రామాల్లో ఇంటింటా ఉండేది.

ఒకప్పుడు అలాగే కాలకృత్యాలు తీర్చుకోగానే, నీటితో పరిశుభ్రం చేసుకోవడం అనివార్యంగా జరిగే కృత్యం! కానీ క్రమేపీ ఆ పద్ధతులన్నీ మరుగవుతున్నాయి. నిజమే! నీటి ఎద్దడి... ఆచారవ్యవహారాల పరిణామాన్ని కూడా మార్చివేస్తుంది. పూర్వం 'మడి' అంటూ చీటికీమాటికీ స్నానాలు చేసే ఛాదస్తులూ ఉండేవారు. బావుల్లోంచి చేదలతో నీరుతోడుకుని పోసుకునేవారు.

నిజానికి నీరే 'ప్రాణాధారం' అన్నారు. 'జీవనం' అంటే నీరుతో అనుసంధానమైనదే! కానీ అలాంటి నీరు-ఇవాళ ఉచితంగా లభించే, వాడుకునే స్థితిని పోగొట్టుకుని మార్కెట్ సరుకుగా మారిపోతోంది. మంచినీరు కొనుక్కునే వ్యాపారవస్తువైపోయింది. సీసాల్లో డబ్బాల్లో నీరు అమ్ముకోవడం, మంచినీరు అంటే 'బిస్లరీ వాటర్ బాటిల్' మాత్రమే అనుకునే స్థితికి నెట్టబడిపోయాం. గోదావరి, కృష్ణలు వున్నా ప్రస్తుతం రెండు తెలుగురాష్ట్రాల్లోనూ నీటి ఎద్దడి గోచరిస్తూనే ఉంది. మనమే అనుకుంటే, మహారాష్ట్ర పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది!

ముఖ్యంగా 'లాతూర్'లో మునుపెన్నడూ లేనంతగా నీటికి కటకట ఏర్పడింది. అక్కడికి రైల్లో ప్రజలకోసం నీటిని తరలించాల్సిన పరిస్థితి. వచ్చిన నీటికోసం ప్రజలు

అందిపుచ్చుకోవడానికి అగ్గగ్గలాడడం జరుగుతోందిట! ముంబై, పూణే, నాగపూర్‌లలో కూడా నీటి ఎద్దడి పెరిగింది.

ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లను మహారాష్ట్ర నుండి తరలించాలని కోర్టు ఆదేశించడానికి ఈ నీటి వ్యవహారమే మూలకారణం అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు మరి! ఐపీఎల్ మ్యాచ్‌లకు మహారాష్ట్రలో అరవై లక్షల లీటర్ల నీరు అవసరం అని తేలిందట! సామాన్యుడు నీరు అందక దాహార్తితో వేదనపడుతూంటే, వినోదక్రీడ కోసం అంతటి నీరుని అమ్మకానికయినా సిద్ధం చేయడం ఏమిటని జనమే నిలదీసారంటే–తప్పకుండా అర్థం చేసుకోవచ్చు. సరళీకృత ఆర్థిక విధానాల అమలు అంటూ జరగడం మొదలయ్యాకే, దేశంలో నీటి వ్యవహారమూ క్రమంగా–కన్నీటి దుస్థితికి దిగజారింది అని ఒప్పుకోక తప్పదు.

'నీటిపొదుపు' గురించి ఇవాళ విస్తృతంగా పథకాలు, ప్రచారాలు సాగుతున్నాయంటే–నీరు వ్యాపారవస్తువుగా మలుచుకుని సాగిస్తున్న వైఖరులే కారణం. ప్రజా ప్రయోజనాలు చూడవలసిన ప్రభుత్వం– కూడు, గూడు, గుడ్డ ప్రతి ఒక్కరికీ సమకూర్చడంమాట అటుంచి, ప్రకృతి ఇచ్చిన వనరు అయిన నీటిని కూడా సామాన్యుడికి అందని మార్కెట్ సరుకుగా మార్చేయడమంత వైపరీత్యం మరొకటి లేదు. 'నదుల అనుసంధానం' కబుర్లు కమ్మగా వినిపిస్తుంటాయి కానీ, ఊరులోని చెరువునీ, బావినీ కూడా ఎండగట్టి, నీరు కొనుక్కొని త్రాగే స్థితినే అభ్యుదయంగా ముందుకు తెస్తున్నాయి ప్రభుత్వాలు.

గత వారం రోజులుగా అమెరికాలో ఉన్న ఈ వ్యాసకర్తకు–మన దేశంలోకీ ఆ సంస్కృతి ఎలా దిగబడిపోతోందో తెలుస్తూనే ఉంది. మలవిసర్జన చేశాక నీటితో శుభ్రం చేసుకోవడం కాక, 'టిష్యూపేపర్'తో తుడుచుకోవడమనే పాశ్చాత్య కల్చర్, మన దేశంలోనూ, క్రమంగా వేళ్లూనుకుంటోంది! 'వెస్టర్న్ టాయిలెట్స్' అనేవి 'రెస్ట్‌రూమ్'ల పేరిట విస్తరించబడుతూ వుండడం 'అభ్యుదయం'గా భావించే ఆలోచనావిధానం ప్రబలుతోంది! నీటివాడకం నియంత్రణ పేర–మున్ముందు ప్రభుత్వాలు ఈ 'టిష్యూకల్చర్'నే శాసనం చేస్తాయేమోననే భయాందోళనలు కూడా పొడచూపుతున్నాయి.

రోజూ రెండు పూటలా శుభ్రంగా స్నానం చేయడం, వారంవారం తలంటు స్నానం చేయడం, మలమూత్ర విసర్జన అనంతరం కాళ్ళూ, చేతులూ శుభ్రంగా

నీటితో కడుక్కోవడం, పొలానికో, బజారుకో వెళ్ళి ఇంటికి రాగానే-కాళ్లు నీటితో కడుక్కునే ఇంట్లోకి రావడం, ఇంటికి ఎవరు వచ్చినా ముందుగా వారికి త్రాగేందుకు మంచినీరు 'ఆఫర్'చేయడం, చెఱువుల్లో ఈతలు కొట్టడం, నదీస్నానాలు, సముద్రస్నానాలు చేయడం... ఇలా భారతీయ సంప్రదాయం నీటితో ముడివేసుకుని వుంది. భోజనం చేసేటప్పుడు కూడా త్రాగడానికి లోటాతోనో, చెంబుతోనో మంచినీరు ముందు పెట్టుకుని మరీ భోజనంచెయ్యడం మన అలవాటు. తేహినో దివసాగతాః అన్నట్లు - జీవన మాధుర్యపు ఆ రోజులు అంతరించిపోయి, నీరు 'కొనుగోలు' సరుకుగా, స్నానం ఒక 'లగ్జరీ'గా మారిపోవడమంత దైన్యం వేరొకటేముంది? 'నీటి సమస్య ఇష్యూకి-పరిష్కారం 'టిష్యూ' పేపరే అని, రేపోమాపో చట్టం తెచ్చినా నివ్వెరపోనక్కర్లేదేమో! నీటి కథలు కన్నీటి వ్యథలుగా మారకుండా జాగ్రత్తపడాల్సింది మనమే! అవును ఇవాళ జలసంరక్షణే జనసంరక్షణ.

జీవజలం ఎండిపోకుండా జీవరాశి మనుగడ సాగించాలి. జలాలు ఊరుతూ-ఊర్లన్నీ బాగుపడి, అందరికీ నీరు అనవరతం అందుబాటులో ఉండే ఆగామికాలాన్ని ఆకాంక్షిద్దాం!

**(16.4.2016)**

# (సు) సంపన్నత

'ఇఫ్ యూ టేక్ కేర్ ఆఫ్ సిస్టమ్-సిస్టమ్ విల్ టేక్ కేర్ ఆఫ్ యూ' అన్న మాటలోని పరమార్థాన్ని పట్టుకోవడం అవసరం. భారత్ ఇంకా పేదదేశమేనని ఆర్.బి.ఐ గవర్నర్ రఘురామ్‌రాజన్ ఊరికే అనలేదు. ఇప్పటి వృద్ధిరేటు ప్రకారం ఇంకా ఇరవై సంవత్సరాలు పురోగమిస్తేనే కానీ సంపన్నత సమకూరదనీ, సగటు చైనా పౌరుడు మనకన్నా నాలుగురెట్లు అధిక సంపన్నుడిగా వున్నాడనీ ఆయన చేసిన విశ్లేషణలో సామంజస్యం గ్రహించాలి. 'అంధుల రాజ్యంలో ఒంటికన్నువాడే మహారాజు' అని ఆయన వాడిన సామెత-అంధుల మనోభావాలను దెబ్బతీసినట్లుంటే క్షమాపణలని ఆయన స్వయంగా అన్నాక, వాచ్యార్థాన్ని మాత్రమే పట్టుకుని 'యాగీ' చేయడం సరికాదు!

ఒక సంవిధానాన్నీ, నియమాన్నీ తూ.చా తప్పక పాటించడం జరిగితే, అందువల్ల అందరికీ సమష్టి ప్రయోజనాలు లభిస్తాయి. అమెరికా సంపన్న దేశం కావడానికి వారి క్రమశిక్షణ చెప్పుకోదగింది! 'క్లీన్ అండ్ గ్రీన్' అని ఊరికే ఊదరగొడితే కాదు, స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరిలో ఆ రీతిని పాటించే క్రమశిక్షణ నిజంగా అచ్చెరువునే కలిగిస్తుంది. రోడ్లమీద చెత్తాచెదారం, దుమ్మూ, ధూళీ కనబడని పరిశుభ్రతవల్లనే-ఆరోగ్యదాయక వాతావరణం రూపొందుతుంది. రోడ్ల మీద ఏర్పరచిన 'డస్ట్‌బిన్స్'లో తప్ప-తిన్న, తాగిన, కాగితం ప్లేట్లు, కప్పులు, వాటర్ బాటిల్స్ వంటివి అమెరికాలో ఎవరూ రోడ్డుమీదే పారేసి పోవడం చూడం! అలాగే రోడ్లను ఎక్కడబడితే అక్కడ-జనం వాహనాలకు అడ్డుపడుతూ దాటేయడం, మన దగ్గరున్నట్లుగా లేశమంతైనా కనబడదు. అందుకోసం ఏర్పరచిన కూడలి దగ్గరే-రోడ్డు దాటతారు. పాదచారులు రోడ్డు దాటేందుకు సిగ్నల్ వచ్చినప్పుడే దాటుతారు. అంతేకాదు! అలా నిర్దిష్ట స్థానం నుంచి వారు రోడ్డు దాటుతున్నప్పుడు, వాహనదారులు తమ వాహనం గౌరవంగా నిలిపివేసి ఆగుతారు. రోడ్లు ప్రక్కన పాదచారులకే కాదు, సైకిల్ నడిపే వారికి కూడా ప్రత్యేకమైన బాట వుంటుంది. ఫ్రీవేలు, లైన్లు అన్నీ - కార్లు వేగంగా కదలడానికీ, ప్రయాణించడానికీ అనువుగా ఉంటాయి.

ఈ తరహా క్రమశిక్షణ పౌరులు అలవరచుకోవడం నిజంగా మనకూ చాలా అవసరం అనిపిస్తుంది. మంచి ఎక్కడున్నా గ్రహించాలి. 'బంగారు తెలంగాణ' పథంలో నగరాన్ని స్వచ్ఛ శుభ్రంగా చేయాలనీ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తూ, వాహనదారులు హెల్మెట్లతో, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ప్రయాణించాలనీ సంకల్పించినప్పుడు, ఆ నియమాన్ని పౌరులు స్వచ్ఛందంగా క్రమశిక్షణతో పాటించగలగాలి! నియమాలను బ్రేక్ చేయడం ఎలాగ? అన్న తీరున పౌరులూ, నిబంధనలు ఎవరు అతిక్రమిస్తారా? జరిమానాలతో ఛలాన్లతో జేబులు నింపుకుందాం? అన్నట్లు ట్రాఫిక్ నిఘావర్గాలూ–ఆలోచించడం పోనంతకాలం, మార్పు రావడం అసంభవం. అలాగే ఫుట్‌పాత్‌ల దురాక్రమణను అరికట్టాలి. రోడ్ల మధ్యనే గుడులూ, మసీదులూ అంటూ నెలకొల్పుకుని మతం పిచ్చ పెంచుకుని–రహదారులనూ, రహదారి ప్రయాణాలనూ సంక్లిష్టం చేసుకుంటున్న స్వయంకృతాపరాధాలు మనవేమరి.

ఇంతకీ సంపన్నత అంటే ఏమిటి?–ఆర్థికపుష్టి ఒకటి మాత్రమేనా? జీవనవిధానాలూ, వ్యక్తిగత సంస్కారాలూ సంపన్నతలు కావా? తమ దేశం గురించీ, తమ దేశ చరిత్ర గురించీ, మహనీయుల గురించీ, వారు నడయాడిన స్థలాల గురించీ, వారి స్మృతులను భద్రపరచడం గురించి శ్రద్ధతీసుకోవడం కూడా అమెరికా నుంచి నేర్చుకోవాలా? బెంజిమన్ ఫ్రాంక్లిన్ అన్నట్లు – 'WELTH IS NOT HIS THAT HAS IT, BUT HIS THAT ENJOYS IT''. కూడబెట్టుకున్నది సంపన్నతకాదు, కలిగివున్నదీ సంపన్నత కాదు. వినియోగించుకుని సంతోషపడిందే సంపన్నత. కవులనూ, కళాకారులనూ గౌరవించుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఖర్చుచేసిన, చేస్తున్న సొమ్ము గురించి దుర్వ్యాఖ్యానాలు చేసినవారు లేకపోలేదు. దాశరథి, కాళోజీ వంటి మహనీయుల పేర లక్షరూపాయల పురస్కారం ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. అలాగే తెలంగాణ సంస్కృతిని సమగ్రంగా ప్రతిబింబించే మ్యూజియం ఏర్పర్చాలన్న సంకల్పం గొప్పది. అది సమగ్రంగా రూపుదిద్దుకోవాలి.

"ఏదేశమేగినా ఎందు కాలిడినా

పొగడరా నీ తల్లి భూమి భారతిని" అని రాయప్రోలువారు అన్నారు గానీ, భేషజాలకు పోయి ఆత్మస్తుతి, పరనింద చేయవలసిన అగత్యం లేదు. అమెరికాలోని తెలుగువాడు గొప్పవాడు, సంపన్నుడు అయిపోయి, ఆర్మూరులోని తెలుగువాడు

సామాన్యుడేమీ అయిపోడు. అసామాన్యత, ప్రజ్ఞాపాటవాలవల్లనే వరంగల్ నుండి వాషింగ్‌టన్ డి.సి దాకా ఎదగవచ్చు. సంపన్నతకు అమెరికాను కొలబద్ద చేసుకుంటే చాలదు. చైనావాడి సంపన్నతపట్ల అమెరికావాడికీ గుర్రే! కానీ, చైనా బజార్‌లు అమెరికాలో రాణకెక్కుతున్నాయి. ఇండియన్స్‌పట్ల - ఒక "స్పిరిట్యువల్" అనగా ఆధ్యాత్మిక కోణంలో తప్ప పెద్ద గౌరవాదరాలు ఉన్నాయనుకోలేం. ఇప్పటికీ చిన్నచూపు పూర్తిగా సమసిపోలేదని మనవారే చెబుతుంటారు.

మన తెలంగాణ-క్రమశిక్షణను, స్వచ్ఛంద కార్యశీలతను సంతరించుకున్నట్లయితే మన నగరాల పౌరులు స్వచ్ఛభారత్ గురించీ, రహదారుల నియమాల గురించీ శ్రద్ధపెట్టి పనిచేసినట్లయితే, అమెరికాలో కనబడే 'మంచి'-మనకు మించినదేమీ కాదని తెలుస్తుంది. సంపన్నత, సౌశీల్యత సమఉజ్జీలుగా సాగవలసిన అవసరం ఉంది. మనది లోటుబడ్జెటేమీ కాదు, కానీ మనకు ఏది 'లోటు' అవుతోందో గ్రహించగలిగి, అదాటున సంస్కరించుకుని-పురోగమించవలసిన అగత్యం ఎంతైనా ఉంది. మన తెలంగాణ నిజంగానే కోటి రతనాల వీణగా మ్రోగాలన్నదే పౌరుల, పాలకుల సమష్టి ఆశయమూ, ఆచరణ కావాలి.

**(23.4.2016)**

# MANA TELANGANA

(News Narrations on Topical issues)

**''SUDHAMA'YOKTHI' Editpage Middle Column**

**by**

SUDHAMA



కవిగా, రచయితగా, కార్టూనిస్టుగా, విమర్శకుడిగా,
వక్తగా, పజిల్సు నిర్మాతగా,
ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా
ప్రముఖులైన శ్రీ సుధామ
పత్రికా కాలమిస్టుగా కూడా పేరొందారు.

గతంలో ఆంధ్రభూమి దినపత్రిక
ఎడిట్ పేజ్ మిడిల్ కాలంగా పుష్కరకాలం పైగా
సుధామ వారం వారం నిర్వహించిన 'సం.సా.రా.లు'
(సంస్కృతి-సాహిత్యం-రాజకీయాలు) పాఠకులను
ఎంతగానో అలరించింది. కొన్ని వ్యాసాలతో వెలువరించిన
'సం.సా.రా.లు' గ్రంథం 2004 లో తెలుగు విశ్వ విద్యాలయం
సాహితీ పురస్కారాన్ని అందుకోవడం విశేషం.
'మన తెలంగాణ' దిన పత్రికలో
శనివారాల్లో 2015 నుంచి ఓ ఏడాదిగా ప్రచురిత మయిన
"సుధామ యోక్తి' కాలమ్ లోని
కాలిక వార్తాంశ కథనాల సంకలనమే ఈ గ్రంథం